In Public domain. Digitization Muthulakshmi Research Academy

సంస్కృత అకాడమీ గ్రంథమాలా - 139

శ్రీసాయణమాధవాచార్యప్రణీతము

సర్వదర్శనసంగ్రహము

(చార్వాక-బౌద్ధ-అర్హత దర్శనాలు)

మనస్వినీ తెలుగు వ్యాఖ్యాసహితము

వ్యాఖ్యాత్రి

ఆచార్యా పి. శశిరేఖ

నివృత్త-ఆచార్యా, సంస్కృతవిభాగము, ఉస్మానియా విశ్వవద్యాలయము

సంపాదకులు

ఆచార్య కే నీలకంఠమ్

నిదేశకులు, సంస్కృత అకాడమీ

సంస్కృత అకాడమి

(కేంద్రీయసంస్కృతవిశ్వవిద్యాలయముచే మాన్యతపొందిన ఆదర్శసంస్కృతశోధసంస్థ)

ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాద్

2024

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సంస్కృత అకాడమీ గ్రంథమాల – 139
Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీసాయణమాధవాచార్యప్రణీతము

సర్వదర్శనసంగ్రహము

(చార్వాక-బౌద్ధ-అర్హత దర్శనాలు)

మనస్విని తెలుగు వ్యాఖ్యాసహితము

వ్యాఖ్యాత్రి

ఆచార్యా పి శశిరేఖ

నివృత్త-ఆచార్యా, సంస్కృతవిభాగము, ఉస్మానియా విశ్వవద్యాలయము

సంపాదకులు

ఆచార్య కే నీలకంఠమ్

నిదేశకులు, సంస్కృత అకాడమీ

సంస్కృత అకాడమి

(కేంద్రీయసంస్కృతవిశ్వవిద్యాలయముచే మాన్యతపొందిన ఆదర్శసంస్కృతశోధసంస్థ)

ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాద్

2024

In Public domain. Digitization Muthulakshmi Research Academy

Sanskrit Academy Granthamālā 139

Sarvadarśanasaṅgaha

Cārvāka-Bauddha-Arhata Darśana

(with Telugu Commentary)

Publisher
Director, Sanskrit Academy

Copies can be had from:
Director
Sanskrit Academy
Adarsha Sanskrit Shodha Sanstha
Osmania University,
Hyderabad – 500 007

Phone:
8331021001

Email:
sanskritacademyhyd@gmail.com

Web:
https://sanskritacademy.net/

Printed at
Karshak Art Printers,
Vidyanagar, Hyderabad

Sarvadarśanasaṅgaha
Cārvāka-Bauddha-Arhata Darśana
(with Telugu Commentary)

ISBN – 978-81-975732-1-7

© Sanskrit Academy

Year : 2024
Pages : IV+150
Copies : 300
Price : Rs 400

Sanskrit Academy Granthamala - 139

In Public domain, Digitization Muthulakshmi Research Academy

Sarvadarśanasaṅgaha

of

Shri Sayanamadhavacharya

(Cārvāka-Bauddha-Arhata Darśana)

With

Manaswini Telugu Commentary

By

Prof. P Shashirekha

Retd. Professor, Department of Sanskrit, OU

Editor

Prof. K. Neelakantham

Director, Sanskrit Academy

Sanskrit Academy

Adarsha Sanskrit Shodha Sanstha

(Recognised by Central Sanskrit University, New Delhi)

Osmania University, Hyderabad – 500 007

2024

In Public domain. Digitization Muthulakshmi Research Academy

Sanskrit Academy Granthamālā 139

Sarvadarśanasaṅgaha

Cārvāka-Bauddha-Arhata Darśana

(with Telugu Commentary)

Publisher
Director, Sanskrit Academy

Copies can be had from:
Director
Sanskrit Academy
Adarsha Sanskrit Shodha Sanstha
Osmania University,
Hyderabad – 500 007

Phone:
8331021001

Email:
sanskritacademyhyd@gmail.com

Web:
https://sanskritacademy.net/

Printed at
Karshak Art Printers,
Vidyanagar, Hyderabad

Sarvadarśanasaṅgaha
Cārvāka-Bauddha-Arhata Darśana

(with Telugu Commentary)

ISBN – 978-81-975732-1-7

© Sanskrit Academy

Year	:	2024
Pages	:	iv+150
Copies	:	300
Price	:	Rs 400

ఓమ్ శ్రీ గురుభ్యో నమః

In Public domain. Digitization Muthulakshmi Research Academy

|| శ్రీ శఙ్కరభగవత్పాదాః విజయన్తే ||

న్యాయవ్యాకరణాద్వైతతత్త్వజ్ఞం విబుధాగ్రణిమ్।
కావ్యశాస్త్రవిదాం శ్రేష్ఠం ధర్మశాస్త్రార్థకోవిదమ్ ॥

వ్యాఖ్యానచతురం ప్రాజ్ఞం పద్మశ్రీబిరుదాన్వితమ్।
పుల్లెలాన్వయసమ్భూతం రామచన్ద్రం గురుం భజే॥

సంస్కృత అకాడమీ ప్రతిష్ఠాపించిన 1954 వ సంవత్సరం నుండి వామన-జయాదిత్యులచేత రచింపబడిన కాశికా, హరదత్తవిరచిత పదమంజరీ, జినేంద్రబుద్ధవిరచిత కాశికావివరణపంజికా (న్యాసము), నాగేశభట్టవిరచిత పరిభాషేందుశేఖరం, ఆయుర్వేదాబ్ధిసారము, పండితరాజ జగన్నాథుని కావ్యసంగ్రహం, క్షేమేంద్రుని లఘుకావ్యసంగ్రహం, ధర్మసూరి విరచితమైన సాహిత్యరత్నాకరం ఇత్యాది అనేకవిశిష్ట గ్రంథములను ప్రకాశింపజేసింది. ఆచార్య ఆర్యేంద్ర మిశ్ర, మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు మొదలగు లోకవిఖ్యాతులైన పండితులు విశేషకృషి చేసి ఉత్తమోత్తమ గ్రంథాలను లోకానికి అందించారు.

అటుతర్వాత కేంద్రీయసంస్కృత విశ్వవిద్యాలయం (పూర్వం రాష్ట్రీయ సంస్కృత సంస్థానం) వారి చేత ఆదర్శశోధసంస్థగా గుర్తింపు పొంది, వారియొక్క సంపూర్ణధనసహాయంతోనే నడుపబడుతున్న సంస్కృత అకాడమి సంస్కృత పరిశోధనరంగంలో, సంస్కృత-గ్రంథప్రకాశనంలో, సంస్కృతభాషాప్రచారంలో, సంస్కృతశాస్త్ర-సంగోష్ఠీనిర్వహణంలో విశేషకృషి చేస్తున్నది. పూర్వం తెలుగులిపిలో ముద్రింపబడి ఇతరప్రాంతీయుల దృష్టికి రానంటువంటి పుస్తకములను దేవనాగరిలిపిలో విశేషపరిశోధన చేసి సుమారుగా 40 కి పైగా పుస్తకములను ముద్రించి సంస్కృత లోకానికి అందించింది సంస్కృత అకాడమి. ఇటువంటి పుస్తకప్రచురణలో భాగంగా ఆయా విశ్వవిద్యాలయాల పాఠ్యప్రణాలికలో ఉన్నటువంటి పుస్తకాలు తెలుగు వ్యాఖ్యానం తో ఉంటే బాగుండునన్న అధ్యయనోత్సాహవంతుల ప్రేరణతో, అకాడమీలోని వివిధకమిటీల గౌరవసభ్యుల అనుమతితో సిద్ధాన్తకౌముదీ, కావ్యప్రకాశము, ధ్వన్యాలోకము, పాతంజల యోగదర్శనము, సాంఖ్యకారికా, తర్కభాషా, వేదాన్తసారము, అర్థసంగ్రహం, వృత్తరత్నాకరం, శిశుపాలవధం, నలచంపూ ఇత్యాది పుస్తకాలను లోకానికి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అందించింది, ఇప్పుడు విద్యార్థులకు అంత్యంతోపయుక్తమైన **సర్వదర్శనసంగ్రహం (చార్వాక, బౌద్ధ, ఆర్హత దర్శనాలు మాత్రమే)** ఆచార్య పి శశిరేఖ గారిచే రచింపబడిన **మనస్విని** అను తెలుగు వ్యాఖ్యానంతో ముద్రించి లోకార్పణం చేయుటకు సిద్ధపడింది.

సర్వదర్శనసంగ్రహప్రణేత అయిన శ్రీ సాయణమాధవులు శాలివాహనశకం పదమూడవ శతాబ్దపు ఉత్తరార్ధంలో ఉండి ఉన్నాడని ఇతిహాసకారుల అభిప్రాయం. విజయనగర-సామ్రాజ్యస్థాపకులైన సాయణమాధవులు కాకతీయ-సామ్రాజ్య పతనానన్తరం చెలరేగిన దుష్టమతముల పరివ్యాప్తతను చూచి అంతరించిపోతున్న వైదికమతసంప్రదాయాన్ని మానవతా విలువలను పునః ప్రతిష్ఠ గావించిన మహనీయులు. సంన్యాసాశ్రమాన్ని స్వీకరించి, శృంగేరీ పీఠాన్ని కొంతకాల పర్యంతం అధిష్ఠించి విద్యారణ్యులుగా ప్రసిద్ధి గాంచినారు.

పదార్థతత్వాన్ని కనిపింపజేసేది దర్శన శాస్త్రం. ఒక్కొక పండితుని దృక్పథం ఒక్కోరకంగా ఉంటుంది. కొంతమంది వేదాలను, ఉపనిషత్తులను ఆధారంగా జేసికొని దర్శనాలను రచిస్తే మఱికొంతమంది తమ అనుభవాలను ఆధారంగా జేసికొని సామాన్యులకుకూడ అవగతం అయ్యే రీతిలో శాస్త్రాన్ని రచించడానికి ప్రయత్నించారు[1]. ఈ విధంగా దర్శనశాస్త్రాలు రెండు ప్రధానభేదాలుగా విభజింపబడ్డాయి. వేదాలప్రామాణ్యాన్ని అంగీకరిస్తూ రచించినవి ఆస్తికదర్శనాలైతే వాటి ప్రామాణ్యాన్ని అంగీకరించకుండా ఇతరప్రమాణాలను చూపిస్తూ రచించినవి నాస్తికదర్శనాలు. మఱల ఆస్తికదర్శనాలలో వేదాంతానికి వచ్చేసరికి అద్వైత-ద్వైత-విశిష్టాద్వైత-శివాద్వైత ఇత్యాద్యనేక భేదాలు ఏర్పడ్డాయి.

---

[1] నాస్తి వేదోదితో లోక ఇతి యేషాం మతిః స్థిరా।

నాస్తికాస్తే తథాస్తీతి మతిర్యేషాం త ఆస్తికాః ॥

అవైదికప్రమాణానాం సిద్ధాన్తానాం ప్రదర్శకాః

చార్వాకాద్యాః షడ్విధాస్తే ఖ్యాతా లోకేషు నాస్తికాః॥

వేదప్రమాణకానీహ ప్రోచుర్యే దర్శనాని షట్ ।

న్యాయవైశేషికాదీని తే స్మృతా ఆస్తికాదిభిః ॥ (సర్వదర్శనసంగ్రహః)

సాయణమాధవులు తమ సర్వదర్శనసంగ్రహంలో పదహారు
In Public domain. Digitization Muthulakshmi Research Academy
దర్శనాలను సప్రమాణంగా ఉట్టంకించారు. ఈ పుస్తకానికి శ్రీవాసుదేవశాస్త్రి అభయంకర్ మహాశయులు రచించిన సంస్కృతవ్యాఖ్య పరమప్రమాణమైనది. దాన్ని ఆధారంగా జేసికొని భారతదేశంలోని అనేక ప్రాంతీయభాషలలో చాలామంది విద్వాంసులు వ్యాఖ్యానాలు రచించారు. తెలుగులో అస్మద్ గురువర్యులు పద్మశ్రీ విభూషితులు మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు బాలానందిని వ్యాఖ్యానాన్ని రచించారు. ఈ పుస్తకం పరమోత్కృష్టమైనది తెలుగువారందరికి అత్యంతోపయుక్తమైనది. అయితే ప్రస్తుతం ఆయా విశ్వవిద్యలయాలలో అధ్యయన-అధ్యాపనములలో ఉన్నట్టువంటి **చార్వాక, బౌద్ధ, అర్హత దర్శనాలకు** మాత్రమే సరళరీతిలో ఒక వ్యాఖ్యానం ఉంటే బాగుండునన్న మా కోఱికను మన్నించి గురువుగారి ప్రియశిష్యులు వారి వద్ద దర్శన శాస్త్రాలను అభ్యసించిన ఆచార్య పి. శశిరేఖ గారు **మనస్విని** పేరుతో సులభంగా అర్థం అయ్యే వ్యాఖ్యానాన్ని రచించి మా అకాడమీ ద్వారా ప్రచురించుటకు అంగీకరించారు. స్వయంగానే విద్యార్థిహితైషి అయిన శశిరేఖ గారు తమ సుదీర్ఘ అధ్యయన అధ్యాపనముల అనుభవంతో ఈ వ్యాఖ్యానమును రచించారు. వారికి సంస్కృత అకాడమీ పక్షాన వినమ్రపూర్వక నమస్సులు తెలుపుకుంటున్నాను.

ఈ పుస్తకప్రచురణలో సంపూర్ణంగా సహకరించిన మా అకాడమీలో ఉపనిదేశకురాలు డా. కే. వరలక్ష్మికి, శోధసహాయకులు డాక్టర్ కే. వి. సూర్యప్రకాశ్ కు, డాక్టర్ జోషీ సంతోష కుమార్ కు మఱియు చిరంజివ జోషీ భరద్వాజ్ కు అందరికి శుభాభినందనలు.

శోధగ్రంథాలతో పాటు ఇటువంటి అరుదైన మఱియు సాధారణవిద్యార్థులకు కూడ ఉపయోగపడే పుస్తకాలను కూడ అకాడమీ ద్వారా ముద్రించుటకు మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తున్న కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి వర్యులు **ఆచార్య శ్రీనివాస వర్ఖెడి** గారికి, ఆ విశ్వవిద్యాలయ సంచాలకులు అస్మన్మిత్రులు **ఆచార్య గాయత్రీమురళీ కృష్ణకు** ఉస్మానియా విశ్వవిద్యాలయసంచాలకులు **ఆచార్య పి. లక్ష్మీనారాయణ** గారికి ధన్యవాదములు తెలుపుకుంటు న్నాను. కేంద్రీయసంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదర్శసంస్థల విభాగానికి

నిదేశకులు ఆచార్య మధుకేశ్వర్ భట్ గారికి ధన్యవాదములు తెలుపుతున్నాను.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈ గ్రంథాన్ని తక్కువ సమయంలో సుందరంగా ముద్రించి ఇచ్చిన కర్షక్ ఆర్ట్స్ ప్రింటర్స్ విద్యానగర్ వారికి కృతజ్ఞతలు.

బుధజనవిధేయః
ఆచార్యో కే. నీలకంఠః
నిదేశకః, సంస్కృత అకాడమీ.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః

తొలి పలుకు

భిన్న భిన్న మతాలతో అలరారే రంగులహరివిల్లు మన భారతీయ సంస్కృతి. ఎన్ని విదేశీ ఆక్రమణలు జరిగినా ఈ సంస్కృతి ఈనాటికీ చెక్కు చెదరకుండా నిలిచిందంటే అందుకు కారణం ఎందరో మహానుభావులు మనకు చూపించిన 'భిన్నత్వంలో ఏకత్వమే'. మానవులు అందరూ ఒక్కటేనని 'వసుధైవ కుటుంబకమ్' అన్న ఆర్యోక్తిని అక్షరాలా ఆచరించి చూపించిన వారు మన మహర్షులు. అలాంటి వారిలో ఒకరు విజయనగర సామ్రాజ్య సంస్థాపకులైన శ్రీ మాధవాచార్యులు. కాకతీయసామ్రాజ్య పతనానంతరం చెలరేగిన అలజడులను చూచి, అంతరించి పోతున్న వైదికమతాన్ని, మానవతా విలువలను వెలికితీసిన మహనీయులు మాధవాచార్యులు. వీరే తరువాతి కాలంలో సంన్యాసాశ్రమం స్వీకరించి, కొంతకాలం శృంగేరీపీఠాన్నధిష్ఠించి విద్యారణ్యులుగా విరాజిల్లినారు. వైదిక వైదుష్యానికి ఆలవాలమైన కుటుంబం వారిది. వారికి ఇరువురు అనుజులు. ఒకరు వేదభాష్య కర్తయైన శ్రీసాయణాచార్యులు, మరొకరు భోగనాథుడు. సాయణాచార్యులకు కంపణ, మాయణ, సింగణ అని ముగ్గురు కుమారులు. వీరు వివిధశాస్త్ర పారంగతులు. వీరిలో **మాయాణుడే సాయణ మాధవుడు. మాయణ** అనేది **మాధవ** అనుదాని కన్నడరూపం. ఈయనే 'సర్వదర్శన సంగ్రహ' రచయిత **శ్రీసాయణ మాధవా చార్యులు.**

పదార్థతత్త్వాన్ని (ఉన్నది ఉన్నట్లుగా) కనిపింపజేసేది దర్శనశాస్త్రం. అయితే ఒకొక్కరి దృక్పథం ఒక్కోవిధంగా ఉంటుంది. కొందరు వైదికవాఙ్మయాన్ని, ఉపనిషత్తులను ఆధారంగా చేసికొని 'దర్శనగ్రంథాలను' నిర్మిస్తే మరికొందరు తమ అనుభవాలను జోడించి సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా ఇహ లోకంలోనే బంధవిముక్తులయ్యే మార్గాన్ని సూచించారు. ఈ విధంగా దర్శన శాస్త్రంలో రెండు ప్రధాన భేదాలు ఏర్పడినాయి. వేదాల ప్రామాణ్యాన్ని అంగీకరించేవి **ఆస్తిక దర్శనాలు** గానూ, వాటి ప్రామాణ్యాన్ని అంగీకరించనివి **నాస్తిక దర్శనాలు** గానూ వర్గీకరించబడినాయి. ఆస్తిక దర్శనాల్లో కూడా వేదాంతానికి వచ్చేసరికి మళ్లీ ద్వైతమనీ, విశిష్టాద్వైతమనీ ఎన్నో ప్రభేదాలు. అద్వైతంలో కూడా శివాద్వైతము మొదలైన భేదాలు ఏర్పడినాయి. ఈ దర్శనాలన్నీ మహర్షులు, మహాత్ములు ప్రతిపాదించినవే. మార్గాలు వేరైనా గమ్యం ఒకటే. అదే మోక్షం. అయితే ఎదుట ఇన్ని మార్గాలు కనిపిస్తుంటే ఏ మార్గాన్ని అనుసరించి

In Public domain. Digitization Muthulakshmi Research Academy
వెల్లాలో తెలియక దిక్కులుతోచని పరిస్థితిలో పడిపోతాడు సామాన్యమానవుడు. ఏదర్శనశాస్త్రాన్నైనా చిత్తశుద్ధితో పాటిస్తే మోక్షం సిద్ధిస్తుంది. దర్శనాలన్నింటిలోనూ గల సారాన్ని ఎదుట ఉంచితే మానవుల మనస్సులో ఉన్న కల్లోల పరిస్థితి తొలగిపోతుంది. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఆనాడు ప్రపంచంలో ఉన్న 1. **చార్వాక**, 2. **బౌద్ధ**, 3. **ఆర్హత (జైన)**, 4. **రామానుజ (విశిష్టాద్వైత)**, 5. **పూర్ణప్రజ్ఞ (ద్వైత)**, 6. **నకులీశపాశుపత**, 7. **శైవ**, 8. **ప్రత్యభిజ్ఞ (కాశ్మీరశైవ)**, 9. **రసేశ్వర**, 10. **ఔలూక్య (వైశేషిక)**, 11. **అక్షపాద (న్యాయ)**, 12. **జైమిని (పూర్వమీమాంస)**, 13. **పాణిని**, 14. **సాంఖ్య**, 15. **పాతఞ్జల**, 16. **శాంకర** అను పదహారు దర్శనాలను సంగ్రహంగా అందించారు సాయణ మాధవాచార్యులు. 'న స్వర్గో నాపవర్గో' (స్వర్గమూ లేదు, మోక్షమూ లేదు) అనే నాస్తికవాదంతో ఆరంభించి, 'బ్రహ్మసత్యం జగన్మిథ్య' (బ్రహ్మసత్యము, జగత్తుమిథ్య) అనే శాంకరదర్శనంతో ఈ గ్రంథాన్ని ముగిస్తారు ఆచార్యులు. ఈ విధంగా దర్శన సుమాలను ఏరి, మాలగా కూర్చి ఆ పరమాత్మ గళసీమను అలంకరించిన గొప్ప దార్శనికులు సాయణమాధవాచార్యులు. భారతీయ సంస్కృతికే శిరోభూషణం ఈ గ్రంథరాజం. ఇంతటి మహత్తర గ్రంథాన్ని బాలానందినీ వ్యాఖ్యతో ఆంధ్రలోకానికందించారు మా ఆచార్యులు మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల **శ్రీరామచంద్రుడు** గారు. వ్యాఖ్యారచనే గాక వీరు యీ గ్రంథాన్ని జిజ్ఞాసువులైన శిష్యులకు దాదాపు ఒక సంవత్సరం పాటు ప్రతిపదోక్తంగా బోధించారు. ఆ జ్ఞానామృత బిందువులు గ్రోలిన శిష్యవర్గంలో నేనూ ఉన్నాను. జటిలమైన విషయాన్ని మనోజ్ఞమైన, పాండిత్యపూర్ణమైన శైలిలో అందించారు మాధవా చార్యులు. సకలశాస్త్ర పారంగతత్వం లేనిదే ఒక్క అక్షరం కూడా అస్మాదృశులకు అర్థం కాదు. ఈ పరిస్థితిని గమనించిన సద్గురు శ్రీ శివానందమూర్తి గారు సర్వతంత్ర స్వతంత్రులు (సకల శాస్త్రపండితులు) ఐన ఆచార్య శ్రీరామచంద్రుడు గారిని యీ 'సర్వదర్శనసంగ్రహానికి' వ్యాఖ్యను కూర్చవలసిందిగా కోరారు. వారి ఆదేశం మేరకు ఆచార్యులు సమగ్రవ్యాఖ్యను సమకూర్చారు. 820 పేజీలకు పైగా ఉన్న ఈ బృహత్ గ్రంథానికి గల 33 పేజీల ప్రస్తావనలో 'సర్వదర్శన సంగ్రహ' కర్తయైన సాయణమాధవాచార్యుల జీవిత విశేషాలతో పాటు సాయణ, విద్యారణ్యమాధవుల విషయాలు కూడా విస్తృతంగా, చారిత్రకాధారాలతో సహా చర్చించబడినాయి. 2008 వ సంవత్సరంలో ముద్రితమైన యీ గ్రంథం శ్రద్ధాలువు లెందరికో ఆనందమకరందమైంది. దీనిలో గల మొదటి మూడు చార్వాక- బౌద్ధ- అర్హత దర్శనాలు ఉస్మానియా విశ్వవిద్యాలయ, ఎం.ఎ. సంస్కృతంలో పాఠ్యాంశంగా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నిర్ణయించబడినాయి. ఆచార్య శ్రీరామచంద్రుడి గారి కన్నా ఈ దర్శనాలను చక్కగా బోధించగలవారెవరూ లేరనేది నిర్వివాదాంశము. అందుచేత మా విద్యార్థుల శ్రేయస్సు కోరి నేను వారివద్దకు వెళ్లి యీ మూడు నాస్తికదర్శ నాలనూ యథాతథంగా 'సర్వదర్శనసంగ్రహం' నుండి సంగ్రహించటానికి అనుమతిని కోరగా, శిష్యపక్షపాతియైన వారు వెంటనే నా ప్రార్థనను అంగీకరించారు. వారి చరణారవిందాలకు నా కృతజ్ఞతాంజలి. పేరుకు తగినట్లుగా బాలురకు (విషయంతో పరిచయం లేని వారికి) సులభంగా అర్థమయ్యేటట్లుగా కూర్చబడిన 'బాలానందిని' వ్యాఖ్య మా విద్యార్థుల పాలిట కల్పవృక్షమే. కేవలం విద్యార్థులకే కాక నాస్తిక దర్శనాల స్వరూపాన్ని కొంతవరకైనా తెలుసుకునేందుకు జిజ్ఞాసువులందరికీ ఉపకరిస్తుందనే ఆశతో, ఆశయంతో యీ నా ప్రయత్నం.

డా॥ పి. శశిరేఖ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః

ప్రస్తావన

ప్రణమ్య శిరసా దేవీం వాణీం వాసర వాసినీమ్,
విద్యారణ్య మతాన్యత్ర ప్రస్తూయన్తే యథామతి.

భారతీయ దర్శనాలు ఆస్తిక, నాస్తిక అను రెండు ప్రధాన విభాగాలుగా వ్యవహరించబడుతున్నాయి. తిరిగి ఆ ఆస్తిక, నాస్తికాలలో ఎన్నో అవాంతర భేదాలు. ఈ విశాల విశ్వంలో మానవులకే కాదు చేతనాచేతన పదార్థాలకు కూడా వాటివాటి స్వభావం ఉంటుంది. బెల్లం తియ్యగా ఎందుకుంటుంది? వేప చేదుగా ఎందుకుంటుంది? అని ప్రశ్నించటం మూర్ఖత్వం. అదే ఆయా పదార్థాల వైశిష్ట్యం. ఒకానొక తత్త్వాన్ని పరబ్రహ్మ అనీ, ఈశ్వరుడనీ వివిధ నామాలతో కొందరు చెపుతుంటే ఆ తత్త్వమే లేదు అంటారు మరికొందరు. ఎవరినీ ఒప్పించనూలేము, నొప్పించనూ లేము. ఈ సమస్యకు సంయమీంద్రుడూ, లోకోద్ధరణ దీక్షాబద్ధుడూ అయిన విద్యారణ్యస్వామి ఒక పరిష్కారమార్గం చూపించాడు. అయితే ఆ మార్గం పదిమార్గాల కూడలిలో ఉంటుంది. 'దశకుమారచరిత్ర'లో పదిమంది కుమారులు పదిమార్గాలుగా వెళ్ళినట్లు ఆయా మహనీయులు వారివారి దృష్టికోణాన్ని ప్రదర్శిస్తే, వాటన్నింటినీ వరుసగా మన ముందుంచారు విద్యారణ్యుల వారు. అందరూ తత్త్వాన్వేషులే, నిస్వార్థపరులే, సమాజోద్ధరణ దీక్షాబద్ధులే. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేని సంకుచిత స్వభావులు మతవైషమ్యానికి బీజావాపం చేసి భిన్నత్వంలోని ఏకత్వాన్ని మాయంచేసి భిన్నత్వాన్ని మాత్రమే ముందుంచారు. విద్యావంతులు అలాంటి భ్రమకు లోనుకారాదని మహామహోపాధ్యాయ ఆచార్య శ్రీమరామచంద్రుడుగారు "సర్వదర్శనసంగ్రహమ్" బృహత్ గ్రంథాన్ని తమ బాలానందిని వ్యాఖ్యతో తెలుగువారికందించారు. శాస్త్రవైదుష్యపూర్ణమైన ఆ రచన విద్యార్థులకు సులభగ్రాహ్యం కాదు. అందుచేత ఈ సరళ వ్యాఖ్యానానికి అవసరం ఏర్పడింది. ముఖ్యంగా నాస్తిక దర్శనాలను గూర్చి సరియైన, స్పష్టమైన అవగాహన లేనివారు వాటిపట్ల నిరాదరణ కలిగిఉంటారు. ఆ నాస్తిక దర్శనాలలోనూ, విశేషించి బౌద్ధ, జైనాలలోని విలువలను మా వంటి విద్యార్థులకు బోధించిన ఘనత ఆచార్య శ్రీరామచంద్రుడు గారిదే. ఆచార్య ఋణము తీర్చుకోలేనిది. వారు మాకు పంచిన జ్ఞానసుధాబిందువులను ముందు తరానికందించి కృతకృత్యులము కావాలనే ఆకాంక్ష యీ చిన్న ప్రయత్నానికి మూలకందము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈ పుస్తకాన్ని గురుముఖతః చదువుకున్న నాకు ఈ శాస్త్ర పరిభాష, పారిభాషిక పదాలు వాటి సౌందర్యం, గాంభీర్యం తెలుసు కాబట్టి మా శిష్యుల పట్ల పక్షపాతంతో శాస్త్ర సౌధ సోపానపంక్తిని దిగివచ్చి, వారికి చేయూతనందించే ఆశయంతో సరళంగా, అతి సరళంగా వాడుక భాషలో వ్యాఖ్యనందించాలని సంకల్పించాను. ఆ మాటే **అకాడెమీ డైరక్టర్** మా మిత్రువర్యులు ఆచార్య **నీలకంఠం** గారితో చెప్పాను. వారు వెంటనే ఆమోదం తెలిపారు. సంకల్పించానే గానీ కార్యం సంపన్నమవటం ఆ శారదాదేవి ఆశీఃఫలం. ఈ నా ప్రయత్నం అందరికీ నచ్చాలని కోరటంలేదు, నచ్చుతుందని నమ్మకమూ లేదు. ఇది **నాలో నేను, నాకై నేను, నా శిష్యులకై నేను** అనే మూడు ముడులతో అల్లిన అక్షరమాల. అందుకే నా వ్యాఖ్యకు 'మనస్విని' అని నామకరణం చేసాను.

పుస్తకంలోని విషయాన్ని గూర్చి పరిచయం అవసరం. ఆస్తిక దర్శనాలను గూర్చి నిత్యజీవితంలో పెద్దల మాటల్లో ప్రస్తావించబడుతుంది. ముఖ్యంగా వేదాంతం. శాఖోపశాఖలుగా విస్తరించి, భిన్న మార్గాలలో పయనించిన యీ వేదాంత ప్రస్థానాలు సమాజంలో శాంతిస్థాపనే లక్ష్యంగా ప్రారంభమైనప్పటికీ, అది ప్రజలను చేరేటప్పటికి లక్ష్యాన్ని మరచిపోయి మార్గాలను పట్టుకుని గమ్యం చేరలేకపోతున్నారు. దీనికి కారణం సమన్వయలోపం. ఈ "సమన్వయాన్ని" అందించిన విద్యారణ్యులు లేరు. **విద్యారణ్యం** మాత్రం మిగిలింది. విద్యారణ్య మహర్షి చూపించిన మార్గాన్ని నా కలం యొక్క చిరువెలుగులో చూపించాలనే యీ ప్రయత్నం.

నాస్తిక దర్శనాలుగా చెప్పబడే చార్వాక, బౌద్ధ, జౌన దర్శనాలు భారతీయ దర్శనాలుగానే పరిగణించబడతాయి. వీటిలో చారావకం తప్ప మిగిలిన రెండూ అత్యంత నియమబద్ధమైన జీవనశైలిని నిర్దేశించే గొప్ప దర్శనాలు. ఆలయాలు, దేవుడు అంటూ ఆర్భాటం లేని తపోమయ జీవితాన్ని గడపటమే 'మోక్షం' అనే గొప్ప సత్యాన్ని చాటిచెపుతాయి బౌద్ధ, జైన దర్శనాలు.

ప్రత్యక్ష ప్రమాణాన్ని మాత్రమే నమ్ముతూ "ఇహలోకసుఖాలే ప్రధానం. స్వర్గం, నరకం అంటూ లేవు" అని బోధించే చార్వాకం అతిసామాన్యుని ఆలోచనకు దర్పణం. వీరు చెప్పే ప్రధాన సిద్ధాంతంలోని లోపమేమిటో గమనిస్తే ఆధునికులకు అందునా విశృంఖల జీవితానికి అలవాటు పడిన వారికి కొంచెమైనా కనువిప్పు కలిగే అవకాశం ఉంది. వారి వాదం –

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"యావజ్జీవేత్ సుఖం జీవేత్, ఋణంకృత్వా ఘృతం పిబేత్,
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః"

"బ్రతికినంత కాలం సుఖంగా బ్రతకాలి. అప్పుచేసి అయినా నెయ్యి త్రాగాలి (నెయ్యితో సుష్ఠుగా భుజించాలి). కాలిపోయిన శరీరం మళ్ళీ రావటం ఎక్కడ?"

వీరికి పునర్జన్మ పట్ల విశ్వాసం లేదు. అయితే ఒక విషయం గమనించాలి. అప్పుచేసి, ఎగవేసి అనుభవిస్తే అది గొప్పా? పట్టుబడితే కృష్ణజన్మ స్థానమే కదా! ఇది ఆలోచించాలి.

అలాంటిదే మరొకటి – "ప్రమదాలింగనాజన్య సుఖమే స్వర్గం" అని వీరి వాదం. అసలు మానవ జీవితం ఎంత? అనుభవించే కాలం ఎంత? శైశవ, బాల్య, కౌమారాలు అనుభవానికి తగని దశలు. యౌవన, ప్రౌఢ రెండు దశలు మాత్రమే సంసార వ్యవహారానికి తగినవి. వృద్ధాప్య, చరమ దశలు పరాధీన దశలు. వంద సంవత్సరాల జీవితంలో ముచ్చటగా 'ముప్పై' మాత్రమే (అదీ ఒకప్పుడు) కార్యాచరణకు అనువైన కాలం. అదీ విషయ వాంఛలతో వృథా చేయాలా? గృహస్థ జీవనం నియమనిష్ఠలతో గడపాలని వేదాంతం, ధర్మశాస్త్రాలు బోధిస్తూనే ఉన్నాయి. పరకీయమైనది ఏదీ ఆశించకూడదు. అందుచేత 'చార్వాకం' గ్రాహ్యము? త్యాజ్యము? అని ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. విద్యారణ్యులు కూడా తాముగా ఏ దర్శనాన్నీ ఖండించలేదు. ఇతరులు ఖండించినదాన్నే మనముందుంచారు.

బౌద్ధ, జైనాలు ఈనాటికీ ఆదరింపబడుతున్నాయి. వీటిని గూర్చి పుస్తకంలో విస్తృతంగా చర్చించబడింది. సామాన్య మానవుల మేధాశక్తికి అందని యీ దర్శనాల సౌరభాన్ని అందించిన విద్యారణ్య మహర్షికీ, దర్శనశాస్త్ర దివ్యదర్శనం చేయించిన మా ఆచార్యవర్యులు మహామహోపాధ్యాయ శ్రీరామచంద్రుడు గారికీ శిరసా ప్రణాముంజలిని సమర్పిస్తున్నాము. గ్రంథ ప్రచురణలో సెంచరీలు సాధిస్తున్న సంస్కృత అకాడమీ డైరక్టర్ ఆచార్య నీలకంఠం గారికి అభినందనపూర్వక కృతజ్ఞతలు. 'ప్రూఫ్ రీడింగ్' అవసరం లేనంత అందంగా డి.టి.పి చేసిన చి. నాగరాజుకు శుభాకాంక్షలు.

ఈ 'నాస్తిక దర్శనాలు' ఆస్తికులకు కూడా నయనానందం కల్గిస్తాయని ఆశిస్తూ...

డా॥ పి. శశిరేఖ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

గ్రంథాంతర్గత సంక్షిప్త పదసూచి

బృ.ఉ.	:	బృహదారణ్యక ఉపనిషత్
త.వి.	:	తత్త్వ వివేక
త.సూ.	:	తత్త్వార్థాధిగమసూత్ర గ్రంథ
న్యా.కుసు.	:	న్యాయకుసుమాంజలి
ప్ర.వా.	:	ప్రమాణవార్తికమ్
వి.వి.	:	వివేక విలాసః
వీ.స్తు	:	వీతరాగస్తుతి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పుట సంఖ్య
1.	చార్వాకదర్శనమ్ (చార్వాక దర్శనము)	1-19
2.	బౌద్ధదర్శనమ్ (బౌద్ధ దర్శనము)	20-73
3.	ఆర్హతదర్శనమ్ (జైన దర్శనము)	74-138

In Public domain. Digitization Muthulakshmi Research Academy

శ్రీః

ఓమ్ స్వస్తి శ్రీగణేశాయ నమః

సర్వదర్శనసంగ్రహః

1. చార్వాకదర్శనమ్

ఉపోద్ఘాతము: భారతీయ దర్శనాలలో నాస్తిక దర్శనాలకు గల స్థానం లోకవిదితం. అందులోనూ సామాన్య మానవుల మనోరంజకం చార్వాకదర్శనం. ఈ దర్శన ప్రవర్తకుడు ఎవరైనదీ అటుంచితే ఈ సిద్ధాంతం వినగానే 'ఆహా! బాగుంది' అనిపిస్తుంది. 'చారువాకం' అంటేనే ప్రీతికర వచనం. సాక్షాత్తూ బృహస్పతే యీ దర్శన ప్రవర్తకుడని చెపుతారు. అయితే అంతే అందంగా ఈ దర్శనం యొక్క ప్రధాన సూత్రాలను మనముందుంచి, నిర్ణయాన్ని మనకే వదిలివేస్తారు విద్యారణ్యులు. ఆ చమత్కార వైభవం సహృదయవేద్యం. గ్రంథారంభానికి ముందు 'వందన శ్లోకం' ప్రాచీన సంప్రదాయం. గ్రంథ నిర్విఘ్న సమాప్తికై చేసే 'మంగళాచరణం' ఈ వందనం.

మూ. **నిత్యజ్ఞానాశ్రయం వన్దే నిఃశ్రేయసనిధిం శివమ్,**
యేనైవ జాతం మహ్యాది తేనైవేదం సకర్తృకమ్. 1

నిత్య జ్ఞానాశ్రయుడూ, నిశ్రేయస (మోక్ష) నిధీ అయిన శివునికి నమస్కరిస్తున్నాను. శివుని నుండే ప్రభవించినది యీ జగత్తు. ఆయనే దీనికంతటికీ కర్త.

వి: ఇక్కడ మంగళప్రదమైన శివతత్త్వం వర్ణించబడింది. విద్యారణ్య మహర్షి అద్వైత వేదాంత శిరోమణి. అందుచేత ఒక పరతత్త్వాన్నే చెపుతున్నాడు, కాని శైవ సిద్ధాంతం కాదు. (దేవతావందనం తరువాత విధిగా ఆచార్య వందనం ఒక ఆచారం. గ్రంథకర్త ఈ క్రింది శ్లోకంలో గురువందనం చేస్తున్నాడు)

మూ. **పారం గతం సకలదర్శనసాగరాణా**
మాత్మోచితార్థచరితార్థితసర్వలోకమ్,
శ్రీ శార్ఙ్గపాణితనయం నిఖిలాగమజ్ఞం
సర్వజ్ఞవిష్ణుగురుమన్వహమాశ్రయేఽహమ్. 2

తా. సకల దర్శన సాగరాల ఆవలితీరాన్ని చూచిన మా గురుదేవుని 'సర్వజ్ఞ విష్ణువు'ను సదా ఆశ్రయిస్తున్నాను. ఆయన సార్థకనామధేయుడు. పేరుకు తగినట్టుగా తనను ఆశ్రయించిన వారందరినీ చరితార్థులనుగా (కోరిన ఫలాన్ని పొందినవాళ్ళుగా)

In Public domain. Digitization Muthulakshmi Research Academy
చేస్తూన్న ఈ మహనీయుడు శారఙ్గపాణి తనయుడు. సకలాగమ కోవిదుడు.

తా. నేను మా గురువైన సర్వజ్ఞవిష్ణువును ఎల్లప్పుడూ ఆశ్రయించుచున్నాను. ఈయన సమస్తదర్శనసముద్రాల అంతము చూచినవాడు. అందుచే తన పేరును (అన్నీ తెలిసినవాడు అను పేరును) సార్థకం చేసుకొంటూ జ్ఞానంకొరకై తనను ఆశ్రయించినవారి నందరినీ చరితార్థులనుగా (కోరిన ఫలమును పొందినవాళ్లనుగా) చేస్తూంటాడు. శ్రీశార్ఙ్గపాణి పుత్రుడు. సకల ఆగమములూ తెలిసినవాడు.

తరువాతి శ్లోకంలో రచయిత తన పరిచయాన్ని పొందుపరిచాడు.

మూ. **శ్రీమత్సాయణదుగ్ధాబ్ధికౌస్తుభేన మహౌజసా,**
క్రియతే మాధవార్యేణ సర్వదర్శనసంగ్రహః. 3

మనస్విని

నిత్యమైన జ్ఞానానికి ఆశ్రయం ఐనవాడూ, మోక్షానికి నిధీ పృథివి మొదలైన వాటికి కర్త ఐన శివునికి వందన మాచరించుచున్నాను.

తా. శ్రీయుతుడైన సాయణాచార్యుడనే క్షీరసాగరం నుండి ఉద్భవించిన తేజోవంతమైన కౌస్తుభమణి మాధవార్యునిచేత "సర్వదర్శన సంగ్రహము" రచింపబడుచున్నది.

వి: సంస్కృతవాఙ్మయంలో కవులు, రచయితలు 'నేను' అని 'ఉత్తమపురుష' (ఫస్ట్ పర్సన్) ప్రయోగం చేయరు. అది సంప్రదాయం. 'ప్రథమ పురుష' (థర్డ్ పర్సన్)లోనే వ్యవహరిస్తారు. అందుచేత మాధవ విద్యారణ్యులు 'మాధవార్యేణ' అని చెప్పుకున్నారు.

అవతారిక: సాధారణంగా ఏ రచయిత ఐనా తమ గ్రంథాన్ని గూర్చి ఇతరులు ఏమనుకుంటారో అని ఆలోచిస్తారు. అందుచేత దానికి తగినట్లుగా తమ సమాధానాన్ని ఆరంభంలోనే జోడిస్తారు. విద్యారణ్యులవారు కూడా ఈక్రింది శ్లోకంలో తన గ్రంథాన్ని గూర్చి తెలియజేస్తారు.

మూ. **పూర్వేషామతిదుస్తరాణి సుతరామాలోడ్య శాస్త్రాణ్యసౌ**
శ్రీమత్సాయణమాధవః ప్రభురుపాన్యస్యత్సతాం ప్రీతయే,
దూరోత్సారితమత్సరేణ మనసా శృణ్వన్తు తత్సజ్జనాః
మాల్యం కస్య విచిత్రపుష్పరచితం ప్రీత్యై న సంజాయతే. 4

మనస్విని

శాస్త్రజ్ఞానం కలిగిన శ్రీ సాయణామాధవుడు, పూర్వాచార్యులు రచించిన,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దుస్తరమైన (సులభగ్రాహ్యము కాని) శాస్త్రాలను చక్కగా మథించి ఈ గ్రంథాన్ని సజ్జనుల ముందుంచాడు. ఆ సహృదయులు మనసులోని మాత్సర్యాన్ని దూరంగా వదిలివేసి విందురు గాక. (అయినా) విచిత్ర (రంగురంగుల) సుమాలతో అల్లినమాల ఎవరికి ప్రీతిని కలిగించకుండా ఉంటుంది? (అందరికీ నచ్చి తీరుతుంది)

వి: గ్రంథకర్తకు తన రచనా సామర్థ్యంపై గల ఆత్మవిశ్వాసం పై వాక్యాలలో ధ్వనిస్తుంది. అంతేకాని అది అహంకారం అనుకోకూడదు. ఇక గ్రంథం ఆరంభం అవుతుంది.

సమర్థుడైన ఈ శ్రీసాయణమాధవుడు, పూర్వులు రచించిన, దాటుటకు (అర్థం చేసికొనుటకు) శక్యం కాని శాస్త్రాలను బాగుగా మథించి ఈ గ్రంథాన్ని, సత్పురుషుల ఆనందంకొరకై అందజేశాడు. అందుచేత సజ్జనులందరూ మనస్సులోని మాత్సర్యాన్ని దూరంగా విడచివేసి దీనిని వినెదరు గాక. విచిత్రములైన పుష్పాలతో అల్లిన మాల ఇష్టం కానివాళ్లు ఎవరుంటారు?

చార్వాకదర్శనమ్

మూలమ్

1. అథ కథం పరమేశ్వరస్య నిఃశ్రేయసప్రదత్వమభిధీయతే? బృహస్పతి-మతానుసారిణా నాస్తికశిరోమణినా చార్వాకేణ తస్య దూరోత్సారితత్వాత్. దురుచ్ఛేదం హి చార్వాకస్య చేష్టితమ్. ప్రాయేణ సర్వప్రాణినస్తావత్

యావజ్జీవం సుఖం జీవేన్నాస్తి మృత్యోరగోచరః,
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః."

ఇతి లోకగాథామనురున్ధానాః నీతికామశాస్త్రానుసారేణ అర్థకామావేవ పురుషార్థౌ మన్యమానాః, పారలౌకికమ్ అర్థమ్ అపహ్నువానాః చార్వాకమతమ్ అనువర్తమానాః ఏవ అనుభూయన్తే. అత ఏవ తస్య చార్వాకమతస్య లోకాయతమ్ ఇతి అన్వర్థమ్ అపరం నామధేయమ్.

మనస్విని

అవ: మంగళ శ్లోకంలో పరమేశ్వరుడు మోక్ష ప్రదాత, జగత్కారణం ఇత్యాది వర్ణించబడింది. దీన్నే పూర్వపక్షంగా తీసికొని చార్వాకమతాన్ని ప్రదర్శిస్తున్నాడు.

వి: 'అథ' అని ప్రారంభించబడింది. 'అథ' అంటే 'అటుపైని' అని అర్థం. ఇక్కడ "ముందు ఏమీ చెప్పకుండానే 'అథ' పద ప్రయోగం ఏమిటి?" అనే సందేహానికి

In Public domain. Digitization Muthulakshmi Research Academy
సమాధానం శాస్త్ర సంప్రదాయంలో లభిస్తుంది.

ఓంకారమూ, అథ శబ్దమూ రెండూ మంగళ వాచకాలు. ఇవి సాక్షాత్తూ బ్రహ్మదేవుని కంఠంనుండి వెలువడినాయని విద్వాంసుల మతం.

ఇక చర్చ మొదలౌతుంది.

"పరమేశ్వరుడు మోక్షప్రదాత అని ఎలా చెప్పబడుతుంది? బృహస్పతి మతానుయాయి ఐన నాస్తికశిరోమణి చార్వాచకుడు (ఈశ్వరుడనేవాడు లేనేలేడని) ఈ విషయాన్ని దూరంగా త్రోసిపుచ్చాడు కదా! చార్వాకుని చేతలు (చేష్టలు) కొట్టిపారవేయలేనివి. సాధారణంగా సకల ప్రాణులూ వారి మతాన్ని అంగీకరిస్తారు. అది ఏమిటంటే –

"జీవించినంతకాలం సుఖంగా జీవించాలి. మృత్యువుకు గురికానివాడంటూ ఎవడూ ఉండడు. కాలి భస్మం ఐపోయిన శరీరం తిరిగి ఎలా వస్తుంది?" ఈ ప్రసిద్ధ లోకోక్తిని అనుసరిస్తూ, నీతిశాస్త్రంలో చెప్పబడిన 'అర్థమూ', కామశాస్త్రంలో చెప్పబడిన 'కామమూ' రెండే పురుషార్థాలని భావించేవారూ, పారలౌకిక (పరలోక) విషయం లేదని చార్వాకమతాన్ని అనుసరిస్తున్నారు. అందుచేత ఈ చార్వాకమతానికి "లోకాయతం" అనే మరొక సార్థకనామం ఉంది. లోకమునందు విస్తృతమైనది అని అర్థం.

వి: ధర్మ, అర్థ, కామ, మోక్ష అని పురుషార్థాలు నాలుగు. ధర్మాన్ని అనుసరిస్తూ, ధర్మబద్ధంగా ధన, ధాన్యాదులు ఆర్జిస్తూ, తమ తమ ఆదాయానికి మించకుండా అవసరాలు తీర్చుకుంటూ రాగద్వేషాలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించడానికి ఏర్పరచబడిన నాలుగు స్తంభాలు ఇవి. అలాకాకుండా ఏదోలాగ సంపాదించే 'అర్థం' (ధనాదులు), ఏదోరకంగా కోరికలు తీర్చుకోవడమే జీవితపరమార్థం అనుకున్నట్లయితే ప్రపంచంలో ఎలాంటి కల్లోలం చెలరేగుతుందో ప్రస్తుత సమాజం చూస్తే తెలుస్తుంది.

మూలమ్

2. తత్ర పృథివ్యాదీని భూతాని చత్వారి తత్త్వాని. తేభ్య ఏవ దేహాకారపరిణతేభ్యః కిణ్వాదిభ్యో మదశక్తివత్ చైతన్యమ్ ఉపజాయతే. తేషు వినష్టేషు సత్సు స్వయం వినశ్యతి. తదాహుః – **"విజ్ఞానఘన ఏవైతేభ్యో భూతేభ్యః సముత్థాయ తాన్యేవాను వినశ్యతి న ప్రేత్య సంజ్ఞాస్తి"** (బృ.ఉ.2.4.12) ఇతి. తత్ చైతన్యవిశిష్టదేహ ఏవాత్మా. దేహాతిరిక్తే ఆత్మని ప్రమాణాభావాత్. ప్రత్యక్షైకప్రమాణవాదితయా అనుమానాదేః అనఙ్గీకారేణ ప్రామాణ్యాభావాత్.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

పృథివి మొదలైన అనగా పృథివి, జలము, తేజస్సు, వాయువు అను నాలుగు భూతాలు నాలుగు తత్త్వాలు. ఈ నాలుగూ కలిసి దేహంగా రూపుదిద్దుకున్నప్పుడు ఆ కలయిక నుండి 'కిణ్వాదుల' నుండి మదశక్తి ఉత్పన్నమైనట్లు చైతన్యం పుడుతుంది. ఆ భూతాలు విడిపోయి నశించినప్పుడు ఈ చైతన్యం కూడా నశిస్తుంది. ఈ విషయాన్నే బృహదారణ్యక ఉపనిషత్తులోని "విజ్ఞానఘన ...." ఇత్యాది వాక్యం చెపుతుంది. అందుచేత చైతన్యంతో కూడన శరీరమే ఆత్మ. శరీర భిన్నమైన 'ఆత్మ' లేనేలేదు. అందుచేతనే మరణానంతరం 'జ్ఞానం' లేదు. ప్రత్యక్ష ప్రమాణాన్ని మాత్రమే అంగీకరించే చార్వాకుడు అనుమానాది ప్రమాణాలను అంగీకరించకపోవటంచేత వాటికి (వీరి మతంలో) ప్రామాణ్యం లేదు.

వి: ఏవైనా మత్తు పదార్థాలు, పానీయాలు తయారు చేసేటప్పుడు వాటిలో 'మాదకశక్తిని' కలిగించే పదార్థాలను 'కిణ్వం' అంటారు. ఈ విషయం రసాయన శాస్త్రజ్ఞులకు చక్కగా తెలుసు.

'భారతీయ దర్శన' పరంపరలో వివిధ ప్రమాణాలు అంగీకరించబడినాయి. కొందరు రెండు, మరికొందరు మూడు, కొందరు నాలుగు, మరికొందరు ఐదు, కొందరు ఆరు ఈ విధంగా ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద, అర్థాపత్తి, అనుపలబ్ధి – అని ఆరు ప్రమాణఆలు చోటు చేసుకున్నాయి. అయితే చార్వాకుడు మాత్రం 'ప్రత్యక్షం' తప్ప యే ఇతర ప్రమాణాన్నీ అంగీకరించడు. అది ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఉదరంలోని ఆకలి, హృదయంలో అనురాగం ఏ ప్రత్యక్ష ప్రమాణంతో తెలుస్తుంది?

విద్యారణ్యుల వారు విషయాలను ముందుపరిచి, వారి వారి విజ్ఞతకే నిర్ణయాలని వదిలివేసారు.

అవ: ఇక చార్వాకుని వాదనా చాతుర్యం తెలుసుకుని తీరాల్సిందే.

మూలమ్

3. అఙ్గనాద్యాలిఙ్గనాదిజన్యం సుఖమేవ పురుషార్థః. న చాస్య దుఃఖసంభిన్న తయా పురుషార్థత్వమేవ నాస్తీతి వక్తవ్యమ్, అవర్జనీయతయా ప్రాప్తస్య దుఃఖస్య పరిహారేణ సుఖమాత్రస్యైవ భోక్తవ్యత్వాత్; తద్యథా మత్స్యార్థీ సశల్కాన్ సకణ్టకాన్ మత్స్యానుపాదత్తే;సః యావదాదేయం తావదాదాయ నివర్తతే;యథా వా ధాన్యార్థీ సపలాలాని ధాన్యాని ఆహరతి,

In Public domain. Digitization Muthulakshmi Research Academy
సః యావదాదేయం తావదాదాయ నివర్తతే. తస్మాత్ దుఃఖభయాత్ న అనుకూల-వేదనీయం సుఖం త్యక్తుముచితమ్. **న హి మృగాః సన్తీతి శాలయో నోప్యన్తే. న హి భిక్షుకాః సన్తీతి స్థాల్యో నాధిశ్రీయన్తే.** యది కశ్చిద్భీరుః దృష్టం సుఖం త్యజేత్ తర్హి సః పశువత్ మూర్ఖః భవేత్. తదుక్తమ్ -

త్యాజ్యం సుఖం విషయసంగమజన్మ పుంసాం
దుఃఖోపసృష్టమితి మూర్ఖవిచారణైషా,
వ్రీహీన్ జిహాసతి సితోత్తమతణ్డులాఢ్యాన్
కో నామ భోస్తుషకణోపహితాన్ హితార్థీ. ఇతి

మనస్విని

అంగనాలింగనము మొదలైన వాటివలన కలిగిన సుఖమే పురుషార్థము. ఈ సుఖంలో కూడా దుఃఖం కలిసే ఉంటుంది కదా! కనుక ఇందులో పురుషార్థత్వమే లేదు అని అనకూడదు. ఎందువల్ల అంటే తప్పనిసరియైన దుఃఖాన్ని పరిహరించి సుఖాన్ని మాత్రమే పరిగ్రహించాలి. అది ఎలాగంటే - మత్స్యము (చేప) కావాలనుకునేవాడు పొలుసులతో, ముళ్ళతో ఉన్న చేపను తీసికొని, దానిలో ఏది ఎంత కావాలో తీసికొని మిగిలిన దాన్ని వదిలివేస్తాడు. అలాగే ధాన్యం కావాలనుకునేవాడు పొల్లుతో ఉన్న ధాన్యాన్ని తీసికొని, దానినుండి కావలసింది తీసికొంటాడు. అందుచేత దుఃఖానికి భయపడి, అనుకూలంగా ఉండే సుఖాన్ని వదిలిపెట్టటం సమంజసం కాదు.

'మృగాలున్నాయని వరి విత్తనాలు వేయకుండా ఉండరు కదా! భిక్షుకులు ఉన్నారని పొయ్యిమీద గిన్నెలు ఎక్కించకుండా ఉండరు కదా! ఒకవేళ ఎవడైనా భీరువు ఎదుట కనబడుతున్న సుఖాన్ని వదిలిపెడితే వాడు పశువు వలె మూర్ఖుడు అవుతాడు. ఈ విషయాన్నే ఈ క్రింది శ్లోకం ఇలా వివరిస్తుంది.

విషయాల (భోగ పదార్థాల) సంబంధం వలన కలిగే సుఖాన్ని దుఃఖంతో కూడింది కాబట్టి వదిలిపెట్టాలి అనేది మూర్ఖపుటాలోచన. పొల్లు, నూకలతో కూడిన తెల్లని ఉత్తమ రకానికి చెందిన బియ్యం ఉన్న వరి ధాన్యాన్ని మేలు కోరే వాడెవడైనా వదిలివేయాలనుకుంటాడా?

వి: ప్రతి సుఖం వెనుకా దుఃఖం ఉంటుందన్నది చార్వాకునికి తెలియని విషయం కాదు. ప్రమదాలింగనాదుల విషయంలోనూ ఆయా సమస్యలు ఉండనే ఉంటాయి. కమ్మని భోజనం కావాలన్నా కష్టం తప్పదు. అయితే 'సుఖాన్నే' కేంద్ర బిందువుగా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చేసికొని జీవించాలి అనేది చార్వాకమతం. అందుకొరకై లౌకిక ఉదాహరణలు చూపుతున్నాడు.

(వింటూంటే ఔను సుమా! అనిపిస్తుంది)

మూలమ్

4. నను పారలౌకికసుఖాభావే బహువిత్తవ్యయశరీరాయాససాధ్యే అగ్నిహోత్రాదౌ విద్యావృద్ధాః కథం ప్రవర్తిష్యన్తే ఇతి చేత్ – తదపి న ప్రమాణకోటిం ప్రవేష్టుమ్ ఈష్టే- అనృతవ్యాఘాతపునరుక్తదోషైః దూషితతయా వైదికమన్యైరేవ ధూర్తబకైః పరస్పరం కర్మకాణ్డప్రామాణ్యవాదిభిః జ్ఞానకాణ్డస్య, జ్ఞానకాణ్డప్రామాణ్యవాదిభిః కర్మకాణ్డస్య చ ప్రతిక్షిప్తత్వేన త్రయ్యాః ధూర్తప్రలాపమాత్రత్వేన అగ్నిహోత్రాదేః జీవికామాత్రప్రయోజన-త్వాత్. తథా చాభాణకః–

"అగ్నిహోత్రం త్రయో వేదాః త్రిదణ్డం భస్మగుణ్డనమ్,
బుద్ధిపౌరుషహీనానాం జీవికేతి బృహస్పతిః". ఇతి

మనస్విని

పారలౌకిక సుఖం లేనట్లయితే (స్వర్గాదులు) అధిక ధన వ్యయమూ, శారీరక శ్రమలతో కూడిన అగ్నిహోత్ర (యజ్ఞ యాగాదుల) విషయంలో విద్యావంతులు ఎందుకు ప్రవర్తిస్తున్నారు? (ఆచరిస్తున్నారు?) అని ప్రశ్నించినట్లయితే – అది కూడా ప్రమాణ కోటిలోకి ప్రవేశించజాలదు. అసత్య, పరస్పర విరోధ, పునరుక్తులనే మూడు దోషాలు అందులో ఉన్నాయి. వైదికులం (వేదవేత్తలం) అని తమను తాము గొప్పగా అనుకునే ధూరబకులు (కొంగల వంటి వాళ్ళు) కర్మకాండ ప్రమాణమంటూ కొందరు, జ్ఞానకాండ ప్రమాణమంటూ కొందరు వాళ్ళలో వాళ్లే పరస్పరం ఎదుటి వారి మతాలను కొట్టివేస్తూ కర్మకాండ ప్రామాణ్యవాదులు జ్ఞానకాండనీ, జ్ఞానకాండ ప్రామాణ్యవాదులు కర్మకాండనీ నిరాకరించటం చేత ఈ రెండూ ప్రామాణ్యాన్ని కోల్పోతున్నాయి. మూడు వేదాలూ ధూర్త ప్రలాపాలే. అగ్నిహోత్రాదులు జీవిక కోసం కల్పించబడినాయి.

ఈ విషయమే క్రింది లోకోక్తి చెపుతుంది.

అగ్నిహోత్రం, మూడు వేదాలు, త్రిదండము, భస్మలేపనం – ఇవన్నీ బుదీ&ధ, పౌరుషమూ లేనివారికి జీవిక (పొట్ట నింపుకునే వృత్తి) అని బృహస్పతి చెప్పాడు.

వి: చార్వాకుడు చెప్పిన "అంగనాలింగనా...." అనే మాటలకు ఆక్షేపం లేవదీసి సమాధానం చెపుతున్నాడు గ్రంథకర్త. "అంగనాలింగనాదుల వల్లనే సుఖం లభిస్తుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

స్వర్గాది సుఖాలు లేవని అన్నట్లయితే అది అంతా ధూర్తవైదికుల ప్రేలాపన. అసలు వేదాలే ప్రేలాపనలు. వాళ్ళలో వాళ్ళకే స్పష్టత లేదు. ఒకరు కర్మకాండ ఐన యజ్ఞాదులను ప్రశంసిస్తే, మరొకరు 'కర్మ' అక్కరలేదు జ్ఞానం ద్వారానే మోక్షం సిద్ధిస్తుంది అంటారు. దీన్ని బట్టి తెలిసేదేమంటే కర్మకాండ, జ్ఞానకాండ రెండూ మోక్షానికి మార్గాలు కావు. ఇదంతా బుద్ధీ, పౌరుషమూ లేనివారు ఉదరపోషణకై ఏర్పరచుకున్నది.

ఇదంతా సాధారణ వ్యక్తిలో చెలరేగే భావజాలం. విశృంఖల జీవనం రుచించేవారి మనోగతం. నియమాదులు ఆచరించటం కష్టం. ఆనాడు ఈనాడు కూడా ఇలాంటి బుద్ధి, పౌరుష హీనులున్నారు. కపటోపాయంతో సమాజాన్ని మోసగించేవాళ్ళూ ఉన్నారు. అంతమాత్రంచేత వేదాలను, వేదవేత్తలను నిందించడం ఉచితం కాదు.

అవ: ఇలా వాదించిన చార్వాకుడు ఇక తన అభిమతం చెపుతున్నాడు.

మూలమ్

5. అత ఏవ కణ్టకాదిజన్యం దుఃఖమేవ నరకః. లోకసిద్ధో రాజా పరమేశ్వరః దేహొచ్ఛేదో మోక్షః. దేహాత్మవాదే చ **"స్థూలోఽహమ్"**, **"కృశోఽహమ్"**, **"కృష్ణోఽహమ్"** ఇత్యాదిసామానాధికరణ్యోపపత్తిః. **"మమ శరీరమ్"** ఇతి వ్యవహారః **"రాహోః శిరః"** ఇత్యాదివత్ ఔపచారికః, తదేతత్సర్వం సమగ్రాహి

మనస్విని

అందుచేత ముళ్ళు గ్రుచ్చుకోవడం ఇత్యాది వలన కలిగే దుఃఖమే 'నరకము'. లోకంలో ప్రసిద్ధుడైన రాజే 'పరమేశ్వరుడు'. దేహం నశించడమే మోక్షం. 'దేహమే ఆత్మ' అని వాదిస్తే మరి "నేను లావుగా ఉన్నాను, నేను కృశించే ఉన్నాను" అనే వ్యవహారం ఎలా కుదురుతుంది? అంటే రెండింటికీ సమానాధికరణం (ఒకే విభక్తి అన్వయించడం) చెప్పబడింది. "నా శరీరం" ఇత్యాది వ్యవహారం 'రావు శిరస్సు' అని లక్షణ ద్వారా చెప్పడం వంటిది.

వి: చార్వాకులకు స్వర్గ, నరకాల విషయంలో విశ్వాసంలేదు. ప్రమదాలింగనాదుల వలన కలిగే సుఖమే 'స్వర్గమనీ', ముల్లు గ్రుచ్చుకోవటం లాంటి శరీరానికి బాధ కలిగేదే 'నరకమనీ' అంటారు. ఇక ఈ లోకంలో 'పరిపాలించేవాడే రాజు'. అయితే 'నేను లావుగా ఉన్నాను' మొదలైన మాటలు శరీరానికి అన్వయిస్తాయా? ఆత్మకు అన్వయిస్తాయా? అంటే రెండూ ఒకే దానిపైన ఉన్నాయి అంటున్నాడు. 'నల్ల కలువ' అంటే నలుపూ, కలువతనమూ ఒకే దానిని ఆశ్రయించి ఉన్నాయి. దీనినే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

'సమానాధికరణం' అంటారు. ఇక 'రాహువు' అంటేనే 'శిరసు' మాత్రమే కదా! మరి 'రాహువు శిరసు' అనే మాటకు అర్థం ఏమిటి? అంటే అది లాక్షణిక ప్రయోగం. అలాంటిదే 'నా శరీరం' అనే వ్యవహారం.

'అభిధ, లక్షణ, వ్యంజన' వీటిని గూర్చి కావ్యశాస్త్రాల్లో వివరించబడింది.

అవ: ఇంతవరకూ జరిగిన చర్చనంతా ఈ క్రింది శ్లోకాలలో కూర్చి చెపుతున్నాడు.

మూలమ్

6. "అఙ్గనాలిఙ్గనాజ్జన్యసుఖమేవ పుమర్థతా,
కణ్టకాదివ్యథాజన్యం దుఃఖం నిరయ ఉచ్యతే. 1

మనస్విని

స్త్రీలను ఆలింగనం చేసికొనడం వలన కలిగిన సుఖమే పురుషార్థము (హ్యూమన్ గోల్). కంటకాదుల వలన కలిగే దుఃఖమే నరకమనబడుతుంది.

లోకసిద్ధో భవేద్రాజా పరేశో నాపరః స్మృతః,
దేహస్య నాశో ముక్తిస్తు న జ్ఞానాన్ముక్తిరిష్యతే. 2

మనస్విని

లోక ప్రసిద్ధుడైన నాయకుడే రాజు. పరమేశ్వరుడనేవాడు లేడు. దేహనాశమే ముక్తి. జ్ఞానం వలన మోక్షం కలుగుతుంది అనేది లేదు.

అత్ర చత్వారి భూతాని భూమివార్యనలానిలాః,
చతుర్భ్యః ఖలు భూతేభ్యశ్చైతన్యముపజాయతే. 3

మనస్విని

భూమి, నీరు, నిప్పు, గాలి – అని భూతాలు నాలుగే. ఈ నాలుగూ కలిపినప్పుడు ఆ కలయిక నుండి చైతన్యం పుడుతుంది.

కిణ్వాదిభ్యః సమేతేభ్యో ద్రవ్యేభ్యో మదశక్తివత్,
అహం స్థూలః కృశోఽస్మీతి సామానాధికరణ్యతః. 4

మనస్విని

వివిధ ద్రవ్యాలు కలిసినప్పుడు కిణ్వం వలన మదశక్తి పుట్టినట్లుగా, (చైతన్యం పుడుతుంది). 'నేను స్థూలంగా ఉన్నాను, నేను కృశించి ఉన్నాను' అనేది సామాన్యాధికరణం వలన జరిగే వ్యవహారం.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దేహః (హే) స్థౌల్యాదియోగాచ్చ స ఏవాత్మా న చాపరః,
మమ దేహోऽయమిత్యుక్తిః సంభవేదౌపచారికీ". ఇతి 5

మనస్విని

స్థూలత్వాదులు శరీరంలో ఉండడంచేత అదియే (ఆ శరీరమే) ఆత్మ. 'నా దేహము' అని వ్యవహరించడం 'ఔపచారికం.'

అవ: ఇంతవరకూ బాగానే ఉంది. అయితే మరి ఇతర ప్రమాణాలని అంగీకరించే పక్షాలు కూడా ఉన్నాయి కదా! ప్రతిదానికీ ప్రత్యక్ష ప్రమాణం పొసగదు. అలాంటప్పుడు 'అనుమాన' ప్రమాణాన్ని ఆశ్రయిస్తారు. అయితే "అనుమాన ప్రమాణం" పొసగదు అని చార్వాకుడు బహువిధాలా వాదిస్తున్నాడు. ఆ వాదన ఇలా సాగుతుంది.

మూలమ్

7. స్యాదేతత్ – స్యాదేష మనోరథో యద్యనుమానాదేః ప్రామాణ్యం న స్యాత్; అస్తి చ ప్రామాణ్యమ్. కథమన్యథా ధూమోపాలమ్భానన్తరం ధూమధ్వజే ప్రేక్షావతాం ప్రవృత్తిరుపపద్యేత? **"నద్యాస్తీరే ఫలాని సన్తి"** ఇతి వచనశ్రవణసమనన్తరం ఫలార్థినాం నదీతీరే ప్రవృత్తిః? ఇతి.

మనస్విని

పూర్వ పక్షివాదాన్ని ప్రస్తావించి దానికి సమాధానం చెపుతున్నాడు.

అనుమానాది ప్రమాణాల ప్రామాణ్యం లేకపోతే నీ మనోరథం అలా అయిఉండవచ్చు. కానీ వాటి ప్రామాణ్యం అంగీకరించబడింది. అలా కానట్లయితే ధూమాన్ని (పొగను) చూచి ధూమధ్వజం (అగ్ని) ఉందని బుద్ధిమంతులు ఎందుకు ప్రవర్తిస్తారు? "నదీతీరాన ఫలాలు ఉన్నాయి" అనే మాట వినగానే పళ్ళు కావలసిన వాళ్ళు నదీతీరానికి ఎందుకు వెళతారు?

వి: పూర్వపక్షి అంటూ ఎదురుగా ఎవరూ ఉండరు. ఎదుటి వారికి రాబోయే సందేహాన్ని ఆశంకించుకుని (ఊహించుకుని) దానికి సమాధానం చెప్పటం శాస్త్రపద్ధతి. ఇతర శాస్త్రాలలో అనుమాన, శబ్దాది ప్రమాణాలు అంగీకరించబడినాయి. అందుచేతనే పైన పొగను చూచి నిప్పు ఉందని ఊహించే 'అనుమాన ప్రమాణాన్నీ', 'నదీతీరంలో పళ్ళున్నాయి' అనే శబ్ద ప్రమాణాన్నీ ఉదాహరించాడు. ఇప్పుడు ఈ ప్రమాణాలకు ప్రామాణ్యం లేదని వాదించబోతున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇక్కడ అత్యంతాసక్తికరమైన విషయం విద్యారణ్యుల వారి పదవిన్యాసం. పదునైన పదాలతో వాదాన్ని కదం తొక్కిస్తున్నారు.

మూలమ్

8. తదేతన్మనోరాజ్యవిజృమ్భణమ్. వ్యాప్తి పక్షధర్మతాశాలి హి లిఙ్గం గమకమభ్యుపగతమ్ అనుమానప్రామాణ్యవాదిభిః, వ్యాప్తిశ్చోభయోపాధివిధురః సంబన్ధః. స చ సత్తయా చక్షురాదివన్నాఙ్గభావం భజతే; కింతు జ్ఞాతతయా. కః ఖలు జ్ఞానోపాయో భవేత్? న తావత్ ప్రత్యక్షమ్. తచ్చ బాహ్యమ్ ఆన్తరం వా అభిమతమ్? న ప్రథమః తస్య సంప్రయుక్తవిషయజ్ఞానజనకత్వేన భవతి ప్రసరసంభవేఽపి భూతభవిష్యయోః తదసంభవేన సర్వోపసంహారవత్యాః వ్యాప్తేః దుర్జ్ఞానత్వాత్. న చ వ్యాప్తిజ్ఞానం సామాన్యగోచరమితి మన్తవ్యమ్, వ్యక్త్యోః అవినాభావాభావప్రసంగాత్. నాపి చరమః, అన్తఃకరణస్య బహిరిన్ద్రియతన్త్రత్వేన బాహ్యేఽర్థే స్వాతన్త్ర్యేణ ప్రవృత్త్యనుపపత్తేః. తదుక్తమ్.

"చక్షురాద్యుక్తవిషయం పరతన్త్రం బహిర్మనః" (త.వి.20) ఇతి.

మనస్విని

నీవు చెప్పేదేదైతే ఉందో అది నీ 'మనోరాజ్య విజృంభణం' (నీ మనసులో విశృంఖలంగా చెలరేగే ఆలోచన). వ్యాప్తి, పక్షధర్మత్వం – ఈ రెండూ కలిసిన 'లింగం' అనుమాన ప్రమాణానికి సూచకం. 'వ్యాప్తి' అంటే రెండు విధాలైన ఉపాధులు లేని సంబంధం. అది ఉంది అనడానికి చక్షువుల వలె 'అంగం' కాదు, తెలుసుకోవటం ద్వారానే అనగా జ్ఞానం ద్వారానే తెలుస్తుంది. మరి ఆ జ్ఞానానికి సాధనం ఏమిటి? అది ప్రత్యక్షం కాదు. ప్రత్యక్షం రెండు విధాలు – బాహ్యం, ఆంతరం. బాహ్యం కావడానికి వీలులేదు. అది తన ఇంద్రియ గోచరమైన వర్తమాన విషయ జ్ఞానాన్నే కలిగించ గలుగుతుంది కాని భూత, భవిష్యత్తులకు సంబంధించిన దానిని తెలుపజాలదు. భిన్న కాలాలకి సంబంధించిన వాటికి వ్యాప్తి కుదరదు. వ్యాప్తి జ్ఞానం జాతికి సంబంధించింది అని అనుకోవడానికి వీలులేదు. అలా అయితే వ్యక్తులకు (భిన్న భిన్న ద్రవ్యాలకు) అవినాభావం లేకుండా పోతుంది. రెండవదైన ఆంతర ప్రత్యక్షమూ కుదరదు. అంతఃకరణం బాహ్యేంద్రియం పైనే ఆధారపడి ఉంటుంది, అది స్వతంత్రంగా బయట వస్తువుల వైపు ప్రసరించజాలదు. ఈ విషయమే ఇలా చెప్పబడింది – "మనసు దేనినైనా గ్రహించాలంటే బాహ్య వస్తువులపై ప్రసరించగలిగే చక్షురాది ఇంద్రియాలపై ఆధారపడి ఉంటుంది (అది సాక్షాత్తూ విషయాలను చేరజాలదు).

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి: ఒక విషయం ప్రత్యక్షంగా గోచరించనప్పుడు కొన్ని గుర్తులను బట్టి దానిని ఊహిస్తాం. ఆ గుర్తులే 'లింగం' అనబడతాయి. ఉదాహరణకు ఎక్కడైనా ధూమం కనిపిస్తే అక్కడ నిప్పు ఉంది అని గ్రహించడం. 'నిప్పు లేనిదే పొగరాదు' అంటారు కదా! అయితే 'ధూమం నిప్పు' రెండింటి మధ్య 'వ్యాప్తి' అన్ని కాలాలలోనూ చూడజాలం కదా! 'ఎక్కడెక్కడ పొగ ఉంటుందో అక్కడక్కడ నిప్పు ఉంటుంది' అని చెప్పడంలో ఆ రెండింటి సాహచర్యమే వ్యాప్తి.

వంటింట్లో చూచినట్లు ప్రతిచోటా ఆ రెండింటినీ కలిపి చూడలేం. అదీగాక భూత, భవిష్యత్తులకు సంబంధించినది అసలే చూడలేం. ఇదీ చార్వాకుల వాదన.

ఇక్కడ చెప్పబడిన వ్యాప్తి, జాతి, వ్యక్తి ఇవన్నీ శాస్త్రంలోని పారిభాషిక పదాలు. న్యాయ, వైశేషిక దర్శనాల్లో వీటిని గూర్చిన చర్చ విస్తృతంగా లభిస్తుంది.

అవ: 'వ్యాప్తి'ని గూర్చి తెలుసుకోవడానికి ప్రమాణం ఏదీ లేదని వాదించి చూపించబోతున్నాడు చార్వాకుడు.

మూలమ్

9. నాప్యనుమానం వ్యాప్తిజ్ఞానోపాయః తత్ర తత్రాప్యేవమితి అనవస్థాదౌస్థ్య ప్రసంగాత్. నాపి శబ్దః తదుపాయః. కాణాదమతానుసారేణ అనుమాన ఏవాన్తర్భావాత్. అనన్తర్భావే వా వృద్ధవ్యవహారరూపలిఙ్గావగతిసాపేక్షతయా ప్రాగుక్త దూషణలఙ్ఘనా-జఙ్ఘాలత్వాత్. ధూమధూమధ్వజయోః అవినాభావః అస్తీతి వచనమాత్రే మన్వాదివద్విశ్వా-సాభావాచ్చ. అనుపదిష్టావినాభావస్య పురుషస్య అర్థాన్తరదర్శనేన అర్థాన్తరానుమిత్యభావే స్వార్థానుమానకథాయాః కథాశేషత్వ ప్రసఙ్గాచ్చ, కైవ కథా పరార్థానుమానస్య. ఉపమానాదికం తు దూరాపాస్తమ్. తేషాం సంజ్ఞాసంజ్ఞిసంబన్ధాదిబోధకత్వేన అనౌపాధిక-సంబన్ధబోధకత్వాసంభవాత్.

మనస్విని

'వ్యాప్తి' ఉంది అని తెలుసుకోవడానికి అనుమానం కూడా ఉపాయం (సాధనం) కాదు. ధూమానికీ, అగ్నికీ 'వ్యాప్తి' ఉందని ఏ 'అనుమాన' ప్రమాణం చెపుతావో ఆ అనుమాన ప్రమాణానికి కూడా 'వ్యాప్తి' అవసరం. అది నిరూపించడానికి కూడా 'అనుమానం' కావాలి. ఈవిధంగా 'అనుమానాని'కి 'అనుమానం' అంటూ వెళితే అది అనవస్థాదోషం అవుతుంది. (కాబట్టి అనుమాన ప్రమాణం అంగీకరించబడదు). ఇక శబ్ద ప్రమాణం కూడా కుదరదు. కాణాద (వైశేషిక) మతానుసారం 'శబ్దం'

Public domain. Digitization Muthulakshmi Research Academy

'అనుమానం'లోనే వస్తుంది. 'కాదూ అలా అనుమానాంతర్గతం కాదూ' అంటే మళ్ళీ పూర్వం లాగే దానికీ 'వృద్ధ వ్యవహార రూపమైన' లింగాపేక్ష ఉంటుంది. మళ్ళీ ఆ దోషమే ఇక్కడా దూకివస్తుంది. 'ధూమానికీ, అగ్నికీ అవినాభావం ఉంది' అని ఎవరో అన్నంత మాత్రాన అది ప్రమాణమైపోదు. మన్వాదుల వచనాల వలెనే దానిని ఎవరూ నమ్మరు. ఈవిధంగా రెండింటి 'అవినాభావాన్ని' గూర్చి తెలియడానికి అవకాశం లేనపుడు ధూమాన్ని చూచి, అగ్ని ఉందని అనుమానించడం అనే 'స్వార్థానుమానం' కుదరదు. స్వార్థానుమానం (తాను ఊహించి తెలుసుకోవడం) కుదరనపుడు మరొకరికి ధూమాన్ని చూపించి, ఇక్కడ అగ్ని ఉంటుంది అని నిరూపించడానికి (పరార్థానుమానం) అవకాశం ఎక్కడ ఉంటుంది?

(అనుమానం, శబ్దం రెండూ కుదరలేదు, ఉపమానాదులు ఉన్నాయి కదా అంటే దానికీ సమాధానం చెపుతున్నాడు). సంజ్ఞా, సంజ్ఞి సంబంధం ఉంటేనే ఉపమానం కుదురుతుంది. అది ధూమానికీ, అగ్నికీ మధ్యలేదు కాబట్టి అది అవతల పెట్టాల్సిందే (దూరాపాస్తమ్).

వి: 'వృద్ధ వ్యవహారం' అంటే ఒక పెద్దాయన ఒక పిల్లవాడితో 'నాయనా ఆవును తీసుకురా' అని చెప్పి ఆవును చూపించినప్పుడు 'ఓహో దీన్ని 'ఆవు' అంటారు అని ఆ పిల్లవాడు గ్రహించడం. మాట విని గ్రహించాడు కాబట్టి ఇది 'శబ్ద' ప్రమాణం అవుతుంది. అయితే 'పెద్దాయన' చెపుతున్నాడు కదా! అనే ఊహ (అనుమానం) నమ్మకానికి తావిస్తుంది. ఇక్కడా 'అనుమాన' ప్రమాణం ప్రసక్తి కాబట్టి పైన చెప్పిన దోషం ఇక్కడా వస్తుంది అని చార్వాక మతం.

అవ: 'అనుమానం' అనే దానిలో 'ఉపాధి' అనే ఆటంకం కూడా ఉంటుంది. అలా ఏ 'ఉపాధి' లేకపోతేనే అది 'ప్రమాణం' అవుతుంది. ఉదాహరణకు 'ఎక్కడ పొగ ఉందో అక్కడ అగ్ని ఉంది' అనే దానిలో పొగకు కారణం ఆర్ద్ర ఇంధనం (పచ్చి కట్టెలు) అనేది 'ఉపాధి'. అంటే అప్పుడే చల్లార్చిన 'ఇంధనం'లో నిప్పు ఉండదు గానీ పొగ ఉంటుంది. ఇలా అనుమాన ప్రమాణానికి సంబంధించి చాలా చర్చ ఉంటుంది. అదంతా అప్రస్తుతం కాబట్టి అవసరమైనంత వరకే తెలుసుకోవటం మంచిది.

మూలమ్

10. కించ - ఉపాధ్యభావోఽపి దురవగమః. ఉపాధీనాం ప్రత్యక్షత్వనియమా-సంభవేన, ప్రత్యక్షాణామభావస్య ప్రత్యక్షత్వేఽపి అప్రత్యక్షాణామభావస్య అప్రత్యక్షతయా

In Public domain. Digitization Muthulakshmi Research Academy
అనుమానాద్యపేక్షాయాముక్తదూషణానతివృత్తేః.

మనస్విని

ఉపాధి లేదనేది తెలుసుకోవటమూ కష్టమే. ఎందుచేతనంటే ఉపాధులన్నీ ప్రత్యక్షాలు అనే నియమం లేదు. కంటికి కనబడేవి లేవని తెలుసుకోవటం సాధ్యం, కానీ కంటికి కనబడని సూక్ష్మమైనవి ఉన్నవని తెలుసుకోవటం ఎంతకష్టమో, లేవని తెలుసుకోవటమూ అంతే కష్టం. మళ్ళీ అక్కడ అనుమానమే శరణ్యం. ఆ అనుమానానికి మరో అనుమానం కావాలి (ఇది ఇలాగే కొనసాగుతుంది).

అవ: ఇప్పుడు ఉపాధి లక్షణం వివరించి, ఉపాధి లేకపోవడం కుదరదు అని ప్రతిపాదిస్తున్నాడు.

11. అపి చ సాధనావ్యాపకత్వే సతి సాధ్యసమవ్యాప్తిరితి తల్లక్షణమ్ అఙ్గీకర్తవ్యమ్. తదుక్తమ్ -

"అవ్యాప్తసాధనో యః సాధ్యసమవ్యాప్తిరుచ్యతే స ఉపాధిః,
శబ్దేఽనిత్యే సాధ్యే సకర్తృకత్వం ఘటత్వమశ్రవతాం చ.
వ్యావర్తయితుముపాత్తాన్యత్ర క్రమతో విశేషణాని త్రీణి,
తస్మాదిదమనవద్యం సమాసమేత్యాదినోక్తమాచార్యైః" ఇతి.

మనస్విని

సాధనానికి అవ్యాపకంగా ఉండి, సాధ్యంతో సమవ్యాప్తి కలిగిఉండడం అనేది 'ఉపాధి' లక్షణంగా అంగీకరించాల్సి ఉంది. ఈ విషయమే 'అవ్యాప్తసాధనః'... అనే కారికలలో చెప్పబడింది.

ఇక్కడ కొన్ని పదాలకు ఈ శాస్త్రంలో చెప్పబడిన అర్థాలు తెలుసుకోవాలి. అవి - వ్యాప్యం, వ్యాపకం, అతివ్యాప్తి, అవ్యాప్తి, అసంభవం.

సాధనం, అనగా దేనిచేత సాధింపబడుతుందో అది. ఉదాహరణకు, "యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః" - ఎక్కడెక్కడ పొగ ఉంటుందో అక్కడక్కడే అగ్ని ఉంటుంది అనే వాక్యంలో ధూమ, అగ్నులకు గల సంబంధం వ్యాప్తి అనబడుతుంది. ఇక్కడ ధూమం, వ్యాప్యం, అగ్ని వ్యాపకం. అయితే ఈ సంబంధం (వ్యాప్తి) రెండు విధాలు - 1. సమవ్యాప్తి, 2. అసమవ్యాప్తి.

అవశ్యంగా రెండూ కలిసి ఉంటే అది సమవ్యాప్తి. ఉదాహరణం

"యత్ర యత్ర పృథివీత్వం తత్ర తత్ర గంధః". ఎక్కడెక్కడ పృథివీత్వం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉంటుందో అక్కడక్కడ గంధం ఉంటుంది. "గంధవతీ పృథివీ" అని పృథివి లక్షణం చెప్పబడింది. పృథివి, గంధం మధ్య వ్యాప్తి విడదీయరానిది. కానీ "యత్ర యత్ర ధూమః...." అనే ఉదాహరణంలో అలా కాదు. ధూమం లేకుండా కూడా అగ్ని ఉంటుంది. ఎర్రగా కాలిన ఇనుపగోళంలో అగ్ని (కాల్చేతత్త్వం) ఉంటుంది. కాని ధూమం ఉండదు. దీనినే 'అసమ వ్యాప్తి' అంటారు (ఈ విషయాలు శాస్త్రాధ్యయనంతో స్పష్టమౌతాయి).

"యత్ర యత్ర ధూమః....." ఉదాహరణంలో ""ఆర్ద్రేంధన సంయోగః" "పచ్చి ఇంధనంతో సంయోగం" (పచ్చి కట్టెలు మొదలైనవి) అనేది 'ఉపాధి' అని చెప్పబడుతుంది.

ఆర్ద్ర ఇంధన సంయోగం, ధూమం - ఈ రెండింటికీ వ్యాప్తి ఉంది, కానీ అగ్నికీ, ఆర్ద్ర ఇంధన సంయోగానికీ వ్యాప్తి లేదు.

ఈ ఉపాధికి ఉదాహరణం - "సదేశః ధూమవాన్ అగ్నిమత్త్వాత్".

పై వాక్యంలో అగ్ని సాధనం, ధూమం సాధ్యం. ఆర్ద్రేంధన సంయోగం సాధనమైన అగ్నితో వ్యాప్తి కలిగిలేదు, సాధ్యమైన ధూమంతో సమవ్యాప్తి కలిగి ఉంది.

ఈ విధంగా ఉపాధి, వ్యాప్తి - ఈ రెండు చక్కగా పరిశీలించి కానీ అనుమాన ప్రమాణాన్ని చేరుకోలేము. ఉపాధి తెలుసుకోవటానికి వ్యాప్తి జ్ఞానం అవసరం, వ్యాప్తి తెలుసుకోవటానికి ఉపాధి జ్ఞానం అవసరం. ఈ విధంగా పరస్పరాశ్రయ దోషం ఏర్పడుతుంది. (పెళ్ళయితే పిచ్చి కుదురుతుంది, పిచ్చికుదిరితే పెళ్ళవుతుంది అన్నట్లుగా). ఇలాంటి పరిస్థితిలో ఉపాధి లేకపోవడాన్ని నిరూపించడం కష్టం కనుక అనుమాన ప్రమాణం అంగీకరించడం కుదరదు.

ఈ విషయాన్నే నొక్కి వక్కాణిస్తున్నాడు.

మూలమ్

12. తత్ర విధ్యధ్యవసాయపూర్వత్వాత్ నిషేధాధ్యవసాయస్య ఉపాధిజ్ఞానే జాతే తదభావవిశిష్టసంబన్ధరూపవ్యాప్తిజ్ఞానం, వ్యాప్తిజ్ఞానాధీనం చ ఉపాధిజ్ఞానమ్ ఇతి పరస్పరాశ్రయవజ్రప్రహారదోషః వజ్రలేపాయతే. తస్మాత్ అవినాభావస్య దుర్బోధతయా న అనుమానాద్యవకాశః. ధూమాదిజ్ఞానానన్తరమ్ అగ్న్యాదిజ్ఞానే ప్రవృత్తిః ప్రత్యక్షమూలతయా, భ్రాన్త్యా వా యుజ్యతే. క్వచిత్ ఫలప్రతిలమ్భస్తు మణిమన్త్రౌషధాదివత్ యాదృచ్ఛికః.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

నిషేధం యొక్క నిర్ణయానికి ముందు విధి యొక్క నిర్ణయం ఉండాలి. అందుచేత ముందుగా ఉపాధి అంటే ఏమిటో తెలిస్తేనే దాని అభావం (అదిలేకపోవడం)తో కూడిన సంబంధం అనే వ్యాప్తిని గూర్చి తెలుస్తుంది. ఉపాధి జ్ఞానం వ్యాప్తి జ్ఞానం మీద ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా పరస్పరాశ్రయ దోషం అనే వజ్రలేపం (అభేద్యమైనది) ఏర్పడుతుంది. అందుచేత అవినాభావం (వ్యాప్తి) తెలియడానికి శక్యంకాదు కావున అనుమానాదులకు అవకాశం లేదు. ధూమం ఉందని చూచినప్పుడు అగ్ని ఉందని తెలుసుకోవటం ప్రత్యక్షంగా చూడటం వల్లనైనా కావచ్చు లేదా అది భ్రాంతి జ్ఞానమైనా కావచ్చు. ఒక్కొక్కప్పుడు మణి, మంత్ర, ఔషధాదుల ఫలితం వలె యాదృచ్ఛికమైనా కావచ్చు. (చార్వాకులు మణిమంత్రాదులను విశ్వసించరు కనుక పైవిధంగా చెపుతున్నారు).

మూలమ్

13. అతః తత్సాధ్యమ్ అదృష్టాదికమపి నాస్తి. నను అదృష్టానిష్టౌ జగద్వైచిత్ర్యమ్ ఆకస్మికం స్యాదితి చేత్ - న తద్భద్రమ్. స్వభావాదేవ తదుపపత్తేః. తదుక్తమ్ -

మనస్విని

అందుచేత అదృష్టం మొదలైనవి లేవు. "మరి అలాగైతే అదృష్టం, అనిష్టం (పుణ్య, పాపాలు) అనేవీ, ప్రపంచంలో కనిపించే సుఖవంతులు, దుఃఖవంతులు అనే విచిత్రాలకు కారణం లేకుండా పోతుంది" అన్నట్లయితే అది యుక్తంకాదు. అన్నీ స్వభావసిద్ధంగా జరుగుతాయి. ఈ విషయమే ఇలా చెప్పబడింది.

మూలమ్

అగ్నిరుష్ణో,జలం శీతం,సమస్పర్శస్తథానిలః,
కేనేదం చిత్రితం,తస్మాత్స్వభావాత్తద్వ్యవస్థితిః". ఇతి

మనస్విని

నిప్పు వేడిగా ఉంటుంది, నీరు చల్లగా ఉంటుంది. గాలి సమశీతోష్ణంగా ఉంటుంది. ఇదంతా ఎవరు చేశారు? ఈ వ్యవస్థ అంతా స్వభావం చేతనే జరిగిపోతున్నది.

ఇదంతా బృహస్పతి చేత కూడా చెప్పబడింది.

 Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

14. తదేతత్సర్వం బృహస్పతినాప్యుక్తమ్ –

"న స్వర్గో నాపవర్గో వా నైవాత్మా పారలౌకికః,

నైవ వర్ణాశ్రమాదీనాం క్రియాశ్చ ఫలదాయికాః". 1

మనస్విని

బృహస్పతి కూడా ఈ విషయాన్నే చెప్పాడు.

స్వర్గమూ లేదు, మోక్షమూ లేదు. పారలౌకికమైన ఆత్మ అనేదీ లేదు. వర్ణ ధర్మక్రియలు, ఆశ్రమధర్మక్రియలూ కూడ ఫలదాయకాలు కావు.

"అగ్నిహోత్రం త్రయో వేదాః త్రిదణ్డం భస్మగుణ్ఠనమ్,

బుద్ధిపౌరుషహీనానాం జీవికా ధాతృనిర్మితా". 2

మనస్విని

అగ్నిహోత్రం, మూడు వేదాలు. సంన్యాసులు ధరించే త్రిదండము, భస్మం పూసుకోవటం – ఇవన్నీ బుద్ధీ, పురుషకారము (పురుష ప్రయత్నం) లేనివారికి జీవికలుగా (పొట్ట పోసుకోవటానికై) విధాతచేత నిర్మించబడినాయి.

"పశుశ్చేన్నిహతః స్వర్గం జ్యోతిష్టోమే గమిష్యతి,

స్వపితా యజమానేన తత్ర కస్మాన్న హింస్యతే". 3

మనస్విని

జ్యోతిష్టోమ యాగంలో వధించబడిన పశువు స్వర్గానికి వెళ్ళేటట్లయితే యజమాని తన తండ్రినే (స్వర్గం పంపడానికై) ఎందుకు వధించటం లేదు?

"మృతానామపి జన్తూనాం శ్రాద్ధం చేత్తృప్తికారణమ్,

నిర్వాణస్య ప్రదీపస్య స్నేహః సంవర్ధయేచ్ఛిఖామ్". 4

మనస్విని

మరణించిన మానవులకు శ్రాద్ధం తృప్తి కలిగించేటట్లయితే ఆరిపోయిన దీపంలో కూడా నూనె జ్వాలను ప్రజ్వరిల్లజేయాలి కదా!

"గచ్ఛతామిహ జన్తూనాం వ్యర్థం పాథేయకల్పనమ్,

గేహస్థకృతశ్రాద్ధేన పథి తృప్తిరవారితా". 5

మనస్విని

ప్రయాణించే వారికి 'దారిభోజనం' కట్టి ఇవ్వడం వ్యర్థం. శ్రాద్ధంలో వలెనే

In Public domain. Digitization Muthulakshmi Research Academy
బాటసారికి కూడా ఇంట్లో శ్రాద్ధం పెడితే ఆ భోజనం అతనికి చేరుతుంది కదా!

"స్వర్గస్థితా యదా తృప్తిం గచ్ఛేయుస్తత్ర దానతః,
ప్రాసాదస్యోపరిస్థానామత్ర కస్మాన్న దీయతే". 6

మనస్విని

ఇక్కడ ఇచ్చిన దాంతో స్వర్గంలో ఉండేవారు తృప్తి చెందుతారన్నట్లయితే, భవనం పైన ఉన్నవారికి కూడా క్రింద నుండే భోజనాదులు సమర్పించవచ్చు కదా!

వి: రెండవ శ్లోకంలో 'ధాతృనిర్మితా' అనేచోట పాఠాంతరమేదైనా ఉండి ఉండాలి. 'బ్రహ్మదేవుడు' అనేది చార్వాకులు అంగీకరించరు కదా! ఈ విధంగా వేదవిధులను, యజ్ఞయాగాది కర్మలను, శ్రాద్ధకర్మలను గూర్చి అవహేళనగా మాట్లాడతారు నాస్తికులు. ఇది ఒక రకమైన మనస్తత్త్వం. వీరి మాటలకి సమాధానాలు ఇతర దర్శనాలలో లభిస్తాయి.

ఇక పైన చెప్పిన అభిప్రాయాలనే క్రింది మూడు శ్లోకాలలో నొక్కి వక్కాణిస్తున్నాడు.

మూలమ్

15. **"యావజ్జీవేత్సుఖం జీవేత్ ఋణం కృత్వా ఘృతం పిబేత్,**
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః". 7

మనస్విని

జీవించినంత కాలం సుఖంగా జీవించాలి. అప్పుచేసి నెయ్యి త్రాగాలి. దేహం భస్మమైపోయాక తిరిగి వస్తుందా?

"యది గచ్ఛేత్పరం లోకం దేహాదేష వినిర్గతః,
కస్మాద్భూయో న చాయాతి బన్ధుస్నేహసమాకులః". 8

మనస్విని

ఒకవేళ ఈ శరీరం నుండి బయటకు వెళ్ళినవాడు పరలోకానికి వెళితే (వెళ్ళగలిగితే) బంధువుల పట్ల, స్నేహితులు పట్ల గల ప్రేమతో ఎందుకు తిరిగిరావడం లేదు?

"తతశ్చ జీవనోపాయో బ్రాహ్మణైర్విహితస్త్విహ,
మృతానాం ప్రేతకార్యాణి న త్వన్యద్విద్యతే క్వచిత్". 9

మనస్విని

అందుచేత మరణించిన వారికి ప్రేతకార్యాలు (అపకర్మలు) చేయాలన్నది తమ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

జీవనోపాధి కోసం బ్రాహ్మణులు కనిపెట్టిన ఉపాయం. అంతకుమించి మరేమీ లేదు.

వి: ఈ భావాలు ఈ కాలంలో కూడా చాలామంది హేతువాదులమంటూ ప్రకటించేవే. అయితే అప్పు చేసైనా విందు భోజనం ఆరగించాలి అనేది ఎంతవరకు సమాజానికి శ్రేయస్కరం? ఒకని దగ్గర నుండి డబ్బు తీసికొని తీర్చకుండా ఉండటం నేరం అని ఆనాటి ఈనాటి చట్టాలు చెపుతూనే ఉన్నాయి.

అవ: ఇక చివరగా వేద, వేదవేత్తల నిందతో ఈ దర్శన సారం ముగుస్తుంది.

మూలమ్

16. **"త్రయో వేదస్య కర్తారో భణ్డధూర్తనిశాచరాః,**
జర్భరీతుర్ఫరీత్యాది పణ్డితానాం వచః స్మృతమ్". 10

మనస్విని

భండులు (ఉన్మత్తులు), ధూర్తులు, రాక్షసులు అను మూడు రకాల వాళ్ళు వేదాలు రచించారు. ఈ వేదాలలో ఉచ్చరించబడే 'జర్భరీ, తుర్ఫరీ' (మంత్రాలు) ధూర్త ప్రేలాపన.

"అశ్వస్యాత్ర హి శిశ్నం తు పత్నీగ్రాహ్యం ప్రకీర్తితమ్,
భణ్డైస్తద్వత్పరం చైవ గ్రాహ్యజాతం ప్రకీర్తితమ్".
మాంసానాం ఖాదనం తద్వన్నిశాచర సమీరితమ్." 11

తస్మాత్ బహూనాం ప్రాణినామనుగ్రహార్థం చార్వాకమతమ్ ఆశ్రయణీయమ్ ఇతి రమణీయమ్.

ఇతి శ్రీమత్సాయణమాధవీయే సర్వదర్శనసంగ్రహే చార్వాకదర్శనమ్

మనస్విని

అశ్వమేధంలో చంపబడిన అశ్వం యొక్క లింగాన్ని పట్టమహిషి గ్రహించాలి అని యీ ఉన్మత్తులు వ్రాశారు. అదేవిధంగా ఇంకా కొన్ని వస్తువులను గ్రహించాలని పేర్కొన్నారు. అదేవిధంగా యజ్ఞంలో చంపబడిన పశుమాంసం భుజించాలని వ్రాశారు. ఇది నిశాచరుల చేత చెప్పబడింది.

అందుచేత చాలామంది ప్రాణులను (జనాలను) అనుగ్రహించడానికి చార్వాకమతం ఆశ్రయించదగినది అన్నది అత్యంత రమణీయమైనది. ఇది శ్రీమత్సాయణ మాధవ 'సర్వదర్శనసంగ్రహం'లోని 'చార్వాకదర్శనం'.

వి: ఇంతవరకూ 'చార్వాక దర్శనాన్ని' సంక్షిప్తంగా 'I quote' అన్న రీతిలో ముఖ్యమైన శ్లోకాలను గ్రహించి పఠితల ముందుంచారు విద్యారణ్యమాధవులు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

2. అథ బౌద్ధదర్శనమ్

మనస్విని

అవ: తాము ఏ దర్శనాన్ని దుయ్యబట్టకుండా ఇతర దర్శనాలు లేవనెత్తిన అభ్యంతరాలతో తమ పాండితీచమత్కృతిని మెరిపిస్తూ గ్రంథాన్ని ముందుకు నడిపిస్తారు మాధవవిద్యారణ్యులు. ఇది అసాధారణ ప్రజ్ఞ. గ్రంథాన్ని చదువుతున్న వారెవరికీ గ్రంథకర్త పట్ల కోపంరాదు. ఒక చక్కని డిబేట్ వాగ్వాదం చూస్తున్నట్లుగా ఆసక్తికరంగా ఉంటుంది.

మూలమ్

17. అత్ర బౌద్ధైరభిధీయతే – యదభ్యధాయి – అవినాభావః దుర్బోధః ఇతి తత్ అసాధీయః. తాదాత్మ్య తదుత్పత్తిభ్యామ్ అవినాభావస్య సుజ్ఞానత్వాత్. తదుక్తమ్ -

"కార్యకారణభావాద్వా స్వభావాద్వా నియామకాత్,
అవినాభావనియమో దర్శనాన్న నదర్శనాత్". (న్యాయన్దు:) ఇతి.

అన్వయవ్యతిరేకావవినాభావనిశ్చాయకావితి పక్షే సాధ్యసాధనయోః అవ్యభిచారః దురవధారణః భవేత్; భూతే, భవిష్యతి, వర్తమానే చ అనుపలభ్యమానే అర్థే వ్యభిచారశఙ్కాయాః అనివారణాత్.

మనస్విని

చార్వాకులు చెప్పిన దాంట్లో "అవినాభావము" (వ్యాప్తి) అర్థం చేసికొనటం కష్టం అని ఏదైతే ఉందో దాని విషయంలో బౌద్ధులు ఇలా చెపుతున్నారు – "అవినాభావం తెలిసికోవటం సులభంకాదు" అన్నది సముచితం కాదు. ఎందుచేతనంటే తాదాత్మ్యంచేతా, తదుత్పత్తిచేతా అది సులభగ్రాహ్యమే. ఈ విషయమే ఇలా చెప్పబడింది.

"కార్యకారణ భావంచేత గానీ, నియతమైన స్వభావం వలన గానీ అవినాభావ నియమం కనిపిస్తుంది. అయితే ఒకచోట కనపడి, మరొకచోట కనబడకపోవటం వలన మాత్రం అది కుదరదు."

అన్వయ వ్యతిరేకాలు అవినాభావాన్ని నిశ్చయిస్తాయి అన్న పక్షంలో సాధ్య సాధనాలకు వ్యభిచారం (ఒకచోట ఉండి మరొకచోట లేకుండాపోవటం) లేకపోవడమనేది నిర్ణయించడం కష్టం. ఎందుచేతనంటే భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలో ప్రత్యక్షంగా చూడలేని వాటి విషయంలో వీటి మధ్య వ్యభిచారం ఉంటుందా? ఉండదా? అనే

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

శంక అనివార్యం. (క్షణిక వాదులైన బౌద్ధులు ఏ విషయాన్నీ ప్రత్యక్షంగా చూడలేము అంటారు. ఈ విషయం ముందు ముందు చర్చలో విశదమౌతుంది.)

మూలమ్

18. నను తథావిధస్థలే తావకేఽపి మతే వ్యభిచారశఙ్కా దుష్పరిహారేతి చేత్ – మైవం వోచః. వినాపి కారణం కార్యముత్పద్యతామ్ ఇత్యేవం విధాయాః శఙ్కాయాః వ్యాఘాతావధికతయా నివృత్తత్వాత్. తదేవ హ్యాశఙ్క్యేత యస్మిన్నాశఙ్క్యమానే వ్యాఘాతాదయో నావతరేయుః. తదుక్తం **"వ్యాఘాతావధిరాశఙ్కా"** (న్యా. కుసు. 3.7) ఇతి. తస్మాత్ తదుత్పత్తినిశ్చయేన అవినాభావో నిశ్చీయతే.

మనస్విని

ఇక్కడ పూర్వపక్షాన్ని ముందుంచుకొని సమాధానం చెపుతున్నాడు.

"నీ మతం (బౌద్ధం) ప్రకారం కూడా ప్రత్యక్షంగా కనబడని వాటిలో వ్యభిచార శంక అపరిహార్యమే. మరి అలాంటప్పుడు కార్యకారణ భావంచేత అవినాభావం నిర్ణయించడం ఎలా కుదురుతుంది?" అంటావా? అలా అనకూడదు. ఏ శంక అయినా దానికి వ్యాఘాతం (కొట్టివేయబడటం) వరకే. ఒకసారి వ్యాఘాతం ఏర్పడితే ఆ శంక తీరిపోతుంది. "కారణం లేకపోయినా కార్యం పుట్టవచ్చును గదా!" అను శంక వ్యాఘాతంతో తొలగిపోతుంది. అందుచేత "కారణం నుండి కార్యం పుట్టింది" అను దానితో అవినాభావం నిశ్చయించబడుతుంది. అంతేకాని మీరు (నైయాయికులు) అనుకున్నట్లుగా అన్వయ వ్యతిరేకాలచేత కాదు.

వి: 'కనబడే ప్రతిదీ క్షణికం' అనే బౌద్ధ సిద్ధాంతంలో ఒకటి ఉన్న క్షణంలో మరొకటి ఉండదు. మనం ఒక వస్తువుని చూచాం, చూస్తున్నాం అంటాం. వారు "ప్రతి క్షణానికీ ఆ వస్తువు మారిపోతుంది. మీరు మొదటి క్షణంలో చూచినది రెండవ క్షణంలో ఉండదు" అంటారు. ఇది వారి క్షణికవాదం. అర్థం చేసుకోవటం కష్టమే అయినా 'అది వారి అభిప్రాయం' అంటూ గ్రహించినపుడు ఏ సమస్యా ఉండదు. శాస్త్ర సిద్ధాంతాలు పరస్పర ఖండనం చేసికొన్నప్పుడు ఏ సమస్యా ఉండదు. శాస్త్ర సిద్ధాంతాలు పరస్పర ఖండనం చేసికొన్నప్పుడు పరిణతి లేనివారికి అర్థంచేసికోవడానికి కొంచెం సమయం పడుతుంది. విషయాన్ని గమనించాలి అంతేకాని గందరగోళంలో పడకూడదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

19. తదుత్పత్తినిశ్చయశ్చ కార్యహేత్వోః ప్రత్యక్షోపలమ్భానుపలమ్భపఞ్చకనిబన్ధనః కార్యస్యోత్పత్తేః ప్రాక్ అనుపలమ్భః, కారణోపలమ్భే సత్యుపలమ్భః, ఉప లబ్ధస్య పశ్చాత్ కారణానుపలమ్భాత్ అనుపలమ్భః ఇతి పంచకారణ్యా ధూమ ధూమధ్వజయోః కార్యకారణభావో నిశ్చీయతే. తథా తాదాత్మ్యనిశ్చయేనాపి అవినాభావో నిశ్చీయతే. "**యది శింశపా వృక్షత్వమ్ అతిపతేత్ స్వాత్మానమేవ జహ్యాత్**" ఇతి విపక్షే బాధకప్రవృత్తేః. అప్రవృత్తే తు బాధకే భూయః సహభావో పలమ్భేఽపి వ్యభిచారశఙ్కాయాః కః నివారయితా? శింశపావృక్షయోశ్చ తాదాత్మ్య నిశ్చయః "**వృక్షోఽయం శింశపా**" ఇతి సామానాధికరణ్యబలాదుపపద్యతే. న హ్యత్యన్తాభేదే తత్ సంభవతి. పర్యాయత్వేన యుగపత్ ప్రయోగాయోగాత్. నాప్యత్యన్తభేదే, గవాశ్వయోః అనుపలమ్భాత్, తస్మాత్ కార్యాత్మానౌ కారణాత్మానౌ అనుపమాయతః ఇతి సిద్ధమ్.

మనస్విని

అవ: ఇక ఇప్పుడు అవినాభావం ఎలా సిద్ధిస్తుందో చూపుతున్నాడు.

తదుత్పత్తి నిశ్చయము "ఇది దాని నుండి పుట్టినది" అనే నిశ్చయము కార్య-కారణాలు ప్రత్యక్షంగా కనబడటం, కనబడకపోవటం మొదలైన ఐదింటిచేత నిబద్ధమై ఉంటుంది.

1. పుట్టడానికి ముందు కార్యం కనబడకపోవటం, 2. కారణం కనబడినప్పుడు, 3. అది కనబడటం, 4. కార్యం కనబడిన తరువాత, 5. కారణం కనబడకపోవటం - ఈ పంచ కారణాల చేత తదుత్పత్తి నిశ్చయం జరుగుతుంది.

వి: 'ధూమం, అగ్ని' ఉదాహరణంలో 'నిప్పులేనిదే పొగరాదు' అనే భావం కలుగుతుంది. పొగ (ధూమానికి)కు కారణం నిప్పు (అగ్ని). వీటి కార్యకారణంలో పై ఐదింటిని ఇలా గ్రహించాలి.

1. 'ధూమం' అనే కార్యం అది పుట్టకముందు లేదు. ఇది ఒక అనుపలంభం. 2. కారణం అగ్ని కనబడినప్పుడు, 3. ధూమం కనబడడం – ఈ రెండు ఉపలంభాలు. 4. అగ్ని (చల్లారగానే) కనబడకపోగానే, 5. ధూమం కనబడకపోవడం – రెండు అనుపలంభాలు.

మొత్తంగా రెండు ఉపలంభాలు – లభించటం

మూడు అనుపలంభాలు – లభించకపోవటం

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

వీటిని బట్టి ధూమాగ్నుల మధ్య కార్యకారణ భావం నిశ్చయించబడుతుంది అని బౌద్ధుల అభిప్రాయం.

ఇదేకాకుండా 'తాదాత్మ్యం'చేత కూడా అవినాభావం నిశ్చయించబడుతుంది అని "తథా...." అంటూ వివరిస్తున్నాడు.

అదేవిధంగా తాదాత్మ్య నిశ్చయం చేతకూడా అవినాభావం నిశ్చయించబడుతుంది. 'శింశపావృక్షం' విషయంలో 'శింశపా'కి 'వృక్షాని'కి తాదాత్మ్యం ఉంది. 'శింశప' అనేది 'వృక్షత్వాన్ని' విడిచివేస్తే ఇక 'శింశపావృక్షం' తన స్వరూపాన్నే విడిచి వేసినట్లవుతుంది.

వి: ఏదో 'రంగు' అంటించినట్లుగా 'తుడిచివేస్తే పోయేదికాదు 'శింశపా వృక్షం'లో 'శింశపాత్వం'. దాని పేరే శింశపావృక్షం. రెండూ ఒక దానిలోనే ఉన్నాయి. అదే తాదాత్మ్యం. ఈ తాదాత్మ్యం రెండూ ఒకటే ఐతే (అభిన్నమైతే) కుదరదు. అలాగే రెండూ వేరువేరుగా ఉంటే ఒక గోవు, ఒక ఏనుగు ఇలా – ఈ రెండింటి మధ్య కుదరదు.

'శింశప', 'వృక్షం' రెండూ ఒక వృక్షాన్నే ఆశ్రయించి ఉన్నాయి. అయితే శింశపాత్వం అనే విశేషణం ఉంది కాబట్టి రెండూ ఒక్కటే కావు. ఈ వాదం కొంచెం ఆలోచించి అర్థం చేసికోవాలి.

ఈవిధంగా "కార్య ఆత్మలు, కారణ ఆత్మలను అనుమానింపజేస్తాయి. (అనుమాన ప్రమాణంగా అవుతాయి)

ఇక్కడ ఆత్మ అంటే శరీరం, ఆత్మ అని కాదు. దాని 'స్వరూపం', వస్తుతత్త్వం అని అర్థం చేసుకోవాలి.

శాస్త్ర చర్చలో నిత్యవ్యవహారంలోని ఉదాహరణలు, పదాలు అంగీకరించబడవు. శాస్త్రం ఎప్పుడూ దానికి సంబంధించిన సాంకేతిక పదచట్రంలో బిగించబడి ఉంటుంది. అందుచేతనే ఒక్కో దర్శనంలో ఒక్కో పదజాలం ఉంటుంది.

అవ: ఇంతకుముందు చర్చించిన 'చార్వాకదర్శనం'లో ప్రత్యక్ష ప్రమాణానికి తప్ప యే ఇతర ప్రమాణానికీ స్థానం లేదు. బౌద్ధులు అనుమాన ప్రమాణం అంగీకరిస్తారు. అందుచేత 'అనుమాన ప్రమాణాన్ని' కొట్టివేసిన చార్వాకమతాన్ని ఖండించబోతున్నాడు.

మూలమ్

20. యది కశ్చిత్ ప్రామాణ్యమ్ అనుమానస్య నాఙ్గీకుర్యాత్ తం ప్రతి బ్రూయాత్ – అనుమానం ప్రమాణం న భవతీతి ఉచ్యతే – తత్ర న కించన సాధనమ్ ఉపన్యస్యతే, ఉపన్యస్యతే వా? న ప్రథమః; అశిరస్కవచనస్య ఉపన్యాసే సాధ్యాసిద్ధేః

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

"ఏకాకినీ ప్రతిజ్ఞా హి ప్రతిజ్ఞాతం న సాధయేత్"

ఇతి న్యాయాత్. నాపి చరమః; అనుమానం ప్రమాణం న భవతీతి బ్రువాణేన వచనప్రమాణమనభ్యుపగచ్ఛతా త్వయా స్వపరకీయశాస్త్రే ప్రామాణ్యేన ఉపగృహీతస్య వచనస్య ఉపన్యాసే మమ మాతా వన్ధ్యా ఇతివత్ వ్యాఘాతాపాతాత్.

మనస్విని

ఒకవేళ ఎవరైనా అనుమానం యొక్క ప్రామాణ్యాన్ని అంగీకరించకపోతే అతనిని ఇలా అడగాలి – "అనుమానం ప్రమాణం కాదు అని అంటున్నావు. దానికి ఏదైనా సాధనాన్ని (కారణాన్ని) చూపుతావా? చూపవా? మొదటిది కుదరదు 'తలకాయలేని మాట' (చెప్పదలచిన విషయం) సిద్ధించదు. సరియైన హేతువు చెప్పకుండా కేవలం ప్రతిజ్ఞ (ఇది ఇలా ఉంటుంది అనడం) విషయాన్ని సాధించజాలదు కదా! (నిరూపించజాలదు). ఇక రెండవ పక్షం కూడా కుదరదు. శబ్ద ప్రమాణాన్ని అంగీకరించని నీవు ఇతర శాస్త్రాలంగీకరించిన శబ్ద ప్రమాణాన్ని ఉపయోగిస్తూ "అనుమానం ప్రమాణం కాదు" అంటే "నా తల్లి గొడ్రాలు" అన్న రీతిగా వ్యాఘాత దోషానికి లోనవుతుంది.

వి: ఇది కూడా చార్వాకమతాన్ని దృష్టిలో ఉంచుకుని చేసిన చర్చయే. శబ్ద ప్రమాణం కూడా అంగీకరించని చార్వాకుని 'మాటలు' ప్రమాణంగా స్వీకరించడానికి ఎలా కుదురుతుంది? ఇదీ శాస్త్ర చర్చలోని చమత్కృతి. శాస్త్రకారుని ప్రతిభ. మేధాసంపత్తిని అందించే గొప్ప శబ్ద విన్యాసాలు శాస్త్రంలోని చమక్కులు.

అవ: ప్రత్యక్షం మాత్రమే ప్రమాణం అంటూన్న చార్వాకుణ్ణి అతని మాటలలోనే బందీని చేసి, అతని వాదనలో ఇతర ప్రమాణాలు ఎలా ఉన్నాయో నిరూపిస్తున్నాడు.

మూలమ్

21. ప్రమాణతదాభాసవ్యవస్థాపనం తత్సమానజాతీయత్వాత్ ఇతి వదతా భవతైవ స్వీకృతం స్వభావానుమానమ్. పరగతా విప్రతిపత్తిస్తు వచనలిఙ్గేనేతి బ్రువతా కార్యలిఙ్గకమనుమానమ్. అనుపలబ్ధ్యా కంచిదర్థం ప్రతిషేధయతా అనుపలబ్ధి-లిఙ్గకమనుమానమ్. తథాచోక్తం తథాగతైః

"ప్రమాణాన్తరసామాన్యస్థితేరన్యధియో గతేః,
ప్రమాణాన్తరసద్భావః ప్రతిషేధాచ్చ కస్య చిత్". ఇతి

పరాక్రాన్తం చాత్ర సూరిభిః ఇతి గ్రన్థభూయస్త్వభయాదుపరమ్యతే.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

ప్రమాణము, ప్రమాణాభాసము రెండూ ఒకే జాతికి (కోవకి) చెందినవని అంటూన్న నీవు స్వభావానుమానాన్ని అంగీకరించినట్లే. అదేవిధంగా ఇతరుల వాదనలో విప్రతిపత్తి (విరోధం) ఉందని చెపుతూంటే వచన లింగాన్ని అంగీకరించడం వలన కార్యం లింగంగా ఉన్న కార్యలింగక అనుమానం అంగీకరించినట్లయింది.

ఒక వస్తువు కనబడకపోవటం వలన అది లేదు అంటున్న నీవు 'అనుపలబ్ధి' అనే హేతువు గల వస్తు 'అభావం' అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకున్నట్లే.

ఈ విషయాన్నే బౌద్ధులు ఈక్రింది కారికలో తెలియజేశారు.

"మరొక ప్రమాణంతో పోల్చటం, ఇతరుల అభిప్రాయాన్ని వారి మాటల ద్వారా (ఊహించి) తెలుసుకోవటం, ఒక వస్తువు కనబడలేదని అది లేనేలేదు అనడం – ఈ మూడూ ప్రత్యక్షాలు కావు. అందుచేత మరొక ప్రమాణం అనుమాన ప్రమాణం ఉన్నది."

ఈ విషయంలో పండితులు తమ వాదనా పరాక్రమం చూపి ఉన్నారు కావున గ్రంథం విస్తృతమవుతుంది అనే భయంచేత ఈ చర్చ నిలిపి వేయబడింది.

వి: జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఒక్క ప్రత్యక్షమే ప్రమాణంగా అంగీకరిస్తే లోకవ్యవహారమే పొసగదు. ప్రత్యక్షమే ప్రమాణంగా భావించే చార్వాకులు ఇతరుల అభిప్రాయాలను చూడలేరు కదా! మరి ఇంత గొడవ, చర్చ ఎందుకు? ప్రత్యక్షం కాని ప్రతిదీ మనం ఒకరి మాటల వల్లనో, ఊహించో తెలుసుకుంటాం. అవి కూడా ప్రమాణాలే కదా! ఈ విషయాన్నే బౌద్ధులు శాస్త్ర భాషలో వ్యక్తీకరించారు.

అవ: ఇక బౌద్ధమత సిద్ధాంతాలను వివరించబోతున్నాడు.

మూలమ్

22. తే చ బౌద్ధాః చతుర్విధయా భావనయా పరమపురుషార్థం కథయన్తి. తే చ మాధ్యమిక – యోగాచార – సౌత్రాన్తిక – వైభాషికసంజ్ఞాభిః ప్రసిద్ధాః బౌద్ధాః యథాక్రమం సర్వశూన్యత్వ – బాహ్యార్థశూన్యత్వ – బాహ్యార్థానుమేయత్వ– బాహ్యార్థప్రత్యక్షత్వ వాదాన్ ఆతిష్ఠతే. యద్యపి భగవాన్ బుద్ధః ఏక ఏవ బోధయితా తథాపి బోద్ధవ్యానాం బుద్ధి భేదాత్ చాతుర్విధ్యమ్. యథా **"గతోఽస్తమర్కః"** ఇత్యుక్తే జార – చోర – అనూచానాదయః స్వేష్టానుసారేణ అభిసరణ – పరస్వహరణ – సదాచరణాది సమయం బుధ్యన్తే.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

ఆ బౌద్ధులు వాళ్ళ నాలుగు విధాల భావన ద్వారా పరమ పురుషార్థాన్ని చెపుతున్నారు. మాధ్యమిక–యోగాచార–సౌత్రాన్తిక–వైభాషికులు అను పేర్లతో ప్రసిద్ధులైన ఆ బౌద్ధులు వరుసగా సర్వశూన్యత్వవాదాన్ని, బాహ్యార్థశూన్యత్వవాదాన్ని, బాహ్యార్థాను-మేయత్వవాదాన్ని, బాహ్యార్థ ప్రత్యక్షత్వవాదాన్ని ప్రతిపాదిస్తున్నారు. (ఈ వాదాలన్నీ ముందు ముందు వివరించబడతాయి). బోధించిన భగవంతుడు బుద్ధుడు ఒకడే అయినా, ఆ బోధను అందుకున్న శిష్యుల బుద్ధి భేదానుసారం నాలుగు విధాలైన సిద్ధాంతాలు ఏర్పడినాయి. ఎలాగైతే "సూర్యుడు అస్తమించాడు" అనగానే జారులు, చోరులు, వేదానుష్ఠానపరులు మొదలైన వారు వరుసగా వారివారి అభిమతానుసారం జారత్వానికి, చోరత్వానికి, అనుష్ఠానానికి సమయం ఐంది అని గ్రహిస్తారో అలాగే ఈ బౌద్ధులు కూడా తమకు తోచినట్లుగా అన్వయించుకున్నారు.

వి: ఈ విధమైన భావనా వైవిధ్యం చాలా సహజం. ఈ భేదభావన వలననే వేదాంతం శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. మానవమేధ అంతటి శక్తివంతమైనది. తాము భావించినదాన్ని బహువిధాల సమర్థించుకోగల సామర్థ్యం మానవజాతికి సాధ్యం. అదేవిధంగా బుద్ధుని బోధనలను కూడా నాలుగు ప్రధాన భాగాలుగా సిద్ధాంతీకరించారు. నాలుగు విధాల వారికీ అంగీకార్యమైన 'భావనా చతుష్టయం' ఒకటి ఉంది. అందుచేతనే 'చతుర్విధ భావన', 'భావనా చతుష్టయం' అని రెండు రకాల పద ప్రయోగం జరిగింది. మొదటిది నలుగురిలోను భిన్న భిన్న భావనలు అని చెపితే, రెండవది ప్రతి వారిలోనూ ఈ 'భావనా చతుష్టయం' ఉంది అని చెపుతుంది.

ఆ భావనా చతుష్టయం ఏమిటో చెపుతున్నాడు.

మూలమ్

23. సర్వం క్షణికం క్షణికం, దుఃఖం దుఃఖం, స్వలక్షణం స్వలక్షణం, శూన్యం శూన్యమ్ ఇతి భావనాచతుష్టయమ్ ఉపదిష్టం ద్రష్టవ్యమ్. తత్ర క్షణికత్వం నీలాదిక్షణానాం సత్త్వేన అనుమాతవ్యం – **"యత్ సత్ తత్ క్షణికమ్; యథా జలధరపటలమ్; సన్తశ్చ అమీ భావాః"** ఇతి. న చాయమసిద్ధో హేతుః; అర్థ క్రియాకారిత్వలక్షణస్య సత్త్వస్య నీలాదిక్షణానాం ప్రత్యక్షసిద్ధత్వాత్. వ్యాపకవ్యావృత్త్యా వ్యాప్యవ్యావృత్తిః ఇతి న్యాయేన వ్యాపకక్రమాక్రమవ్యావృత్తౌ అక్షణికాత్ సత్త్వవ్యావృత్తేః సిద్ధత్వాచ్చ.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

సర్వమూ క్షణికం క్షణికం, దుఃఖం దుఃఖం, స్వలక్షణం స్వలక్షణం, శూన్యం శూన్యం అని భావనా చతుష్టయం ఉపదేశించబడింది అని తెలుసుకోవాలి (ఈ నాలుగూ భావన చేయాలి). 'నీలం' మొదలైన పదార్థాలు 'క్షణికాలు' అనే విషయం వాటి సత్త్వం (ఉనికి) చేత అనుమానించాలి. (అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోవాలి). ఏదైతే సత్తో (ఉందో) అది క్షణికం (క్షణకాలం మాత్రమే ఉంటుంది) మేఘ సముదాయంలాగా. ఈ భావాలు (పదార్థాలు) అన్నీ సత్తులే. అందుచేత ఇవన్నీ క్షణికములే. 'యత్ సత్....' అన్న దానిలో చూపబడిన 'సత్' అనే హేతువులో 'అసిద్ధ'మనే దోషం లేదు. 'అర్థక్రియా-కారిత్వం' లక్షణంగా కల నీలాది క్షణాలు (పదార్థాలు) ప్రత్యక్షంగా కనబడుతున్నాయి కనుక. వ్యాపకం తొలగిపోతే వ్యాప్యం కూడా తొలగిపోతుంది అనే 'న్యాయం' చేత వ్యాపకమైన క్రమ, అక్రమములు (ముందు, వెనుకలు అనేవి) తొలగిపోవటంచేత అక్షణికం (క్షణికం కానిది) నుండి సత్త్వం తొలగిపోవడం సిద్ధిస్తుంది.

వి: ఇక్కడ ఉన్న పదాలు బౌద్ధ పరిభాషలోనివి. వారు ప్రతిపదార్థం క్షణకాలమే ఉంటుంది కాబట్టి దాన్ని 'క్షణికం' అంటారు. అసలు ఏదైనా ఉందీ అంటే అది క్షణికమే. అందుచేత పదార్థాలనే 'క్షణాలు' అనికూడా అంటారు. మరి పదార్థం ఉందనడానికి రుజువేమిటి అంటే ప్రతిదానికీ అది నిర్వహించగల క్రియ ఒకటి ఉంటుంది. దాన్నే 'అర్థక్రియాకారిత్వం' అంటారు. అదే పదార్థాలకు లక్షణం. ఉదాహరణకు 'ఘటం' ఉందంటే 'నీళ్ళు' ఉంచడానికి. నీలాది పదార్థాలు కనబడుతూనే ఉన్నాయి కదా! (ఇక్కడ 'నీలం' అనేది పదార్థాన్ని చెప్పే శాస్త్ర పారిభాషిక పదం). క్షణికం కాకపోతే క్రమము అనేది ఉండదు. శాశ్వతమైన దానిలో ఏ భేదమూ ఉండదు. అది అఖండమౌతుంది. అఖండం కానిది క్షణికమవాల్సిందే అని వీరి అభిప్రాయం.

ఇక 4 భావనలు -

1. అంతా క్షణికము, క్షణికము అని భావన చేయాలి.
2. అంతా దుఃఖము, దుఃఖము అని భావన చేయాలి.
3. అన్నిటికీ వాటి వాటి లక్షణం ఉంటుంది అని భావన చేయాలి.
4. అంతా శూన్యం శూన్యం అని భావన చేయాలి.

ఈ ప్రపంచమే భావనామయము. బౌద్ధులు అందుచేత ఇలా భావన చేయాలి అని ఉపదేశిస్తున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే శాస్త్రకారులు తమ వాదనా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

పటిమతో ఎదుటివారు చెప్పేది సరికాదని, తాము ప్రతిపాదించేదే యుక్తమని అనిపించేలా చేస్తారు.

'వ్యాప్యం' అంటే హేతువు, 'వ్యాపకం' అనగా సాధ్యం.

ఉదాహరణకు – "యత్ర యత్ర ధూమః తత్ర తత్రాగ్నిః" 'పొగ ఎక్కడెక్కడ ఉంటుందో అక్కడ 'అగ్ని' ఉంటుంది' అన్నప్పుడు 'ధూమం' 'వ్యాప్యం' అగ్ని వ్యాపకం.

అలాగే "యత్ర యత్ర అర్థక్రియాకారిత్వం తత్ర తత్ర క్రమ + అక్రమౌ (క్రమంక్రమౌ) అన్నదానిలో 'అర్థక్రియాకారిత్వం' 'వ్యాప్యం' (హేతువు), క్రమాక్రమౌ (సాధ్యం).

నిప్పులేనిదే పొగరానట్లే, క్రమ, అక్రమాలు (ముందు, వెనుక అనే వ్యవహారం) లేకపోతే అర్థక్రియాకారిత్వం ఉండదు.

'క్షణికం కాకపోతే పదార్థాలే ఉండవు' అని వాదనా సారాంశం.

ఇది 'వేదాంత' సిద్ధాంతానికి పూర్తిగా భిన్నం. అందుచేత బౌద్ధులకు తప్ప ఇతరులకు కొరుకుడు పడని అంశం.

అవ: ఈ విషయాన్నే క్రింద ప్రతిపాదిస్తున్నాడు.

మూలమ్

24. తచ్చ అర్థక్రియాకారిత్వం క్రమాక్రమాభ్యాం వ్యాప్తమ్. న చ క్రమాక్రమాభ్యామ్ అన్యః ప్రకారః సంభవతి.

"పరస్పరవిరోధే హి న ప్రకారాన్తరస్థితిః,

నైకతాపి విరుద్ధానాముక్తిమాత్రవిరోధతః". (న్యా.కుసు. 3.8)

ఇతి న్యాయేన వ్యాఘాతస్యోద్ఘటత్వాత్. తౌ చ క్రమాక్రమౌ స్థాయినః సకాశాత్ వ్యావర్తమానౌ అర్థక్రియామపి వ్యావర్తయన్తౌ క్షణికత్వపక్ష ఏవ సత్త్వం స్థాపయతః ఇతి సిద్ధమ్.

మనస్విని

ఆ అర్థక్రియాకారిత్వం క్రమ, అక్రమముల చేత వ్యాప్తమైనది (సంబంధించి ఉన్నది). ఈ క్రమ, అక్రమములకు భిన్నంగా మరొక పద్ధతి ఏదీ సంభవం కాదు.

"పరస్పర విరోధం ఉన్నప్పుడు మరొక ప్రకారం ఏదీ కుదరదు. విరుద్ధములైన వాటిమధ్య ఏకత్వం కూడా కుదరదు. 'పరస్పర విరోధం' అన్న మాటలోనే 'విరోధం' ఉన్నది."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈ న్యాయం (శాస్త్రోక్తి) ద్వారా వాఘాతం (చెప్పినదానికి అడ్డుకలగడం) ప్రస్ఫుటమౌతుంది. క్రమ, అక్రమములు అనే రెండూ స్థిరమైన (క్షణికం కాని) పదార్థం నుండి వ్యావృత్తములై (తొలగిపోయి), అర్థక్రియాకారిత్వాన్ని వ్యావర్తింపజేస్తూ సత్త్వాన్ని క్షణికత్వపక్షంలో స్థాపిస్తాయి అని సిద్ధించింది.

వి: 'పరస్పర విరుద్ధము' అన్నప్పుడు రెండింటి మధ్య 'విరోధం' అని అర్థం. మూడవదానికి చోటులేదు. చీకటి, వెలుతురు, మంచీ–చెడు ఇత్యాదులు. 'ఒకటి ఉన్నప్పుడు రెండోది ఉండదు', రెండూ ఒకటే ఏనాటికీ కాజాలవు. అలాగే ముందు, వెనుక అన్నప్పుడు కాలభేదం ఉంటుంది. స్థిరము, శాశ్వతము అన్నప్పుడు అఖండత్వం ఉంటుంది. 'అఖండత్వం'లో ఇది, అది అంటూ పదార్థాల గణన, వ్యవహారం కుదరదు. ఇదంతా ముందు, ముందు వివరించబడుతుంది.

నిజానికి బౌద్ధుల 'తార్కికవాదన' బుద్ధికి పదునుపెడుతుంది. వాదనలో చాతుర్యంతోబాటు 'ఒక విషయాన్ని ఇంత సూక్ష్మంగా, లోతుగా పరిశీలించవచ్చా?' అని తెలుస్తుంది. ఏ మతాన్ని అవలంబిస్తారు, ఆదరిస్తారు అన్నది ప్రశ్నకాదు. ఒక భిన్న దృక్కోణం నుంచి 'విశ్వదర్శనం' ఎలా ఉంటుందో తెలిపేవే దర్శనాలు.

అవ: ఇప్పుడు క్షణికం కాకుండా అక్షణికం (స్థాయి) ఐన పదార్థం క్రమంగా కాని అక్రమంగా కాని అర్థక్రియాకారి అవడానికి వీలులేదు అని ప్రతిపాదించబోతున్నాడు.

మూలమ్

25. నను అక్షణికస్య అర్థక్రియాకారిత్వం కిం న స్యాత్ ఇతి చేత్ – తదయుక్తమ్. వికల్పాసహత్వాత్. తథాహి – వర్తమానార్థక్రియాకరణకాలే అతీతానాగతయోః కిమర్థక్రియయోః స్థాయినః సామర్థ్యమ్ అస్తి నో వా? ఆద్యే తయోః అనిరాకరణ ప్రసఙ్గః; సమర్థస్య క్షేపాయోగాత్. యద్యదా యత్కరణసమర్థం తత్తదా తత్కరోత్యేవ, యథా సామగ్రీ స్వకార్యమ్; సమర్థశ్చాయం భావ ఇతి ప్రసఙ్గానుమానాచ్చ. ద్వితీయే కదాపి న కుర్యాత్; సామర్థ్యమాత్రానుబన్ధిత్వాత్ అర్థక్రియాకారిత్వస్య. యద్యదా యన్న కరోతి తత్తదా తత్రాసమర్థమ్, యథా హి శిలాశకలమ్ అఙ్కురే. న చైష వర్తమానార్థక్రియాకరణకాలే వృత్తవర్తిష్యమాణే అర్థక్రియే కరోతి ఇతి తద్విపర్యయాచ్చ.

మనస్విని

(నను అనగా ప్రశ్న, సందేహాన్ని వెలిబుచ్చటం. దీన్నే ఆశంక అంటారు). క్షణికం కానిది అర్థ క్రియాకారి ఎందుకు కాకూడదు అంటే అది యుక్తం కాదు (ప్రశ్నే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సరిఐనది కాదు). ఎందుచేతనంటే దీనిలో వికల్పానికి అవకాశం లేదు. చెప్పబోయే రెండు పక్షాలూ కుదరవు. ఎలాగంటే - వర్తమానంలో అర్థక్రియ చేసే తరుణంలో గడచిన, రాబోయే అర్థక్రియలకు (స్థాయి పదార్థానికి సంబంధించిన వాటికి) సామర్థ్యం ఉందా? లేదా? ఉందంటే అవి జరుగుతూనే ఉండాలి సమర్థమైనది తాను చేసే దానిలో ఆలస్యాన్ని సహించలేదు కాబట్టి. "ఏది ఏది ఐతే దేన్నిదేన్ని చేయడానికి తగియున్నదో అది దానిని చేస్తుంది సామగ్రి తన పనిని చేసినట్లు. ఈ పదార్థం సమర్థం కూడ" అని ప్రసంగానుమానం చెప్తూంది. అర్థక్రియా కారిత్వం అంటేనే సామర్థ్యంతో అనుబంధం కలిగి ఉంటుంది (కదా!). ఏది దేనినైతే చేయలేదో అది అక్కడ అసమర్థం, శిలాశకలం (చిన్న రాయి) అంకురాన్ని అంకురింపజేయనట్లు. ఈ పదార్థం వర్తమానంలో అర్థక్రియను చేస్తూ, భూత భవిష్యత్ కాలాలలో చేయలేదు అని చెప్పటం ఇంతకుముందు చెప్పిన దానికి విరుద్ధంగా ఉంటుంది.

వి: ఇక్కడ ఒక విషయం పదేపదే గుర్తుంచుకోవాలి. 'అర్థక్రియాకారిత్వం' అనగానే ఒక పదార్థం తన పనిని చేయటం. ఉదాహరణకు 'అగ్గిపుల్ల వెలగటం' అది వెలగకపోతే దాన్ని ప్రక్కన పడేస్తాం. నీళ్లు నిలవ ఉంచాల్సిన కుండ చిల్లుపడితే దాని పని ముగిసినట్లే. బౌద్ధులు పదార్థాలు 'క్షణికాలు' అని ఒప్పించేందుకు చేసిన పదజాలం ఇదంతా. అందుచేత కొంచెం సావధానంగా అర్థం చేసుకోవాలి. 'ప్రసంగానుమానం' అంటే 'ఇది ఇలా అని అంగీకరించకపోతే ఈ దోషం వస్తుంది' అని చెప్పటం.

'సామగ్రి' అనగా ఒక కార్యం (ఒక పదార్థం తయారు చేయటం) పుట్టడానికి అవసరమైనవి ఒకచోట సమకూరడం, ఒక వస్త్రం నేయాలంటే 'నేతగాడు' ఉంటే సరిపోదు. నూలు, మగ్గం, కఱ్ఱ ఇత్యాదులన్నీ ఉండాలి. అలాగే ఒక ఘటం తయారు కావాలంటే మట్టి, చక్రం ఇత్యాదులు కావాలి.

ఇక్కడ వాదన ఏమిటంటే సామర్థ్యం ఉంటే అది వర్తమాన, భూత, భవిష్యత్ కాలాలలోనూ పనిచేస్తూనే ఉండాలి. ప్రతిరోజూ మొక్కకు నీళ్లు పోయనక్కరలేదు. భిన్న భిన్నంగా చేస్తూ ఉంటే అది 'స్థాయి' అనబడదు.

పోనీలే 'సామర్థ్యం లేదు' అని అంగీకరిస్తే ఏ బాధా ఉండదు కదా అంటే అర్థక్రియాకారిత్వం అంటేనే 'అది ఆ పనిని చేసే సామర్థ్యం కలది' అని అర్థం. చిన్న రాయి ముక్కపై విత్తనం వేస్తే మొలకెత్తుతుందా? మొలకెత్తదు దానికి సామర్థ్యం (అర్థక్రియాకారిత్వం) లేదు.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈవిధంగా 'అర్థక్రియాకారిత్వం' 'స్థాయి' కాదు కాబట్టి పదార్థాలు క్షణికాలు అని అంగీకరించాలి. ఇంతకుముందు చెప్పినట్లుగా వర్తమాన, భూత, భవిష్యత్ కాలాలలో అర్థక్రియను చేసే పదార్థాలు వేరువేరు అని అంగీకరించక తప్పదు.

అవ: ఇప్పుడు మరొక ఆశంకను ముందుంచుకుని తన వాదాన్ని వివరిస్తున్నాడు.

మూలమ్

26. నను క్రమవత్సహకారిలాభాత్ స్థాయినః అతీతానాగతయోః క్రమేణ కరణమ్ ఉపపద్యతే ఇతి చేత్ – తత్రేదం భవాన్ పృష్టో వ్యాచష్టామ్. సహకారిణః కిం భావస్య ఉపకుర్వన్తి న వా? న చేత్ నాపేక్షణీయాః తే. అకించిత్కుర్వతాం తేషాం తాదర్థ్యాయోగాత్. అథ భావః తైః సహకారిభిః సహైవ కార్యం కరోతీతి స్వభావః ఇతి చేత్, అఙ్గ! తర్హి సహకారిణో న జహ్యాత్; ప్రత్యుత పలాయమానానపి గలే పాశేన బద్ధ్వా కృత్యం కార్యం కుర్యాత్ స్వభావస్యానపాయాత్.

మనస్విని

'స్థాయి' పదార్థంతో కూడిన సహకార సామగ్రి ఒక క్రమంలో ఉండడం చేత అతీత (భూత), అనాగత (భవిష్యత్తు) లకు చెందిన కార్యాలను క్రమంలో పుట్టించవచ్చు కదా!" అంటే ఇక్కడ మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాం, సమాధానం చెప్పు. సహకారులు పదార్థానికి ఉపకరిస్తాయా? (సహకరిస్తాయా)? ఉపకరించవా (సహకరించవా)? ఉపకరించవు అంటే ఎందుకూ ఉపకరించని వాటితో భావానికి (పదార్థానికి) అపేక్ష ఉండదు. ఏమి చేయని వాటిని వాటికి సహకారులు అనడమే కుదరదు. అలాకాదు, భావం సహకారులతో కలిసి మాత్రమే పనిచేస్తుంది. అది దాని స్వభావం అన్నట్లయితే–అయ్యా! అలా అయితే భావం సహకారులను విడవరాదు. స్వభావం అనేది ఎన్నటికీ దూరం అవడం ఉండదు కాబట్టి. సహకారులు పారిపోతున్నా భావం వాటి మెడకు ఉచ్చు వేసి బిగించి పట్టి తాను చేయవలసిన పని చెయ్యాలి.

వి: ఇక్కడ శాస్త్రపరంగా విషయాన్ని వివరించినప్పటికీ ఈ వాదంలో ఎంతో సత్యం ఉంది అనిపించక మానదు. అంతే కాకుండా మెదడుకు పదును పెట్టి ఆలోచించేలా చేస్తుంది?

అవ: మళ్లీ ఈ సహకారులకూ, ముఖ్యమైన పదార్థానికీ గల సంబంధాన్ని గుర్చి చర్చించబోతున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

27. ఉపకారకత్వపక్షే సోఽయముపకారః కిం భావాద్భిద్యతే న వా? భేదపక్షే ఆగన్తుకస్యైవ తస్య కారణత్వం స్యాత్; న భావస్య అక్షణికస్య; ఆగన్తుకాన్వయవ్యతిరేకాను-విధాయిత్వాత్ కార్యస్య. తదుక్తమ్ –

"వర్షాతపాభ్యాం కిం వ్యోమ్నశ్చర్మణ్యస్తి తయోః ఫలమ్,

చర్మోపమశ్చేత్సోఽనిత్యః ఖతుల్యశ్చేదసత్ఫలః." ఇతి

మనస్విని

సరే, ఉపకారక పక్షాన్ని అంగీకరించినట్లయితే ఇక్కడ ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ ఉపకారకం భావానికి (పదార్థానికి) భిన్నమా? (వేరుగా ఉంటుందా) కాదా? వేరుగా ఉంటుంది అన్నట్లయితే అప్పుడు ఆ వేరైన (క్రొత్తగా వచ్చి చేరిన) సామగ్రియే కార్యానికి కారణం అని చెప్పాలి కాని అక్షణికమైన భావం అనడం కుదరదు. ఎందుచేతనంటే కార్యానికి క్రొత్తగా వచ్చిన సామగ్రి యే అన్వయ వ్యతిరేకాల ద్వారా కారణమౌతుంది.

"వర్షం వలనా, ఎండ వలనా ఆకాశానికి ఏమి జరుగుతుంది? (ఏ ప్రభావమూ ఉండదు). ఆ రెండింటి ప్రభావం చర్మం మీద ఉంటుంది. పదార్థం చర్మం వంటిది అంటే అది అనిత్యము (క్షణికము). అలా కాదు ఆకాశం వంటిది అంటే ఏ ఫలమూ లేనిది అవుతుంది.

వి: 'విత్తనం' అనే పదార్థం భావం. అది మొలకెత్తడంలో అవసరమయ్యే మట్టి, గాలి, నీరు, వెలుతురు మొదలైనవి సహకారులు. 'మొలకెత్తడం' అనేది అది దాని ప్రకృతి రూపాన్నుంచి 'వికారం' పొందడం. ఇలా మారుతూ ఉండడమే 'అనిత్య' లక్షణం. 'ఆకాశం' ఉందంటే దానికి ఎలాంటి వికారమూ ఉండదు. దానికి ఏ సహకారితోనూ పనిలేదు. ఈవిధంగా పదార్థాలు క్షణికాలు అని అంగీకరించాల్సిందే.

అవ: ఈ వాదననే ఇంకా కొంచెం పొడిగిస్తున్నాడు. ఇక్కడ 'అతిశయం' అనే పదం ఉపయోగించబోతున్నాడు. 'అతిశయం' అనగా ఒక 'గొప్పతనం' విశేషం. ఒక వస్తువు మార్పు చెందడానికి అవసరమయ్యే సహకారులలో ఈ ఒకానొక అతిశయం పుడుతుంది అని బౌద్ధుల వాదన.

మూలమ్

28. కిం చ సహకారిజన్యః అతిశయః కిమ్ అతిశయాన్తరమారభతే న వా? ఉభయథాపి ప్రాగుక్తదూషణపాషాణవర్షణ ప్రసఙ్గః. అతిశయాన్తరారమ్భపక్షే

Public domain. Digitization Muthulakshmi Research Academy

బహుముఖానవస్థాదౌస్థ్యమపి స్యాత్. అతిశయే జనయితవ్యే సహకార్యన్తరాపేక్షాయాం తత్పరమ్పరాపాత ఇత్యేకా అనవస్థా ఆస్థేయా. తథా సహకారిభిః సలిల పవనాదిభిః పదార్థైః ఆధీయమానే బీజస్యాతిశయే బీజముత్పాదకమ్ అభ్యుపేయమ్; అపరథా తదభావేఽ పి అతిశయః ప్రాదుర్భవేత్. బీజం చాతిశయమాదధానం సహకారిసాపేక్షమేవ ఆధత్తే. అన్యథా, సర్వదా ఉపకారాపత్తౌ అఙ్కురస్యాపి సదా ఉదయః ప్రసజ్యేత, తస్మాదతిశయార్థమ్ అపేక్ష్యమాణైః సహకారిభి: అతిశయాన్తరమ్ ఆధేయం బీజే. తస్మిన్నపి ఉపకారే పూర్వన్యాయేన సహకారిసాపేక్షస్య బీజస్య జనకత్వే సహకారిసంపాద్యబీజగతా- నవస్థా ప్రథమా వ్యవస్థితా.

మనస్విని

మరొక విషయం ఏమిటంటే – సహకారి వలన పుట్టిన 'అతిశయం' మరొక 'అతిశయాన్ని' పుట్టిస్తుందా? పుట్టించదా? రెండు విధాల వాదనలోనూ ఇంతకు ముందు పడిన దూషణ పాషాణ వర్షమే (రాళ్లవర్షమే) వచ్చిపడే అవకాశం ఉంది. ఎలాగంటే – మరొక అతిశయాన్ని పుట్టిస్తుంది అంటే దానికి మరొక సహకారి కావలసి వస్తుంది. ఇలా అతిశయం – సహకారి ఒకదాని వెనుక ఒకటి ఏర్పడాలి. ఇది అంతు లేనిది. నిలకడ లేనిది. దీనినే అనవస్థా దోషం అంటారు.

అలా కాదు సహకారులు అతిశయాన్ని పుట్టించడం లేదు అంటే మరి నీరు, గాలి, మొదలైన సహకారులు కాకుండా బీజమే అతిశయాన్ని పుట్టిస్తుంది అని చెప్పాలి. కాదంటే బీజం లేకపోయినా గాలి, నీరు మొదలైన సహకారుల వలననే 'అతిశయం' పుట్టవలసి ఉంటుంది. బీజం కూడా సహకారుల సాహాయ్యంతోనే అతిశయాన్ని పుట్టిస్తుంది. అలా కాదంటే మరి బీజం ఎప్పుడూ నీరు మొదలైనవి లేకున్నా మొలకెత్తడానికి కారణమైన అతిశయాన్ని పుట్టిస్తుంది అని చెప్పాలి. ఈవిధంగా ఒకదానితో ఒకటి చిక్కుముడి ఏర్పడుతుంది. అందుచేత ఇక్కడా అనవస్థాదోషమే ఏర్పడుతుంది.

వి: ఈ పెద్ద పేరాలో 'కాలికేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి' అన్న చందాన సహకారి వలన అతిశయం, అతిశయం నుండి మరో అతిశయం రావడానికి సహకారి అంటూ పరుగులు పెట్టిస్తున్నాడు బౌద్ధుడు. ఇదంతా కూడ 'స్థాయి' అన్నది లేదు అని నిరూపించడానికే.

మూలమ్

29. అథ ఉపకారః కార్యార్థమ్ అపేక్ష్యమాణోఽ పి బీజాదినిరపేక్షం కార్యం జనయతి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తత్సాపేక్షం వా? ప్రథమే బీజాదేర హేతుత్వమ్ ఆపతేత్. ద్వితీయే అపేక్ష్యమాణేన బీజాదినా ఉపకారే అతిశయః ఆధేయః. ఏవం తత్ర తత్రాపీతి బీజాదిజన్యాతిశయనిష్ఠాతి-శయపరమ్పరాపాత ఇతి ద్వితీయా అనవస్థా స్థిరా భవేత్.

మనస్విని

కార్యం (అంకురం) పుట్టించడానికి సహకారి నుండి ఏర్పడే ఉపకారం (అతిశయం) విత్తనాలు లేకుండానే అంకురాన్ని పుట్టిస్తుందా? విత్తనాలు ఉండాలా? అంటే బీజాదులు లేకుండా 'అంకురం' పుడుతుంది అన్న పక్షంలో 'ఇక బీజం అంకురానికి కారణం' కాకుండా పోతుంది. అలా కాదు బీజాదుల అపేక్ష (అవసరం) తోనే సహకారులు పుట్టించిన ఉపకారం పనిచేస్తుంది అంటే, అప్పుడు ఈ బీజాదులు ఉపకారంలో అతిశయాన్ని పుట్టించాల్సి ఉంటుంది. మళ్లీ ఇక్కడ – బీజాదులు ఉపకారంలో అతిశయం – అతిశయం వలన మరొక అతిశయం – ఇలా ఇక్కడా అనవస్థాదోషం స్థిరమై నిలుస్తుంది.

వి: 'గ్రుడ్డు ముందా, పిల్ల ముందా?' అన్న పద్ధతిలో ఈ చర్చ కొనసాగుతుంది. ఇక్కడ కొంచం 'సూక్ష్మబుద్ధి' అవసరం. గాలి, నీరు మొదలైనవి ఉన్నా మొలకెత్తడానికి, మొలకెత్తక పోవటానికీ ఏవో తెలియని కారణాలు ఉంటాయి. ఆ కారణానికి 'అతిశయం' అనీ, 'ఉపకారం' అనీ పారిభాషిక పదాలు వాడబడినాయి. 'క్రమము' ఒకదాని తరువాత ఒకటి అంటేనే క్షణికమని బౌద్ధుల వాదన. అలాకాదంటే బీజం ఎప్పుడూ మొలకెత్తుతూనే ఉండాలి ఇత్యాది వాదనలు ముందుంచుతారు. ఇది వారి దృక్కోణం. అలా చూడాలి. అంతే కాని అయోమయానికి లోనుకాకూడదు.

అవ: ఇక్కడ మూడవ అనవస్థాదోషం ప్రదర్శించబడుతుంది.

మూలమ్

30. ఏవమ్ అపేక్ష్యమాణేన ఉపకారేణ బీజాదౌ ధర్మిణి ఉపకారాన్తరమ్ ఆధేయమితి ఉపకారాధేయబీజాశ్రయాతిశయపరమ్పరాపాత ఇతి తృతీయా అనవస్థా దురవస్థా స్యాత్.

మనస్విని

ఈవిధంగా ఉపకారం ధర్మి ఐన బీజాదికంలో మరొక ఉపకారాన్ని పుట్టిస్తుంది. ఇలా ఉపకారాలు బీజాలలో పుట్టించాల్సిన అతిశయాల పరంపర మూడవ అనవస్థాదోషమనే దురవస్థకు కారణమౌతుంది.

ఇక సహకారి, బీజాదుల చర్చను ముగించబోతున్నాడు.

Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

31. అథ భావాదాభిన్నః అతిశయః సహకారిభిః ఆధీయతే ఇత్యభ్యుపగమ్యేత తర్హి ప్రాచీనో భావః అనతిశయాత్మా నివృత్తః, అన్యశ్చ అతిశయాత్మా కుర్వద్రూపాది పదవేదనీయః జాయతే ఇతి ఫలితం మమాపి మనోరథద్రుమేణ. తస్మాత్ క్రమేణ అక్షణికస్యార్థక్రియా దుర్ఘటా.

అవ: సామగ్రి చేత కల్పించబడిన ఉపకారం భావం (పదార్థం) కంటె భిన్నమా? కాదా? అన్న ప్రశ్నకు భిన్నమైతే ఏర్పడే లోపాలు పైన వివరించాడు. ఇప్పుడు అభిన్నమైతే అనే పక్షానికి సంబంధించి చర్చ మొదలు పెడుతున్నాడు.

మనస్విని

ఇక సహకారులు పదార్థంతో అభేదం కలిగి అతిశయాన్ని పుట్టిస్తాయి అన్నట్లయితే – అప్పుడు 'అతిశయరహిత స్వరూపం' గల భావం నశించి, అతిశయ స్వరూపం కలిగిన, 'కుర్వద్రూపం' అని చెప్పబడే మరొకటి జన్మించినట్లైంది. కాబట్టి నా మనోరథం (క్షణికతావాద ప్రతిష్ఠాపనం) అనే వృక్షం ఫలించింది. నా వాదమే సిద్ధించింది. అందుచేత అక్షణికమైన (స్థాయి) పదార్థం 'అర్థక్రియాకారి' అవడం కుదరదు.

వి: కుర్వత్+రూపం = కుర్వద్రూపం అనగా ఫలం సాధించడానికి సిద్ధంగా ఉన్న రూపం (పరిస్థితి). ఫలోన్ముఖమైనది.

ఒక పదార్థంలో అతిశయం జనించింది అంటే అంతకు ముందు ఉన్న రూపం మారినట్లే కదా! నిజానికి బీజం అంకురమవడానికి ముందు కలిగే మార్పు అతిశయమే కదా! ఆలోచించి చూస్తే ఎంతో అర్థముంటుంది ఈ క్షణికవాదంలో.

పరమార్థంలో అంతా అశాశ్వతము, నశ్వరము, బుద్బుదప్రాయము, క్షణభంగురము అనే పదాలు వేదాంత చర్చలోనూ అంగీకరించబడేవే. అందుచేత అన్ని వాదాలు సమన్వయ భావంతో ఆదరించాల్సిందే.

మూలమ్

32. నాప్యక్రమేణ ఘటతే, వికల్పాసహత్వాత్. తథాహి – యుగపత్ సకల కార్యకరణసమర్థః స్వభావః తదుత్తరకాలమనువర్తతే న వా? ప్రథమే తత్కాలవత్ కాలాన్తరేఽపి తావత్కార్యకరణమ్ ఆపతేత్. ద్వితీయే స్థాయిత్వవృత్త్యాశామూషిక–భక్షితబీజాదౌ అఙ్కురాదిజననప్రార్థనామ్ అనుహరేత్. **"యద్విరుద్ధధర్మాధ్యస్తం తత్ నానా; యథా శీతోష్ణే. విరుద్ధధర్మాధ్యస్తశ్చ అయమ్"** ఇతి జలధరే ప్రతిబన్ధసిద్ధిః న చాయమ్

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అసిద్ధో హేతుః; స్థాయిని కాలభేదేన సామర్థ్యాసామర్థ్యయోః ప్రసజ్గతద్విపర్యయసిద్ధత్వాత్ తత్రాసామర్థ్యసాధకౌ ప్రసజ్గతద్విపర్యయౌ ప్రాగుక్తౌ. సామర్థ్యసాధకౌ అభిధీయేతే.

అవ: స్థాయి (అక్షణికం) క్రమం ద్వారా కార్యాన్ని పుట్టిస్తుందా? అక్రమం (క్రమం లేకుండా) ద్వారా కార్యం పుట్టిస్తుందా అని రెండు ప్రశ్నలు ముందుంచి, వాటిలో మొదటి ప్రశ్నకు వివరణగా ఇంతవరకూ చర్చించి, క్రమం ద్వారా కుదరదు అని అంగీకరించేట్లు చేసాడు. ఇప్పుడు క్రమరహితంగా ఐనా 'స్థాయి' కార్యాన్ని పుట్టించజాలదు అని నిరూపించబోతున్నాడు.

మనస్విని

క్రమం లేకుండా కూడా కార్యం పుట్టించడం కుదరదు. ఎందుచేతనంటే వికల్పాలను సహించలేదు (పొసగవు).ఆ వికల్పాలు – ఒకటి – యుగపత్ (ఒకే సమయంలో) సకల కార్యాలనూ చేయగలిగిన (సమర్థమైన) స్వభావం తరువాతి కాలానికి కూడా అనువర్తిస్తుందా? రెండు అనువర్తించదా? మొదటి పక్షంలో అనువర్తిస్తుంది అంటే తత్కాలంలో (ఒక కాలంలో) అన్ని కార్యాలు పుట్టించినట్లు ఇతర కాలంలో కూడా అన్ని కార్యాలను పుట్టించాల్సి ఉంటుంది.

'అనువర్తించదు' అనే రెండవ పక్షంలో అలాంటి దానిలో స్థాయిత్వం ఉంటుంది అని ఆశించడం 'ఎలుకలు తినివేసిన బీజాదులు అంకురాదులను పుట్టిస్తాయి' అని ఆశించడంతో సమానం అవుతుంది. దేనిలో విరుద్ధ ధర్మాలు ఉంటాయో అది భిన్నమై ఉంటుంది. ఉదాహరణకు – శీత – ఉష్ణాలు పరస్పర విరుద్ధాలు. (ఆమదుచేత అవి ఏనాడూ ఒకటి కావు.) ఈ భావం విరుద్ధ ధర్మాలను పుట్టించగలదు, పుట్టించజాలదు అని విరుద్ధ ధర్మాలతో కూడినది ఐంది. ఇలా చెప్పడానికి ఆధారంగా మేఘంలో ప్రతిబంధం (వ్యాప్తి) కనబడుతుంది. ఈ ఉదాహరణంలో అసిద్ధ హేతువు లేదు. 'స్థాయి' (పదార్థంలో) కాలభేదం చేత సామర్థ్యం, అసామర్థ్యం రెండూ ఉన్నట్లు ప్రసంగం చేత, ప్రసంగ విపర్యయం చేత సిద్ధించింది. వీటిలో అసామర్థ్య సాధకాలు ఐన ప్రసంగ, ప్రసంగ విపర్యయాలు ఇంతకు ముందు చెప్పబడినవి. ఇప్పుడు సామర్థ్య సాధకాలు చెప్పబడుతున్నాయి.

వి: ఏది ఉండడానికి వీలు లేదో అది ఉన్నట్లు చెప్పాల్సి వస్తుంది' అని ప్రతిపాదించడం 'ప్రసంగం' – వ్యతిరేక వ్యాప్తి ద్వారా ప్రతిపాదించబడిన అనుమానం 'ప్రసంగానుమానం.' అన్వయ వ్యాప్తి ద్వారా ప్రతిపాదింపబడిన అనుమానం 'ప్రసంగ విపర్యయానుమానం'.

Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇంతవరకూ జరిగిన 'అర్థక్రియాకారిత్వం' చర్చలో ఒక వస్తువునకు సామర్థ్యం ఉంటే వర్తమానంలో లాగే భూత భవిష్యత్తుల్లో కూడా అది ఆ పని చేస్తూనే ఉండాలి' అంటూ అలా చేస్తున్నట్లు కనబడటం లేదు కాబట్టి దానికి సామర్థ్యం లేదు' అని ప్రతిపాదించారు. ఇది 'ప్రసంగం'.

'ఏదైతే దేన్నైతే చేయజాలదో అది ఆ విషయంలో అసమర్థం' అని చెప్పడం 'ప్రసంగవిపర్యయం'.

మూలమ్

33. యద్యదా యజ్జననాసమర్థం తత్తదా తన్న కరోతి; యథా శిలాశకలమ్ అఙ్కురమ్. అసమర్థశ్చ అయం వర్తమానార్థక్రియాకరణకాలే అతీతానాగతయోః అర్థక్రియయోః ఇతి ప్రసఙ్గః. యద్యదా యత్ కరోతి తత్ తదా తత్ర సమర్థం; యథా సామగ్రీ స్వకార్యే. కరోతి చాయమ్ అతీతానాగతకాలే తత్కాలవర్తిన్యావర్థక్రియే భావ ఇతి ప్రసఙ్గవ్యత్యయో విపర్యయః. తస్మాద్విపక్షే క్రమయౌగపద్యవ్యావృత్త్యా వ్యాపకానుపలమ్భేన అధిగతవ్యతిరేకవ్యాప్తికం ప్రసఙ్గతద్విపర్యయబలాత్ గృహీతాన్వయ వ్యాప్తికం చ సత్త్వం క్షణికత్వపక్ష ఏవ వ్యవస్థాస్యతి ఇతి సిద్ధమ్.

మనస్విని

ఏది, ఎప్పుడు, దేనిని పుట్టించడానికి సమర్థం కాదో, అది అప్పుడు దానిని పుట్టించదు రాతి ముక్క అంకురాన్ని పుట్టించనట్లు. ఇది (స్థాయి) వర్తమానంలో 'అర్థక్రియను' పుట్టించే సమయంలో గడచిన, రాబోయే (కాలాలకు చెందిన) అర్థక్రియలను పుట్టించడానికి అసమర్థము అని ప్రసంగము (ఇంతకు ముందు వివరించబడింది).

ఏది ఎప్పుడు దేనిని పుట్టిస్తుందో అది అప్పుడు దానిని పుట్టించడంలో సమర్థము, సామగ్రి తన కార్యాన్ని పుట్టించడంలో ఎలా సమర్థమో అలాగ. ఈ భావం (పదార్థం) గడిచిన, రాబోయే కాలాలలో ఆ కాలాలలో ఉన్న అర్థక్రియలను పుట్టిస్తుంది – అనేది ప్రసంగ విపర్యయము.

అందుచేత విపక్షంలో అనగా ఇతరులు అంగీకరించే ఈశ్వరుడు, కులాలుడు (కుమ్మరి) మొదలైన అక్షణికములందు క్రమము, క్రమం లేకపోవటం అనే రెండూ కుదరకపోవడం చేత వ్యతిరేక వ్యాప్తిని కలిగిన, ప్రసంగ, ప్రసంగ వ్యతిరేకాల బలం వల్ల అన్య వ్యాప్తి కలిగిన సత్త్వము క్షణికత్వ పక్షంలోనే నిలిచి ఉంటుంది అని సిద్ధించింది (ఫలితం).

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

34. తదుక్తం జ్ఞానశ్రియా -

యత్సత్తత్ క్షణికం, యథా జలధరః, సన్తశ్చ భావా అమీ
సత్తా శక్తిరిహార్థకర్మణి, మితేః సిద్ధేషు సిద్ధా న సా,
నాప్యేకైవ విధాన్యథా పరకృతేనాపి క్రియాదిర్భవేత్
ద్వేధాపిక్షణభఙ్గసఙ్గతిరతః సాధ్యే చ విశ్రామ్యతి. ఇతి

మనస్విని

ఆ విషయమే జ్ఞానశ్రీ అనే బౌద్ధపండితుడు ఇలా చెప్పాడు-

"ఏది ఉందో (సత్) అది క్షణికం మేఘంలాగా. ఈ పదార్థాలు (ఘటాదులు) సత్తులే కదా! అందుచేత అన్నిపదార్థాలు క్షణికాలే. అర్థకర్మలో (అర్థక్రియలో) ని శక్తియే ఇక్కడ 'సత్తా'. ఆ అర్థక్రియాశక్తి అనుమానాది ప్రమాణాలను బట్టి సిద్ధములైన (స్థిరమైన) వాటి యందు స్వభావతః సిద్ధించదు. ఒకే పద్ధతి కుదరదు. కార్యోత్పత్తి స్వాభావికంగా కాదు మరొక విధంగా జరుగుతుంది అనేది కూడా కుదరదు. (ఇంతవరకూ చర్చించిన దాన్ని బట్టి) ఎటు చూచినా క్షణ భంగవాదమే కుదురుతుంది. చివరికి అందులోనే విశ్రాంతి పొందుతుంది.

వి: ఈ శ్లోకంలో ఇంతవరకూ వివరించిన విషయాన్నే సంక్షిప్తంగా చెప్పాడు. అర్థక్రియాకారిత్వం స్వాభావికం అన్నా లేదా సహకారికృత ఉపకారం చేత ఉంటుందన్నా, లేదా కారణం కార్యాన్ని క్రమంగా లేదా ఒకేసారి పుట్టిస్తుంది అని ఎలా చెప్పినా క్షణికవాదమే సిద్ధిస్తుంది.

మూలమ్

35. న చ కణభక్షాక్షచరణాదిపక్షకక్షీకరణేన సత్తాసామాన్యయోగిత్వమేవ సత్త్వమితి మన్తవ్యమ్. సామాన్యవిశేష సమవాయానామ్ అసత్త్వప్రసఙ్గాత్. న చ తత్ర స్వరూపసత్తానిబన్ధనః సద్వ్యవహారః. ప్రయోజకగౌరవాపత్తేః. అనుగతత్వాననుగ తత్త్వ వికల్పపరాహతేశ్చ. సర్షపమహీధరాదిషు విలక్షణేషు క్షణేషు అనుగతస్య ఆకారస్య మణిషు సూత్రవత్ భూతగణేషు గుణవచ్చ అప్రతిభాసనాచ్చ.

మనస్విని

(పూర్వ పక్షాన్ని ఉదాహరించి సమాధానం చెపుతున్నాడు) -

కణభక్ష (కణాదుడు), అక్షచరణ (అక్షపాదుడు) పక్షాన్ని అంగీకరించి సత్తా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సామాన్యత్వమే 'సత్త్వం' అని అనుకోవడం కుదరదు. ఎందుచేతనంటే వారి మతానుసారమే 'సామాన్య, విశేష, సమవాయాల్లో సత్త్వం (అనే జాతి) లేదు. పోనీ 'స్వరూప సత్తా నిబంధనం' అని చెపుదాం అంటే అది అన్నింటికీ అన్వయించాల్సిన భారం ఏర్పడుతుంది.

అనుగతత్వం, అననుగతత్వం కూడా కుదరవు. ఆవగింజ, పర్వతాదుల్లో మణుల్లో దారం ఉన్నట్లుగా ఆకారం ఏదో కనబడడం లేదు, పృథివ్యాధులలో గంధాదుల విషయంలోనూ అంతే. అందుచేత స్వరూపసత్తానుసంధానం కూడా కుదరదు.

వి: కణాదుడు వైశేషిక దర్శన ప్రతిపాదకుడు. అక్షపాదుడు అనగా గౌతముడు న్యాయదర్శన ప్రవర్తకుడు. వీరిరువురూ 'జాతి' అనే 'సామాన్యాన్ని అంగీకరిస్తారు. గోవులన్నింటిలో ఉండేది 'గోత్వ' జాతి.

గోవులు లేకపోయినా 'గోత్వం' అనే జాతి ఉంటుంది. అది 'నిత్యం' (అక్షణికం) అని వారి మతం. అది కుదరదు అని బౌద్ధమత వాదన. ఆ 'జాతి' కంటికి కనబడటం లేదు కదా!

'అనుగతం' అనగా అన్నింటిలోకీ వచ్చేది, 'అననుగతం' అంటే అన్నింటిలోకీ రానిది. ఒక పదార్థంలో ఉన్న స్వరూపం ఇతర పదార్థాలన్నింటిలోనూ 'అనుగతం' కాదు కదా! ఇక దాన్ని 'సత్త్వం' ఉనికి అని ఎలా అంటారు' అని వాదన.

అవ: ఈ వాదాన్నే పొడిగిస్తున్నాడు.

మూలమ్

36. కించ సామాన్యం సర్వగతం స్వాశ్రయసర్వగతం వా? ప్రథమే సర్వవస్తుసంకర ప్రసంగః; అపసిద్ధాన్తాపత్తిశ్చ; యతః ప్రోక్తం ప్రశస్తపాదేన **"స్వవిషయసర్వగతమ్"** ఇతి. కించ విద్యమానే ఘటే వర్తమానం సామాన్యమ్ అన్యత్ర జాయమానేన సంబధ్యమానం తస్మాత్ ఆగచ్ఛత్ సంబధ్యతే అనాగచ్ఛద్వా? ఆద్యే ద్రవ్యత్వాపత్తిః. ద్వితీయే సంబన్ధానుపపత్తిః. కించ వినష్టే ఘటే సామాన్యమ్ అవతిష్ఠతే, వినశ్యతిస్థానాన్తరం గచ్ఛతి వా? ప్రథమే నిరాధారత్వాపత్తిః. ద్వితీయే నిత్యత్వవాచో యుక్త్యయుక్తిః తృతీయే ద్రవ్యత్వప్రసక్తిః – ఇత్యాది దూషణగ్రహగ్రస్తత్వాత్ సామాన్యమ్ అప్రామాణికమ్.

అవ: ఇప్పుడు 'సామాన్యం' అనేదే లేదు అని చెప్పబోతున్నాడు కించ.. అంటూ

మనస్విని

మరొక విషయం ఏమంటే (మీరు చెప్పే) 'సామాన్యం' అంతటా ఉంటుందా?

In Public domain. Digitization Muthulakshmi Research Academy
లేక తనకు ఆశ్రయమైన పదార్థాలలో మాత్రమే ఉంటుందా? 'సర్వగతము' అనే మొదటి పక్షంలో అన్ని పదార్థాలలో ఉంటుంది అన్నట్లయితే ఇక గోత్వ జాతి, మనుష్య జాతి అన్నీ ఒకటే ఐపోతాయి.

ఇలా కలగాపులగం (సంకరం) ఏర్పడుతుంది. అదీ గాక 'సర్వగతము'ను అంగీకరిస్తే 'సామాన్యం స్వవిషయ సర్వగతమ్' అని చెప్పే మీ సిద్ధాంతానికే విరోధం ఏర్పడుతుంది. అదీగాక 'ఒకచోట ఉన్న ఘటంలో ఉన్న 'ఘటత్వం' అనే జాతి మరొక చోట పుడుతూన్న ఘటంతో 'సంబంధం' ఏర్పడుతున్నప్పుడు అది ఆ దూరంగా ఉన్న ఘటం లోంచి వచ్చి దీనితో చేరుతుందా? రాకుండానే చేరుతుందా? ఎలా చూసినా అప్పుడు సామాన్యమైన ఈ జాతి 'ద్రవ్యం' కావాల్సి వస్తుంది. పోనీ, అది రావడం లేదు ఇక్కడే వచ్చి చేరుతుంది' అనడం కుదరదు. అప్పుడు అన్నింటిలోనూ ఉండే జాతిత్వానికి భంగం ఏర్పడుతుంది.

మరొక విషయం – ఒక ఘటం నశించినప్పుడు దానిలోని సామాన్యం అలాగే ఉంటుందా? నశిస్తుందా? అన్నది ప్రశ్న. లేక మరొక చోటికి వెళుతుందా? అని మూడవ ప్రశ్న. ఉంటుంది అన్నట్లయితే 'ఘటం' అనే ఆధారం లేకుండా 'ఘటత్వ' జాతి ఉంది అనాల్సి వస్తుంది. అది కుదరదు. అలాగే రెండవ పక్షంలో 'ఘటం' తో పాటు 'ఘటత్వం' నశిస్తుందంటే ఎలా (న్యాయ, వైశేషిక) శాస్త్రానుసారం చెప్పిన 'సామాన్యం నిత్యం' అనే మాట కుదరదు. ఇక 'సామాన్యం' ఒక ఘటం నుండి మరొక ఘటంలోకి వెళుతుండంటే అప్పుడది ద్రవ్యం కావలసి వస్తుంది.

వి: ఈవిధంగా 'సామాన్యం' 'జాతి' అనేది నిత్యం అన్న వాదాన్ని ఖండిస్తున్నాడు. ఇదంతా 'క్షణికవాదం' స్థిరపరచడం కోసం బౌద్ధ సిద్ధాంతి చేసే చర్చ.

అవ: ఇప్పుడు అన్ని వాదనలను ఒకేచోట కారికల రూపంలో సంక్షిప్తం చేసి చెపుతున్నాడు.

మూలమ్

37. తదుక్తమ్ –

అన్యత్ర వర్తమానస్య తతోఽన్యస్థానజన్మని,
తస్మాదచలతః స్థానాత్ వృత్తిరిత్యతియుక్తతా.
యత్రాసౌ వర్తతే భావస్తేన సంబధ్యతే న తు,
తద్దేశినం చ వ్యాప్నోతి కిమప్యేతన్మహాద్భుతమ్.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

న యాతి న చ తత్రాసీదస్తి పశ్చాన్నచాంశవత్,
జహాతి పూర్వం నాధారమహెూ వ్యసనసంతతిః". ఇతి.

అనువృత్తప్రత్యయః కిమాలమ్బనః ఇతి చేత్ – అఙ్గ, అన్యాపోహాలమ్బన ఏవేతి సంతోష్టవ్యమాయుష్మతేత్యలమతిప్రసజ్గేన.

మనస్విని

ఈ విషయం (ఇలా) చెప్పబడింది.

"ఒక ఘటంలో ఉన్న ఘటత్వం, మరొక చోట పుట్టిన ఘటంలోకి తాను ఉన్న చోటు నుండి కదలకుండానే చేరుతుంది అనడం చాలా చక్కగా కుదిరింది" (పరిహాసం).

"ఈ ఘటం అనే భావం ఎక్కడ ఉందో అక్కడ దానితో సంబంధం లేకుండా 'ఘటత్వం' భూతలం మీద ఉన్న ఘటాన్ని పూర్తిగా వ్యాపిస్తుందంటే ఇది ఏదో గొప్ప అద్భుతం". (ఇది కూడా వెటకారమే)

"ఘటత్వాది జాతి ఎక్కడికీ వెళ్లదు, ఘటం పుట్టకముందు దానిలో లేదు తరువాత వస్తుంది అంటే అలా రావడానికి దానిలో పెరుగు తరుగులు లేవు (అంశాలు – అవయవాలు). అంతకు ముందున్న ఆధారాన్ని (ఘటాన్ని) వదిలి పెట్టదు. ఇలా ఆహా! ఏమి కష్టపరంపర?"

"అనుగతత్వం అను జ్ఞానానికి మరి ఆలంబనం ఏది అంటే "నాయనా (అంగ)! అన్యాపోహమే దీనికి ఆలంబనం అని గ్రహించి ఆయుష్మంతుడవు నీవు సంతోషించాలి. ఇంతటితో ఈ అతి ప్రసంగం చాలు".

వి: ఇంతకు పూర్వం చెప్పబడిన 'అనుగతత్వము' మొదలైన విషయాలే ఇక్కడా ప్రస్తావించబడినాయి. 'అపోహ' అంటే 'అది; కాని దానిని వేరుగా చూపించటం, 'ఘటం' అంటే ఏమిటి? అంటే 'ఘట భిన్నమైన వాటికి భిన్నమైనది' అని చెప్పటం. ఇది బౌద్ధులవాదం.

గమనిక:– ఇక్కడ చదువరులు ఒక విషయం గ్రహించాలి. న్యాయ, వైశేషికాల సిద్ధాంతాల పరిచయం లేకుండా 'నాస్తిక దర్శనాలు' అర్థం కావు. ఆస్తిక దర్శన మతాలను (సిద్ధాంతాలను) ఖండించడమే నాస్తిక దర్శనాల ఆశయం. అందుచేత ఆస్తిక దర్శనాల ప్రాథమిక పరిచయాన్నందించే తర్క భాష, తర్క సంగ్రహం వంటి గ్రంథాలు చదివిన వారికే ఈ నాస్తిక దర్శన సిద్ధాంతాలు అవగతమౌతాయి. శాస్త్ర గ్రంథాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. రామాయణ మహాభారతాల లాగా, లేదా కావ్య

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నాటకాదులలాగా వేటికవే చదివి అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

బౌద్ధుల ప్రయత్నమంతా క్షణికవాద స్థాపన కొరకే. అది అనుభవంలో కుదరదు కనుక ఎన్నో విధాల వాదించి ప్రతిపాదించాల్సి వచ్చింది. ఇదొక శాస్త్ర వనవిహారం. మెదడుకు వ్యాయామం. అంతే గాని వీటి విషయంలో ఆందోళనకు గురికారాదు.

అవ: ఇప్పుడు బౌద్ధుడు తమ మతం ప్రకటిస్తున్నాడు.

మూలమ్

38. సర్వస్య సంసారస్య దుఃఖాత్మకత్వం సర్వతీర్థకరసంమతమ్. అన్యథా తన్నివివర్తయిషూణాం తేషాం తన్నివృత్తయే ప్రవృత్త్యనుపపత్తేః. తస్మాత్ **సర్వం దుఃఖం దుఃఖమ్**" ఇతి భావనీయమ్. నను కింవత్ ఇతి పృష్టే దృష్టాన్తః కథనీయః ఇతి చేత్ - మైవమ్; స్వలక్షణానాం క్షణానాం క్షణికతయా సాలక్షణ్యాభావాత్ ఏతేన సదృశమ్ అపరమ్ ఇతి వక్తుమ్ అశక్యత్వాత్. అతః **స్వలక్షణం స్వలక్షణమ్** ఇతి భావనీయమ్; ఏవమ్ **శూన్యం శూన్యమ్**" ఇత్యపి భావనీయమ్. స్వప్నే జాగరణే చ న మయా దృష్టమిదం రజతాది ఇతి విశిష్టనిషేధస్య ఉపలమ్భాత్. యది దృష్టం సత్ తదా తద్విశిష్టస్య దర్శనస్య ఇదంతాయా అధిష్ఠానస్య చ తస్మిన్ అధ్యస్తస్య రజతత్వాదేః తత్సమ్బన్ధస్య చ సమవాయాదేః సత్త్వం స్యాత్. న చైతదిష్టం కస్య చిద్వాదినః. న చ అర్ధజరతీయమ్ ఉచితమ్. న హి కుక్కుట్యాః ఏకో భాగః పాకాయ అపరః భాగః ప్రసవాయ కల్ప్యతామ్ ఇతి కల్ప్యతే.

మనస్విని

సంసారమంతా దుఃఖాత్మకమే (దుఃఖమయమే) అనేది అందరు ఆచార్యుల (శాస్త్రకారుల) కు సమ్మతమే. అలా కాకపోతే ఆ సంసార దుఃఖాన్ని నివర్తించడానికై ప్రయత్నించేవారు కాదు. అందుచేత "అంతా దుఃఖం, దుఃఖం" అని భావన చేయాలి. దేనిలాగా అని ప్రశ్నిస్తే దృష్టాంతం చూపాలి కదా! అంటే దీనికి దృష్టాంతం కుదరదు. పదార్థాలు క్షణికాలవడం చేత వేటికవే (ప్రత్యేక) తమ లక్షణాలను కలిగి ఉండడం చేత వీటికి వేటితోనూ పోలిక చెప్పటం కుదరదు. అందుచేత 'స్వలక్షణం స్వలక్షణం' అని భావన చేయాలి. ఇదే విధంగా 'శూన్యం శూన్యం' అని కూడా భావన చేయాలి. స్వప్నంలోనూ, జాగ్రదవస్థలోనూ (మెలకువగా ఉన్నపుడు) చూచినది, ఈ వెండి మొదలైనది నేను చూచినది కాదు అని నిషేధం లభిస్తుంది కనుక. ('శూన్యం శూన్యం' అని భావన చేయాలి). చూడబడినది 'సత్' అయితే అప్పుడు ఆదర్శనం (చూడటం), 'ఇది' అనే బుద్ధి, ఎక్కడ దేనిపైన వెండిని చూచాడో ఆ అధిష్ఠానము (ఆధారము),

In Public domain. Digitization Muthulakshmi Research Academy

దానిపై ఉన్నట్లు చెప్పబడిన 'వెండి' మొదలైనవి, వాటి మధ్యన ఉండే సమవాయము మొదలైనది కుడా 'సత్' అయి ఉండాలి. వీటి సత్త్వాన్ని (ఉనికిని) ఏ శాస్త్రకారుడూ అంగీకరించడు.

వి: కలలో చూచిన వస్తువులు నిజం కావు. అలాగే 'వెండి' లా మెరిసి 'వెండి' అని భ్రమింపజేసే వస్తువులలోని 'వెండీ' నిజం కాదు. ఇలా ఎలాగూ నిషేధింపబడే వాటిని 'ఉన్నవి' అని ఎలా అనుకోవటం? అందుచేత ఏమీలేదు అనుకోవడమే మంచిది. అదే 'శూన్యం శూన్యం' అనే భావన.

వస్తుతః భావనామయమే ఈ ప్రపంచం. ఈ వాదన ముందు ముందు ఆసక్తికరంగా సాగుతుంది, నిజమే సుమా అనిపిస్తుంది.

ఇక్కడ 'అర్ధజరతీ న్యాయాన్ని' ఉదాహరించాడు. 'కోడి ఒక భాగం ముసలిదై పోయింది. దాన్ని వంటకు ఉపయోగిద్దాం, మిగిలిన సగభాగం గ్రుడ్లు పెడుతుంది' అనటం 'అర్ధజరతీకుక్కుట న్యాయం. ఈ న్యాయం ప్రకారం పైన చెప్పిన దర్శనాదులన్నీ శూన్యాలే, అందులో కొన్ని ఉంటాయి. కొన్ని ఉండవు అనడానికి వీలులేదు అని వాదన.

మూలమ్

39. తస్మాత్ అధ్యస్తాధిష్ఠానతత్సమ్బన్ధదర్శనద్రష్టౄణాం మధ్యే ఏకస్య అనేకస్య వా అసత్త్వే నిషేధవిషయత్వేన సర్వస్య అసత్త్వం బలాదాపతేత్ ఇతి భగవతా ఉపదిష్టే మాధ్యమికాస్తావదుత్తమప్రజ్ఞాః ఇత్థమచీకథన్ - భిక్షుపాదప్రసారణన్యాయేన క్షణభఙ్గాద్యభిధానముఖేన స్థాయిత్వానుకూలవేదనీయత్వానుగతత్వసర్వసత్యత్వ భ్రమవ్యావర్తనేన సర్వశూన్యతాయామేవ పర్యవసానమ్. అతః తత్త్వం సదసదుభయానుభయాత్మకచతుష్కోటినిర్ముక్తం శూన్యమేవ. తథాహి - యది ఘటాదేః సత్త్వం స్వభావః తర్హి కారకవ్యాపారవైయర్థ్యమ్. అసత్త్వం స్వభావ ఇతి పక్షే ప్రాచీన ఏవ దోషః ప్రాదుఃష్యాత్, యథోక్తమ్ -

"న సతః కారణాపేక్షా వ్యోమాదేరివ యుజ్యతే,
కార్యస్యాసంభవీ హేతుః ఖపుష్పాదేరివాసతః" ఇతి.

మనస్విని

'అందుచేత అధ్యసించబడిన రజతాదులు, ఆధిష్ఠానమైన శుక్తి ఇత్యాదులు, వాటి సంబంధము, చూడడము, చూచేవాడు అనే వాటిలో ఏ ఒకటిగాని, అంతకంటె

In Public domain. Digitization Muthulakshmi Research Academy
ఎక్కువగాని లేనప్పుడు, అది నిషేధింపబడినప్పుడు మొత్తం అన్నీ లేనట్లే అని చెప్పవలసి వస్తుంది'. అని బుద్ధ భగవానుడు ఉపదేశించగా బుద్ధిశాలురైన మాధ్యమికులు ఇలా అన్నారు–" క్షణభంగాదులను చెప్పటం ద్వారా భిక్షుపాద ప్రసారణ (భిక్షువు కాలు జాపడం) న్యాయం చేత పదార్థాల స్థాయిత్వము, అనుకూల వేదనీయత్వము (సుఖము), అనుగతత్వము (జాతి), అన్నింటి సత్యత్వము (ఉన్నాయనటం) అనే భ్రమ తొలగిపోవటం చేత సర్వ శూన్యత్వం లోనే పర్యవసానం (ముగింపు) అవుతుంది. అందుచేత తత్త్వం సత్ (ఉన్నది), అసత్ (లేదు), ఉభయాత్మకము (రెండూ ఉన్నది), అనుభయాత్మకము (రెండూ లేనిది) – అను నాలుగు కోటులను (వికల్పాలను) వీడిన శూన్యమే. అది యుక్తమే. 'సత్త్వం' (ఉండటం) ఘటాదుల స్వభావమైతే ఇక దానిని పుట్టించడానికి (తయారు చేయడానికి) కర్త మొదలైన కారకాలు చేసే వ్యాపారం (పని) వ్యర్థం. అలా కాదు. 'అసత్త్వం' స్వభావం అన్న పక్షంలో కూడా పైన చెప్పిన దోషమే వచ్చి పడుతుంది.

(అప్పుడు కర్త ఇత్యాదులతో పనే లేదు).

ఈ విషయమే కారికలో చెప్పబడింది.

"ఆకాశంలాగా నిత్యమూ 'సత్' అయిన దానికి కారణంతో పనిలేదు. ఒకవేళ కార్యం 'అసత్' అయితే గగనకుసుమాలకు వలె కారణం ఏదీ ఉండదు."

వి: ఈ వాదన మనోజ్ఞంగా ఉంటుంది. నిష్పాక్షిక దృష్టితో చూడాలి అంతే. బౌద్ధుని వాదన ఏమిటంటే – ఒక దృశ్యాన్ని "వెండిని" (ముత్యపు చిప్పపై తెల్లగా మెరిసే దానిని వెండి అనుకొన్నపుడు) చూచినపుడు నాలుగు అంశాలు పరిగణనలోకి వస్తాయి. 1. వెండి, 2. ముత్యపు చిప్ప, 3. చూచేవాడు, 4. చూడటం. ఒక్కసారి ఆలోచించి చూస్తే వీటిలో ఏ ఒకటి, లేదా అంతకన్నా ఎక్కువ ఏది లేకున్నా దృశ్యమూ లేదు, ద్రష్టా లేడు, అధ్యాస లేదు. ఏదీ లేదు. అందుచేత చివరికి మిగిలేది శూన్యమే.

ఇక సత్, అసత్తుల మాటకొస్తే ఉన్నదానిని పుట్టించనక్కరలేదు. ఆకాశం లాగా. లేని దానిని పుట్టించనూలేము. 'గగనకుసుమం' లాగా. సాధారణంగా అందని వాటికి 'గగనకుసుమం' అని వాడుతుంటాం. కానీ దాని అర్థం అది కాదు. 'ఆకాశం' అంటే శూన్యం, ఖాళీ (స్పేస్). కుసుమం ఉంటే శూన్యం ఎందుకవుతుంది? శూన్యంలో కుసుమాలు ఉండవు. లేని దానిని గూర్చి అందమైన ఉదాహరణలు, ఆకాశ కుసుమం, కుందేటి కొమ్ము మొదలైనవి. గంభీరమైన శాస్త్రసాగరంలో ఇలాంటి ఉపమానాలు, ఉదాహరణలు అమూల్య రత్నాలు. అందుచేతనే 'శాస్త్రకారుల' బుద్ధి పదునుగా ఉంటుంది.

The Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ: ఇపుడు నాలుగింటిలో మిగిలిన ఉభయాత్మకము (సత్+అసత్తు రెండూ ఉన్నది) అనుభయాత్మకము (సత్తు+అసత్తులు రెండూ లేనిది) లను గూర్చి చెపుతున్నాడు.

మూలమ్

40. విరోధాత్ ఇతరౌ పక్షౌ అనుపపన్నౌ. తదుక్తం భగవతా **లఙ్కావతారే** -

"బుద్ధ్యా వివిచ్యమానానాం స్వభావో నావధార్యతే,

అతో నిరభిలప్యాస్తే నిఃస్వభావాశ్చ దర్శితాః" ఇతి.

"ఇదం వస్తుబలాయాతం యద్వదన్తి విపశ్చితః,

యథా యథార్థాశ్చిన్త్యన్తే విశీర్యన్తే తథా తథా". ఇతి చ.

న క్వచిదపి పక్షే వ్యవతిష్ఠతే ఇత్యర్థః. దృష్టార్థవ్యవహారశ్చ స్వప్నవ్యవహారవత్ సంవృత్యా సంగచ్ఛతే. అత ఏవోక్తమ్-

"పరివ్రాట్ కాముకశునామేకస్యాం ప్రమదాతనౌ,

కుణపః కామినీ భక్ష్య ఇతి తిస్రో వికల్పనాః". ఇతి

మనస్విని

మిగిలిన రెండు పక్షాలూ ఉభయాత్మక, అనుభయాత్మకాలు. వాటి పరస్పర విరోధం చేత ఒకదానికొకటి ఖండించుకోవటం చేత అవి కుదరనే కుదరవు. ఈ విషయాన్నే బుద్ధభగవానుడు **'లంకావతార'** గ్రంథంలో ఇలా చెప్పాడు.

"బుద్ధితో బాగా వివేచించి చూస్తే పదార్థాల స్వభావం ఏమిటో నిర్ణయించడం అశక్యం అని తేలుతుంది. అందుచేత పదార్థాలన్నీ "ఇది దీని స్వరూపం" అని చెప్పటానికి వీలుకానివి, నిఃస్వభావములు. ఒక నిశ్చిత స్వరూపం లేనివని చూపబడినాయి."

"పదార్థాలను (వాటి తత్త్వాన్ని) గూర్చి ఆలోచించేకొలదీ అవి పూర్తిగా ఎక్కడికక్కడే విడిపోతున్నాయి" అని విద్వాంసులు అంటున్నారంటే "ఇది వస్తువుల స్వరూపాన్ని బట్టి తప్పనిసరిగా (బలవంతంగా) వచ్చి పడుతున్నదే." అనగా ఏ క్షణంలోనూ నిలబడవు అని అర్థం. కంటికి కనిపించే వ్యవహారం కూడా కలలో చూచిన దానిలాగే సంవరణం (కప్పివేయబడడం)తో కూడుకొన్నదే. అందుచేతనే ఇలా అన్నారు -

"ఒకే స్త్రీ శరీరం విషయంలో సంన్యాసికీ, కాముకునికీ, శునకానికీ - ఇది శవం అనీ, కామిని అనీ, తినే పదార్థం అనీ మూడు వేరు వేరు వికల్పాలు కలుగుతాయి. అనగా ఎవరెవరికి ఎలాంటి భావన ఉంటుందో ఆ భావనానుసారం వారికి ఎదుటనున్న వస్తువు కనబడుతుంది."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి: ఈ వివరణ చాలా చక్కని తత్త్వవిచారంతో కూడి ఉంది. ఆలోచించే కొద్దీ ఏ వస్తువులు ఒక దశలో అత్యంతాసక్తికరంగా ఉంటాయో అవే కాలాంతరంలో అనాసక్తికరంగా అనిపిస్తాయి. వేటి స్వరూపమూ ఆలోచనలో ఎప్పుడూ ఒకేలా ఉండదు. దీన్నిబట్టే పరిణతి నొందిన విద్వాంసులు 'పదార్థాలను గూర్చి ఆలోచించేకొద్దీ వాటి స్వరూపాలు చెదిరిపోతున్నాయి' అన్నారు.

కళ్ళకు ఏదో పొర కమ్మినట్లు, అది విడిపోతే వెలుగు చూచినట్లుంటుంది ఈ అనుభవం.

ఇక ప్రపంచంలో నిత్యమూ చూచే ఉదాహరణనే ప్రదర్శించాడు.

"ఒక స్త్రీ శరీరాన్ని చూచినపుడు సర్వసంగపరిత్యాగికి ఒక కళేబరంలా కనిపిస్తుంది. కాముకునికి భోగ్యవస్తువుగా కనబడుతుంది. అదే శునకం వంటి జంతువులకు మాంసం ముద్దలాగా అనిపిస్తుంది."

ఎంత గొప్ప ఉదాహరణ. దర్శనకారులందరూ గొప్పవారే. వారి ఆలోచనావిధానం సునిశితంగా ఉంటుంది.

అవ: ఇతర దర్శనాల ప్రసక్తి ఇంతటితో ముగించి, ఇప్పుడు బౌద్ధ సిద్ధాంతాలని వివరిస్తున్నాడు.

మూలమ్

41. తదేవం భావనాచతుష్టయవశాత్ నిఖిలవాసనానివృత్తౌ పరనిర్వాణం శూన్యరూపం సేత్స్యతి ఇతి వయం కృతార్థాః; నాస్మాకమ్ ఉపదేశ్యం కించిదస్తీతి. శిష్యైః తావత్ యోగశ్చ ఆచారశ్చేతి ద్వయం కరణీయమ్. తత్ర అప్రాప్తస్యార్థస్య ప్రాప్తయే పర్యనుయోగః యోగః. గురూక్తస్య అర్థస్య అఙ్గీకరణమ్ ఆచారః. గురూక్తస్యార్థస్య అఙ్గీకరణాత్ ఉత్తమాః, పర్యనుయోగస్య అకరణాత్ అధమాశ్చ. అతస్తేషాం మాధ్యమికా ఇతి ప్రసిద్ధిః.

మనస్విని

"అందుచేత ఈ విధమైన భావనాచతుష్టయం వలన (నాలుగు విధాల భావనల వలన) సకల వాసనలు (సంస్కారాలు) తొలగిపోయి, శూన్యరూపమైన ఉత్తమ నిర్వాణం సిద్ధిస్తుంది కావున మేము కృతార్థులమయ్యాము, మాకు ఉపదేశించాల్సింది ఏమీలేదు" (అని అంటున్నారు). ఇక శిష్యులు ఆచరించాల్సినవి రెండున్నాయి. యోగము, ఆచారము. వీటిలో 'యోగం' అనగా "తెలియని (అర్థంకాని) విషయాలను తెలుసుకోవడానికై ప్రశ్నించడం, 'ఆచారం' అనగా గురువు చెప్పిన విషయాన్ని అంగీకరించడం. వీరు

 Public Domain. Digitization Muthulakshmi Research Academy

(ఈ శిష్యులు) గురువు చెప్పిన దాన్ని అంగీకరించడం చేత ఉత్తములు, అయితే ఈ ఉపదేశం చాలు అనుకొని ఏమీ ప్రశ్నించకపోవటం చేత అధములు. ఈ విధమైన ఉత్తమ + అధమత్వాల కలయిక వలన వీరికి 'మాధ్యమికులు' అను ప్రసిద్ధి ఏర్పడింది.

వి: 'పర్యనుయోగః' అనగా గురువుగారి ఉపదేశం విన్న తరువాత తమకు గల సందేహ నివృత్తికై ప్రశ్నించటం. ఇది ఉత్తమ శిష్యుని లక్షణం.

మూలమ్

42. గురూక్తం భావనాచతుష్టయం, బాహ్యార్థస్య శూన్యత్వం చ అఙ్గీకృత్య ఆన్తరస్య శూన్యత్వం చాఙ్గీకృతం కథమ్ ఇతి పర్యనుయోగస్య కారణాత్ కేషాంచిత్ యోగాచారప్రథా.

ఏషా హి తేషాం పరిభాషా – స్వయం వేదనం తావత్ అఙ్గీకార్యమ్. అన్యథా జగదాన్ధ్యం ప్రసజ్యేత. తత్కీర్తితం ధర్మకీర్తినా –

"అప్రత్యక్షోపలంభస్య నార్థదృష్టిః ప్రసిధ్యతి" ఇతి

బాహ్యం గ్రాహ్యం నోపపద్యత ఏవ; వికల్పానుపపత్తేః. అర్థో జ్ఞానగ్రాహ్యః భవన్ ఉత్పన్నః భవతి అనుత్పన్నః వా? న పూర్వః; ఉత్పన్నస్య స్థిత్యభావాత్. నాపరః, అనుత్పన్నస్య అసత్త్వాత్. అథ మన్యేథాః అతీత ఏవార్థః జ్ఞానగ్రాహ్యః, తజ్జనకత్వాత్ ఇతి, తదపి బాలభాషితమ్; వర్తమానతావభాసవిరోధాత్. ఇన్ద్రియాదేరపి జ్ఞానజనకత్వేన గ్రాహ్యత్వప్రసంగాచ్చ.

మనస్విని

కొందరు శిష్యులు గురువు చెప్పిన భావనా చతుష్టయాన్ని అంగీకరించి, బాహ్యమైన వస్తువేదీ లేదు అని (బాహ్యార్థ శూన్యత్వాన్ని) కూడా అంగీకరించి, "ఆంతర (లోపల) శూన్యత్వాన్ని ఎలా అంగీకరించడం?" అని ప్రశ్నించడం చేత వీరికి యోగాచారులను ప్రసిద్ధి చేకూరింది. వీరి పరిభాష (సిద్ధాంతం) ఇది – "స్వయంగా తనను తాను తెలుసుకోవడం అనుదాన్ని అంగీకరించాలి కదా! లేకపోతే ఈ జగత్తే గ్రుడ్డిదై పోతుంది. ధర్మకీర్తి ఈ విషయాన్నే చెప్పాడు" – తన జ్ఞానాన్ని ప్రత్యక్షంగా గుర్తించని వానికి పదార్థ జ్ఞానం కుదరదు."

ఇక బాహ్య పదార్థమనేది ఒకటి ఉండడం, దాన్ని తెలిసికోవడం (గ్రాహ్యం) అనేది కుదరదు. ఎందుచేతనంటే ఏ వికల్పమూ (పక్షము) పొసగదు. పదార్థం జ్ఞానగ్రాహ్యం అన్నట్లయితే (ఒక ప్రశ్న) – పుట్టిన పదార్థం జ్ఞానగ్రాహ్యం అవుతున్నదా? లేక పుట్టనిది జ్ఞానగ్రాహం అవుతున్నదా? మొదటి పక్షంలో పుట్టినది (క్షణికం కాబట్టి)

In Public domain. Digitization Muthulakshmi Research Academy
మరుక్షణంలో నశిస్తుంది కావున అది ఉండదు. (అందుచేత అది జ్ఞానగ్రాహ్యం అవుతుందనడం కుదరదు). ఇక 'పుట్టనిది' అని రెండో పక్షం స్వీకరిస్తే అసలే కుదరదు. పుట్టనిదానికి సత్త్వమే లేదుకదా! అలాకాక - "పుట్టి నశించిన పదార్థమే జ్ఞానాన్ని కలిగించింది, అందుచేత అది జ్ఞానగ్రాహ్యం" అంటే అది బాలుని (అజ్ఞుని) మాట అవుతుంది. 'అది వర్తమానంలో ఉన్నది' అంటూండగానే నశిస్తుంది కదా (క్షణికం కాబట్టి). ఇక జ్ఞానాన్ని పుట్టించడం వల్ల 'జ్ఞానగ్రాహ్యం' అంటే అప్పుడు జ్ఞానాన్ని పుట్టించే ఇంద్రియాలకు జ్ఞానగ్రాహ్యత్వం (పదార్థత్వం) వచ్చి పడుతుంది.

వి: ఇంతకీ ఈ హడావిడి అంతా బాహ్యపదార్థం లేదు అని ప్రతిపాదించటానికే. ఈ చర్చను అలా ఆస్వాదించాలే గాని అయోమయానికి లోనుకాకూడదు. ఈ చర్చ ఇంకా ముందుకు సాగుతుంధి.

మూలమ్

43. కించ గ్రాహ్యః కిం పరమాణురూపః అర్థః అవయవిరూపో వా?న చరమః; కృత్స్నైకదేశవికల్పాదినా తన్నిరాకరణాత్. న ప్రథమః; అతీన్ద్రియత్వాత్. షట్కేన యుగపద్యోగస్య బాధకత్వాచ్చ. యథోక్తమ్-

"షట్కేన యుగపద్యోగాత్పరమాణోః షడంశతా,

తేషామప్యేకదేశత్వే పిణ్డః స్యాదణుమాత్రకః" ఇతి.

తస్మాత్ స్వవ్యతిరిక్తగ్రాహ్యావిరహాత్ తదాత్మికా బుద్ధిః స్వయమేవ స్వాత్మరూప ప్రకాశికా, ప్రకాశవత్ ఇతి సిద్ధమ్. తదుక్తమ్ -

"నాన్యోఽనుభావ్యో బుద్ధ్యాస్తి తస్యా నానుభవోఽపరః,

గ్రాహ్యగ్రాహకవైధుర్యాత్, స్వయం సైవ ప్రకాశతే". ఇతి

మనస్విని

మరొక ఆశంక (సందేహం) ఏమిటంటే - గ్రాహ్య పదార్థము పరమాణు రూపమా? లేక అవయవ రూపమా? చివరిది కుదరదు అన్ని భాగాలనూ ఒకేసారి చూడడం కుదరదు కనుక. మొదటిదీ కుదరదు ఇంద్రియ గోచరం కాదు కాబట్టి. అదీగాక నాలుగు దిక్కులు, పైన, క్రింద దిక్కులతో (ఆరు దిక్కులతో) సంబంధం గల పరమాణువును అన్నివైపులా ఒకేసారి చూడటం కుదరదు. ఈ విషయమే క్రింది కారికలో చెప్పబడింది.

"నాలుగు దిక్కులు, పై దిక్కు, క్రింద దిక్కులతో సంయోగం ఉండటం వల్ల

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

పరమాణువుకు ఆరు అంశాలు ఉన్నాయని చెప్పినట్లయింది. ఆ ఆరూ ఒకేచోట ఉన్నాయని అంటే అప్పుడు ఎన్ని అణువులు కలిసినా పదార్థ పరిమాణం అణుమాత్రంగానే ఉంటుంది."

అందుచేత తనకు భిన్నమైన పదార్థం ఏదీలేకపోవటం వలన, ఆ పదార్థాన్ని తనలో కలిగిన బుద్ధి స్వయంగా ఆ పదార్థ రూపాన్ని ప్రకాశింజేస్తుంది. ఏవిధంగానైతే ప్రకాశం (వెలుగు) తనకు తానే ప్రకాశింప చేసుకుంటుందో ఆ విధంగా బుద్ధిలోని పదార్థమే ప్రకాశిస్తుంది. ఈ విషయం ఇలా చెప్పబడింది -

"బుద్ధి చేత తెలుసుకొనవలసినది మరొకటి ఏదీలేదు. దానికి మరొక జ్ఞానంలేదు. ఎందుచేతనంటే గ్రాహ్యము (గ్రహించబడేది), గ్రాహకము (గ్రహించేది) అంటూ రెండు వేరు వేరుగా లేవు. బుద్ధియే స్వయంగా ప్రకాశిస్తుంది.

వి: "బాహ్య పదార్థం లేదు, బుద్ధితోనే పదార్థం తాదాత్మ్యం కలిగిఉండి ప్రకాశిస్తుంది" అనే సిద్ధాంతం మనసుకు పట్టదు. అందుచేతనే బౌద్ధులలోనే బాహ్య పదార్థం ఉందని అనుమానించవచ్చు అని కొందరు బాహ్య పదార్థాన్ని అంగీకరించారు. ఇది ముందు ముందు వస్తుంది. ఇంతకీ బాహ్య పదార్థం లేదనే వీరి వాదనలో రెండు ప్రధానాంశాలు పైన చెప్పబడినాయి.

1. బాహ్యపదార్థం యొక్క రూపం పరమాణువు ఐతే అది ఇంద్రియ గోచరంకాదు (మైక్రోస్కోప్‌కు కూడా అందనిది). కాబట్టి అది ఉందని నమ్మడం ఎలా?

2. ఒకవేళ 'అవయవి' అనగా కంటికి కనిపించేరూపం అయితే – ఒక ఘటం ఉందంటే దాని పైభాగం ఒక అవయవం, అడుగు, ప్రక్కలు ఇలా ఇవి అవయవాలు అనబడతాయి. అవయవాలు కలిగినది 'అవయవి'. ఇలాంటి పదార్థాన్ని 'చూచాము' అని చెపితే మొత్తం ఒక్కసారే (అన్ని ప్రక్కలా) చూడలేం కదా! మరిదేన్ని చూచామని చెపుతున్నారు? అందుచేత బాహ్య పదార్థం లేదు. 'బుద్ధి'లో ప్రకాశించేదే పదార్థము అని వీరి వాదన.

ఈ విషయాన్నే ఇంకా వివరిస్తున్నారు.

మూలమ్

44. గ్రాహ్యగ్రాహకయోః అభేదశ్చ అనుమాతవ్యః. యద్వేద్యతే యేన వేదనేన తత్ తతో న భిద్యతే, యథా జ్ఞానేన ఆత్మా. వేద్యన్తే చైతే నీలాదయః. భేదే హి సతి అధునా అనేన అర్థేన సంబన్ధః న స్యాత్. తాదాత్మ్యస్య నియమహేతోః అభావాత్. తదుత్పత్తేః

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అనియామకత్వాత్. యశ్చాయం గ్రాహ్యగ్రాహకసంవిత్తీనాం పృథక్ అవభాసః సః ఏకస్మిన్ చన్ద్రమసి ద్విత్వావభాస ఇవ భ్రమః. అత్రాపి అనాదిః అవిచ్ఛిన్నప్రవాహా భేదవాసనైవ నిమిత్తమ్ - యథోక్తమ్ -

"సహోపలమ్భనియమాదభేదో నీలతద్ధియోః,
భేదశ్చ భ్రాన్తివిజ్ఞానైర్దృశ్యేతేన్దావివాద్వయే". ఇతి
"అవిభాగోఽపి బుద్ధ్యాత్మా విపర్యాసితదర్శనైః,
గ్రాహ్యగ్రాహకసంవిత్తిభేదవానివ లక్ష్యతే". ఇతి చ

మనస్విని

గ్రాహ్యములైన పదార్థాలు, గ్రాహకమైన జ్ఞానము రెండూ ఒకటే (అభేదం) అనే విషయాన్ని అనుమానం చేత స్థాపించవచ్చు. 'ఏ జ్ఞానంచేత ఏది తెలియబడుతుందో అది ఆ జ్ఞానం కంటె భిన్నం (వేరు) కాదు. జ్ఞానంచేత తెలియబడే ఆత్మ ఎలాగో ఇదీ అలాంటిదే. నీలాదులు జ్ఞానాల చేత తెలియబడుతున్నాయి. భేదం ఉండి ఉంటే పదార్థంతో సంబంధం ఉండజాలదు తాదాత్మ్య నియమం లేదు కాబట్టి. తదుత్పత్తి నియామకం కూడా లేదు. మరలాగైతే ఈ గ్రాహ్య గ్రాహక జ్ఞానాలు మూడూ విడిగా భాసిస్తున్నాయి కదా అంటే అది (నేత్రరోగికి) ఒక చంద్రుడు రెండుగా కనబడినట్లు భ్రమయే. అనాదిగా అవిచ్ఛినంగా వస్తూన్న వాసన (సంస్కారం) ఈ భేదమనే భ్రమకు నిమిత్తం. ఈ విషయమే క్రింది కారికలలో ఇలా చెప్పబడింది.

"నీలము, దాని జ్ఞానము రెండూ తప్పక కలిసే కనబడుతున్నాయి కాబట్టి ఈ రెండింటికీ అభేదమే. ఒకే చంద్రునిలో రెండు అనే భేదం కనబడుతున్నట్లు భ్రాంతి జ్ఞానాల వల్ల భేదం ఉన్నట్లు కనబడుతుంది."

"బుద్ధి యొక్క ఆత్మ అనగా జ్ఞానస్వరూపం వాస్తవంలో ఎలాంటి విభాగాలు లేనిదే ఐనా విపరీత జ్ఞానం కలవాళ్ళకు గ్రాహ్య, గ్రాహక సంవిత్తి (జ్ఞానం) అను భేదం ఉన్నట్లుగా కనబడుతూంది."

వి: బౌద్ధులు కార్యకారణ సంబంధాన్ని తాదాత్మ్యం, తదుత్పత్తుల చేత అని అంగీకరిస్తారని ప్రారంభంలోనే వివరించబడింది. ఆ రెండూ లేకుండా ఇతర సంబంధాన్ని వారంగీకరించరు. వారు ఆత్మని కూడా (ఆత్మ అని వేరుగా ఉందని) అంగీకరించరు. అయినా ఇతరులకు అర్థంకావడం కోసం జ్ఞానం, ఆత్మా ఒకటేనని 'అద్వైత' మతాన్ని ఉదహరించారు. విషయం లేకుండా జ్ఞానం ఉండదు. 'నేను ఇది చూస్తున్నాను /

Public Domain. Digitization Muthulakshmi Research Academy

చూడటం లేదు' అని చెప్పటానికి ఏదైనా ఉండాలి కదా! 'There is a thing in Nothing' అంటారు. కాబట్టి విషయ, జ్ఞానాలకు తాదాత్మ్య సంబంధం. భిన్నత్వం ఉంటే తాదాత్మ్యం ఉండదు. పోనీ జ్ఞానానికీ, విషయానికీ తదుత్పత్తి (దాని నుండి పుట్టడం) సంబంధం అంగీకరించవచ్చు కదా! అంటే అది నిత్య సంబంధం కాదు. ఘటాన్ని పుట్టించే కుమ్మరికీ, చక్రానికీ ఘటంతో నిత్య సంబంధం లేదు కదా!

ఈ విధంగా " 'బాహ్య పదార్థం లేదు', ఉంది అనుకుంటే భ్రమ. బుద్ధితోనే పదార్థం ఉంటుంది" అని బౌద్ధులలో ఒకరు ప్రతిపాదించారు.

ఈ విషయాన్నే ఇంకా దృఢంగా చెప్పబోతున్నారు.

మూలమ్

45. న చ రసవీర్యవిపాకాది సమానమ్ ఆశామోదకోపార్జితమోదకానాం స్యాదితి వేదితవ్యమ్. వస్తుతో వేద్యవేదకాకారవర్జితాయా అపి బుద్ధేః వ్యవహర్తృపరిజ్ఞానానురోధేన విభిన్నగ్రాహ్యగ్రాహకాకారరూపవత్తయా తిమిరాద్యుపహతాక్ష్ణాం కేశోణ్డుక నాడీజ్ఞానభేదవత్ అనాద్యుపప్లవవాసనాసామర్థ్యాత్ వ్యవస్థోపపత్తేః పర్యనుయోగాయోగాత్. యథోక్తమ్ -

"అవేద్యవేదకాకారా యథా భ్రాన్తైర్నిరీక్ష్యతే,
విభక్తలక్షణగ్రాహ్యగ్రాహకాకారవిప్లవా.
తథా కృతవ్యవస్థేయం కేశాదిజ్ఞానభేదవత్,
యదా తదా న సంచోద్యా గ్రాహ్యగ్రాహకలక్షణా". ఇతి

తస్మాత్ బుద్ధిరేవ అనాదివాసనావశాత్ అనేకాకారా అవభాసతే ఇతి సిద్ధమ్. తతశ్చ ప్రాగుక్తభావనాప్రచయబలాత్ నిఖిలవాసనోచ్ఛేదవిగలితవివిధవిషయాకారోప-ప్లవవిశుద్ధవిజ్ఞానోదయో మహోదయః ఇతి.

మనస్విని

"గ్రాహ్య, గ్రాహకాలకు భేదం లేదు అన్నట్లయితే, భేదం భ్రాంతి మూలకం అనుకుంటే ఊహించుకున్న మధుర పదార్థాల వలన కూడా నిజమైన మధుర పదార్థాల వలన కలిగే రుచి, బలము (తినటం వలన), వాటి ఫలితం ఉండాలి కదా" అని ఆశంకించకూడదు (సందేహం ప్రకటించకూడదు). వాస్తవానికి వేద్య, వేదక (గ్రాహ్యగ్రాహక) వర్జితమైనది (భేదం లేనిది) బుద్ధి. అయినప్పటికీ వ్యవహర్త జ్ఞానాన్ననుసరించి గ్రాహ్యగ్రాహకాలు వేరువేరుగా కనబడుతున్నాయి. ఎలాగంటే నేత్ర

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వ్యాధిగల వ్యక్తికి కళ్ళముందు ఏవో చిన్న చిన్న వెంట్రుకలు, ఉండలు, పొడవైన గొట్టాలు ఉన్నట్లు అనిపించిన విధంగా అనాది అజ్ఞానం వలన ఏర్పడిన సంస్కారాల కారణంగా భేదభావం ఏర్పడుతుంది. ఎవరికి ఎలాంటిది కలుగుతుంది అనే ప్రశ్నకు అవకాశం లేదు అజ్ఞాన వాసనా విలసితం కారణం కాబట్టి.

ఈ విషయమే క్రింది శ్లోకంలో చెప్పబడింది. అందుచేత బుద్ధియే అనాది వాసనా కారణంగా అనేక ఆకారాలుగా కనబడుతుంది అనే విషయం నిశ్చయము. ఈ విధంగా ఇంతకుముందు చెప్పిన భావనాబలం వలన అన్ని వాసనలు విచ్ఛిన్నములైపోగా, నానావిధ విషయాకారాల ఉపద్రవం (కల్లోలం) తొలగిపోయి విశుద్ధ జ్ఞానోదయమౌతుంది. అదే మోక్షం. ఇది యోగాచారుల మతం. వీరికే విజ్ఞానవాదులని పేరు.

(ఈ విజ్ఞానవాదం వేదాంతంలోని 'భ్రాంతి' వాదానికి దగ్గరగా ఉంటుంది).

అవ: తరువాత సౌత్రాంతిక మతం వివరించబోతున్నాడు.

మూలమ్

46. అన్యే తు మన్యన్తే - యథోక్తం బాహ్యం వస్తు నాస్తీతి తదయుక్తమ్; ప్రమాణాభావాత్. న చ సహోపలమ్భనియమః ప్రమాణమితి వాచ్యమ్; వేద్యవేదకయోః అభేదసాధకత్వేన అభిమతస్య తస్య అప్రయోజకత్వేన సందిగ్ధవిపక్ష వ్యావృత్తికత్వాత్.

మనస్విని

ఇతరులైతే (సౌత్రాంతికులైతే) ఇలా భావిస్తున్నారు – "బాహ్య వస్తువు (పదార్థం) లేదని ఏదైతే అంటున్నారో అది యుక్తంకాదు (కుదరదు). ఎందుచేతనంటే అలా చెప్పడానికి తగిన ప్రమాణం లేదు. సహోపలంభ నియమం (గ్రాహ్య గ్రాహకాలు రెండూ కలిసే కనబడటం) ప్రమాణం అనడానికి వీలులేదు. వేద్యవేదకాల అభేదాన్ని సాధించేదిగా చెపుతూన్న ఈ సహోపలంభ నియమం అప్రయోజకం, కాబట్టి దాని విపక్షవ్యావృత్తి (విపక్షంలో లేకుండటం) సందేహాస్పదం.

వి: అప్రయోజకమనగా అనుకూల తర్కంలేని హేతువు. ఇది విపక్షంలో ఉండదు అని నిస్సంశయంగా చెప్పడానికి కుదరని హేతువు.

ఈ విషయంలో విజ్ఞానవాది, సౌత్రాంతికుల మధ్య చర్చ వివరిస్తున్నాడు గ్రంథకర్త.

మూలమ్

47. నను భేదే సహోపలమ్భనియమాత్మకం సాధనం న స్యాత్ ఇతి చేత్, న.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

జ్ఞానస్య అన్తర్ముఖతయా, జ్ఞేయస్య బహిర్ముఖతయా చ భేదేన ప్రతిభాసనాత్. ఏకదేశత్వైకకాలత్వలక్షణనియమాసంభవాచ్చ. కించ నీలాద్యర్థస్య జ్ఞానాకారత్వే 'అహమ్' ఇతి ప్రతీతిః స్యాత్ న తు 'ఇదమ్' ఇతి ప్రతిపత్తిః; ప్రత్యయాత్ అవ్యతిరేకాత్. అథోచ్యతే జ్ఞానస్వరూపోఽపి నీలాకారః భ్రాన్త్యా బహిః భేదేన ప్రతిభాసతే ఇతి, న చ తత్ర అహమిత్యుల్లేఖః ఇతి; తథోక్తమ్ –

"పరిచ్ఛేదాన్తరాద్యోఽయం భాగో బహిరివ స్థితః,

జ్ఞానస్యాభేదినో భేదప్రతిభాసోఽప్యుపప్లవః". ఇతి

"యదన్తర్జ్ఞేయతత్త్వం తత్ బహిర్వదవభాసతే" ఇతి చ.

మనస్విని

"ఈ రెండింటికి భేదం ఉన్నట్లయితే 'సహోపలంభ నియమం' అను సాధనం (హేతువు) ఉండకూడదు కదా!" అని అన్నట్లయితే "అది సరికాదు. ఎందుచేతనంటే జ్ఞానం (గ్రాహకం) అంతర్ముఖం (లోపల ఉంటుంది), జ్ఞేయమైన (గ్రాహ్య పదార్థం) బహిర్ముఖం (బయట ఉంటుంది). ఈ విధంగా రెండూ భిన్న భిన్నంగా కనబడుతున్నాయి కదా!" అందుచేత ఒకే ప్రదేశంలో ఉండటం, ఒకే సమయంలో ఉండటం అనే నియమం ఇక్కడ కుదరదు.

అంతేకాకుండా నీలాది పదార్థాల జ్ఞానం కలిగినపుడు "నేను" అనే జ్ఞానం కలిగిఉండేది, "ఇది" అనే జ్ఞానం కలిగి ఉండేది కాదు, రెండూ ఒకటే అయినట్లయితే. అందుచేతనే అంటున్నాము "జ్ఞానస్వరూపమే అయినప్పటికీ నీలాకారము భ్రాన్తి కారణంగా బయట ఉన్నట్లుగా భాసిస్తుంది" అని. ఈ స్థలంలో "నేను" అని చెప్పబడటం లేదు. ఈ విషయాన్నే ఇలా చెప్పారు.

"పరిచ్ఛేదం కంటె భిన్నంగా ఉన్నదే బయట ఉన్నట్లుగా ఉంటుంది. జ్ఞానంతో అభేదంగా ఉన్న (జ్ఞేయం) పదార్థం భిన్నంగా ఉన్నట్లు ప్రతిభాసించడం అసత్యమే." "లోపల ఉన్న జ్ఞేయతత్త్వమే బయట ఉన్నట్లు భాసిస్తుంది."

వి: ఇదంతా 'బాహ్యపదార్థం ఏదీలేదు' అనే యోగాచార (విజ్ఞానవాద) మతం. అలా కాదు "బాహ్య పదార్థం అంటూ లేకపోతే అది భాసించటం (కనబడటం) ఏమిటి?" అని సౌత్రాంతికులు వీరితో వాదిస్తున్నారు.

మూలమ్

48. తదయుక్తమ్ బాహ్యార్థభావే తద్వ్యుత్పత్తిరహితతయా **'బహిర్వత్'** ఇతి ఉపమానోక్తేః

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అయుక్తేః. న హి **వసుమిత్రో వన్ధ్యాపుత్రవత్ అవభాసతే** ఇతి ప్రేక్షావాన్ ఆచక్షీత. భేదప్రతిభాసస్య భ్రాన్తత్వే అభేదప్రతిభాసస్య ప్రామాణ్యం, తత్ప్రామాణ్యే చ భేదప్రతిభాసస్య భ్రాన్తత్వమ్ ఇతి పరస్పరాశ్రయప్రసఙ్గాచ్చ. అవిసంవాదాత్ నీలతాదికమేవ సంవిదానాః బాహ్యమేవోపాదదతే జగతి, ఉపేక్షన్తే చ అన్తరమ్ ఇతి వ్యవస్థాదర్శనాచ్చ. ఏవం చాయమభేదసాధకో హేతుః గోమయపాయసీయ న్యాయవత్ ఆభాసతాం భజేత్. అతః **'బహిర్వత్'** ఇతి వదతా బాహ్యం గ్రాహ్యమేవ ఇతి భావనీయమ్ ఇతి భవదీయ ఏవ బాణః భవన్తం ప్రహరేత్.

మనస్విని

(సౌత్రాంతికుడు) అది యుక్తంకాదు. బాహ్యమైన పదార్థమే లేనపుడు 'బాహ్యమైనది' వలె అనే ఉపమానమే పొసగదు. ఎందుచేతనంటే బాహ్యపదార్థం ఉండటమనేదే లేనపుడు దానిని గుర్చిన జ్ఞానం ఎలా కలుగుతుంది? బుద్ధిమంతుడెవడూ "వసుమిత్రుడు గొడ్రాలి పుత్రునివలె కనిపిస్తాడు" అని చెప్పడు. "భేదప్రతిభాసనం (కనిపించడం)లో భ్రాన్తి ఉందంటే అభేద ప్రతిభాసనంలో ప్రామాణ్యం సిద్ధిస్తుంది. అభేద జ్ఞానం ప్రామాణికం అని నిశ్చితమైతే భేదజ్ఞానం భ్రాంతి కల్పితం అనేది సిద్ధిస్తుంది. ఈవిధంగా అన్యోన్యాశ్రయ దోషం వచ్చిపడుతుంది. అంతేకాకుండా విసంవాదం (విరోధం) లేకపోవటం చేత కొందరు నీలత్వాదికాన్నే జగత్తులో ఉన్నట్లు తెలిసికొన్నవారై, ఆ బాహ్య పదార్థాన్ని మాత్రమే గ్రహిస్తున్నారు. వారు ఆంతరమైనదానిని (లోపల ఉన్న దానిని) ఉపేక్షిస్తున్నారు. ఈ విధంగా బాహ్యవస్తువు ఉందని వ్యవస్థ కనబడుతుంది.

ఈవిధంగా ఈ అభేదసాధకమైన హేతువు 'గోమయ పాయసీయ' న్యాయంలాగా ఆభాసపాలు అవుతుంది. అందుచేత 'బాహ్యపదార్థం వలె' అని చెప్పే నిన్ను 'బాహ్య పదార్థం ఉందని గ్రహించాలి' అంటూ నీ బాణం నిన్నే ప్రహరిస్తుంది (కొడుతుంది).

వి: శాస్త్ర చర్చలలో విద్వాంసులు తమకనుకూలమైన వాదాలు ఇతర పక్షాల నుండి ఐనా గ్రహిస్తారు. అదేవిధంగా "బాహ్య పదార్థం మాత్రమే ఉంది" అనే నైయాయికుల మతాన్ని సౌత్రాంతికుడు తన వాదానికి బలం చేకూర్చుకునేందుకు వాడుకున్నాడు. ఈ చర్చలలో ప్రయోగించే 'న్యాయాలు' (సామెతల వంటివి) కూడా చమత్కార జనకంగా ఉంటాయి. గోవుకు సంబంధించినది ఏదైనా 'గవ్యం' అంటారు. 'గోమయం' (పేడ) గవ్యమే. ఆవుపాలు కూడా గోమయాలే. అయితే 'గోమయ పాయసం' అనగానే ఆవుపాలతో అనే అర్థంకంటే ముందు 'పేడతో పాయసం' అని స్ఫురిస్తుంది.

 In public domain. Digitization Muthulakshmi Research Academy

ఈవిధంగా వేళాకోళం చేయటం ఈ విద్వాంసులకు వినోదం.

అవ: గ్రాహ్య పదార్థం అనుమాన ప్రమాణం ద్వారా తెలుసుకోవచ్చు అని చూపబోతున్నాడు.

మూలమ్

49. నను జ్ఞానాత్ భిన్నకాలస్య అర్థస్య గ్రాహ్యత్వమ్ అనుపపన్నమితి చేత్ – తదనుపపన్నమ్. ఇన్ద్రియసంన్నికృష్టస్య విషయస్య ఉత్పాద్యే జ్ఞానే స్వాకారసమర్పకతయా, సమర్పితేన చాకారేణ తస్యార్థస్య అనుమేయతోపపత్తేః. అత ఏవ పర్యనుయోగపరిహారౌ సమగ్రాహిషతామ్ –

"భిన్నకాలం కథం గ్రాహ్యమితి చేద్ గ్రాహ్యతాం విదుః,
హేతుత్వమేవ చ వ్యక్తేః జ్ఞానాకారార్పణక్షమమ్" ఇతి.

తథా చ యథా పుష్ట్యా భోజనమనుమీయతే, యథా చ భాషయా దేశః, యథా వా సంభ్రమేణ స్నేహః తథా జ్ఞానాకారేణ జ్ఞేయమ్ అనుమేయమ్. తదుక్తమ్ –

"అర్థేన ఘటయత్యేనాం న హి ముక్త్వార్థరూపతామ్,
తస్మాత్ ప్రమేయాధిగతేః ప్రమాణం మేయరూపతా". ఇతి

మనస్విని

(ఆశంక) జ్ఞానం కంటె భిన్నమైన కాలం గల వస్తువు గ్రహింపబడటం కుదరదు కదా! అంటే (సమాధానం) అలా అనడం అయుక్తం (సరియైందికాదు).

ఇంద్రియాలతో సన్నికర్ష కలిగిన (సంబంధం కలిగిన) విషయం (పదార్థం) ఉత్పాద్యమైన (పుట్టించవలసిన) జ్ఞానంలో తన ఆకారాన్ని సమర్పిస్తుంది. ఆవిధంగా సమర్పించబడిన ఆకారంచేత ఆ పదార్థము అనుమేయం అవడం పొసగుతుంది. అందుచేత ప్రశ్నా (పర్యనుయోగము), పరిహారం (సమాధానం) రెండూ ఈక్రింది శ్లోకంలో సంగ్రహంగా చెప్పబడినాయి.

'భిన్నకాలంలో ఉన్నది ఎలా గ్రాహ్యం (గ్రహించబడుతుంది) అంటే ఆ పదార్థానికి గల 'జ్ఞానాకార సమర్పణ' శక్తియే అందుకు గల హేతువు."

అది ఏవిధంగానంటే – శరీరపుష్టిచేత భోజనం, భాష ద్వారా దేశం, సంబరాన్ని బట్టి స్నేహం (ప్రేమ). ఎలాగైతే ఊహిస్తారో అలాగే జ్ఞానాకారాన్ని బట్టి జ్ఞేయమైన పదార్థము అనుమేయము. ఈ విషయం ఈ క్రింద చెప్పబడింది.

"జ్ఞాత (తెలుసుకునేవాడు) జ్ఞానాన్ని అర్థంతో కూర్చుతున్నాడంటే జ్ఞానానికి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయ రూపత్వాన్ని ఇవ్వడం మాత్రమే. అంతకుమించి మరేమీ లేదు. అందుచేత జ్ఞానం జ్ఞేయరూపం అవడమే విషయజ్ఞానానికి ప్రమాణము.

వి: ఇక్కడ క్షణికవాదాన్ని అనుసరించి ప్రతిపాదిస్తున్నాడు. బౌద్ధుల సిద్ధాంతంలో ప్రధానమైనది క్షణికవాదం అని చూచి ఉన్నాం. శాశ్వతమైనదేదీ వారి సిద్ధాంతంలో లేదు. అందుచేత నేత్రం అనే ఇంద్రియం ఘటం అనే పదార్థాన్ని చూచిందంటే వారి సిద్ధాంతం ప్రకారం 'ఘటం' తన ఆకారాన్ని 'జ్ఞానానికి' సమర్పిస్తుంది. జ్ఞానంలో కనిపించే వస్తువు బయట ఉందన్నది "అనుమాన ప్రమాణం" ద్వారా తెలుస్తుంది. ఒక పదార్థ జ్ఞానం కలిగిందంటే అది ఉంది అని "అనుమానం".

మరొక విషయం, కొంచెం తర్కానికి కుదురుతుంది కానీ మనసుకు పట్టడం కష్టం. ఎలాగంటే – క్షణికవాదులైన వీరి వాదనలో ఘటమూ, జ్ఞానము భిన్న కాలాల్లో, భిన్న ప్రదేశాల్లో ఉన్నాయి. ఘటం బాహ్యం, జ్ఞానం ఆంతరం – ఇది భిన్న దేశం. 'ఘటం' పుట్టినప్పుడు (ఒకచోట ఉన్నప్పుడు) అదే క్షణంలో జ్ఞానం కలుగదు. మనకూ అనుభవవే కనీసం 'రెప్పపాటు' కాలభేదమైనా ఉంటుంది. స్థాయిత్వాన్ని అంగీకరించపోయినా వీళ్ళు ఒక సంస్కార ప్రవాహాన్ని అంగీకరిస్తారు. అందుచేత రెండవ సెకనులో (క్షణం) చూడబడిన 'ఘటం' మొదటి క్షణంలో ఉండిన ఘటం యొక్క ఉనికికి సహాయపడుతుంది. (ఆ సంస్కారం వల్ల). ఆవిధంగా అది అనుమేయమై గ్రాహ్యమౌతుంది.

అవ: ఇక ఇప్పుడు జ్ఞానం, జ్ఞేయం ఈ రెండింటిని గూర్చి వివరిస్తున్నాడు.

మూలమ్

50. న హి విత్తిసత్తైవ తద్వేదనా యుక్తా. తస్యాః సర్వత్ర అవిశేషాత్. తాం తు సారూప్యమావిశత్ సరూపయితుం ఘటయేదితి చ. తథా బాహ్యార్థసద్భావే ప్రయోగః **– యే యస్మిన్ సత్యపి కాదాచిత్కాః తే సర్వే తదతిరిక్తసాపేక్షాః. యథా – అవివక్షతి అజిగమిషతి మయి వచనగమన ప్రతిభాసాః వివక్షుజిగమిషుపురుషాన్తర సంతానసాపేక్షాః. తథా చ వివాదాధ్యాసితాః ప్రవృత్తిప్రత్యయాః సత్యప్యాలయవిజ్ఞానే కదాచిదేవ నీలాద్యుల్లేఖిన** ఇతి. తత్ర ఆలయవిజ్ఞానం నామ అహమాస్పదం విజ్ఞానమ్. నీలాద్యుల్లేఖి చ విజ్ఞానం ప్రవృత్తి విజ్ఞానమ్. యథోక్తమ్ – –

"తత్ స్యాదాలయవిజ్ఞానం యద్భవేదహమాస్పదమ్,

తత్ స్యాత్ ప్రవృత్తివిజ్ఞానం యన్నీలాదికముల్లిఖేత్". ఇతి

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తస్మాత్ ఆలయవిజ్ఞానసంతానాతిరిక్తః కాదాచిత్కప్రవృత్తివిజ్ఞానహేతుః బాహ్యార్థః గ్రాహ్య ఏవ; న వాసనాపరిపాక ప్రత్యయకాదాచిత్కత్వాత్ కదాచిదుత్పాద ఇతి వేదితవ్యమ్.

మనస్విని

ఆ విషయాల ప్రకాశనం కేవలం జ్ఞానం యొక్క అస్తిత్వం మాత్రమే కాదు. ఎందుచేతనంటే జ్ఞానం అన్నింటియందూ భేదం లేకుండా, ఒకలాగానే ప్రవర్తిస్తుంది. సారూప్యం అనగా ఆయా విషయాలతో సమానమైన ఆకారము, ఆ విత్తి (జ్ఞానం)లో ప్రవేశించి ఆ విషయాకారంగా చేయటం కోసం విత్తిని విషయంతో కలుపుతుంది. అలాగే బాహ్యార్థం (విషయం) ఉంది అనటానికి అనుమాన ప్రయోగం ఇలా చేయవచ్చు. "ఏది ఉన్నా ఏవైతే అప్పుడప్పుడు మాత్రమే కలుగుతుంటాయో, అవి అన్నీ కూడ దానికంటె భిన్నమైన వాటిని అపేక్షిస్తాయి. నేను మాట్లాడాలి అని అనుకోకపోయినా, వెళ్ళాలని అనుకోకపోయినా, మాట్లాడటాన్నీ, వెళ్ళటాన్నీ కోరుకునే ఒకానొక పురుష సంతానాపేక్షగలవి. అలాగే వివాదాస్పదమైన ప్రవృత్తి ప్రత్యయాలు ఆలయ విజ్ఞానం ఉన్నా కూడా అప్పుడప్పుడు మాత్రమే నీలాది పదార్థాలను స్పృశిస్తూంటాయి." 'అహమ్ (నేను) అనే జ్ఞానానికి స్థానమైన విజ్ఞానం 'ఆలయ విజ్ఞానం'. నీలాది పదార్థాలతో సంబంధించి వాటిని నిర్దేశించేది 'ప్రవృత్తి విజ్ఞానం'.

"నేను అనే జ్ఞానంలో ఆశ్రయం 'ఆలయ విజ్ఞానం'. నీలాది పదార్థాలను నిర్దేశించేది 'ప్రవృత్తి విజ్ఞానం'."

అందుచేత 'ఆలయ విజ్ఞాన సంతానంకంటే వేరుగా బాహ్యమైన పదార్థం ఉంది. అది కదాచిత్ (అప్పుడప్పుడు) కలిగే ప్రవృత్తి విజ్ఞానానికి కారణం. ఆ బాహ్య పదార్థమే 'గ్రాహ్యం'. అంతేగాని అప్పుడప్పుడు వాసనాపరిపాకం వల్ల కలిగే ప్రత్యయాల కారణంగా అప్పుడప్పుడు పుట్టేది కాదు.

వి: విజ్ఞానవాదులు ఆంతర జ్ఞానాన్ని అంగీకరిస్తారు కానీ, బాహ్య పదార్థం ఒకటి ఉంది అని అంగీకరించరు. ఒకానొక వాసన (సంస్కారం) వల్ల ఆయా పదార్థాలు లోపలే భాసిస్తాయి అని వీరి మతం. అయితే ఇది హేతుబద్ధంగా అనిపించదు కాబట్టి సౌత్రాంతికులు 'బాహ్య పదార్థం ఉంది, ఐతే అది ప్రత్యక్షం కాదు అనుమేయం' అని ప్రతిపాదించారు. అదే విషయాన్ని ఈ క్రింద వివరిస్తున్నారు.

మూలమ్

51. విజ్ఞానవాదినయే హి వాసనా నామ ఏకసంతానవర్తినామ్ ఆలయ విజ్ఞానానాం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

తత్తత్ప్రవృత్తివిజ్ఞానజననశక్తిః. తస్యాశ్చ స్వకార్యోత్పాదనం ప్రతి ఆభిముఖ్యం పరిపాకః. తస్య చ ప్రత్యయః కారణం స్వసంతానవర్తిపూర్వక్షణః కక్షీక్రియతే. సంతానాన్తర-నిబన్ధనత్వానఙ్గీకారాత్. తతశ్చ ప్రవృత్తివిజ్ఞానజనకాలయవిజ్ఞానవర్తివాసనాపరిపాకం ప్రతి సర్వేఽ ప్యాలయవిజ్ఞానవర్తిక్షణాః సమర్థా ఏవేతి వక్తవ్యమ్. న చేదేకోఽపి న సమర్థః స్యాత్. ఆలయవిజ్ఞానసంతానవర్తిత్వావిశేషాత్. సర్వే సమర్థా ఇతి పక్షే కాలక్షేపానుపపత్తిః. తతశ్చ కాదాచిత్కత్వనిర్వాహాయ శబ్దస్పర్శ రూపరసగన్ధవిషయాః షడపి ప్రత్యయాః చతురః ప్రత్యయాన్ ప్రతీత్య ఉత్పద్యన్తే ఇతి చతురేణ అనిచ్ఛతాపి అచ్ఛమతినా స్వానుభవమ్ అనాచ్ఛాద్య పరిచ్ఛేత్తవ్యమ్.

మనస్విని

విజ్ఞానవాదుల సిద్ధాంతం ప్రకారం - అవిచ్ఛిన్న ప్రవాహం (సంతానం)లో ఉన్న ఆలయ విజ్ఞానాలకు గల ఆయా ప్రవృత్తి విజ్ఞానాలను పుట్టించే 'శక్తి'యే 'వాసన'. ఈ వాసన తన కార్యాన్ని (తాను చేయవలసిన పనిని) పుట్టించడానికి సిద్ధంగా ఉండటమే 'పరిపాకం'. ఈ పరిపాకానికి అవిచ్ఛిన్న ప్రవాహంలోని పూర్వ క్షణ విజ్ఞానం కారణం. (ఇది క్షణిక విజ్ఞానం). దీనికి బాహ్యమైన 'సంతానం' వారు అంగీకరించరు. (ఇక్కడే ఒక సమస్య ఉత్పన్నమవుతుంది). బాహ్యమైనది లేనప్పుడు ఆంతరమైన ఆలయవిజ్ఞానం వల్లనే 'ప్రవృత్తి విజ్ఞానం' కలుగుతుందంటే మరి అది నిరంతరం సాగుతూనే ఉండాలి. సమర్థమైనది కాలక్షేపాన్ని సహించదు కదా! సామర్థ్యం లేకపోతే ఎప్పుడూ ప్రవృత్తి జ్ఞానం కలుగదు.

ఈవిధంగా బాహ్య పదార్థాన్ని అంగీకరించని పక్షంలో, విజ్ఞానవాదుల మతంలో ఈ దోషం పరిహరించ శక్యంకాదు. అందుచేత బాహ్య పదార్థాన్ని అంగీకరించి, దానితో అప్పుడప్పుడు ఇంద్రియాలకు సంబంధం ఏర్పడినప్పుడు 'పరిపాకం' కలుగుతుంది అని చెప్పటం యుక్తం అని ప్రతిపాదిస్తున్నాడు (సౌత్రాంతికుడు). ఈ రకంగా పరిపాకం కదాచిత్ (అప్పుడప్పుడు) మాత్రమే కలుగుతూండడాన్ని కుదిరేటట్లు చేయాలంటే శబ్ద-స్పర్శ-రూప-రస-గంధములు విషయంగా గల ఐదు జ్ఞానాలూ, ఆంతరములైన సుఖాదులు విషయంగాకల ఒక జ్ఞానమూ, ఈ ఆరు జ్ఞానాలూ నాలుగు ప్రత్యయాలను (కారణాలను) ఆలంబనగా చేసికొని పుడతాయి అని స్వచ్ఛమైన బుద్ధి గల తెలివైనవాడు, ఇష్టంలేకపోయినా, తన అనుభవాన్ని కాదనకుండా, అంగీకరించాలి.

"అనిచ్ఛతాపి అచ్ఛమతినా" అని అందమైన పదప్రయోగం.

main. Digitization Muthulakshmi Research Academy

అవ: ఇక ఆ నాలుగు ప్రత్యయాలు ఏమిటో వివరిస్తున్నాడు.

మూలమ్

52. తే చత్వారః ప్రత్యయాః ప్రసిద్ధాః ఆలమ్బన - సమనన్తర - సహకారి - అధిపతిరూపాః. తత్ర జ్ఞానపదవేదనీయస్య నీలాద్యవభాసస్య చిత్తస్య నీలాదౌ ఆలమ్బన ప్రత్యయాత్ నీలాకారతా భవతి. సమనన్తరప్రత్యయాత్ ప్రాచీనజ్ఞానాత్ బోధరూపతా. సహకారిప్రత్యయాత్ ఆలోకాత్ స్పష్టతా. చక్షుషః అధిపతిప్రత్యయాత్ విషయగ్రహణప్రతినియమః. ఉదితస్య జ్ఞానస్య రసాదిసాధారణ్యే ప్రాప్తే నియామకం చక్షుః అధిపతిర్భవితుమర్హతి. లోకే నియామకస్య అధిపతిత్వోపలమ్భాత్. ఏవం చిత్త - చైత్తాత్మకానాం సుఖాదీనాం చత్వారి కారణాని ద్రష్టవ్యాని.

మనస్విని

ఆ నాలుగు ప్రత్యయాలు ప్రసిద్ధమైనవి. అవి ఆలంబన-సమనంతర-సహకారి -అధిపతి అనబడేవి. వీటిలో 'జ్ఞాన'మనే పదంచేత చెప్పబడేది, నీలాదులను ప్రకాశింపజేసేది అయిన చిత్తం 'నీలం' అనే ఆలంబన ప్రత్యయాన్ని బట్టి నీలాకారం అవుతుంది. వెనువెంటనే సమనంతర ప్రత్యయమైన జ్ఞానాన్ని బట్టి బోధస్వరూపం (తెలియటం) అవుతుంది. సహకారి ప్రత్యయమైన ఆలోకం (వెలుగు) వలన స్పష్టత్వం చేకూరుతుంది. అధిపతి ప్రత్యయమైన నేత్రాన్ని బట్టి విషయ గ్రహణంలో నియమం కుదురుతుంది. ఉదయించిన జ్ఞానం రసాదులకూ సాధారణమే అయివుండగా నియామకమైన చక్షువు అధిపతి అవడానికి తగి ఉంటుంది. లోకంలో నియామకునికి అధిపతిత్వం లభించటం చూస్తూనే ఉంటాం కదా! ఈ విధంగా చిత్త-చైత్తాత్మకములైన సుఖాదులకు నాలుగు కారణాలు అని తెలుసుకోవాలి (చిత్తం అనగా రూపాది జ్ఞానం, చైత్తం అనగా సుఖాదికం).

వి: ఒక విధంగా చెప్పాలంటే ఇది అంతా ఒక సైంటిఫిక్ ప్రొసీజర్. శాస్త్రీయ విశ్లేషణ. వేదాంతంలోనైనా, సాంఖ్యాది దర్శనాలలో అయినా ఒక విషయాన్ని గ్రహించటానికి 'మనసు + ఇంద్రియం + విషయం' అనే మూడూ ఉంటాయి. ఆయా శాస్త్రాలు వివరించే పద్ధతులు వేరువేరుగా ఉంటాయి. ఏది ఏమైనా ఒక వస్తువును చూచాము అన్నప్పుడు -

1. మొదటగా ఏదోరూపం, 2. దానిని గూర్చి తెలియటం, 3. ఆ విషయం స్పష్టతకు వెలుగు అవసరం, 4. ఆ విషయ గ్రహణానికి అర్హమైన ఇంద్రియం - ఈ నాలుగు ఉండాల్సిందే.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉదా: ఒక ఘటం ఉంది, మొదట ఒకానొక రూపం కనబడింది. వెంటనే అది ఘటం అని బోధ కలిగింది, అది 'ఘటమే' అని వెలుగులో స్పష్టంగా తెలిసింది. అది కంటి ద్వారా తెలిసింది.

పానీయమైతే రసనేంద్రియం (నాలుక) ద్వారా తెలుస్తుంది. కాబట్టి ఆయా విషయాలకు ఆయా ఇంద్రియాలు నియామకాలు, అధిపతులు.

జ్ఞానం - బోధ - వెలుతురు - అధిపతి

1. ప్రవృత్తి విజ్ఞానానికి విషయం (ఘటాదికం) - 'ఆలంబన ప్రత్యయం'.

2. పూర్వ క్షణంలోని జ్ఞానం ఉత్తర క్షణంలోని జ్ఞానానికి ఆకారాన్ని గ్రహించే సామర్థ్యాన్ని ఇస్తుంది కాబట్టి అది - 'సమనంతర ప్రత్యయం'. (ఇది క్షణికవాదానుసారం)

3. ఘట జ్ఞాన స్పష్టతకు కారణం - వెలుగు అనే 'సహకారి ప్రత్యయం'.

4. ఇంద్రియం 'అధిపతి ప్రత్యయం'.

ఈ విధంగా నాలుగు ప్రత్యయాల వలన విషయజ్ఞానం కలుగుతుంది. చిత్తం గ్రహించే రూపం, చిత్తంలో ఉండే సుఖాది విషయాలు వీటి జ్ఞానం ప్రవృత్తి జ్ఞానం. రూప, సుఖాదులు కూడా జ్ఞానం కంటే వేరైనవి కాబట్టి జ్ఞానం గ్రాహకం కాగా, అవి గ్రాహ్యాలు అవుతాయి. ఇదీ సౌతాంత్రిక మతం.

వి: కాస్త పరిశీలనగా చూస్తే బౌద్ధుల సిద్ధాంతాలు, వేదాంతంతో పోలి ఉంటాయి. చెప్పే విధానం వేరు. నామ, రూపాదులన్నింటినీ వేరుగా వివరిస్తారు. 'ఆత్మ' అంగీకరించరు కానీ ఒక సంస్కారం 'అనాది' అంటారు. బహుశా అందుకేనేమో విద్యారణ్యుల వారు ఈ దర్శనాలను మాలగా అల్లి "పూలు వేరైనా అందులో ఉన్న దారం ఒకటే" అని చూపించారు. ఈ బుద్ధితో చదివితే మతభేదాలతో మతిపోయే గతి తప్పుతుంది.

ఇక లోక వ్యవహారాన్ని వివరించబోతున్నాడు బౌద్ధుడు.

మూలమ్

53. సోఽ యం చిత్తచైత్తాత్మకః స్కన్ధః పఞ్చవిధః - రూప - విజ్ఞాన - వేదనా - సంజ్ఞా - సంస్కారసంజ్ఞకః తత్ర రూప్యన్తే ఏభిః విషయాః ఇతి, రూప్యన్తే ఇతి చ వ్యుత్పత్త్యా సవిషయాణి ఇన్ద్రియాణి రూపస్కన్ధః. ఆలయవిజ్ఞాన - ప్రవృత్తివిజ్ఞానప్రవాహః విజ్ఞానస్కన్ధః. ప్రాగుక్తస్కన్ధద్వయసంబన్ధజన్యః సుఖదుఃఖాదిప్రత్యయప్రవాహః వేదనాస్కన్ధః. గౌరిత్యాదిశబ్దోల్లిఖితసంవిత్ప్రవాహః సంజ్ఞాస్కన్ధః. వేదనాస్కన్ధనిబన్ధనాః రాగద్వేషాదయః

In Public domain. Digitization Muthulakshmi Research Academy

క్లేశాః, ఉపక్లేశాః మదమానాదయః ధర్మాధర్మౌ చ సంస్కార స్కన్ధః.

మనస్వినీ

ఈ చిత్త చైత్తాత్మకమైన 'స్కన్ధము' అయిదు స్కన్ధాలతో కూడి ఉన్నది. ఆ ఐదు - 1. రూపస్కన్ధము, 2. విజ్ఞాన స్కన్ధము, 3. వేదనాస్కన్ధము, 4. సంజ్ఞాస్కన్ధము, 5. సంస్కారస్కన్ధము. పై వాటిలో -

1. 'వీటిచేత విషయాలు గుర్తించబడతాయి' అనే వ్యుత్పత్తిచేత ఇంద్రియాలు రూపాలు, గుర్తించబడే విషయాలు కూడా రూపాలే. ఈవిధంగా విషయాలతో కూడిన ఇంద్రియాలు 'రూపస్కంధం'.

2. ఆలయవిజ్ఞాన - ప్రవృత్తి విజ్ఞానాల ప్రవాహం 'విజ్ఞానస్కంధం'.

3. రెండు స్కంధాల సంబంధం వలన కలిగే సుఖదుఃఖాదుల అనుభవ ప్రవాహం 'వేదనాస్కంధం'.

4. గౌః (ఎద్దు లేదా ఆవు) మొదలైన శబ్దాలను (పదాలను) తెలిపే జ్ఞానప్రవాహం 'సంజ్ఞాస్కంధం'. ఈ సంజ్ఞా స్కంధంలో నామరూపమైన అంశం అభౌతికం. కాబట్టి అది చైత్తం. రూపాంశం భౌతికం.

5. వేదనా స్కంధం వలన ఏర్పడే రాగ-ద్వేషాది క్లేశాలు, మద, మానాదులు, ధర్మాధర్మాలు - ఇవి 'సంస్కార స్కంధం'.

వి: ఇంతకీ ఈ ఐదు స్కంధాలు ఏం చెపుతున్నాయంటే లోకవ్యవహారం ఎలా జరుగుతుందో వివరిస్తున్నాయి. ఒక విషయాన్ని చూడటం, తెలుసుకోవటం, రాగ, ద్వేషాదులు మొదలైనవి ఏర్పడటం - వీటిలో నిరంతర ప్రవాహ రూపమైన విజ్ఞానం అనుస్యూతంగా ఉంటూ ఆయా జ్ఞానాలను అందిస్తుంది. ఈ ఐదింటి కలయికే జీవితం, జీవనం.

అవ: అయితే బౌద్ధులు 'భావన'కు ప్రాధాన్యం ఇస్తారు. ఇది అందరూ అంగీకరించేదే. 'భావనామయం' ఈ ప్రపంచం. ఒక సమయంలో అందంగా కనబడేదే మరొక క్షణంలో సారహీనంగా కన్పిస్తుంది. మానసిక స్థితిని బట్టి ఈ లోకం కనబడుతుంది. అందుచేత అప్పుడప్పుడూ మెరిసిపోయే 'మిణుగురు' పురుగులా లేని నిప్పు ఉన్నట్లు కనిపించినట్లు సుఖంగా కనిపించేది 'సుఖం' కాదు అని వీరి సిద్ధాంతం. అందుచేత అంతా 'దుఃఖమయం' అని భావన చేస్తే ఇక కామ, లోభాదులకు స్థానం ఉండదు. నిర్వేదం, నిర్లిప్తత అలవడతాయి. బంధాలకు బద్ధులు కారు. ఇదీ ఫలితం.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

54. తదిదం సర్వం దుఃఖం, దుఃఖాయతనమ్, దుఃఖసాధనం చేతి భావయిత్వా తన్నిరోధోపాయం తత్త్వజ్ఞానం సంపాదయేత్. అత ఏవోక్తమ్–దుఃఖ–సముదాయ–నిరోధ–మార్గాః చత్వారః ఆర్యబుద్ధస్య అభిమతాని తత్త్వాని. తత్ర దుఃఖం ప్రసిద్ధమ్. సముదాయః దుఃఖకారణమ్. తత్ ద్వివిధం ప్రత్యయోపనిబన్ధనో హేతూపనిబన్ధనశ్చ.

మనస్విని

ఈ సమస్తమూ దుఃఖము, దుఃఖానికి నిలయము. దుఃఖ సాధనము అని భావనచేసి ఆ దుఃఖ నివారణోపాయమైన తత్త్వజ్ఞానాన్ని సంపాదించాలి. అందుచేతనే దుఃఖము, సముదాయము, నిరోధము, మార్గము అను నాలుగు ఆర్యుడైన (పూజ్యుడైన) బుద్ధునికి అంగీకార్యములైన తత్త్వాలు అని చెప్పబడింది. వీటిలో 'దుఃఖము' అందరికీ తెలిసినదే. ఈ దుఃఖానికి కారణం 'సముదాయం'. ఇది 'ప్రత్యయోపనిబంధన సముదాయము', 'హేతూపనిబంధన సముదాయము' అని రెండు విధాలు.

వి: వీటిని గూర్చి ముందు ముందు వివరించబడుతుంది. దుఃఖము, దాని కారణము, దుఃఖాన్ని నిరోధించడం, మార్గము – ఈ నాలుగింటి యథార్థ స్వరూపం తెలిసికోవడమే తత్త్వజ్ఞానం. దుఃఖానికి కారణాన్ని తెలుసుకుని, ఆ కారణాన్ని నిలిపివేస్తే ఇక దుఃఖం ఎలా పుడుతుంది?

అవ: ప్రత్యయోపనిబంధనను వివరించబోతున్నాడు.

మూలమ్

55. తత్ర ప్రత్యయోపనిబన్ధనస్య సంగ్రాహకం సూత్రమ్ – **"ఇదం ప్రత్యయఫలమ్"** ఇతి. ఇదం కార్యం యే అన్యే హేతవః ప్రత్యయన్తి గచ్ఛన్తి తేషామ్ అయమానానాం హేతూనాం భావః ప్రత్యయత్వం, కారణసమవాయః, తన్మాత్రస్య ఫలం న చేతనస్య కస్య చిదితి సూత్రార్థః. యథా బీజాత్ అఙ్కురో ధాతూనాం షణ్ణాం సమవాయాత్ జాయతే. తత్ర పృథివీధాతుః అఙ్కురస్య కాఠిన్యం గన్ధం చ జనయతి. అబ్ధాతుః స్నేహం రసం చ జనయతి. తేజోధాతుః రూపమ్ ఔష్ణ్యం చ. వాయుధాతుః స్పర్శనం చలనం చ. ఆకాశధాతుః అవకాశం శబ్దం చ. ఋతుధాతుః యథాయోగం పృథివ్యాదికమ్.

మనస్విని

పైన చెప్పిన రెండింటిలో ప్రత్యయోపనిబంధనం యొక్క సంగ్రాహక (సంగ్రహించే) సూత్రము – "ఇది ప్రత్యయ ఫలం" అనేది. ప్రత్యయం అంటే "వచ్చి చేరేది" అని

Public domain. Digitization Muthulakshmi Research Academy

అర్థం. ఈ కార్యం 'కారణసముదాయాల' ఫలం అనే విషయాన్ని హేతుబద్ధంగా చెపుతున్నాడు. "కార్యానికి ముందు యేవైతే ఇతర హేతువులు వచ్చి చేరతాయో, ఆ వచ్చి చేరడం ప్రత్యయత్వం. అనగా వేరువేరు కారణాల కలయిక. ఈ కలయిక ఫలమే కార్యం. అంతేకాని ఏదో ఒక చేతన పదార్థం కారణం కాదు." ఇదీ సూత్రార్థం. అది ఎలాగంటే "బీజం నుండి అంకురం ఆరు ధాతువుల కలయిక వల్ల పుడుతుంది. అందులో పృథివీ ధాతువు అంకురానికి కాఠిన్యాన్ని (గట్టిదనాన్ని), గంధాన్నీ పుట్టిస్తుంది, అపధాతువు (జలధాతువు) స్నేహాన్ని (స్నిగ్ధత్వాన్ని), రసాన్ని పుట్టిస్తుంది. తేజోధాతువు రూపాన్ని ఉష్ణత్వాన్ని కలుగజేస్తుంది, వాయుధాతువు స్పర్శను, చలనాన్నీ కలిగిస్తుంది, ఆకాశ ధాతువు అవకాశాన్ని, శబ్దాన్ని ఇస్తుంది. ఋతుధాతువు పృథివీ ఇత్యాదులను పుట్టిస్తుంది.

వి: ఇంతకీ వీళ్ళు చెప్పేదేమిటంటే ఏ కార్యంలోనైనా 'చేతన' అనే పదార్థ ప్రమేయం లేదు. పంచధాతువులు + ఋతువు కలిస్తే బీజం నుండి అంకురం ఉత్పన్నమైనట్లు కారణ సముదాయంతో కార్యం పుడుతుంది. ఇదీ ప్రత్యయోపనిబంధన సముదాయము.

అవ: ఇక 'హేతూపనిబంధన సమవాయమనే' రెండవ దానిని గూర్చి చెప్పబోతున్నాడు.

మూలమ్

56. హేతూపనిబన్ధనస్య చ సంగ్రాహకం సూత్రమ్ – **"ఉత్పాదాద్వా తథా గతానామ్ అనుత్పాదాద్వా స్థితైవైషాం ధర్మాణాం ధర్మతా ధర్మస్థితితా ధర్మనియామ కతా చ ప్రతీత్యసముత్పాదానులోమతా"** ఇతి. తథాగతానాం బుద్ధానాం మతే ధర్మాణాం కార్యకారణభావరూపా ఏషా ఉత్పాదాదనుత్పాదాద్వా స్థితా. యస్మిన్ సతి యత్ ఉత్పద్యతే యస్మిన్నసతి యత్ నోత్పద్యతే తత్తస్య కారణస్య కార్యమ్ ఇతి. ధర్మతేత్యస్య వివరణం ధర్మస్థితితా ఇత్యాది. ధర్మస్య కార్యస్య కారణానతిక్రమేణ స్థితిః. స్వార్థికః తల్ ప్రత్యయః ధర్మస్య కార్యస్య కారణం ప్రతి నియామకతా. న న్వయం కారణభావః చేతనమన్తరేణ న సంభవతీత్యత ఉక్తం ప్రతీత్యేతి. కారణే సతి తత్ ప్రతీత్య ప్రాప్య సముత్పాదే అనులోమతా అనుసరితా యా సైవ ధర్మతా ఉత్పాదాత్ అనుత్పాదాద్వా ధర్మాణాం స్థితా. న చాత్ర కశ్చిచ్చేతనః అధిష్ఠాతా ఉపలభ్యత ఇతి సూత్రార్థః.

మనస్విని

హేతూపనిబంధన సంగ్రాహక సూత్రం ఇలా చెప్పబడింది, "తథాగతుల (బౌద్ధుల)

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మతంలో (కార్యం) పుట్టడం వల్లనైనా, పుట్టకపోవడం వల్లనైనా కార్యకారణ రూపాలైన ధర్మాల యొక్క కార్యకారణ భావం అనేది ఏర్పడి ఉంది. ఏది ఉన్నప్పుడు ఏది పుడుతుందో, ఏది లేకపోతే ఏది పుట్టదో అదే ఆ కారణం యొక్క కార్యము. (పుట్టించేది కారణము, పుట్టేది కార్యము). ధర్మతా అన్నా 'ధర్మస్థితితా' అన్నా 'ధర్మం' ఉండడం అనే అర్థం. అంటే ధర్మం = కార్యం. ఈ కార్యం అనేది కారణం లేకుండా ఉండజాలదు (పుట్టదు). ఈ కార్యకారణ భావం 'చేతనం లేకుండా కుదరదు గదా' అనే ప్రశ్నకు సమాధానంగా 'ప్రతీత్య....' అని చెప్పబడింది. కారణం ఉంటూండగా, దానిని పొంది (ప్రతీత్య), పుట్టుటలో (సముత్పాదే) అనులోమతా (అనుసరించి ఉండటం) – ఇదే "ప్రతీత్య సముత్పాదానులోమతా". దీన్ననుసరించి కారణం ఉన్నప్పుడు కార్యం ఉత్పన్నమౌతుంది, కారణం లేనప్పుడు కార్యం ఉత్పన్నం కాదు. ఇదే ధర్మత. ఇక్కడ కార్యకారణాలు తప్ప వీటికి అధిష్ఠాత కానీ, నియామకుడు గానీ అయిన 'చేతనుడు' ఎవరూ కనబడడం లేదు.

వి: ఈ సుదీర్ఘ చర్చకు సంక్షిప్తంగా అర్థం ఇది. కారణ, కార్యాలు పరస్పర అన్వయంతో ఉంటాయి. కారణం ఉంటే కార్యం పుడుతుంది. అంతేగాని ఆ పుట్టుకకు ఏదో చైతన్యము, శక్తిలాంటివి బౌద్ధులు అంగీకరించరు. ఆత్మ, చైతన్యం, వీరు అంగీకరించరు కాబట్టే నాస్తికులు అనబడినారు. కనబడేదాన్నీ, అనగా ప్రత్యక్షాన్నీ, అనుమానాన్నీ నమ్ముతారు. వీరి ఈ 'ప్రతీత్య సముత్పాదవాదం' చాలా ప్రసిద్ధమైనది.

అవ: ఇక చర్చను ఉపసంహరించబోతున్నాడు.

మూలమ్

57. ప్రతీత్యసముత్పాదస్య హేతూపనిబన్ధనో యథా – బీజాత్ అఙ్కురః, అఙ్కురాత్ కాణ్డమ్, కాణ్డాత్ నాలః, నాలాత్ గర్భః, తతః శూకమ్, తతః పుష్పమ్, తతః ఫలమ్. న చాత్ర బాహ్యే సముదాయే కారణం బీజాది, కార్యమ్ అఙ్కురాది వా చేతయతే అహమఙ్కురం నిర్వర్తయామి, అహం బీజేన నిర్వర్తితః ఇతి. ఏవమ్ ఆధ్యాత్మికేష్వపి కారణద్వయమ్ అవగన్తవ్యమ్.

"పురఃస్థితే ప్రమేయాబ్ధౌ గ్రన్థవిస్తరభీరుభిః"

ఇతి న్యాయేన ఉపరమ్యతే.

మనస్విని

ప్రతీత్య సముత్పాదం (కారణాలను పొంది ఉత్పన్నమవటం) అనేది హేతువులను

 Public Domain. Digitization Muthulakshmi Research Academy

బట్టి జరుగుతుంది. అది ఎలాగంటే - బీజం నుండి అంకురం, అంకురం నుండి కాండం (కాడ), దానినుండి నాలం, ఆ నాలం నుండి శూకం (చిన్న కాడవంటిది), ఆ శూకం నుండి పుష్పం, ఆ పుష్పం నుండి ఫలం - ఉత్పన్నమవటం వలన కారణ కార్యాల క్రమం కనబడుతుంది. ఈ కార్యోత్పత్తికి ఏ చేతనమూ అవసరమైనట్టు కనిపించటం లేదు. ఈ బాహ్య వస్తు సముదాయంలో ఉన్న బీజాదికం గాని, అంకురాదికం గాని, "నేను అంకురాన్ని పుట్టిస్తున్నాను" అని గాని, "నన్ను బీజం పుట్టించింది" అని గాని అనుకోవడం లేదు. ఇక్కడ 'చేతన' సాహాయ్యం ఏమీలేదు. ఇదేవిధంగా ఆధ్యాత్మికముల (శరీరానికి సంబంధించిన) విషయంలో కూడా ఊహించు కోవాలి.

"ప్రమాణాల ద్వారా తెలుసుకోవాల్సిన 'ప్రమేయసాగరం' ఎదుట ఉండగా ఇంకా వివరిస్తే గ్రంథం విస్తృతమౌతుందనే భయంతో" అన్నట్లు - ఈ చర్చ ఇంతటితో ఆపివేయబడుతుంది.

వి: బీజం నుండి మళ్ళీ బీజం వరకూ కారణ కార్యాల వ్యవహారం ఎలా ఉంటుందో అదేవిధంగా 'శరీరోత్పత్తి', లోక వ్యవహారం కూడా జరుగుతుంటాయి. అది అలా జరిగిపోతుంది. దీనిలో ఏ చేతనుడి అపేక్షా లేదు.

అవ: ఇంతవరకూ జరిగిన చర్చ సారాంశం ఇది. 'బాహ్య పదార్థమే లేదు' అంతా ఆంతరమే అని ప్రతిపాదించిన విజ్ఞానవాదులనే యోగాచారుల మతాన్ని సరియైంది కాదనీ, బాహ్య పదార్థం లేకపోతే పదార్థ ప్రతీతి ఎలా కలుగుతుందనీ, అయితే ఆ బాహ్య పదార్థం ప్రత్యక్షం కాదు అనుమేయమనీ సౌత్రాంతికులు సోదాహరణంగా ప్రతిపాదించారు. ఇక సౌత్రాంతిక మత చర్చను ముగించబోతున్నాడు.

మూలమ్

58. తదుభయనిరోధః, తదనన్తరం విమలజ్ఞానోదయో వా ముక్తిః. తన్నిరోధోపాయః మార్గః. స చ తత్త్వజ్ఞానమ్. తచ్చ ప్రాచీనభావనాబలాత్ భవతీతి పరమం రహస్యమ్. సూత్రస్యాన్తం పృచ్ఛతాం కథితమ్; భవన్తశ్చ సూత్రస్యాన్తం పృష్టవన్తః సౌత్రాన్తికా భవన్తు ఇతి భగవతా అభిహితతయా సౌత్రాన్తికసంజ్ఞా సంజాతేతి.

మనస్విని

ఆ రెండింటి అనగా దుఃఖము, దాని కారణము ఈ రెండింటి నిరోధము మోక్షము. లేదా ఆ రెండింటి నిరోధము తరువాత కలిగిన నిర్మల జ్ఞానోదయమే ముక్తి.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఆ నిరోధానికి ఉపాయమే 'మార్గం'. ఈ మార్గమే తత్త్వజ్ఞానం. అది కూడా ఆ తత్త్వజ్ఞానం కూడా ఇంతకుముందు చెప్పబడిన "సర్వం క్షణికం" ఇత్యాది భావనా బలం వల్ల కలుగుతుందనేది పరమ రహస్యము. "సూత్రం (నియమం) యొక్క అంతం ఏమిటి?" అని అడుగుతున్న శిష్యులకు బుద్ధ భగవానుడు ఇలా చెప్పాడు "మీరు సూత్రం యొక్క అంతాన్ని అడిగారు. అందుచేత సౌత్రాంతికులు అగుదురు గాక." ఈ విధంగా భగవానుడు పలకటం చేత వారికి సౌత్రాంతిక సంజ్ఞ ఏర్పడింది.

అవ: ఇంతవరకు 'సర్వ శూన్య, బాహ్య శూన్య, బాహ్య అనుమేయ' అను మూడు సిద్ధాంతాలు వరుసగా మాధ్యమిక, యోగాచార, సౌత్రాంతికుల ప్రతిపాదనలుగా వివరించబడినాయి. ఇప్పుడు బాహ్య పదార్థాన్ని అంగీకరించే వైభాషిక మతాన్ని వివరిస్తున్నాడు.

మూలమ్

59. కేచన బౌద్ధాః - బాహ్యేషు గన్ధాదిషు, ఆన్తరేషు రూపాదిస్కన్ధేషు సత్స్వపి తత్ర అనాస్థామ్ ఉత్పాదయితుం **'సర్వం శూన్యమ్'** ఇతి ప్రాథమికాన్ వినేయాన్ అచకథత్ భగవాన్; ద్వితీయాంస్తు విజ్ఞానమాత్రగ్రహావిష్టాన్ **"విజ్ఞానమేవైకం "సత్"** ఇతి. తృతీయాన్ **"ఉభయం సత్యమ్"** ఇతి ఆస్థితాన్ **"విజ్ఞేయమ్ అనుమేయమ్",** సేయం విరుద్ధ భాషా ఇతి వర్ణయన్తః - వైభాషికాఖ్యయా ఖ్యాతాః.

మనస్విని

బాహ్యములైన గంధము మొదలైన పదార్థాలు, ఆంతరములైన రూపాది స్కంధాలు ఉన్నప్పటికీ అనాసక్తిని కలిగింప జేయటానికి 'సర్వం శూన్యం' అని భగవానుడు మొదటి శిష్యులకు బోధించాడు. 'విజ్ఞానం మాత్రమే ఉంది' అని పట్టుదలతో ఉన్న ద్వితీయ శ్రేణికి 'విజ్ఞానం ఒక్కటే సత్' అని బోధించాడు. 'ఉభయం సత్యం' రెండూ ఉన్నాయి అనే తృతీయ శ్రేణికి 'తెలుసుకొనవలసినది అనుమేయము' (జ్ఞేయం అనుమేయం) అని బోధించాడు. ఇలా అనటం విరుద్ధ భాష (ఒకటికొకటి సరిపోని మాట) అని కొందరు బౌద్ధులు అనటం చేత వారికి "వైభాషికు"లనే పేరు ప్రసిద్ధిలోకి వచ్చింది.

వి: ఇంతవరకు జరిగిన చర్చలో మూడు విధాలుగా చెప్పబడింది. ఒకదానితో ఒకటి పొసగటం లేదు. ఇప్పుడు నాలుగవ శ్రేణి బౌద్ధులు వచ్చి తమ మతాన్ని ప్రతిపాదిస్తున్నారు.

Public Domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

60. ఏషా హి తేషాం పరిభాషా సమున్మిషతి. విజ్ఞేయానుమేయత్వవాదే ప్రాత్యక్షికస్య కస్య చిదప్యర్థస్య అభావేన, వ్యాప్తిసంవేదన స్థానాభావేన అనుమాన ప్రవృత్త్యనుపపత్తిః, సకలలోకానుభవవిరోధశ్చ. తతశ్చ అర్థో ద్వివిధః గ్రాహ్యః అధ్యవసేయశ్చ. తత్ర గ్రహణం నిర్వికల్పకరూపం ప్రమాణమ్; కల్పనాపోఢత్వాత్. అధ్యవసాయః సవికల్పకరూపః అప్రమాణమ్, కల్పనాజ్ఞానత్వాత్. తదుక్తమ్ -

"కల్పనాపోఢమభ్రాన్తం ప్రత్యక్షం నిర్వికల్పకమ్,
వికల్పో వస్తునిర్భాసాదసంవాదాదుపప్లవః". ఇతి
"గ్రాహ్యం వస్తు; ప్రమాణం హి గ్రహణం; యదితోఽ న్యథా
న తద్వస్తు; న తన్మానం శబ్దలిఙ్గేన్ద్రియాదిజమ్". ఇతి చ.

మనస్విని

వారి పరిభాష ఈ విధంగా వికసిస్తుంది. జ్ఞేయమైన (తెలుసుకోవాల్సిన) పదార్థం అనుమేయము అని వాదించే సౌత్రాంతికుల మతంలో ప్రత్యక్షంగా గ్రహింపబడే పదార్థం ఏదీ లేకపోవటం, వ్యాప్తిని తెలిపే స్థానం ఏదీ లేకపోవటం చేత అనుమాన ప్రమాణానికి అవకాశం లేకుండా పోవటం అనేది ఏర్పడుతుంది. అంతేగాక వీరి వాదం లోకానుభవానికి విరుద్ధం. అందుచేత అర్థం (పదార్థం) రెండు విధాలు - 1. గ్రాహ్యం (గ్రహింపబడేది), 2. అధ్యవసేయం (ఇది ఈ పదార్థం అని నిశ్చయంగా చెప్పటం). వీటిలో మొదటిదైన గ్రహణం నిర్వికల్పకరూపమైనది ప్రమాణం, ఎందుచేతనంటే దీనిలో కల్పన, ఆరోపణాదులు ఉండవు. రెండవది సవికల్పక రూపమైన అధ్యవసేయం. ఇది ప్రమాణం కాదు. ఎందువల్లనంటే ఇది కల్పనతో కూడినది కనుక.

ఈ విషయమే క్రింది కారికలలో చెప్పబడింది.

"నామ, జాతి, ఇత్యాది కల్పనలతో లేని నిర్వికల్పక ప్రత్యక్షం ప్రమాణం. వికల్పంతో అనగా నామ - జాత్యాది భేదాలతో భాసించటం వలన, అదీ అందరికీ ఒకే విధంగా కనిపించకపోవటం వలన (వారి వారి దృక్కోణం ప్రకారం పదార్థ జ్ఞానం భిన్నభిన్నంగా ఉంటుంది), సవికల్పక జ్ఞానము ఉపప్లవమే (భ్రాంతియే)."

"నిర్వికల్పక జ్ఞానంచేత గ్రహింపబడే (గ్రాహ్యం) పదార్థం యథార్థమైనది. దీని గ్రహణం ప్రమాణం. దీనికి భిన్నమైనది వస్తువే కాదు. అందుచేత శబ్దం వలన, హేతువు వలన, ఇంద్రియాదుల వలన కలిగే సవికల్పక జ్ఞానం ప్రమాణం కాదు."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి: ఒక వస్తువును చూచిన మొదటి క్షణంలో కలిగేది నిర్వికల్పక జ్ఞానమే. తరువాతి క్షణంలో విశదమయ్యే రూపాది విశేషాలు సవికల్పక జ్ఞానం. బౌద్ధుల మతానుసారం నామ, రూప, జాత్యాదులతో కూడినదైన సవికల్పక జ్ఞానం ప్రమాణం కాదు. ఎందుచేతనంటే ఒక పదార్థం విషయంలో వేరువేరు వ్యక్తుల అభిప్రాయాలు వేరువేరుగా ఉంటాయి. అందుచేత ఏ విశేషాలూ లేని అవ్యక్తరూపాది పదార్థమే యథార్థం.

అవ: "సవికల్పకం ప్రమాణం కాకపోతే లోక వ్యవహారం ఎలా కుదురుతుంది? అనే సందేహానికి సమాధానం చెప్పబోతున్నాడు."

మూలమ్

61. నను సవికల్పకస్య అప్రామాణ్యే కథం తతః ప్రవృత్తస్య అర్థప్రాప్తిః, సంవాదశ్చ ఉపపద్యేయాతామ్ ఇతి చేత్ – న తద్ భద్రమ్. మణిప్రభావిషయమణివికల్ప న్యాయేన పర్యాయేణ అర్థప్రతిలమ్భసంభవేన తదుపపత్తేః. అవశిష్టం సౌత్రాన్తిక ప్రస్తావే ప్రపఞ్చితమ్ ఇతి నేహ ప్రతన్యతే. న చ వినేయాశయానురోధేన ఉపదేశభేదః సాంప్రదాయికః న భవతీతి భణితవ్యమ్. యతో భణితం **బోధచిత్తవివరణే** –

"దేశనా లోకనాథానాం సత్త్వాశయవశానుగాః,
భిద్యన్తే బహుధా లోకే ఉపాయైర్బహుభిః పునః,
గమ్భీరోత్తానభేదేన క్వచిచ్చోభయలక్షణా
భిన్నా హి దేశనాఽ భిన్నా శూన్యతాద్వయలక్షణా". ఇతి

మనస్విని

"సవికల్పకం ప్రమాణం కానట్లయితే, ఆ సవికల్పకం ద్వారా కలిగిన జ్ఞానాన్ని బట్టి ఆ పదార్థం వైపు ప్రవర్తించటం, అది అనుకున్నట్లుగానే ఉండటం ఇత్యాది ఎలా కుదురుతుంది?" అని ప్రశ్నించినట్లయితే (సమాధానం) – మీ ప్రశ్న యుక్తం కాదు. 'మణి ప్రభను చూచి మణిని చేరటం' అనే న్యాయం (ఉదాహరణ, లోకోక్తి) చేత అది కుదురుతుంది. ఇక మిగిలినదంతా సౌత్రాంతిక మత ప్రసంగంలో వివరించబడినాయి. కనుక ఇక్కడ మళ్ళీ విస్తరించబోవడం లేదు. "వినేయులైన శిష్యుల ఆశయానుసారం భిన్న భిన్న విధాలుగా ఉపదేశించటం సాంప్రదాయికం కాదు కదా!" అని అనరాదు. ఎందుచేతనంటే 'బోధచిత్త వివరణ'లో ఇలా చెప్పబడింది.

"లోకనాథుల (మార్గదర్శకుల) ఉపదేశం ఆయా వ్యక్తుల అభిప్రాయాలను అనుసరించి, వారి వారి అధికారాన్ని గ్రహణ సామర్థ్యాన్ని బట్టి అనేక విధాలుగా,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఎన్నో ఉపాయాలతో (యుక్తులతో) కూడి ఉంటుంది. అందుచేత ఉపదేశం ఒకచోట గంభీరంగాను, ఒకచోట స్పష్టంగాను, కొన్నిచోట్ల ఉభయరూపంగాను ఉంటుంది. అయితే అద్వితీయత్వ (ఒకే విధమైన)మైన శూన్యత్వం మాత్రం అందరికీ వర్తించేదే!"

వి: ఇక్కడ ఒక విచిత్రమైన ఉదాహరణ చెపుతారు. "ఒకచోట ప్రకాశవంతమైన మణి ఒకటి ఉంది. ఆ ప్రకాశాన్ని మణి అనుకొని చేరువగా వెళ్ళిన వ్యక్తికి ఆ ప్రకాశం మణికాదు అని తెలుస్తుంది. అయితే ఆ ప్రకాశాన్ననుసరించి వెళ్ళగా మణి లభిస్తుంది. అలాగే సవికల్పకం ప్రమాణం కాకపోయినా క్రమంగా పరంపరంగా పదార్థం తెలుస్తుంది" అని వీరి వివరణ. అదిసరే మరి ఈ మాధ్యమిక, యోగాచార ఇత్యాది అంటూ భిన్న భిన్న ఉపదేశాలు, శిష్యులలో భేదాలు ఎందుకు? అంటే అందరు వ్యక్తుల గ్రహణ, ధారణాదులు ఒకేలా ఉండవు. ఆయా వ్యక్తుల అర్థగ్రహణ సామర్థ్యాన్ని బట్టి లోకనాథులైన ఆచార్యులు వివిధ రీతులుగా బోధిస్తుంటారు. అయితే 'శూన్యత్వం' అనే సిద్ధాంతం అందరికీ ఒకటే.

అవ: బౌద్ధమతంలో "ద్వాదాశయతన పూజ" అనేది చాలా ప్రశంసనీయమైనది. "ఇంద్రియాల పూజ ఏమిటి?" అని అనుకోవచ్చు. ఇంద్రియాలను సరియైన పద్ధతిలో వినియోగించటమే ఇంద్రియ పూజ. అదే విషయాన్ని వివరించబోతున్నాడు.

మూలమ్

62. ద్వాదశాయతనపూజాశ్రేయస్కరీతి బౌద్ధనయే ప్రసిద్ధమ్ -
అర్థానుపార్జ్య బహుశో ద్వాదశాయతనాని వై,
పరితః పూజనీయాని కిమన్యైరిహ పూజితైః
జ్ఞానేన్ద్రియాణి పఞ్చైవ తథా కర్మేన్ద్రియాణి చ
మనో బుద్ధిరితి ప్రోక్తం ద్వాదశాయతనం బుధైః. ఇతి

మనస్విని

ద్వాదశాయనత పూజ శ్రేయస్కరమైనది అని బౌద్ధమతంలో ప్రసిద్ధ వాక్యం.

"అన్ని విధాలా వస్తువులను సంపాదించి, 12 ఆయతనాలను పూజించాలి. ఇతరమైన వాటిని పూజించటం వల్ల ఏం ప్రయోజనం?"

"ఐదు జ్ఞానేంద్రియాలు కళ్ళు, నాసిక, నాలుక, చెవి, చర్మము అనేవి, ఐదు కర్మేంద్రియాలు వాక్కు, పాణి, పాద, పాయు, ఉపస్థ అనునవి, మనస్సు, బుద్ధి - ఈ పన్నెండు ఇంద్రియాలు 12 ఆయతనాలు. ఇవి పూజా స్థానాలని పండితులు చెప్పారు."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి: ఈ 12 ఇంద్రియాలే లోక వ్యవహారానికి సాధనాలు. ఆలయాలను పవిత్రంగా ఉంచుకొన్నట్లు, వీటిని జాగ్రత్తగా చూచుకోవాలి. అది ఎలాగంటే -

1. కంటికి శ్రమ కలిగించేవి, చూడకూడనివి చూడరాదు.

2. నాసికకు దుర్గంధం సోకరాదు.

3. నాలుకను రెండు విధాలుగా కాపాడుకోవాలి. అతిగా వాగకూడదు, అతిగా భుజించకూడదు.

4. చెవులకింపైనది వినాలి. కర్ణ కఠోరమైన నాదాలు (ఈనాటి వెర్రి శబ్దాలు) వినకూడదు.

5. చర్మము అనగా శారీరక సుఖమునకు ఇంద్రియము. అతిగా శారీరక సుఖాలు కూడవు.

అలాగే మాట, చేయి, కాలు, అపాంగము, జననేంద్రియాలను ఉచిత రీతిని కాపాడుకోవాలి.

అన్నింటికీ మూలమైన అంతరింద్రియాలు మనస్సు, బుద్ధి జోడు గుర్రాల వంటివి. వీటిని నియంత్రించాలి.

ఏ వేదాంతమైన ఇవే ప్రధానోద్దేశ్యాలు. ఈ నియమాలు పాటిస్తే వ్యక్తిగత శ్రేయస్సే కాదు, విశ్వమానవ కళ్యాణం సిద్ధిస్తుంది.

అవ: ఇంతవరకూ బౌద్ధమత సిద్ధాంతాలను వివరించి, ముందు ముందు సంక్షిప్తంగా చెప్పి ఉపసంహరిస్తున్నాడు.

మూలమ్

63. వివేకవిలాసే బౌద్ధమతమ్ ఇత్థమ్ అభ్యధాయి -

బౌద్ధానాం సుగతో దేవో విశ్వం చ క్షణభఙ్గురమ్,
ఆర్యసత్యాఖ్యయా తత్త్వచతుష్టయమిదం క్రమాత్.
దుఃఖమాయతనం చైవ తతః సముదయో మతః,
మార్గశ్చేత్యస్య చ వ్యాఖ్యా క్రమేణ శ్రూయతామతః.

మనస్విని

'వివేకవిలాస'మనే గ్రంథంలో బౌద్ధమతం గూర్చి ఇలా చెప్పబడింది.

"బౌద్ధులకు 'సుగతుడు' (బుద్ధుడు) దేవుడు. ఈ విశ్వం క్షణభంగురం. క్షణక్షణానికీ నశిస్తూంటుంది. 'ఆర్య సత్యాలు' అని చెప్పబడే నాలుగు తత్త్వాలు క్రమంగా ఇలా ఉన్నాయి."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

"దుఃఖము, ఆయతనము, సముదాయము, మార్గము" అనే యీ నాలుగు తత్త్వాలను వివరించబోతున్నాము వినండి."

అవ: ఇంతవరకూ చర్చించబడినవి యీ నాలుగు తత్త్వాలే అని క్రింది కారికలతో వివరిస్తున్నాడు.

మూలమ్

64. దుఃఖం సంసారిణః స్కన్ధాః తే చ పఞ్చ ప్రకీర్తితాః,
విజ్ఞానం వేదనా సంజ్ఞా సంస్కారో రూపమేవ చ.

మనస్విని

"సంసారికి (మానవునకు) పంచస్కంధాలే దుఃఖం (దుఃఖహేతువులు). (ఈ పంచస్కంధాలు ఇదివరకే వర్ణించబడినాయి). ఆ ఐదూ - విజ్ఞాన-వేదన-సంజ్ఞ-సంస్కార-రూప స్కంధాలు" అని చెప్పబడినవి.

మూలమ్

65. పఞ్చేంద్రియాణి శబ్దాద్యా విషయాః పఞ్చ మానసమ్,
ధర్మాయతనమేతాని ద్వాదశాయతనాని తు.

మనస్విని

ఐదు శ్రోత్రాది జ్ఞానేంద్రియాలు, ఐదు శబ్దాది విషయాలు, మనస్సు, ధర్మాయతనము (ధర్మస్థానమైన శరీరం), ఈ పన్నెండూ ఆయతనాలు.

వి: ఇంతకుముందు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలను గూర్చి చెప్పి ఇక్కడ కర్మేంద్రియాల స్థానంలో విషయాలు చెప్పాడు. కర్మేంద్రియాలకు లక్ష్యం విషయాలే గనుక అలా చెప్పాడు. ఇక 'ధర్మానికి స్థానం' శరీరం అని చెప్పటంలో 'ధర్మ సాధన క్షేత్రం' అని గ్రహించాలి.

మూలమ్

66. రాగాదీనాం గణో యస్మాత్సముదేతి నృణాం హృది,
ఆత్మాత్మీయస్వభావాఖ్యః స స్యాత్సముదయః పునః.

మనస్విని

ఆత్మ, ఆత్మీయము (నేను, నాది) అనే రాగాదుల సముదాయం హృదయంలో ఉదయిస్తుంది. ఇదే 'సముదాయం'. (ఇదే కదా బంధానికి కారణం).

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

67. క్షణికాః సర్వసంస్కారాః ఇతి యా వాసనా స్థిరా,
స మార్గ ఇతి విజ్ఞేయః స చ మోక్షోఽభిధీయతే.

మనస్విని

'సంస్కారాలన్నీ క్షణికాలే' అనే 'వాసన' ఏదైతే స్థిరంగా ఉంటుందో అదే 'మార్గము' అని తెలుసుకోవాలి. దానినే 'మోక్ష'మని అంటారు.

అవ: ఇప్పుడు ప్రమాణాలు, బౌద్ధంలోని ప్రధాన మతాలు సంక్షిప్తంగా చెపుతున్నాడు.

మూలమ్

68. ప్రత్యక్షమనుమానం చ ప్రమాణద్వితయం తథా,
చతుఃప్రస్థానికా బౌద్ధాః ఖ్యాతా వైభాషికాదయః.

మనస్విని

"ప్రత్యక్షం, అనుమానం అని ప్రమాణాలు రెండు. నాలుగు విధాల సిద్ధాంతాలను అవలంబించిన బౌద్ధులు 'వైభాషికాదు'లని చెప్పబడే వారు నాలుగు విధాలు."

అవ: ఈ నాలుగు విధాల సిద్ధాంతాలు, వారి ప్రవర్తకులు ఎవరో యీ క్రింద చెపుతున్నారు.

మూలమ్

69. అర్థో జ్ఞానాన్వితో వైభాషికేణ బహుమన్యతే,
సౌత్రాన్తికేన ప్రత్యక్షగ్రాహ్యోర్థ న బహిర్మతః.

మనస్విని

"వైభాషికుడు జ్ఞానంతో కూడిన పదార్థాన్ని అంగీకరిస్తాడు. సౌత్రాంతికుడు ప్రత్యక్ష ప్రమాణం చేత గ్రహించబడే పదార్థం బయట ఉండదు అనీ, అది అనుమేయమే అని అంటాడు."

మూలమ్

70. "ఆకారసహితా బుద్ధిర్యోగాచారస్య సంమతా,
కేవలాం సంవిదం స్వస్థాం మన్యన్తే మధ్యమాః పునః."

మనస్విని

"యోగాచార మతానుసారం పదార్థాకారంతో కూడిన బుద్ధియే పదార్థంగా

Public Domain. Digitization Muthulakshmi Research Academy

భాసిస్తుంది. ఇక "మధ్యము"లైతే కేవల జ్ఞానమే స్వస్వరూపంతో ఉంటుంది అని అంగీకరిస్తారు."

అవ: ఈ విధంగా నాలుగు విధాలైన బౌద్ధుల భిన్న దృక్పథాలను చెప్పి అందరికీ అంగీకార్యమైనది ఏదో క్రింద వివరిస్తున్నాడు.

మూలమ్

71. "రాగాదిజ్ఞానసంతానవాసనోచ్ఛేదసంభవా,
చతుర్ణామపి బౌద్ధానాం ముక్తిరేషా ప్రకీర్తితా."

మనస్విని

"రాగాదుల జ్ఞానాల వాసనలు విచ్ఛేదం వలననే ముక్తి సంభవిస్తుంది" అనేది పై నాలుగు విధాల బౌద్ధులూ అంగీకరిస్తారు.

అవ: ఇక బౌద్ధ భిక్షువుల నియమాలు చెపుతున్నాడు.

మూలమ్

72. "కృత్తిః కమణ్డలుర్మౌణ్డ్యం చీరం పూర్వాహ్ణభోజనమ్,
సంఘో రక్తామ్బరత్వం చ శిశ్రియే బౌద్ధభిక్షుభిః." (వి.వా. 8265-275)

ఇతి శ్రీమత్సాయణమాధవీయే సర్వదర్శనసంగ్రహే బౌద్ధదర్శనమ్.

మనస్విని

"మృగచర్మము (ధరించడం), కమండలు (ధారణం), ముండిత శిరస్సు (బోడిగుండు), జీర్ణవస్త్రం, పూర్వాహ్ణం (మధ్యాహ్నానికి ముందు) భోజనం చేయటం, సంఘం, కాషాయవస్త్రం - ఇవీ బౌద్ధ భిక్షువులు ఆశ్రయించినవి (ఆచరించాల్సినవి).

వి: చర్మధారణం, సంఘాన్ని ఆశ్రయించటం, ఒకే పూట భోంచేయటం - ఇత్యాదులు బౌద్ధ భిక్షువులకు ఏర్పరచబడిన నియమాలు.

"ఇది సాయణమాధవ విరచితమైన సర్వదర్శన సంగ్రహంలోని బౌద్ధదర్శనం."

వి: "ఇది బౌద్ధదర్శన సారమే గాని, సమగ్ర బౌద్ధదర్శనం కాదు. విద్యారణ్యుల వారు ఒక అవగాహనకై అందించిన దర్శనసారం."

In Public domain. Digitization Muthulakshmi Research Academy

3. అథ ఆర్హతదర్శనమ్

జైన దర్శనము

అవ: బౌద్ధమతం యొక్క వైశిష్ట్యం క్షణికవాదం. అయితే లోక వ్యవహారంలో 'క్షణికవాదం' అర్థం చేసికోవటం, అన్వయించటం రెండూ కష్టమే. ఈ 'క్షణికవాద' ఖండనతో 'ఆర్హతదర్శనం' ప్రారంభిస్తారు విద్యారణ్య మహర్షి. అత్యంతాసక్తికరంగా అందరు భిన్న భిన్నమతాచార్యులు ఒకేచోట ఉండి, వాదప్రతివాదాలు జరుపుతున్న దృశ్యాన్ని ముందు నిలుపుతారు ఈ వేదాంత మూర్ధన్యులు.

మూలమ్

73. తదిత్థం ముక్తకచ్ఛానాం మతమ్ అసహమానాః వివసనాః కథం చిత్ స్థాయిత్వమ్ ఆస్థాయ క్షణికత్వపక్షం ప్రతిక్షిపన్తి. యద్యాత్మా కశ్చిత్ నాస్థీయేత స్థాయీ తదా ఐహలౌకికపారలౌకికఫలసాధనసంపాదనం విఫలం భవేత్. న హ్యేతత్ సంభవతి అన్యః కరోతి అన్యో భుఙ్క్తే ఇతి. తస్మాత్ యోఽహం ప్రాక్ కర్మ అకరవం సోఽహం సంప్రతి తత్ఫలం భుఞ్జే ఇతి పుర్వాపరకాలానుయాయినః స్థాయినః తస్య స్పష్టప్రమాణావసితతయా పూర్వాపరభాగవికలకలావస్థితిలక్షణ క్షణికతా పరీక్షకైరర్హద్భిః న పరిగ్రహార్హా.

మనస్విని

ఈ విధంగా ముక్తకచ్ఛుల (కచ్చా బిగించకుండా వస్త్రం ధరించేవాళ్ళు) మతాన్ని సహించని దిగంబరులు ఏదోవిధంగా పదార్థాల స్థాయిత్వాన్ని అంగీకరించి క్షణికత్వ పక్షాన్ని నిరాకరిస్తున్నారు. ఒకవేళ స్థిరమైన ఆత్మ అనేది ఒకటుంది అని అంగీకరించనట్లయితే అప్పుడు ఐహలౌకిక, పారలౌకిక ఫలాల కోసం సాధనాలు సంపాదించటం విఫలమౌతుంది. 'ఒకరు చేస్తారు, మరొకరు దాని ఫలాన్ని అనుభవిస్తారు' అనేది సంభవం కాదు. అందుచేత "పూర్వం నేను ఏ కర్మ చేసానో, ఇప్పుడు అదే నేను దాని ఫలం అనుభవిస్తున్నాను" అని అనుకోవడంలో పూర్వ, అపర కాలాలకు సంబంధించిన స్థాయి ఐన ఆత్మ ఒకటి ఉంది అని స్పష్టంగా ప్రమాణాలచేత నిశ్చయింపబడుతున్నది. అందుచేత పూర్వాపరభాగాలు లేని అతిసూక్ష్మ కాలలేశమైన క్షణంలో ఉండడం అనే 'క్షణికత్వ' వాదం చక్కగా పరీక్షించే అర్హతుల చేత (జైన పండితులచేత) స్వీకరించడానికి తగినది కాదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి: జైనులు కూడా నాస్తికులే ఐనప్పటికీ వారు బౌద్ధుల క్షణికవాదాన్ని అంగీకరించకపోవడమే గాక ఆ వాదంలో ఉన్న లోటుపాట్లను ఎత్తిచూపుతున్నారు.

మూలమ్

74. అథ మన్యేథాః -

"ప్రమాణవత్త్వాదాయాతః ప్రవాహః కేన వార్యతే"

ఇతి న్యాయేన; **"యత్సత్ తత్ క్షణికమ్"** ఇతి ప్రమాణేన క్షణికతాయాః ప్రమితతయా తదనుసారేణ సమానసంతానవర్తినామేవ ప్రాచీనః ప్రత్యయః కర్మకర్తా; తదుత్తరః ప్రత్యయః ఫలభోక్తా. న చాతిప్రసఙ్గః, కార్యకారణభావస్య నియామకత్వాత్ యథా మధురసభావితానామ్ ఆమ్రబీజానాం పరికర్షితాయాం భూమౌ ఉప్తానామ్ అఙ్కురకాణ్డస్కన్ధ శాఖాపల్లవాదిషు, తద్వారా పరంపరయా ఫలే మాధుర్యనియమః, యథా వా లాక్షారసావసిక్తానాం కార్పాసబీజాదీనామ్ అఙ్కురాదిపారమ్పర్యేణ కార్పాసాదౌ రక్తిమనియమః యథోక్తమ్ -

"యస్మిన్నేవ హి సంతానే ఆహితా కర్మవాసనా,
ఫలం తత్రైవ బధ్నాతి కార్పాసే రక్తతా యథా,
కుసుమే బీజపూరాదేః యల్లాక్షాద్యవసిచ్యతే,
శక్తిరాధీయతే తత్ర కాచిత్తాం కిం న పశ్యసి" ఇతి.

మనస్విని

ఒకవేళ ఇలా భావిస్తారా? (భావించినట్లయితే)

"ప్రమాణం ఉండటం వలన, ఆ ప్రమాణాన్ని బట్టి వస్తూన్న ప్రవాహాన్ని (సిద్ధాంతాన్ని) ఎవరు ఆపగలరు?" అని లోకోక్తి. 'యత్ సత్ తత్ క్షణికమ్' అనే ప్రమాణం ద్వారా క్షణికత్వం నిశ్చయించబడింది. దీన్ననుసరించి సంతానంలో (ఆలయ విజ్ఞాన క్షణాల ప్రవాహంలో) పూర్వ విజ్ఞాన క్షణం కర్మ చేస్తుంది, ఉత్తర విజ్ఞాన క్షణం ఫలాన్ని అనుభవిస్తుంది. ఈ విషయంలో అతి ప్రసంగం ('ఒకరు కర్మచేస్తే మరొకరు ఫలం అనుభవించటం' అని చెప్పటం) లేదు. ఎందుచేతనంటే ఈ ప్రక్రియలో కార్యకారణ భావమే నియామకం అని అంటాం.

ఉదాహరణకు - 'మామిడి విత్తనాలను మాధుర్యం పుట్టించే పదార్థాలలో ఉంచి నాటడం వలన అది మొలకెత్తే క్రమంలో ఒకదాని తరువాత ఒకటిగా వచ్చే అంకురము, కాండము, మ్రాను, కొమ్మలు, చిగుళ్ళు మొదలైన వాటిలో సంక్రమిస్తూ

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వచ్చిన మాధుర్యం చివరికి దాని ఫలంలో మాత్రమే కనబడుతున్నది. అదేవిధంగా లత్తుక రసం (ఎర్రని రంగు)లో తడిపిన పత్తిగింజలు నాటినపుడు, అవి మొలకెత్తే క్రమంలో అంకురాదుల నుండి చివరి వరకూ సంక్రమిస్తూ చివరికి ప్రత్తి రూపంలోనే ఆ ఎరుపు రంగు కనబడుతుంది. ఆ రంగువేయని వాటిలో ఆ ఎరుపు కనిపించదు.'

ఈ విషయమే క్రింది కారికలలో చెప్పబడింది.

"ఏ సంతానంలో (ఆలయ విజ్ఞాన ప్రవాహంలో) కర్మవాసన ఉంచబడుతుందో ఆ సంతానంలోనే అది ఫలాన్ని ఇస్తుంది. దూదిలో ఎరుపులాగా."

"దానిమ్మ మొదలైన మొక్కల పువ్వులో లాక్షారసం (లత్తుక) మొదలైనవి చల్లినప్పుడు దానిలో ఒకవిధమైన శక్తి ఉంచబడుతుంది కదా! దానిని నీవు చూడటం లేదా?"

వి: ఇంతకీ దీని భావం ఏమిటంటే – 'పదార్థాలు క్షణికమే, కాని ఒకానొక వాసన, సంస్కారం నిరంతర ప్రవాహంగా ఉంటుంది. ఈ క్షణాలు, పదార్థాలు అన్నీ ఆ ప్రవాహంలో ఉంటాయి.' ఒకే సంతతిలో ఉండటంచేత 'ఒకటి కర్మ చేస్తే, మరొకటి ఫలం అనుభవిస్తుంది' అనే మాటకు తావులేదు. ఇదీ బౌద్ధుల వాదం.

'లాక్షా రసం' అంటే లత్తుక రసం. దీనినే హిందీలో 'అల్‌తా' అంటారు. దీన్ని పాదాలకు అలంకరణకు వాడుతారు.

అవ: ఈవిధంగా బౌద్ధవాదాన్ని ఉట్టంకించి క్రింద దానినే నిరాకరిస్తున్నాడు.

మూలమ్

75. తదపి కాశకుశావలమ్బనకల్పమ్, వికల్పాసహత్వాత్. జలధరాదౌ దృష్టాన్తే క్షణికత్వమనేన ప్రమాణేన ప్రమితం ప్రమాణాన్తరేణ వా? నాద్యః, భవదభిమతస్య క్షణికత్వస్య క్వచిదపి అదృష్టచరత్వేన దృష్టాన్తాసిద్ధౌ అస్య అనుమానస్య అనుత్థానాత్. న ద్వితీయః; తేనైవ న్యాయేన క్షణికత్వసిద్ధౌ సత్త్వానుమానవైఫల్యాపత్తేః. అర్థక్రియాకారిత్వం సత్త్వమ్ ఇత్యఙ్గీకారే మిథ్యాసర్పదంశాదేరపి అర్థకారిత్వేన సత్త్వాపాతాచ్చ. అత ఏవోక్తమ్ – **"ఉత్పాదవ్యయధ్రౌవ్యయుక్తం సత్"** ఇతి.

మనస్విని

అని మీరనుకుంటున్నట్లయితే ('అథ మన్యేథాః') అది కూడా 'రెల్లు గడ్డిపరకను ఆలంబనగా తీసుకోవడమే.' ఎందుచేతనంటే ఇది వికల్పాలను సహించజాలదు. నీవు దృష్టాంతంగా చూపిన మేఘాదులలోని క్షణికత్వం 'ఈ అనుమాన ప్రమాణంచేతనే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

నిశ్చయించబడిందా? లేక మరొక ప్రత్యక్షాది ప్రమాణం ద్వారా నిశ్చయించబడిందా?' (ఇలా ప్రశ్నకు తావు ఉండడం వికల్పం. అయితే ఏదో ఒకదానికి సమాధానం ఉండాలి. లేకపోతే వికల్పానికే తావుండదు). మొదటి పక్షం కుదరదు. ఎందుచేతనంటే మీరు అంగీకరించిన క్షణికత్వం ఎక్కడా కనబడదు. అందుచేత దృష్టాంతం (ఉదాహరణం) సిద్ధించదు కాబట్టి అనుమాన ప్రమాణానికి అవకాశం లేదు.

ఇక రెండవ పక్షం విషయానికొస్తే – 'ప్రత్యక్షాది ప్రమాణంచేత క్షణికత్వం నిశ్చయించబడింది' అన్నట్లయితే అది కూడా కుదరదు. ఎందుచేతనంటే ఈ ప్రత్యక్షాది ప్రమాణమే ఘటాది పదార్థాలన్నింటికీ వర్తిస్తుంది. అప్పుడు 'యత్ సత్ తత్ క్షణికమ్' అనే క్షణికత్వం అనుమానం వ్యర్థం అవుతుంది. 'అర్థక్రియాకారిత్వం సత్త్వం' అని చెప్పటం కూడా కుదరదు. సర్పభ్రాంతిలో అది కరచిందను భావమే మరణానికి దారితీస్తుంది. అంతమాత్రంచేత లేని సర్పం ఉందని చెప్పటం కుదరదు కదా! అందుచేతనే – "ఉత్పాద వ్యయ ధ్రౌవ్యయుక్తమైనది సత్" (పుట్టుక, నాశము – ఈ రెంటి మధ్య కొంతకాలం స్థిరంగా ఉండడమన్నది) సత్ యొక్క లక్షణంగా చెప్పబడింది.

వి: బౌద్ధుల క్షణికవాదంలోని 'క్షణం' అతిసూక్ష్మమైనది. సెకండ్‌లో వందో వంతు కూడా ఉండదు. "అందుచేత ఒక పదార్థాన్ని తీసుకుని దీనిలాగా ఉంటుంది అని చెప్పడానికి ఏదీ క్షణం కంటే ఎక్కువ ఉండదు. మనం 'ఇది' అనే లోపే అది మారిపోతుంది. అలాంటప్పుడు ఇక దృష్టాంతం ఏది? అనుమాన ప్రమాణం ఎలా కుదురుతుంది" అని మొదటి పక్షాన్ని నిరాకరించి, ప్రత్యక్షాది కూడా కుదరదని వివరించాడు.

ఇది అందరికీ అనుభవంలో ఉన్నదే. "చెప్పే నేను ద్వితీయ క్షణంలో నేను కాను, వినే నువ్వు నువ్వు కాదు' అంటే లోక వ్యవహారం కుదరదు. అత్యంత వైరాగ్యంలో అలా అనుకోవచ్చేమో కాని సామాన్యుల కర్థమయ్యే సిద్ధాంతం కాదు కదా!

అవ: బౌద్ధులే చెప్పిన "సామర్థ్య, అసామర్థ్య" ధర్మాల వలన క్షణికత్వం సిద్ధిస్తుంది అనే దానికి కూడా అవకాశం లేదని నిరూపించబోతున్నాడు.

మూలమ్

76. అథోచ్యతే – సామర్థ్యాసామర్థ్య లక్షణవిరుద్ధధర్మాధ్యాసాత్ తత్సిద్ధిః ఇతి; తదసాధు. స్యాద్వాదినామ్ అనేకాన్తవాదస్య ఇష్టతయా విరోధాసిద్ధేః. యదుక్తం కార్పాసాది దృష్టాన్త ఇతి, తదుక్తిమాత్రమ్. యుక్తేః అయుక్తేః. తత్రాపి నిరన్వయనాశస్య అనఙ్గీకారాచ్చ.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

'సామర్థ్యము, అసామర్థ్యము అనే రెండు విరుద్ధ ధర్మాలను ఆరోపించడం వలన క్షణికత్వం సిద్ధిస్తుంది' అన్నట్లయితే అది యుక్తం కాదు. స్యాద్వాదులకు (జైనులకు) 'అనైకాంతవాదం' ఇష్టం కాబట్టి విరోధమే సిద్ధించదు. 'పత్తి' మొదలైనవి దృష్టాంతంగా చెప్పినా దానిని సమర్థించే యుక్తి ఏదీ చెప్పలేదు. అక్కడ కూడా 'నిరన్వయ నాశం' అనేది మీకు అంగీకార్యం కాదు.

వి: బౌద్ధవాదంలో ఈ సామర్థ్య అసామర్థ్యాల చర్చ చాలా జరిగింది. అది అంతా ఇక్కడ మళ్ళీ ప్రస్తావించడం చదువరులకు శిరోభారం. సిద్ధాంత, రాద్ధాంతాల వరకే పరిమితమైతే సరిపోతుంది. "ఒక దానిలో సామర్థ్యమైనా ఉండాలి లేదా అసామర్థ్యమైనా ఉండాలి. అంతేకాని రెండు విరుద్ధ ధర్మాలు ఒకేచోట ఉండవు" అని క్షణికత్వవాదుల అభిమతం. జైనులు స్యాద్వాదులు. ఇది ముందు ముందు వివరించబడుతుంది. 'ఉండవచ్చు, ఉండకపోనూవచ్చు, కావచ్చు, కాకపోవచ్చు' ఇలా అనడం 'స్యాద్వాదం'. జైనులు ఈ సిద్ధాంతాన్నే అవలంబిస్తారు. అందువలన వారికి రెండు విరుద్ధ ధర్మాలు ఒకేచోట ఉండటం అభ్యంతరం కాదు. అనుమాన ప్రమాణానికి దృష్టాంతం చూపినపుడు దానికి తగిన 'యుక్తి' కూడా చూపాలి. 'పర్వతంపై పొగ కనపడుతుంది కాబట్టి అక్కడ అగ్ని ఉండి ఉంటుంది' అనే అనుమాన ప్రమాణానికి దృష్టాంతం వంటిల్లు (పాతకాలంలో).

"నిప్పులేందే పొగరాదు కదా!' చెరువులో పొగ కనబడటం లేదు కాబట్టి నిప్పులేదు. ఇలా పలురకాల యుక్తులు చూపితేనే ప్రమాణం సిద్ధిస్తుంధి. అంతేకాని మాట మాత్రంచేత దానికి ప్రామాణ్యం ఉండదు.

ఇలాంటి వాద, ప్రతివాదాల పరిజ్ఞానం ఉంటేనే న్యాయవాద వృత్తిలో శోభిస్తారు. అందుచేత ఈ వాదాలు నిరర్థకం అని ఎప్పుడూ అనుకోరాదు.

ఇక 'నిరన్వయనాశం' అంటే ఏ వస్తువైనా నశిస్తే అది పూర్తిగా నశించినట్లే అని అర్థం. ఇది బౌద్ధవాదం. ఏది నశించినా అది దాని మరో రూపంలో ఉంటుంది. ఘటం బ్రద్దలైతే పెంకులుగా మిగులుతాయి. కర్రలు కాలితే బూడిదగా మిగులుతాయి. నీరు ఆవిరై మళ్ళీ జలాశయాలను చేరుతుంది. ఇదీ జైనుల సిద్ధాంతం.

అవ: ఇక సంతానం, సంతానం అంటూ పదేపదే బౌద్ధుడు చెపుతున్న విషయాన్ని ప్రస్తావించి, అందులోని అనుపపత్తిని చూపుతున్నాడు.

'సంతానం' అనగా 'కంటిన్యుటీ' – ఒక 'ధారావాహికం'. పూలదండలోని దారం వంటిది. పూలన్నీ క్షణిక పదార్థాలైతే వాటిలో కార్యకారణ భావాన్ని పట్టి నిలిపేది యీ సంతానం అని బౌద్ధుల వాదం. అది కుదరదు అని చూపుతున్నాడు.

మూలమ్

77. న చ సంతానివ్యతిరేకేణ సంతానః ప్రమాణపదవీమ్ ఉపారోఢుమర్హతి. తదుక్తమ్–

"సజాతీయాః క్రమోత్పన్నాః ప్రత్యాసన్నాః పరస్పరమ్,
వ్యక్తయస్తాసు సంతానః స చైక ఇతి గీయతే". ఇతి

మనస్విని

(సంతానంలో ఉన్నది సంతాని. అనగా సంతానం, సంతాని సాగర-తరంగాల్లాంటివి. పరస్పరం భిన్నం కావు.) అందుచేత సంతానం కంటే భిన్నంగా సంతాని ప్రమాణ మార్గాన్ని అధిష్ఠింపజాలదు. సంతానం కంటె సంతాని వేరు అని ఏ ప్రమాణంచేతా నిరూపించడం శక్యంకాదు.

"ఒకే జాతికి చెందిన, క్రమంగా పుట్టిన, పరస్పరం దగ్గరగా ఉన్న విభిన్న పదార్థాలే (సమూహమే) సంతానం. అది ఒక్కటే."

వి: అలాంటప్పుడు 'ఒకటి కర్త', మరొకటి 'ఫలభోక్త' అవడం ఎలా కుదురుతుంది? ఈవిధంగా ఒక క్షణం 'కర్త', మరొక క్షణం 'కర్మ' అనటం కుదరదు.

అవ: ఇక 'కార్యకారణభావ నియమాన్ని' గూర్చి బౌద్ధులు చెప్పిన దాన్ని నిరాకరిస్తున్నాడు.

మూలమ్

78. న చ కార్యకారణభావనియమః అతిప్రసగ్గజం భఙ్క్తుమ్ (భంక్తుం) అర్హతి. తథా హి ఉపాధ్యాయబుద్ధ్యనుభూతస్య శిష్యబుద్ధిః స్మరేత్, తదుపచితకర్మఫలమ్ అనుభవేద్వా తథా చ కృతప్రణాశాకృతాభ్యాగమప్రసంగః. తదుక్తం సిద్ధసేనవాక్యకారేణ –

"కృతప్రణాశాకృతకర్మభోగభవప్రమోక్షస్మృతిభఙ్గదోషాన్,
ఉపేక్ష్య సాక్షాత్ క్షణభఙ్గమిచ్ఛన్ అహో మహాసాహసికః పరోఽసౌ."

(వీ.స్తు. 18) ఇతి.

మనస్విని

కార్యకారణభావ నియమం కూడా 'అతి ప్రసంగాన్ని' భంగం చేయలేదు. (కొట్టిపారవేయలేదు. అతి ప్రసంగమే అవుతుంది). ఆ నియమం చెప్పినట్లయితే

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉపాధ్యాయ బుద్ధిచేత అనుభవించబడిన (అతనికి కలిగిన జ్ఞానము కారణము) దానిని, శిష్యుని బుద్ధి స్మరించాల్సి వస్తుంది (కార్యం కాబట్టి). అప్పుడు కృత ప్రణాశము (చేసింది నశించటం), అకృత అభ్యాగమం (చేయనిది వచ్చి చేరటం) అను దోషాలు ప్రసక్తమవుతాయి. ఈ విషయాన్నే సిద్ధసేన వాక్యకారుడు ఇలా చెప్పాడు.

"కృతప్రణాశము, అకృతకర్మ భోగము, సంసార భంగము, మోక్ష భంగము, స్మృతి భంగము అనే దోషాలు ప్రత్యక్షంగా కనబడుతూంటే, వాటిని ఉపేక్షించి, క్షణభంగవాదాన్ని కోరుతున్న ఈ బౌద్ధుడు అబ్బో! ఎంత సాహసికుడు? ఆశ్చర్యకరంగా ఉంది."

వి: క్షణికవాదం ప్రకారం ఒక ఆచార్యునిలో విజ్ఞానం ఉందంటే దాన్ని విజ్ఞాన క్షణాలు అంటారు. ఈ క్షణాలు శిష్య బుద్ధిలో విజ్ఞాన క్షణాలకు కారణాలు. అయితే అన్నీ క్షణికాలే అవటం వలన గురువులోని కారణ క్షణం, శిష్యునిలోని కార్య క్షణానికి కారణం అవుతుంది. అంటే ఉపాధ్యాయ బుద్ధి కర్మను, శిష్య బుద్ధి అనుభవిస్తుంది (ఇది చర్చించడానికే అయోమయంగా ఉంటుంది ముఖ్యంగా శాస్త్రంలో ప్రవేశంలేని వారికి). అందుచేత కర్మ చేసిన వానికి ఫలం లేకపోవటం (కృతప్రణాశం), ఏమీ చేయని వానికి ఫలం చేకూరటం (అకృత అభ్యాగమం) అనేది ఏర్పడుతుంది. ఈ వాదం దోషభూయిష్టం. అలాగే స్థిరమైన ఆత్మ లేకపోతే కర్మానుసారం సంసారం ఏర్పడడం ఉండదు, మోక్షమూ ఉండదు. స్మృతీ ఉండదు. ముక్క ముక్కలుగా ఉండే క్షణికవాదంలో ఏవీ పొసగవు అని జైన సిద్ధాంతి.

అవ: ఈ విషయాన్నే ఇంకా వివరిస్తున్నాడు.

మూలమ్

79. కించ క్షణికత్వపక్షే జ్ఞానకాలే జ్ఞేయస్య అసత్త్వేన జ్ఞేయకాలే జ్ఞానస్య అసత్త్వేన చ గ్రాహ్యగ్రాహకభావానుపపత్తౌ సకలలోకయాత్రా అస్తమియాత్. న చ సమసమయవర్తితా శఙ్కనీయా. సవ్యేతరవిషాణవత్ కార్యకారణభావాసంభవేన అగ్రాహ్యస్య ఆలమ్బనప్రత్యయత్వాపత్తేః. అథ భిన్నకాలస్యాపి తస్య ఆకారార్పకత్వేన గ్రాహ్యత్వమ్ - తదప్యపేశలమ్. క్షణికస్య జ్ఞానస్య ఆకారార్పకతాశ్రయతాయాః దుర్వచత్వేన సాకారజ్ఞానవాదప్రత్యాదేశాత్.

మనస్విని

మరొక విషయం - క్షణికత్వ పక్షంలో జ్ఞానం, జ్ఞేయలకు సంబంధం ఉండదు.

Public domain. Digitization Muthulakshmi Research Academy

ఒక పదార్థ జ్ఞానం కలిగిన క్షణంలో ఆ పదార్థం ఉండదు. పదార్థం ఉన్న క్షణంలో జ్ఞానం ఉండదు. ఈ విధంగా గ్రాహ్య గ్రాహక భావం కుదరకపోవటంతో సకల లోకవ్యవహారం అస్తమించిపోతుంది. పోనీ రెండూ ఒకే సమయంలో (క్షణంలో) ఉన్నాయని అందామా అంటే అదీ కుదరదు. రెండు కొమ్ములు ఒకే సమయంలో ఉత్పన్నమైతే వాటిమధ్య కార్యకారణ భావం ఎట్లు పొసగదో అట్లే, వేరు వేరు కాలాల్లో ఉన్నా జ్ఞానం ఆకారాన్ని అర్పిస్తుంది అంటే కూడా అదీ అంతగా యుక్తంకాదు. ఆ జ్ఞానం క్షణికమే అయినప్పుడు దానికి ఆకారాన్ని గ్రహించడం, సమర్పించడం ఎలా సంభవమౌతుంది. అందుచేత 'సాకార జ్ఞానం' అనే మాట కూడా కుదరదు.

అవ: ఇక నిరాకార జ్ఞాన విషయం కూడా వివరించి, ఖండిస్తున్నాడు.

మూలమ్

80. నిరాకారజ్ఞానవాదేఽపి యోగ్యతావశేన ప్రతికర్మవ్యవస్థాయాః స్థితత్వాత్. తథాహి -ప్రత్యక్షేణ విషయాకారరహితమేవ జ్ఞానం ప్రతిపురుషమ్ అహమహమికయా ఘటాదిగ్రాహకమ్ అనుభూయతే, న తు దర్పణాదివత్ ప్రతిబిమ్బాక్రాన్తమ్. విషయాకారధారిత్వే చ జ్ఞానస్య అర్థే దూరనికటాదివ్యవహారాయ జలాఞ్జలిః దీయేత. న చేదమిష్టాపాదనమేష్టవ్యమ్. దవీయాన్ మహీధరః, నేదీయాన్ దీర్ఘో బాహురితి వ్యవహారస్య నిరాబాధం జాగరూకత్వాత్. న చాకారాధాయకస్య తస్య దవీయస్త్వాది శాలితయా తథా వ్యవహార ఇతి కథనీయమ్. దర్పణాదౌ తథానుపలమ్భాత్.

మనస్విని

నిరాకార జ్ఞానవాదంలో (జ్ఞానంలో ఆకారం భాసించదు అన్నట్లయితే కూడా) ఆయా పదార్థాలను బట్టియే (ప్రతి కర్మ వ్యవస్థ) పదార్థ (విషయ) గ్రహణం జరుగుతుంది. ఒక వ్యక్తి ఘటాన్ని ప్రత్యక్షంగా గ్రహించినపుడు ఆ జ్ఞానం విషయాకారం లేకుండానే "నేనంటే నేనంటూ" అనుభవించబడుతుంది. అంతేకాని అద్దంలోని ప్రతిబింబంలా ఆక్రమించబడటంలేదు. జ్ఞానం విషయాకారాన్ని ధరిస్తే 'ఈ పదార్థం దూరంగా ఉంది, ఇది దగ్గరగా ఉంది' అనే వ్యవహారానికి నీళ్ళు వదలాల్సి వస్తుంది. 'ఇది మాకు సమ్మతమే' అనడానికి వీలులేదు. ఎందుచేతనంటే 'పర్వతం దూరంగా ఉంది, బాహువు దగ్గరగా పొడవుగా ఉంది' అనే జ్ఞానం లోక వ్యవహారంలో కనపడుతూనే ఉంది కదా? అనే ప్రశ్నకు సమాధానం – "ఆకారాన్ని జ్ఞానంలో ఉంచే పదార్థం దూరంగాను, దగ్గరగాను ఉండడాన్ని బట్టి అలా వ్యవహారం ఏర్పడుతున్నది" అంటే కుదరదు. అద్దంలో

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ప్రతిబింబాలు అలా కనబడటం లేదు. అన్నీ దగ్గరగా ఉన్నట్లే కన్పిస్తాయి.

వి: జ్ఞానం పదార్థం యొక్క ఆకారాన్ని గ్రహిస్తుంది అంటే అది ఒక తీరు. జ్ఞానంలో ఆకారం గ్రహించబడటం లేదు అంటే అలాంటప్పుడు జ్ఞానం ప్రత్యక్షంగా ఘటాదులను చూచినప్పుడు (విషయాకారం లేకపోవటం చేత) 'నేను ముందు, నేను ముందు' అంటూ (విషయ గ్రహణానికి) పోటీపడుతుంది. అద్దంలో ఆకారం సమర్పించబడదు. కానీ ప్రతిబింబం కనబడుతుంది. నిరాకార జ్ఞానం అద్దమూ కాదు, ఆకార సమర్పకమూ కాదు అని చెప్పటం. ఇక జ్ఞానంలోనే పదార్థం ఉంటే (లోపలే ఉంటుంది కాబట్టి) 'ఇది దగ్గర', 'అది దూరం' అనే వ్యవహారం కుదరదు.

అవ: ఈ ఆకార గ్రహణాన్నే మరొక వాదంతో ఖండిస్తున్నాడు.

మూలమ్

81. కిం చ అర్థాదుపజన్యమానం జ్ఞానం యథా తస్య నీలాకారతామనుకరోతి తథా యది జడతామపి తర్హి అర్థవత్ తదపి జడం స్యాత్. తథా చ **వృద్ధిమిష్టవతో మూలమపి తే నష్టం స్యాదితి** మహత్ కష్టమాపన్నమ్. అథ ఏతద్దోషపరిజిహీర్షయా జ్ఞానం జడతాం నానుకరోతీతి బ్రూషే, హన్త తర్హి తస్యాః గ్రహణం న స్యాదితి **ఏకమ్ అనుసంధిత్సతః అపరం ప్రచ్యవత** ఇతి న్యాయాపాతః.

మనస్విని

మరొక విషయం - పదార్థం వలన కలిగే జ్ఞానం ఏవిధంగా ఆయా పదార్థాల నీలాది ఆకారాన్ని అనుకరిస్తూందో అలాగే దానితో బాటుగా దానిలో ఉండే జడత్వాన్ని కూడా అనుకరిస్తే అప్పుడు జ్ఞానం కూడా 'జడం' అవుతుంది (మొదటికే మోసం). జ్ఞానస్వరూపానికే హాని కలుగుతుంది. 'వడ్డీ కోరుకుంటున్న నీకు మూలధనం కూడా లేకుండాపోతుంది'. సరే! ఈ దోష పరిహారానికై 'జ్ఞానం జడత్వాన్ని అనుకరించదు అంటావా?' అయ్యో! అలా అయితే 'ఆ జడత్వం తెలీదు, దాని గ్రహణం జరగదు'. అప్పుడు నీ వాదానికి "ఒకటి ముడి పెట్టబోతుంటే రెండవది ఊడిపోతుంది" అనే సామెత చక్కగా సరిపోతుంది.

అవ: చర్చను ఉపసంహరించబోతున్నాడు.

మూలమ్

82. నను మా భూత్ జడతాయా గ్రహణమ్; కిం నః ఛిన్నమ్? తదగ్రహణేఽపి తయోః భేదః అనేకాన్తో వా భవేత్. నీలాకారగ్రహణే చ అగృహీతా జడతా కథం తస్య

In Public domain. Digitization Muthulakshmi Research Academy

స్వరూపం స్యాత్? అపరథా గృహీతస్య స్తమ్భస్య అగృహీతం త్రైలోక్యమపి రూపం భవేత్. తదేతత్ ప్రమేయజాతం ప్రభాచన్ద్రప్రభృతిభిః అర్హన్మతానుసారిభిః **ప్రమేయకమలమార్తాణ్డాదౌ** ప్రబన్ధే ప్రపఞ్చితమితి గ్రన్థభూయస్త్వభయాత్ నోపన్యస్తమ్.

మనస్విని

'జడత్వం గ్రహించబడకపోనీగాక, మాకేం నష్టం" అని బౌద్ధుడు అంటే జైనుని సమాధానం – 'ఆ గ్రహణం అనేది లేకపోతే అప్పుడు నీలాకారానికీ, దానిలోని జడత్వానికీ భేదం ఉందని చెప్పినట్లయింది, లేదా ఒక్కదానికి కట్టుబడకుండా (ఇదే వ్యభిచార దోషం) ఇదిలేకుండా అది ఉండవచ్చు, అదిలేకుండా ఇది ఉండవచ్చు' అనే పరిస్థితి ఏర్పడుతుంది. నీలాకారం మాత్రం గ్రహించి దానిలోని జడత్వాన్ని గ్రహించలేకపోతే అప్పుడు జడత్వం ఆ పదార్థం యొక్క స్వరూపం ఎలా అవుతుంది? ఈ ప్రమేయ (ప్రమాణం ద్వారా తెలియదగిన) సముదాయం అంతా జైనమతానుయాయులైన ప్రభాచంద్రుడు మొదలైన వారిచేత 'ప్రమేయకమలమార్తాండమ్' మొదలైన గ్రంథాలలో స్పష్టంగా చెప్పబడింది. అందుచేత, ఇంకా గ్రంథం పెద్దదవుతుంది అనే భయంచేత అదంతా ఇక్కడ చెప్పబడలేదు.

వి: ఒక పదార్థం ఉదాహరణకు 'ఘటం' ఉంది అనుకుందాం. ఆ పదార్థాన్ని గురించి తెలుసుకున్నప్పుడు (జ్ఞానంచేత గ్రహించబడినపుడు) అది చైతన్యవంతమా? జడమా? అనికూడా గ్రహించబడుతుంది. అలా గ్రహించబడకపోతే అది ఆ చేతనం లేదా జడం దాని స్వరూపం కాజాలదు కదా!

ఇంతవరకూ శూన్యత్వాది వాదనలన్నింటిని ఉదాహరించి, బౌద్ధులు చూపిన ఉపపత్తులలోని దోషాలను చూపించి, ఇంతకూ వారి సిద్ధాంతం పొసగదు అని వాదాన్ని ఉపసంహరించాడు.

అవ: ఇప్పుడు తమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించటానికై ఉపక్రమిస్తున్నాడు జైన సిద్ధాంతి. 'ఆర్హత దర్శనం' ఇప్పుడు ప్రారంభం అవుతుంది.

మూలమ్

83. తస్మాత్ పురుషార్థాభిలాషుకైః పురుషైః సౌగతీ గతిః నానుగన్తవ్యాః అపితు ఆర్హత్యేవ అర్హణీయా. అర్హత్స్వరూపం చ హేమచన్ద్రసూరిభిః **ఆప్తనిశ్చయాలఙ్కారే** నిరటఙ్కి.

"సర్వజ్ఞో జితరాగాదిదోషస్త్రైలోక్యపూజితః,

యథాస్థితార్థవాదీ చ దేవోఽర్హన్ పరమేశ్వరః" ఇతి.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

అందుచేత పరమపురుషార్థాన్ని సాధించగోరే పురుషులు (మానవులు) బౌద్ధులు చెప్పిన మార్గం (సౌగతీగతిః = సుగతానాం గతిః) అనుసరించరాదు. ఆర్హతుడు (జైనాచార్యుడు) చెప్పిన మార్గాన్నే అనుసరించాలి. ఆర్హతుని స్వరూపం ఎలా ఉంటుందో 'ఆప్తనిశ్చయాలంకారం' అనే గ్రంథంలో 'హేమచంద్రసూరి' పండితుడు స్పష్టంగా చెప్పాడు. అది ఎలాగంటే -

"రాగాది (రాగ, ద్వేష ఇత్యాది) దోషాలను జయించినవాడు, మూడు లోకాలలోను పూజింపబడేవాడు, ఉన్న విషయం ఉన్నట్లుగా చెప్పేవాడు, దీప్తిమంతుడు, పరమేశ్వరుడు (సర్వ సమర్థుడు) అయిన వాడు సర్వజ్ఞుడు."

వి: జైనుల ఆచరణ కొంచెం ప్రత్యేకంగా ఉంటుంది కాని, చెప్పే విషయాలు లోకవ్యవహారానికి దగ్గరగా ఉంటాయి. ఎలాంటి 'అయోమయానికి' తావుండదు. దేవుడు అనగా 'కాంతిమంతుడు' అని అర్థం. అందుచేతనే 'మహాత్ముల' చుట్టూ ఒక తేజోవలయం ఉంటుంది.

అవ: ఈ సర్వజ్ఞ స్వరూపం విషయంలో ముందుగా కొన్ని ఆశంకలు (ఇతర మతాల వారు లేవదీసే సందేహాలు) వివరించిన తరువాత జైన సిద్ధాంతాలని వివరిస్తాడు. ఈ సందర్భంలోని చర్చ 'శాస్త్ర పరిచయం' లేని ఛాత్రులకు కొంచెం కష్టంగా అనిపించినా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. దీనివల్ల ఇతర శాస్త్ర విషయాలూ కొంచెం పరిచయమౌతాయి. ఈ వాదోపవాదాలు మేధాశక్తిని పెంపొందింపజేస్తాయి.

మూలమ్

84. నను న కశ్చిత్ పురుషవిశేషః సర్వజ్ఞపదవేదనీయః ప్రమాణపద్ధతిమ్ అధ్యాస్తే. తత్సద్భావగ్రాహకస్య ప్రమాణపఞ్చకస్య తత్రానుపలమ్భాత్, తథాచోక్తం తౌతాతికైః

సర్వజ్ఞో దృశ్యతే తావన్నేదానీమస్మదాదిభిః,
దృష్టో న చైకోదేశోఽస్తి లిఙ్గం వా యోఽనుమాపయేత్. 1
న చాగమవిధిః కశ్చిన్నిత్యసర్వజ్ఞబోధకః,
న చ తత్రార్థవాదానాం తాత్పర్యమపి కల్ప్యతే. 2
న చాన్యార్థప్రధానైస్తైస్తదస్తిత్వం విధీయతే
న చానువదితుం శక్యః పూర్వమన్యైరబోధితః. 3

In Public Domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

(ఆశంక) – "ఒకానొక విశేష పురుషుడు, సర్వజ్ఞ పదంచేత తెలియబడేవాడు (సర్వజ్ఞుడనేవాడు) ప్రమాణం ద్వారా తెలియటం లేదుకదా? అలాంటివాడు ఉన్నాడని చెప్పడానికి ఐదు ప్రమాణాలూ దొరకటం లేదు కదా? (ఐదూ నిరూపించ లేకపోతున్నాయి కదా). ఈ విషయాన్నే 'తౌతాతికులు' ఇలా అన్నారు –

1. సర్వజ్ఞుడనేవాడు ఇప్పుడు మాకు ఎవరూ కనిపించటం లేదు. (ప్రత్యక్ష ప్రమాణం లేదు)

2. పోనీ ఏదైనా ఒక భాగమైనా కనబడితే ఆ లింగాన్ని (గుర్తును) బట్టి అనుమాన ప్రమాణం పొసగుతుంది. అదీ లేదు.

3. ఏదైనా ఆగమశాస్త్రంలో చెప్పబడిందా అంటే అలాంటిది ఏదీ లేదు (శబ్ద ప్రమాణం).

4. అర్థవాదాల తాత్పర్యమూ లేదు. కాబట్టి అదీ కుదరదు.

5. ప్రధానంగా ఇతర విషయాలను బోధించే అర్థవాద వాక్యాలలో కూడా సర్వజ్ఞుడున్నాడని ఎక్కడా చెప్పబడలేదు. ఇంతకుముందు చెప్పని దానిని అనువదించటానికి (మళ్ళీ చెప్పటానికి) వీలులేదు.

వి: అనుమాన ప్రమాణానికి ఏదో హేతువు ఉండితీరాలి. ఉదాహరణకు 'అగ్ని ఉందని అనుమానానికి హేతువు ధూమం.' అలా సర్వజ్ఞుడు ఉన్నాడనటానికి ఏదీ కనబడటం లేదు.

ఇక తెలియనిదాన్ని చెప్పేదాన్ని 'విధి' అంటారు. శాస్త్రాలలో ప్రతిపాదించే 'విధి వాక్యాలుంటాయి'. సర్వజ్ఞుణ్ణి విధించే (చెప్పే) వాక్యాలూ లేవు.

విధి వాక్యంలో చెప్పిన వాటి సమర్థకాలు (సపోర్టింగ్) 'అర్థవాదలు' అంటారు. ఈ సర్వజ్ఞుని ఉనికిని సమర్థించే 'అర్థవాద'లూ లేవు.

ఈనాటి వ్రతాలలోని ఫలశ్రుతులన్నీ అర్థవాదలే.

'ఈ కర్మ ఆచరించాలి' అనేది 'విధి' వాక్యమైతే, 'ఇది ఆచరిస్తే ఈ ఫలితాన్ని పొందుతాడు' అని చెప్పటం 'అర్థవాద' అవుతుంది.

వేదాలలో విధివాక్యాలు ఉంటాయి, నిషేధ వాక్యాలు ఉంటాయి. వాటి వాటి ఫలితాలను వివరించే 'అర్థవాద' వాక్యాలూ ఉంటాయి. ఇవి ముఖ్యంగా 'మీమాంసా శాస్త్రం'లో వివరించబడతాయి.

అవ: ఈ శంకా ప్రవాహం ఇంకా కొనసాగుతూ ఉంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

85. "అనాదేరాగమస్యార్థో న చ సర్వజ్ఞ ఆదిమాన్,
కృత్రిమేణ త్వసత్యేన స కథం ప్రతిపాద్యతే". 4

మనస్విని

"ఆగమం యొక్క అర్థం అనాది. సర్వజ్ఞుడు 'సాది' 'ఆది' కలిగినవాడు. అసత్యమైన కృత్రిమమైన ఆగమం చేత అతడు ఎలా ప్రతిపాదించబడతాడు?

వి: 'అనాది' అంటే పుట్టుకలేనిది. 'ఆది' ఉంది అంటే అది క్రొత్తగా ఏర్పడినది. 'అనాది' ఆగమం ఒక కాలానికి చెందిన సర్వజ్ఞుణ్ణి కూర్చి చెప్పడం కుదరదు. అలా కాదు 'సాది' ఐన 'ఆగమం' చెపుతుందంటే దానికి ప్రామాణ్యం ఉండదు.

అవ: అలాకాదు సర్వజ్ఞుడే 'నేను సర్వజ్ఞుడను' అన్నట్లయితే అనే దానికి సమాధానం చెపుతున్నాడు.

మూలమ్

86. "అథ తద్వచనేనైన సర్వజ్ఞోఽజ్ఞైః ప్రతీయతే,
ప్రకల్ప్యేత కథం సిద్ధిరన్యోన్యాశ్రయదోషతః" 5

మనస్విని

"సర్వజ్ఞుని మాటల ద్వారాలే అజ్ఞులైన (అజ్ఞానులైన) లోకులకు అతడు సర్వజ్ఞుడని తెలిసింది" అన్నట్లయితే అప్పుడు అన్యోన్యాశ్రయ దోషం వచ్చి పడుతుంది. అలాంటప్పుడు 'అతడు సర్వజ్ఞుడు' అనేది ఎలా సిద్ధిస్తుంది.

మూలమ్

87. "సర్వజ్ఞోక్తతయా వాక్యం సత్యం, తేన తదస్తితా,
కథం తదుభయం సిధ్యేత్ సిద్ధమూలాన్తరాదృతే" 6

మనస్విని

"సర్వజ్ఞుడు చెప్పటం చేత ఆ వాక్యం ప్రమాణం, అదే వాక్య ప్రమాణం ద్వారా సర్వజ్ఞుడతడు" – అని అన్నట్లయితే మరొక మూలం, అందరికీ ఆమోదయోగ్యమైనది ఏదీ లేకుండా ఈ సర్వజ్ఞత్వం ఎలా సిద్ధిస్తుంది.

వి: "సర్వజ్ఞుడు చెప్పాడు కాబట్టి అతని మాటలే ప్రమాణంగా అతడు ఉన్నాడు." ఇలా అన్నప్పుడు సర్వజ్ఞుడు ఉన్నాడు అనే దానికి అతని మాటలే ప్రమాణం. ఆ మాటలు 'ప్రమాణం' అవడానికి సర్వజ్ఞుడే ఆధారం. ఇలా పరస్పరం ఆధారపడినది

In Public domain. Digitization Muthulakshmi Research Academy

'అన్యోన్యాశ్రయం'. ప్రమాణం విషయంలో ఇది దోషం.

ఒక సామెత ఉంది "పెళ్ళయితే పిచ్చి కుదురుతుంది, పిచ్చి కుదిరితే పెళ్ళవుతుంది" అని. అలాంటిదే పైన చెప్పబడిన 'అన్యోన్యాశ్రయదోషం.'

అవ: ఈ సర్వజ్ఞత్వ విషయాన్నే తిరిగి ప్రశ్నిస్తున్నాడు.

మూలమ్

88. "అసర్వజ్ఞప్రణీతాత్తు వచనాన్మూలవర్జితాత్,
సర్వజ్ఞమవగచ్ఛన్తః స్వవాక్యాత్ కిం న జానతే". 7

మనస్విని

సర్వజ్ఞుడు కానివాడు రచించిన, ఏ మూలమూ (సోర్స్) లేనట్టి వాక్యాన్ని ప్రమాణంగా తీసుకొని, అతనిని సర్వజ్ఞునిగా గుర్తించిన వాళ్ళు తమ మాటలే ప్రమాణంగా మేం చెపుతున్నాం కదా! మా మాటే ప్రమాణం అతడు సర్వజ్ఞుడు అనడానికి' అని చెప్పవచ్చు కదా!

అవ: ఇంతదాకా ప్రత్యక్ష, అనుమాన, ఆగమ – ఇత్యాది ప్రమాణాల చేత సర్వజ్ఞత్వం స్థాపించడం కుదరదు అని నిరూపించి, ఇక ఉపమాన ప్రమాణం కూడా ఈ విషయంలో ఎలా పొసగదో చెపుతున్నాడు.

మూలమ్

89. "సర్వజ్ఞసదృశం కంచిద్యది పశ్యేమ సంప్రతి,
ఉపమానేన సర్వజ్ఞం జనీయామ తతో వయమ్." 8

మనస్విని

"ఈ కాలంలో సర్వజ్ఞుని వంటి వానిని చూడగలిగితే ఆ ఉపమానం సాహాయ్యంతో సర్వజ్ఞుణ్ణి గుర్తించే వాళ్ళం. అలాంటి ఉపమానం కనబడటం లేదు కాబట్టి 'సర్వజ్ఞుడు' అయినవాడు ఒకడున్నాడని చెప్పడానికి ఉపమాన ప్రమాణం కూడా లేదు."

అవ: ప్రత్యక్ష, అనుమాన, శబ్ద (ఆగమ), ఉపమాన అనే నాలుగు ప్రమాణాలే గాక మీమాంసకులు అంగీకరించిన 'అర్థాపత్తి', 'అనుపలబ్ధి' అనే ప్రమాణాలు కూడా ఉన్నాయి. వీటిలో 'అర్థాపత్తి'ని గూర్చి ప్రస్తావిస్తున్నాడు.

మూలమ్

90. **"ఉపదేశోఽపి బుద్ధస్య ధర్మాధర్మాదిగోచరః,**
అన్యథా నోపపద్యేత సార్వజ్ఞ్యం యది నాభవత్. 9

ఏవమర్థాపత్తిరపి ప్రమాణం నాత్ర యుజ్యతే,
ఉపదేశస్య సత్యత్వం యతో నాధ్యక్షమీక్ష్యతే". ఇత్యాది.

మనస్విని

"బుద్ధుడు గావించిన 'ధర్మాధర్మ' ఉపదేశం సర్వజ్ఞత్వం లేకపోతే సాధ్యంకాదు" అని అర్థాపత్తి (కనబడని దానికి అర్థాన్ని ఊహించి తెచ్చుకోవటం) ప్రమాణం కూడా ఇక్కడ కుదరదు." ఎందుచేతనంటే అతడు ఉపదేశించినదంతా సత్యమే అనడానికి మనకు ప్రత్యక్ష నిదర్శనం ఏదీ కనబడడం లేదు. (ఇంతవరకు తౌతాతికుల ఆశంకలు).

వి: 'అర్థాపత్తి'కి ప్రసిద్ధమైన ఉదాహరణం – 'పీనో దేవదత్తః దివా న భుంక్తే'. 'లావుగా ఉన్న దేవదత్తుడు పగలు భోంచేయడం లేదు.' ఈ వాక్యాన్ని బట్టి 'దేవదత్తుడు రాత్రి భోంచేస్తాడు' అనేది 'అర్థాపత్తి ప్రమాణం'.

ఈ వాదనకు జైనుడు సమాధానం చెపుతున్నాడు –

మూలమ్

91. అత్ర ప్రతివిధీయతే – యదభ్యధాయి తత్సద్భావగ్రాహకస్య ప్రమాణపఞ్చకస్య తత్రానుపలమ్భాత్ ఇతి; తదయుక్తమ్. తత్సద్భావావేదకస్య అనుమానాదేః సద్భావాత్. తథాహి – "కశ్చిదాత్మా సకలపదార్థసాక్షాత్కారీ, తద్గ్రహణస్వభావత్వే సతి ప్రక్షీణప్రతిబన్ధ-ప్రత్యయత్వాత్. యత్ యద్గ్రహణస్వభావత్వే సతి ప్రక్షీణ ప్రతిబన్ధప్రత్యయం తత్ తత్సాక్షాత్కారి, యథాపగతతిమిరాది ప్రతిబన్ధం లోచనవిజ్ఞానం రూపసాక్షాత్కారి. తద్గ్రహణస్వభావత్వే సతి ప్రక్షీణప్రతిబన్ధ ప్రత్యయశ్చ కశ్చిదాత్మా; తస్మాత్ సకల పదార్థసాక్షాత్కారీ" ఇతి.

మనస్విని

ఇంతదాకా ప్రకటించిన ఆశంకలకు సమాధానం చెప్పబడుతుంధి. "సర్వజ్ఞత్వం ఉందని ఐదు ప్రమాణాల ద్వారానూ నిరూపించబడకపోవడం చేత సర్వజ్ఞత్వం అనేదే లేదు అని ఏదైతే నీవంటున్నావో అది సరికాదు. ఈ సర్వజ్ఞత్వాన్ని నిరూపించడానికి అనుమానాది ప్రమాణాలు ఉన్నాయి. అది ఎలాగంటే – 'ఒకానొక ఆత్మ సకల పదార్థాల ప్రత్యక్ష జ్ఞానం కలిగినది, ఆ ప్రత్యక్ష గ్రహణ శక్తి కారణంగా దానికి అడ్డుతగిలే ప్రత్యయాలు (జ్ఞానాలు) నశించిపోతాయి.' దేనికైతే పదార్థ గ్రహణంతో బాటుగా ప్రతిబంధాలను ఎదుర్కొనే స్వభావం కలదో అది ఆ పదార్థాల సాక్షాత్కారి. ఎలాగంటే "తిమిరం (నేత్రరోగం) తొలగిన పిమ్మట ప్రతిబంధాలన్నీ క్షీణించిపోగా లోచన జ్ఞానం రూపాన్ని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

సాక్షాత్కరించుకొన్నట్లు."

ఒక ఆత్మ సకల పదార్థ గ్రహణ స్వభావం కలిగిఉంది, దానిలో ఉన్న ప్రతిబంధక ప్రత్యయాలన్నీ తొలగిపోయాయి. అప్పుడు ఆ ఆత్మ సకల పదార్థ సాక్షాత్కారం కలది (అవుతుంది). ఆ ఆత్మయే అర్హతుడు అని అనుమాన ప్రమాణం ద్వారా తెలుస్తుంది.

వి: 'అర్హతుడు ఉన్నాడనటానికి 'ప్రమాణం' ఏదీలేదు కదా' అనే ఆశంకకు పైవిధంగా సమాధానం ఇవ్వబడింది. ఈ విషయాన్నే ముందు ముందు ఇంకా స్పష్టంగా వివరించబోతున్నాడు.

మూలమ్

92. న తావదశేషార్థగ్రహణస్వభావత్వమ్ అసిద్ధమ్; చోదనాబలాత్. నిఖిలార్థ జ్ఞానోత్పత్త్యన్యథానుపపత్త్యా సర్వమనేకాన్తాత్మకం, సత్త్వాత్ ఇతి వ్యాప్తిజ్ఞానోపపత్తేశ్చ. చోదనా హి భూతం భవన్తం భవిష్యన్తం సూక్ష్మం వ్యవహితం విప్రకృష్టమ్ ఇత్యేవం-జాతీయకమ్ అర్థమ్ అవగమయతి ఇతి ఇత్యేవంజాతీయకైః అధ్వరమీమాంసా గురుభిః విధిప్రతిషేధవిచారణానిబన్ధనం సకలార్థవిషయవిజ్ఞానం ప్రతిపద్యమానైః సకలార్థగ్రహణ-స్వభావకత్వమ్ ఆత్మనః అభ్యుపగతమ్. న చాఖిలార్థ ప్రతిబన్ధకావరణ- ప్రక్షయానుపపత్తిః. సమ్యగ్దర్శనాదిత్రయలక్షణస్య ఆవరణప్రక్షయ హేతుభూతస్య సామగ్రీవిశేషస్య ప్రతీతత్వాత్. అనయా ముద్రయాపి క్షుద్రోపద్రవాః విద్రావ్యాః.

మనస్విని

'ఆత్మకు అశేష పదార్థ గ్రహణ స్వభావత్వమే అసిద్ధము' అనరాదు. చోదనాబలం వల్లా, సకల విషయ జ్ఞానం మరోవిధంగా కుదరకపోవటం వల్లా 'సర్వమ్ అనేకాన్తాత్మకమ్; సత్త్వాత్' అనే వ్యాప్తి జ్ఞానం ఉపపన్నం అవడం వల్లా అది తెలియవస్తుంది.

'చోదన' అనేది భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు సంబంధించిన దానినే గాక సూక్ష్మ విషయాలను, ఏదైనా అడ్డుగా కలిగిన వాటిని, దూరంగా ఉన్న వాటిని - ఇలా అన్నింటినీ గూర్చి తెలుపుతుంది" అని పూర్వ మీమాంసా ఆచార్యులు చెప్పారు. వేదాలలోని విధి, నిషేధ వాక్య వివరణల ద్వారా జ్ఞానాన్ని గూర్చి నిర్దేశిస్తూ 'ఆత్మకు సకల పదార్థ జ్ఞానం ఉందని' అంగీకరించారు.

అదీగాక అఖిలార్థ ప్రతిబంధకమైన ఆవరణం నశించడం కుదరకపోవడం అనేది కూడా లేదు. ఎందుచేతనంటే ఈ ఆవరణ నశించడానికి సమ్యక్ దర్శనాది రత్న త్రయమనే సామగ్రి హేతువుగా ఉండనే ఉంది. ఈ ముద్ర ద్వారా, ఈ పద్ధతిని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అనుసరించి జైనమతాన్ని ఆక్షేపించే చిన్న చిన్న ఆక్షేపణలను నిరాకరించవచ్చు.

వి: 'చోదన' అనగా ప్రవర్తింపజేయడం. ఇది ముఖ్యంగా మీమాంసాశాస్త్రంలో వివరించబడింది. ఎవరైనా ఏదైనా విషయాన్ని 'ఇలా చెయ్యాలి', 'ఇలా చెయ్యకూడదు' అంటూ దానివలన లాభనష్టాలను దృష్టిలో ఉంచుకొని చెపుతున్నాడంటే అతనికి ఆ విషయంలో స్పష్టమైన అవగాహన ఉండి ఉండాలి. 'స్వర్గం కోరుకున్నవాడు యాగం చేయాలి' అనే వాక్యం ఉందంటే 'స్వర్గం, యాగవిధానం', 'దాని ఫలితం' తెలిసినవాళ్ళే అలా చెప్పగలరు. అదేవిధంగా 'అర్హతుడు' ఎన్నో విషయాలు వివరించాడంటే అతనికి అన్ని విషయాలూ తెలిసి ఉండాలి. అతడు చెప్పినవి మరొకవిధంగా తెలియడంలేదు కాబట్టి అతడు సర్వజ్ఞుడు అని అర్థాపత్తి ప్రమాణం ద్వారా నిర్ణయించవచ్చు. సకల పదార్థాలూ అనేక విధాలుగా (అనేకాన్తాత్మకమ్) ఉండటం వలన 'ఇది ఇలా ఉంటుంది', 'ఇలాగే ఉంటుంది' అని చెప్పడానికి కుదరదు. అందుచేత ఇలాగే ఉండవచ్చు, ఉండకపోనూవచ్చు అని అనాల్సి వస్తుంది. అవి 'సత్'లు కాబట్టి. (ఇది జైనుల స్యాద్వాదం, ముందు ముందు తెలుస్తుంది.) ఈ అనుమాన ప్రమాణానికి వ్యాప్తి జ్ఞానం ఉండాలంటే అతడు సర్వజ్ఞుడై ఉండాలి. ఈ విధంగా అర్హతుడనబడే ఆత్మకు సకల పదార్థాలనూ గ్రహించే స్వభావం అసిద్ధం కాదు అని తెలుసుకోవాలి.

(ముద్ర అనగా అంగీకారానికి గుర్తు. స్టాంప్ అంటాం అలాంటిది.)

అవ: సర్వజ్ఞుడంటే ఈశ్వరుడు అనే నైయాయిక మతాన్ని ప్రస్తావించి 'ఈ సర్వజ్ఞుడు తద్భిన్నం' అని చెప్పబోతున్నాడు.

ఏదైనా ఒక క్రొత్త విషయాన్ని ప్రతిపాదించాలంటే అంతకుముందు ఉన్న వాటికంటే దీనిలో ఏదైనా విశేషముండి ఉండాలి. అందుచేతనే శాస్త్రకారులు పూర్వాచార్య మతాలను ఉదాహరిస్తూ ఉంటారు.

మూలమ్

93. నను ఆవరణప్రక్షయవశాత్ అశేషవిషయం విజ్ఞానం విశదం ముఖ్యప్రత్యక్షం ప్రభవతీత్యుక్తం తదయుక్తమ్. తస్య సర్వజ్ఞస్య అనాదిముక్తత్వేన ఆవరణస్యైవ అసంభవాత్ ఇతి చేత్ తన్న. అనాదిముక్తత్వస్యైవ అసిద్ధేః. న చ సర్వజ్ఞః అనాదిముక్తః ముక్తత్వాత్, ఇతరముక్తవత్. బద్ధాపేక్షయా చ ముక్తవ్యపదేశః. తద్రహితే చాస్యాపి అభావః స్యాత్; ఆకాశాదివత్.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

"ఆవరణం తొలగిపోవటం వల్ల సకల పదార్థాలకూ సంబంధించిన విజ్ఞానం స్పష్టంగానూ, ప్రత్యక్షంగానూ కలుగుతుంది అని ఏదైతే నీవు చెప్పావో అది యుక్తం (సరి ఐంది) కాదు. ఎందుచేతనంటే అనాదిముక్తుడైన సర్వజ్ఞుని విషయంలో ఆవరణ అనేదే ఉండదు కదా!" అని ఆశంకించినట్లయితే (మా సమాధానం) అది కాదు. అనాదిముక్తత్వం అనేదే అసిద్ధం. 'సర్వజ్ఞుడు అనాది ముక్తుడు కాదు, ముక్తత్వం (అతనికి) ఉండడం చేత, ఇతర ముక్తుల వలెనే' అని అనుమాన ప్రయోగం చేత అతడు అనాది ముక్తుడు కాడు. ఇతర ముక్తుల వలెనే బంధంలో ఉండి కాలాంతరంలో ముక్తుడై సర్వజ్ఞుడనబడతాడు. అంతేకాని, అనాది ముక్తుడు కాడు. అసలు బంధమనే మాటే లేకపోతే ఆకాశం లాగా ముక్తత్వ వ్యవహారం ఉండేది కాదు.

అవ: ఇంకా నైయాయిక మతాన్నే ప్రస్తావిస్తూ ముందుకు సాగుతున్నాడు.

మూలమ్

94. నన్వనాదేః క్షిత్యాదికార్యపరంపరాయాః కర్తృత్వేన తత్సిద్ధిః. తథాహి – **"క్షిత్యాదికం సకర్తృకమ్, కార్యత్వాత్, ఘటవత్"** ఇతి. తదసమీచనమ్. కార్యత్వస్యైవ అసిద్ధేః. న చ సావయవత్వేన తత్సాధనమిత్యభిధాతవ్యమ్; యస్మాదిదం వికల్పజాలమ్ అవతరతి. సావయవత్వం కిమవయవసంయోగిత్వమ్, అవయవ సమవాయిత్వమ్, అవయవ–జన్యత్వమ్, సమవేతద్రవ్యత్వమ్, సావయవబుద్ధి విషయత్వం వా? న ప్రథమః, ఆకాశాదౌ అనైకాన్త్యాత్. న ద్వితీయః, సామాన్యాదౌ వ్యభిచారాత్. న తృతీయః సాధ్యావిశిష్టత్వాత్. న చతుర్థః వికల్పయుగలార్గల గ్రహగలత్వాత్. సమవాయసంబంధమాత్రవత్ ద్రవ్యత్వం సమవేతద్రవ్యత్వమ్, అన్యత్ర సమవేతద్రవ్యత్వం వా వివక్షితం హేతూక్రియతే? ఆద్యే గగనాదౌ వ్యభిచారః, తస్యాపి గుణాదిసమవాయవత్త్వద్రవ్యత్వయోః సంభవాత్. ద్వితీయే సాధ్యా విశిష్టతా; అన్యశబ్దార్థేషు సమవాయకారణభూతేషు సమవాయస్య సాధనీయత్వాత్. అభ్యుపగమ్య ఏతదభాణి. వస్తుతస్తు సమవాయ ఏవ న సమస్తి. ప్రమాణాభావాత్.

మనస్విని

"భూమి మొదలైన కార్య పరంపర అనాదిగా వస్తూన్నది. వీటి యొక్క కర్తృత్వం చేత సర్వజ్ఞుడు సిద్ధిస్తున్నాడు. 'క్షిత్యాదికము కర్తగలది, కార్యత్వం ఉండటం చేత, ఘటం లాగా' అనే అనుమాన ప్రమాణం తెలియజేస్తూంది" అన్నట్లయితే (ఆశంక) – సమాధానం ఇలా ఉంటుంది 'అది (మీ మాట) సరియైంది కాదు. కార్యత్వమే అసిద్ధము.' అలాకాదు

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

క్షిత్యాదికం అవయవాలతో కూడినదవటం చేత ఈ సావయవత్వం అనే హేతువు ద్వారానే కార్యత్వం పొసగుతుంది కదా' అని అనడం కూడా యుక్తం కాదు. ఎందుచేతనంటే ఇది సావయవం అని అంటే ఈ క్రింది వికల్పాల సముదాయం వచ్చిపడుతుంది. ఎలాగంటే - నీవు చెప్పే సావయవత్వానికి అర్థం (1) అవయవ సంయోగిత్వమా? (అవయవాలతో సంయోగం ఉండడమా), (2) అవయవ సమవాయిత్వమా? (అవయవాలతో సమవాయ సంబంధం కలిగివుండడమా), (3) అవయవ జన్యత్వమా? (అవయవాల నుండి పుట్టడమా), (4) సమవేతద్రవ్యత్వమా? (ఏదో ఒకదానితో సమవాయ సంబంధం గల ద్రవ్యం అయి ఉండడమా) లేక (5) సావయవ బుద్ధి విషయత్వమా? (అవయవాలతో కూడిన బుద్ధికి గోచరం అవడమా).

వీటిలో మొదటిది కుదరదు. ఎందుచేతనంటే ఆకాశాదులలో అనైకాంత్యం (వ్యభిచారం) కలుగుతుంధి. ఆకాశానికి అవయవాదులు ఉన్నా అది కార్యం అని మీరు (నైయాయికులు) అంగీకరించరు కదా! రెండవ వికల్పం కూడా కుదరదు. మీరు నిత్యమని భావించే సామాన్యం (జాతి)లో వ్యభిచారం ఏర్పడుతుంది. ఈ జాతి అనేది అవయవి ఐన ఘటంలోనూ ఉంటుంది, దాని అవయవాలలోనూ ఉంటుంది. అయితే జాతిని ఘటాదుల వలె కార్యం అనవలసి వస్తుంది. అదే వ్యభిచార దోషం.

మూడవ వికల్పం కూడా కుదరదు. 'అవయవజన్యత్వం' అంటే కార్యమే. కాబట్టి సాధన సాధ్యాలు ఒకటై పోతాయి.

నాలుగవదీ కుదరదు. 'సమవేతద్రవ్యత్వం' అనే యీ వికల్పం రెండు వికల్పాల మధ్య బిగుసుకొని ఉంది. అదెలాగంటే - సమవేతద్రవ్యత్వం అంటే 1. సమవాయ సంబంధం మాత్రం ఉన్న ద్రవ్యత్వమా? 2. మరొక దానియందు సమవాయ సంబంధంతో ఉన్న ద్రవ్యత్వమా? మొదటి దానిని అంగీకరిస్తే ఆకాశాదులందు వ్యభిచారం. ఆకాశాదులలో శబ్దాది గుణాలతో సమవాయ సంబంధం ఉంది. రెండవ పక్షం అంగీకరిస్తే సాధనమూ సాధ్యమూ ఒకటైపోతాయి.

అసలు ఇంతకీ ఇదంతా సమవాయ సంబంధాన్ని అంగీకరిస్తేనే ఏర్పడే పరిస్థితి. వాస్తవానికి సమవాయ సంబంధం అనేదే కుదరదు. ఎందుచేతనంటే సమవాయ సంబంధం ఒకటుందని చెప్పటానికి ప్రమాణం ఏదీలేదు. (వేదాంతులు కూడా సమవాయ సంబంధాన్ని అంగీకరించరు.)

వి: ఈ సుదీర్ఘ చర్చ అంతా నైయాయికులు చెప్పే 'ఈశ్వరుడు' సర్వజ్ఞుడు

In Public domain. Digitization Muthulakshmi Research Academy
(సర్వజ్ఞుడంటే ఈశ్వరుడు) అనుదానిని నిరాకరించడానికే. జైనులు ఈశ్వరుణ్ణి అంగీకరించరు. నైయాయికుల మాటల్లోనే వారి అభిప్రాయాన్ని ఖండించటానికి వారి పారిభాషిక పదాలైన 'సమవాయం', 'వ్యభిచారం' వంటివి ఉదాహరించటం జరిగింది. ఇదంతా తర్క సంగ్రహ, తర్క భాషాది గ్రంథాల్లో లభిస్తుంది.

నైయాయికులు రెండు విధాలైన సంబంధాన్ని అంగీకరిస్తారు. 1. సంయోగం, 2. సమవాయం. రెండు ద్రవ్యాల కలయిక సంయోగం. రెండు చేతులు కలవటం వంటిది. అవయవం అవయవి, గుణం గుణి మొదలైన వాటిలో ఉండే సంబంధం సమవాయం. తంతువులు (దారాలు) అవయవాలు. వాటితో ఏర్పడే పటం (వస్త్రం) అవయవి. తెలుపు నలుపు ఇత్యాది గుణాలు. 'తెల్లని కలువ', 'నల్లని పక్షి' అన్నపుడు ఆ గుణాలు కలిగిన 'కలువ', 'పక్షి' గుణి అనబడతాయి.

వ్యభిచార దోషం అనగా ఏదైనా ఒక లక్షణం, హేతువు చెప్పినపుడు అది దానికి సంబంధించిన దానికే కాకుండా ఇతరమైన వాటికి కూడా అన్వయిస్తే అది వ్యభిచారం.

ఉదా: "ఇక్కడ పొగ కనబడుతూంది, నిప్పు ఉంది కాబట్టి" అన్నపుడు నిప్పు ఎర్రగా కాల్చిన ఇనుప కడ్డీలోనూ ఉంటుంది. అక్కడ పొగలేదుగా. అంతెందుకు, ఆధునిక కాలంలో వంటింట్లోనూ గ్యాస్ స్టవ్‌లో నిప్పు ఉంది గానీ పొగ లేదుగా. వంటింట్లో పొగ, నిప్పు ఉండడం ప్రాచీన కాలం సంగతి. ఆ ఉదాహరణ అలాగే వస్తూ ఉంది. ఇలాంటి చర్చలు దేశ, కాలాదులకు అన్వయించుకొని అర్థం చేసుకోవాలి. అంతేగానీ సందేహ సాగరంలో మునిగిపోకూడదు.

అవ: నాలుగు వికల్పాలూ కుదరవని నిరూపించి ఇక ఐదవ దానిని గూర్చి చెప్పబోతున్నాడు.

మూలమ్

95. నాపి పఞ్చమః, ఆత్మాదినా అనైకాన్త్యాత్. తస్య సావయవబుద్ధివిషయత్వేఽపి కార్యత్వాభావాత్. న చ నిరవయువత్వేఽప్యస్య సావయువార్థసంబంధేన సావయవబుద్ధివిషయత్వమ్ ఔపచారికమితి ఏష్టవ్యమ్; నిరవయవత్వే వ్యాపిత్వ విరోధాత్, పరమాణువత్.

మనస్విని

'సావయవ బుద్ధిత్వం' అనే ఐదవ వికల్పం కూడా కుదరదు. ఆత్మ మొదలైన

వాటిలో అనైకాంతికం (వ్యభిచారం) ఉండటం చేత ఆ వికల్పం కుదరదు. ఆత్మకు అవయవాలున్నాయి, అది సావయవి అని బుద్ధికి కలుగుతున్నా (గోచరిస్తున్నా) అది (ఆత్మ) కార్యం కాదు కదా? అయితే 'ఆత్మకు అవయవాలు లేకపోయినప్పటికీ అవయవాలున్న శరీరాదులతో సంబంధం వలన దీనియందు సావయత్వం ఆరోపించబడుతుంది. కనుక, ఆత్మ విషయంలో సావయవత్వం ఔపచారికం (ఆరోపం) మాత్రమే అంటారా? అది అంగీకరించబడదు. పోనీ ఆత్మకు అవయవాలు లేవు, అది నిరవయవమే అంటే పరమాణువు లాగానే (దేహం) అంతా వ్యాపించి ఉండడం కుదరదు.

వి: ఔపచారికం అంటే ఆరోపం. 'పురుషవ్యాఘ్రః' అన్నపుడు వ్యాఘ్రంలో ఉన్న శౌర్యాదులు పురుషుని యందు ఆరోపించబడినాయి. ఇలాంటి ప్రయోగాలనే 'ఔపచారికం, లాక్షణికం, గౌణం' అని అంటారు.

అవ: 'అన్నింటికీ కర్త ఈశ్వరుడు' అనే భావనను నిరాకరించడానికి ఉపక్రమిస్తున్నాడు.

మూలమ్

96. కిం చ కిమేకః కర్తా సాధ్యతే, కిం వా అనేకే? ప్రథమే ప్రాసాదాదౌ వ్యభిచారః. స్థపత్యాదీనాం బహూనాం పురుషాణాం తత్ర కర్తృత్వోపలమ్భాత్, ద్వితీయే బహూనాం విశ్వనిర్మాతృత్వే తేషు మిథో వైమత్యసంభావనాయాః అనివార్యత్వాత్ ఏకైకస్య వస్తునః అన్యాన్యరూపతయా నిర్మాణే సర్వమసమఞ్జ సమాపద్యేత. సర్వేషాం సామర్థ్యసామ్యేన ఏకైనైవ సకలజగదుత్పత్తిసిద్ధావితర వైయర్థ్యం చ. తదుక్తం వీతరాగస్తుతౌ –

"కర్తాస్తి కశ్చిజ్జగతః స చైకః, స సర్వగః, స స్వవశః, స నిత్యః,
ఇమాః కుహేవాకవిడమ్బనాః స్యుః తేషాం న యేషామనుశాసకస్త్వమ్"

(వీ.స్తు. 6) ఇతి.

అన్యత్రాపి –

"కర్తా న తావదిహ కోఽపి యథేచ్ఛయా వా
దృష్టోఽన్యథా కటకృతావపి తత్ప్రసంగః,
కార్యం కిమత్ర భవతోఽపి చ తక్షకాద్యైః
ఆహత్య చ త్రిభువనం పురుషః కరోతి." ఇతి.

తస్మాత్ ప్రాగుక్తకారణత్రితయబలాత్ ఆవరణక్షయే సార్వజ్ఞ్యం యుక్తమ్.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మరొక విషయం ఏమిటంటే - ఈ అనుమాన ప్రమాణం ద్వారా ఒక కర్త సాధింపబడతాడా? (ఒకటే కర్త అని ఋజువు అవుతుందా?) లేక అనేక కర్తలు సాధింపబడతారా? (అని వికల్పాలు). వీటిలో మొదటి పక్షంలో ప్రాసాదాదుల విషయంలో వ్యభిచారం (దోషం). ఎందుచేతనంటే వాటి విషయంలో స్థపతి (ప్రధాన శిల్పి) ఇతర సహాయకులు చాలామంది కర్తలుగా కనబడుతున్నారు కదా! రెండవ పక్షంలో కర్తలు చాలామంది అని అంగీకరించే పక్షంలో ఈ విశ్వ నిర్మాణంలో వారిలో వారికి అభిప్రాయ భేదాలుండటం చేత ఒక్కొక్క వస్తువును ఒక్కొక్క కర్త (తన తన ఇష్టానుసారం) నిర్మిస్తే అంతా అసమంజసం ఐపోతుంది. అందరూ సమర్థులైనపుడు, ఒక్కని చేతనే జగన్నిర్మాణం సిద్ధించేటప్పుడు ఇక ఇతరుల ఉనికి వ్యర్థం. ఈ విషయమే 'వీతరాగస్తుతి' అనే గ్రంథంలో ఇలా చెప్పబడింది.

"(జినుణ్ణి ఉద్దేశించి) నీవు ఎవరికి అనుశాసకుడవు కావో వారికి - జగత్తుకు కర్త ఒకడున్నాడు; అతడు ఒకడే, సర్వత్రా వ్యాపించి ఉంటాడు. అతడు తనకు తానే వశుడు. (పరాధీనుడు కాడు). స్వతంత్రుడు, నిత్యుడు" - ఇలా చెడ్డ పట్టుదలతో కూడిన హాస్యాస్పదమైన చేతలు, మాటలు ఉంటుంటాయి.

ఇదే విషయాన్ని మరోచోట కూడా ఇలా చెప్పారు -

"యథేచ్ఛగా ఈ జగత్తును నిర్మించే కర్త ఎవడూ కనబడడం లేదు. పోనీ అలాంటివాడు ఉండవచ్చు అని ఊహిస్తే అప్పుడు అతడే వచ్చి అన్నీ నిర్మించాలి. చాప అల్లడానికి కూడా అతడే రావాలి. అలాంటప్పుడు నీతో ఏం పని? వడ్రంగి మొదలైన వాళ్ళతో ఏం పని? ముల్లోకాల నిర్మాణం కూడా మొత్తంగా అతడే చేయాలి."

అందుచేత ఇంతకుముందు చెప్పబడిన మూడు కారణాల (రత్నత్రయం) వలన ఆవరణం తొలగి పోగా సర్వజ్ఞత్వం చేకూరడమే యుక్తమైనది.

వి: ఈ జైనుల వాదంలో కొన్ని విషయాలు ప్రాకృతజనాల సందేహాలకు దర్పణం పడతాయి. ఈశ్వరుడొక్కడే కర్త అయితే మరి యీ భువన భాండంలో ఇతర కర్తలు ఎందుకు? అతడు సర్వగతుడైతే, సర్వ వ్యాపి ఐతే ఇక ఇతర పదార్థాలకు, ప్రాణి కోటికీ చోటెక్కడిది? అతడు స్వతంత్రుడైతే, దయామయుడు కాబట్టి అందరినీ ఒకే మాదిరిగా సృష్టించాలి. ఇన్ని భేదాలుండకూడదు. కర్మానుసారం వారి వారి ఫలం ఉంటుందంటే మరి ఈశ్వరునికి స్వాతంత్ర్యం లేనట్లే. అతడు నిత్యుడు అనడమూ

 In Public domain. Digitization Muthulakshmi Research Academy.

కుదరదు. జగన్నిర్మాణం అతని స్వభావమైతే మరి ప్రళయం ఎందుకు? (తాను నిర్మించి, తానే విధ్వంసం చేయడు కదా). ఈ విధంగా ఎన్నో సందేహాలు. అందుచేత జగత్కర్త ఈశ్వరుణ్ణి జైనులు అంగీకరించరు.

అవ: ఇంతవరకు నైయాయిక మతాన్ననుసరించి ఈశ్వరుణ్ణి గూర్చి చర్చించి అతడు సర్వజ్ఞుడు కాడు అంటూ వాదించిన జైనునికి తమ సర్వజ్ఞుని స్వరూపం ఏమిటో వివరించాల్సిన అవసరం ఉంది. అందుచేత సర్వజ్ఞుని విషయంలో కలిగే ఆశంకలను ముందుంచుకొని, ఆపై అతని స్వరూపం నిరూపిస్తున్నాడు.

మూలమ్

97. న చాస్య ఉపదేష్ట్రన్తరాభావాత్ సమ్యగ్దర్శనాదిత్రితయానుపపత్తిరితి భణనీయమ్; పూర్వసర్వజ్ఞప్రణీతాగమప్రభవాత్ అముష్య అశేషార్థజ్ఞానస్య. న చ అన్యోన్యాశ్రయాది-దోషః; ఆగమసర్వజ్ఞపరంపరాయాః బీజాఙ్కురవత్ అనాదిత్వాఙ్గీకారాత్ ఇత్యలమ్.

మనస్విని

"ఇతనికి ఉపదేశం చేసిన వారు మరొకరు ఎవరూ లేకపోవడం చేత సమ్యగ్దర్శనాది రత్నత్రయము ఉండడం కుదరదు గదా" అని అనకూడదు. ఇతనికి ముందు ఉండిన సర్వజ్ఞులు రచించిన ఆగమాల వలన ఈ సర్వజ్ఞునికి సకల పదార్థ జ్ఞానం కలిగింది. ఇందులో అన్యోన్యాశ్రయ దోషానికి ఆస్కారం లేదు. ఆగమం, సర్వజ్ఞుడు – ఈ పరంపర బీజాంకురాల వలె (విత్తనం, చెట్టు) అనాదిగా వస్తూన్నదే, అందరూ అంగీకరించినదే. ఇక ఈ చర్చ చాలు.

వి: 'ఆవరణ క్షయం వలన సర్వజ్ఞత్వం సిద్ధిస్తుంది సరే, అయితే ఆవరణ క్షయానికి కారణమైన రత్నత్రయాన్ని ఈ సర్వజ్ఞునికి ఎవరు బోధించారు' అనేది ఆశంక. దానికి సమర్థకంగా 'పూర్వ సర్వజ్ఞులు రచించిన ఆగమాలు అధ్యయనం చేయడం వలన జ్ఞానం కలిగింది' అని సమాధానం. అయితే సర్వజ్ఞుడు ముందా? ఆగమం ముందా? మీరు చెప్పిన పూర్వ సర్వజ్ఞులకు బోధించిన వారు ఎవరు? ఇత్యాది ప్రశ్న పరంపర బయలుదేరుతుంది." సర్వజ్ఞుడు రచించటం వలన ఆగమం ప్రమాణమౌతుందా? ఆగమం చదవటం వలన సర్వజ్ఞుడౌతాడా? అని అన్యోన్యాశ్రయ దోషం ఏర్పడుతుంది. దానికి సమాధానంగా అందరూ అంగీకరించే, అనాదిగా చెప్పబడుతున్న 'బీజాంకుర న్యాయమే' ఉదాహరణగా పేర్కొని ఇక చర్చకు తావు లేకుండా ముగింపు పలికాడు.

అవ: ఇక ఇప్పటికి జైనుడు తమ మత సిద్ధాంత వివరణకు ఉపక్రమిస్తున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

98. రత్నత్రయపదవేదనీయతయా ప్రసిద్ధం సమ్యగ్దర్శనాదిత్రితయమ్ అర్హత్ప్ర వచన-సంగ్రహపరే పరమాగమసారే ప్రరూపితం – **"సమ్యగ్దర్శనజ్ఞానచారిత్రాణి మోక్షమార్గః"** ఇతి. వివృతం చ యోగదేవేన – "యేన రూపేణ జీవాద్యర్థః వ్యవస్థితః తేన రూపేణ అర్హతా ప్రతిపాదితే తత్త్వార్థే విపరీతాభినివేశరహితత్వాద్యపరపర్యాయం శ్రద్ధానం సమ్యగ్దర్శనమ్. తథా చ తత్త్వార్థ సూత్రమ్ – **"తత్త్వార్థం శ్రద్ధానం సమ్యగ్దర్శనమ్"** ఇతి.

అన్యదపి –

"రుచిర్జినోక్తతత్త్వేషు సమ్యక్ శ్రద్ధానముచ్యతే,
జాయతే తన్నిసర్గేణ గురోరధిగమేన వా" ఇతి.

పరోపదేశనిరపేక్షమ్ ఆత్మస్వరూపం నిసర్గః. వ్యాఖ్యానాదిరూపపరోపదేశజనితం జ్ఞానమ్ అధిగమః.

మనస్విని

'రత్నత్రయ'మనే పదంచేత తెలియబడే ప్రసిద్ధమైన 'సమ్యగ్దర్శనము' మొదలైన త్రయము (మూడు) అర్హతుడు ప్రవచించిన బోధనల సంగ్రహరూపమైన 'పరమాగమసార' మనే గ్రంథంలో – "సమ్యక్ దర్శనము, సమ్యక్ జ్ఞానము, సమ్యక్ చారిత్రము – మోక్షమార్గము" అని నిరూపించబడింది. ఇదే విషయం యోగదేవుని చేత వివరించబడింది – "జీవాది పదార్థం ఏ రూపంలో వ్యవస్థితమై ఉన్నదో అదే రూపంలో అర్హతుడు ప్రతిపాదించిన తత్త్వార్థంలో విపరీతమైన పట్టుదలకు పోకుండా శ్రద్ధను కలిగి ఉండడమే" సమ్యగ్దర్శనమ్. ఆ తత్త్వార్థ సూత్రం ఇలా చెప్పబడింది 'తత్త్వం కొరకు శ్రద్ధను కలిగి ఉండడమే 'సమ్యక్ దర్శనము".

మరొకటి కూడ –

"జినుడు బోధించిన తత్త్వాల పట్ల అభిరుచి 'శ్రద్ధానం' అనబడుతుంది. ఈ శ్రద్ధానం మానవునికి సహజంగా కాని, లేదా గురువు వద్ద నుండి విషయం తెలుసుకోవడం వలన గాని కలుగుతుంది" అని.

ఇతరుల ఉపదేశం అవసరం లేకుండా సహజంగానే తత్త్వార్థం పట్ల శ్రద్ధ కలిగి ఉండడం నిసర్గం. గురూపదేశం వలన కలిగిన జ్ఞానం అధిగమం.

వి: జైనుల బోధనలు సామాన్యులకు అర్థం అయ్యేవిధంగా ఉంటాయి. నిత్య

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

జీవితంలో ఆచరణ యోగ్యంగా ఉంటాయి. ఈ 'రత్నత్రయము' కలిగి ఉంటే చాలు మానవ జీవితం ఉన్నత పథాన్ని చేరుతుంది.

'Proper vision, proper knowledge and proper conduct' అనే మూడు అమూల్య రత్నాలు.

అవ: ఈ రత్నత్రయాన్ని స్పష్టంగా వివరిస్తున్నాడు.

మూలమ్

99. యేన స్వభావేన జీవాదయః పదార్థాః వ్యవస్థితాః తేన స్వభావేన మోహసంశయ రహితత్వేన అవగమః సమ్యగ్జ్ఞానమ్. యథోక్తమ్ –

"యథావస్థితతత్త్వానాం సంక్షేపాద్విస్తరేణ వా,
యోఽవబోధస్తమత్రాహుః సమ్యగ్జ్ఞానం మనీషిణః" ఇతి.

మనస్విని

జీవాది పదార్థాలు ఏ స్వభావంతో ఉంటాయో వాటిని అదే స్వభావంతో మోహ, సంశయాలు లేకుండగా తెలుసుకోవటం 'సమ్యక్ జ్ఞానం' (యథార్థ జ్ఞానం). ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోవటం. ఆ తెలుసుకోవటంలో మోహానికి గాని, సంశయానికి గాని తావివ్వకపోవటం. ఇదే విషయాన్ని క్రింది శ్లోకం తెలియజేస్తుంది.

'తత్త్వాలను ఉన్నవి ఉన్నట్లుగా సంక్షిప్తంగా కాని, విస్తృతంగా కాని తెలుసుకోవటం సమ్యక్ జ్ఞానం' అని మహాత్ములు అంటారు.

వి: 'తత్త్వం' అనగా యథార్థ రూపం. భ్రాంతి, సందేహాదులు లేని స్పష్టమైన జ్ఞానమే 'సమ్యక్ జ్ఞానం'. వేదాంతులు చెప్పే స్వచ్ఛమైన జ్ఞానమూ అదే.

అవ: ఇప్పుడు జ్ఞానం యొక్క భేదాలను వివరిస్తున్నాడు. ఈ వివరణ అత్యంత శాస్త్రీయ పద్ధతిలో ఉంటుంది. కంటికి కనబడని పొరలను తొలగించి పదార్థ దర్శనం చేయిస్తుంది.

మూలమ్

100. తద్ జ్ఞానం పఞ్చవిధం – మతి – శ్రుత – అవధి – మనఃపర్యాయ – కేవల భేదేన; తదుక్తమ్ – **"మతిశ్రుతావధిమనఃపర్యాయకేవలాని జ్ఞానమ్".** అస్యార్థః – జ్ఞానావరణక్షయోపశమే సతి ఇన్ద్రియమనసీ పురస్కృత్య వ్యాపృతః సన్ యథార్థం మనుతే, సా **మతిః**. జ్ఞానావరణక్షయోపశమే సతి మతిజనితం స్పష్టం జ్ఞానం **శ్రుతమ్**. సమ్యగ్దర్శనాదిగుణజనిత క్షయోపశమనిమిత్తమ్ అవిచ్ఛిన్నవిషయం జ్ఞానమ్ **అవధిః**.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈర్ష్యాన్తరాయజ్ఞానావరణక్షయోపశమే సతి పరమనోగతస్య అర్థస్య స్ఫుటం పరిచ్ఛేదకం జ్ఞానం **మనఃపర్యాయః**. తపః క్రియావిశేషాన్ యదర్థం సేవన్తే తపస్వినః తద్ జ్ఞానమ్ అన్యజ్ఞానాసంస్పృష్టం కేవలమ్. తత్ర ఆద్యం పరోక్షమ్, ప్రత్యక్షమన్యత్. తదుక్తమ్ -

"విజ్ఞానం స్వపరాభాసి ప్రమాణం బాధవర్జితమ్,
ప్రత్యక్షం చ పరోక్షం చ ద్విధా మేయవినిశ్చయాత్" ఇతి.

అన్తర్గణికభేదస్తు సవిస్తరః తత్రైవ ఆగమే అవగన్తవ్యః.

మనస్విని

ఆ జ్ఞానం ఐదు విధాలు. 1. మతి, 2. శ్రుతము, 3. అవధి, 4. మనఃపర్యాయము, 5. కేవలము. అదే ఈ విధంగా చెప్పబడింది. 'మతి - శ్రుత - అవధి - మనఃపర్యాయ - కేవలాలు జ్ఞానము'. దీని అర్థం - జ్ఞానం యొక్క ఆవరణం (ప్రతిబంధకం) క్షయమొందినపుడు గాని లేదా ఉపశమించినపుడు గానీ ఇంద్రియము, మనస్సు రెండింటితోనూ లోక వ్యవహారాన్ని సాగిస్తూ, పదార్థాన్ని (తత్త్వాన్ని) మననం చేయడం 'మతి'.

జ్ఞానావరణ యొక్క క్షయము, ఉపశమము కలిగినపుడు 'మతి' (పైన చెప్పినది) వలన కలిగిన స్పష్టమైన జ్ఞానం - శ్రుతం.

సమ్యక్ దర్శనాది గుణముల వలన కలిగిన క్షయ, ఉపశమాల కారణంగా ఏర్పడే అవిచ్ఛిన్న విషయం అనగా 'ఇది ఇలా' అని నిశ్చయాత్మకంగా ఉండే జ్ఞానం - అవధి.

ఈర్ష్య మొదలైన ప్రతబంధకాలు, జ్ఞానావరణముల క్షయ, ఉపశమాల కారణంగా ఇతరుల మనసులలో ఉన్న విషయాలను స్పష్టంగా, నిశ్చితంగా గ్రహించగలిగిన జ్ఞానం 'మనఃపర్యాయం'. ఇది ఒక రకంగా 'మనస్తత్త్వం' జ్ఞానం.

తపఃశాలులైన మహాపురుషులు దేనికోసమై తపోవిశేషాలను (వివిధ రూపమైన తపస్సులను), క్రియా విశేషాలను (విశేషమైన ఆచారాలను) సేవిస్తూంటారో (పాటిస్తూంటారో) వాటి వలన కలిగేదీ, ఇతర జ్ఞానాలతో (ప్రాపంచిక విషయాలకు సంబంధించి) మిశ్రంకానిదీ అయిన జ్ఞానం - కేవలం.

సమ్యక్ చరిత్రాదులచేత జ్ఞాన ప్రతిబంధకాలు తొలగిపోగా ఏర్పడే జ్ఞానం కేవల జ్ఞానం.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈ ఐదు విధాల జ్ఞానాలలో మొదటిదైన 'మతి' పరోక్ష జ్ఞానం. మిగిలినవి ప్రత్యక్ష జ్ఞానాలు. ఈ విషయమే క్రింది శ్లోకంలో చెప్పబడింది.

"విజ్ఞానం తననూ, ఇతరమైన దాన్నీ కూడా ప్రకాశింపజేస్తుంది. బాధ (అడ్డంకి) లేనిదైతే ఆ జ్ఞానం ప్రమాణం. మేయము (ప్రమేయము) అనగా తెలియదగిన (తెలుసుకోవాల్సిన) వస్తువు యొక్క నిశ్చయాన్ని బట్టి జ్ఞానం పరోక్షం అనీ ప్రత్యక్షం అనీ రెండు విధాలు.

ఇంతేకాకుండా ఈ జ్ఞానంలో అవాంతర భేదాలున్నాయి. వాటిని గూర్చి సవిస్తరంగా తెలుసుకోవాలంటే ఆగమం (గ్రంథం) ద్వారానే తెలుస్తుంది.

వి: ఈ ఘట్టం అత్యంత వైజ్ఞానికం, ఆసక్తిదాయకం కూడా. జ్ఞానావరణం ఎన్ని విధాలో తెలుసుకుంటే ఆవరణ క్షయానికి ప్రయత్నించవచ్చు. ఈ జ్ఞానాన్ని అడ్డుకునే (ఆవరణం) ప్రతిబంధకం మూడు విధాలు. 1. మనోగతము, 2. ఇంద్రియగతము, 3. విషయగతము.

1. ఈర్ష్యాద్వేషాదులు మనోగత ప్రతిబంధకాలు
2. నేత్ర రోగాదులు ఇంద్రియగత ప్రతిబంధకాలు
3. సూక్ష్మంగా ఉండటం, అంధకారం విషయగత ప్రతిబంధకాలు

ఆవరణం పూర్తిగా నశించటం ఆవరణ క్షయం.
అది అణగి ఉండడం ఆవరణోపశమం.

అవ: సమ్యక్ జ్ఞానం తర్వాత 'సమ్యక్ చరితం' అంటే ఏమిటో వివరిస్తున్నాడు.

మూలమ్

101. సంసరణకర్మోచ్ఛిత్తౌ ఉద్యతస్య శ్రద్దధానస్య జ్ఞానవతః పాపగమనకారణ క్రియానిర్వృత్తిః సమ్యక్చరితమ్. తదేతత్సప్రపఞ్చమ్ ఉక్తమ్ అర్హతా –

"సర్వథావద్యయోగానాం త్యాగశ్చారిత్రముచ్యతే,
కీర్తితం తదహింసాదివ్రతభేదేన పఞ్చధా.
అహింసాసూనృతాస్తేయ బ్రహ్మాచర్యాపరిగ్రహాః,
న యత్ర్పమాదయోగేన జీవితవ్యపరోపణమ్.
చరాణాం స్థావరాణాం చ తదహింసావ్రతం మతమ్."

మనస్విని

సంసారానికి కారణమైన కర్మలను నశింపచేసికోవటానికై పూనుకున్న

In Public domain. Digitization Muthulakshmi Research Academy
శ్రద్ధావంతుడు, జ్ఞానవంతుడూ అయినవాడు పాపాలకు దారితీసే క్రియల నుండి విరమించుకోవటం 'సమ్యక్చరితమ్'. ఇదంతా అర్హతుడు సవివరంగా బోధించాడు. అది ఈ క్రింది శ్లోకాలలో వివరించబడింది.

"పాప సంబద్ధమైన వాటిని పూర్తిగా వదిలివేయటం 'చారిత్రం' అనబడుతుంది. అది అహింస మొదలైన భేదాల చేత ఐదు విధాలు.

"అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం" – ఇవి ఐదు వ్రతాలు.

"పొరపాటున కూడా స్థావర, జంగములకు (చెట్లు మొదలైనవి స్థావరాలు, కదిలే ప్రాణులు జంగములు) ప్రాణహాని కలిగించకుండా ఉండడం 'అహింసావ్రతం'."

మూలమ్

102. "ప్రియం పథ్యం వచస్తథ్యం సూనృతం వ్రతముచ్యతే,
తత్తథ్యమపి నో తథ్యమప్రియం చాహితం చయత్."

మనస్విని

ప్రియమైనదీ, హితమైనదీ అయిన సత్యాన్ని పలకటం 'సూనృతవ్రతం'.

అప్రియము, అహితము అయినది సత్యమైనా అది సత్యంకాదు.

వి: ఈ భావమే ధర్మశాస్త్రాల్లో 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్' అనే ప్రసిద్ధమైన శ్లోకంలో తెలుపబడింది.

మూలమ్

103. "అనాదానమదత్తస్యాస్తేయవ్రతముదీరితమ్,
బాహ్యాః ప్రాణా నృణామర్థో హరతా తం హతా హి తే."

మనస్విని

ఇవ్వని వస్తువును తీసికోవటం స్తేయం (దొంగతనం వంటిది). ఆ విధంగా ఒకరు ఇవ్వని వస్తువుని తీసుకోకపోవటం 'అస్తేయవ్రతం'. అంతేకాదు మానవులకు ధనం (ఇతర వస్తువులు) ఇత్యాదులు బహిఃప్రాణం. ఆ అర్థాన్ని హరించడమంటే వారి ప్రాణాలు హరించటమే.

వి: తమ కిష్టమైన వస్తువును ఎవడూ మరొకనికి మనసారా ఇవ్వడు. అలాంటి దానిని బలవంతంగా తీసికోవటం ప్రాణాలు తీయటంతో సమానం.

అవ: ఇపుడు బ్రహ్మచర్య వ్రతాన్ని వివరించబోతున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

104. "దివ్యౌదరికకామానాం కృతానుమతకారితైః,
మనోవాక్కాయతస్త్యాగో బ్రహ్మాష్టాదశధా మతమ్."

మనస్విని

కృత – అనుమత – కారితాల చేత కలిగే దివ్యములు, ఔదరికము (శారీరకము)లు అయిన విషయభోగాలను మనోవాక్కాయాల చేత (మనసా, వాచా, కర్మణా) త్యజించడం – అంతా కలిపి బ్రహ్మచర్య వ్రతం పద్దెనిమిది విధాలుగా అంగీకరించబడింది.

వి: ఇహలోక శరీరంతోకాక మరొక దివ్య శరీరంతో అనుభవించే భోగాలు 'దివ్యములు'. మానవ శరీరంతో అనుభవించేవి 'ఔదరికాలు'. ఉదర శబ్దానికే 'శరీరం' అని లాక్షణికార్థం. ఈ రెండు విధాలు ఒక్కొక్కటి కృతాది భేదాలచేత మూడు విధాలు. కృత అనగా తాను చేసినవి, అనుమతి అనగా ఇతరుల అనుమతితో చేసినవి, కారిత అనగా ఇతరులచేత చేయించబడినవి. ఈ ఆరూ తిరిగి ఒక్కొక్కటి మూడు విధాలు (మనోవాక్కాయాల భేదం వలన). ఈ విధంగా మొత్తంగా పద్దెనిమిది విధాలు. వీటన్నింటినీ త్యజించటం 'బ్రహ్మచర్యం'.

అవ: ఇక 'అపరిగ్రహం' అంటే ఏమిటో తెలుపుతున్నాడు.

మూలమ్

105. "సర్వభావేషు మూర్ఛాయాస్త్యాగః స్యాదపరిగ్రహః,
యదసత్స్వపి జాయేత మూర్ఛయా చిత్తవిప్లవః".

మనస్విని

"సకల వస్తు సముదాయం పట్ల ఆసక్తిని వదిలిపెట్టడం 'అపరిగ్రహం'. ఎందుచేతనంటే లేని వస్తువులు ఊహించుకుని కోరుకున్నంత మాత్రానే మనసు అలజడికి లోనవుతుంది. అలాంటప్పుడు కంటికి కనబడే వాటిని గూర్చి వేరే చెప్పాలా?"

వి: కనబడిన ప్రతిదీ కావాలనుకోవటమే చిత్త సంక్షోభానికి మూలకారణం. ఆ కోరికను వదిలివేస్తే ఇతరులు ఇస్తానన్నా తీసుకోలేరు. ఇది చాలా గొప్ప గుణం. ఈనాడు సమాజంలో కనుపించే 'లంచం' మొదలైనవి ఇలాంటివే (పరిగ్రహాలే).

అవ: ఐదు భావనలచేత సంస్కరించబడి, ఐదు విధాల వ్రతాలను ఆచరించిన వారికి అవ్యయ (శాశ్వత) స్థానాన్ని పొందే అర్హత వస్తుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

106. **"భావనాభిర్భావితాని పఞ్చభిః పఞ్చధా క్రమాత్,**
మహావ్రతాని లోకస్య సాధయన్త్యవ్యయం పదమ్." ఇతి.

మనస్విని

"వరుసగా ఐదు భావనల చేత భావింపబడిన ఐదు మహావ్రతాలు లోకానికి మోక్షాన్ని సాధిస్తాయి (సిద్ధింపజేస్తాయి)".

వి: భావన అనే పదానికి మనోభావన అనే అర్థం. 'భావయతి' అంటే భావింపజేస్తున్నాడు, సంస్కరిస్తున్నాడు అని అర్థం వస్తుంది. అందుచేత ఈ భావనలు ఐదు వ్రతాలను ఆచరించడానికి దోహదపడతాయి. వీటిని ఆచరించినవారు ఇక భవబంధాల నుండి ముక్తులే.

అవ: పైన చెప్పబడిన భావనా పంచకం ఒక్కొక్క దానికి ఒక్కోవిధంగా ఉంటుంది. వాటి వాటి విశేషాలనూ, వివరాలనూ ప్రస్తుతిస్తున్నాడు.

మూలమ్

107. భావనాపఞ్చకప్రపఞ్చనం చ ప్రరూపితమ్ -
"హాస్యలోభభయక్రోధప్రవృత్త్యాఖ్యైర్నిరన్తరమ్,
ఆలోచ్యభాషణేనాపి భావయేత్సూనృతం వచః." ఇత్యాదినా.

మనస్విని

భావనా పంచక వివరణ ఇలా నిరూపించబడింది.

1. "హాస్య, లోభ, భయ, క్రోధ, ప్రవృత్తులనబడే వాటిని నిరంతరం త్యజించాలి. ఆలోచించి మాట్లాడాలి. ఈవిధంగా సూనృత వ్రతాన్ని భావన చేయాలి."

వి: మాటే మనిషికి ఇతర ప్రాణులకంటె అధికంగా దొరికిన వరం. ఆ మాటను సరియైన విధంగా ప్రయోగించాలి. హాస్యం కోసం అసత్యం పలుకుతారు. అది ఒక్కోసారి విపరీతాలకు దారితీస్తుంది. అలాగే లోభం కారణంగా అసత్యం పలుకుతారు. అదీ అపరాధమే. అలాగే భయం, క్రోధం వలన కూడా అసత్యం పలుకరాదు.

ఇక కొందరు వారి ప్రవృత్తి (ప్రవర్తన) కారణంగా (అలవాటుగా) అసత్యం మాట్లాడతారు. వీటన్నింటినీ పరిత్యజించాలి. అదే సూనృత (సత్య) వ్రతం.

2. అహింసా వ్రతంలోని ఐదు భావనలు – 1. వాగ్గుప్తి, 2. మనోగుప్తి, 3. ఈర్యా సమితి, 4. ఆదాన సమితి, 5. ఆలోకితపాన భోజనం.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విషయాలకు దూరంగా ఉండి తనను తాను రక్షించుకోవటం గుప్తి.

1. వాక్కులతో ఎవరినీ బాధించకుండా, పరుష వచనాలు పలుకకుండా ఉండడం 'వాగ్గుప్తి'. మాటల ద్వారా ఎదుటివారిని నొప్పించటం నేరం.

2. మనసులో కూడా ఎవరికీ చెడు తలపెట్టకుండా ఉండడం మనోగుప్తి.

3. ఈర్యాసమితి అనగా మంచిగా మాట్లాడటం. సత్యమూ, మధురమూ అయిన పదజాలాన్ని ప్రయోగించటం.

4. జైనులు అల్ప ప్రాణులైన క్రిమి, కీటకాదులకు కూడా అపకారం చేయకూడదంటారు. అందుచే ఆసన గ్రహణంలో సరిగా ఉందో, లేదో దానిపైన గాని, క్రింద గానీ ఏవైనా ప్రాణులున్నాయేమో అని పరిశీలించి గ్రహించాలి. అదే ఆదాన సమితి.

5. అదేవిధంగా పానమూ, భోజనమూ కూడా ఏ ప్రాణులూ లేవు కదా అని పరిశీలించి గ్రహించాలి. అది ఆలోకితపాన భోజనం.

3. ఆస్తేయ వ్రతంలోని ఐదు భావనలు.

1. శూన్య గృహాలలో, కొండ గుహలలో నివసించడం.

2. ఇతరులతో పోటీ పడకుండా వారు వెళ్ళిన తరువాత అక్కడ ఉండటం.

3. తమ ఉనికి వల్ల ఎవరికీ ఏ అసౌకర్యం లేకుండా ఉండటం.

4. ఆచారం, శాస్త్రం చెప్పిన విధులను ఆచరిస్తూ భిక్షాన్నం శుద్ధంగా ఉందా లేదా అని చూచుకోవటం.

5. ఇది నాది, అది నీది అంటూ ఇతరులతో వివాదం పెట్టుకోకపోవడం.

4. బ్రహ్మ చర్యానికి సంబంధించిన భావనలు

1. స్త్రీలకు సంబంధించిన విషయాలకు దూరంగా ఉండటం.

2. స్త్రీలను, వారి శరీరాలను చూడకుండా ఉండటం.

3. పూర్వ జీవితంలోని స్త్రీ సంగమాదుల స్మరణను వదిలివేయటం.

4. శక్తివర్ధకాలైన ఔషధాలను త్యజించడం.

5. తన శరీరాన్ని సంస్కరించుకోవడాన్ని త్యజించడం.

శారీరక సుఖాలకు దూరంగా ఉండటమే బ్రహ్మచర్యం. దాని కొరకై చేయాల్సిన భావనలు పైన చెప్పబడినాయి.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

5. అపరిగ్రహ వ్రతానికి సంబంధించిన ఐదు భావనలు ఐదు ఇంద్రియాలను వాటి వాటికి సంబంధించిన విషయాలకు దూరంగా ఉంచటం.

కంటికి ఇంపుగా ఉండే దానివైపు నుండి దృష్టి మరల్చటం, అటుకేసి దృష్టిని పోనివ్వక పోవటం.

ఇలాగే ఇంద్రియాలు విషయాలను పరిగ్రహించకుండా నియంత్రించటం (ఇంద్రియ నిగ్రహం).

అదేవిధంగా ఎవరినుండీ ఏమీ తీసుకోకపోవడం, తనకోసం కూడబెట్టుకోక పోవడం కూడా 'అపరిగ్రహం' క్రిందకే వస్తాయి.

ఈ నియమాలు అన్నీ పరిశీలించినట్లయితే ధర్మశాస్త్రంలో చెప్పిన నియమాలు, ఇతర దర్శనాల్లో చెప్పిన యమ, నియమాలకు పెద్దగా భేదం లేదు అనిపిస్తుంది.

అవ: ఇంతవరకూ చెప్పబడిన సమ్యక్ దర్శన జ్ఞాన చరిత్రలు అనబడే రత్నత్రయము ఎలా మోక్షసాధనమవుతుందో వివరించబోతున్నాడు.

మూలమ్

108. ఏతాని సమ్యగ్దర్శనజ్ఞానచరిత్రాణి మిలితాని మోక్షకారణమ్, న ప్రత్యేకమ్; యథా రసాయనమ్. తథా చాత్ర జ్ఞానశ్రద్ధానాచరణాని సంభూయ ఫలం సాధయన్తి, న ప్రత్యేకమ్.

మనస్విని

ఈ సమ్యక్ దర్శనము, సమ్యక్ జ్ఞానము, సమ్యక్ చారిత్రము - మూడూ కలిసి మోక్ష కారణం అవుతాయి. ఏ ఒకటీ ప్రత్యేకంగా మోక్ష హేతువు కాజాలదు. వివిధ పదార్థాలు కలిపి రసాయనం తయారు చేసినట్లు. అదేవిధంగా జ్ఞానము, శ్రద్ధానము, ఆచరణ - ఈ మూడూ కలిసే ఫలాన్ని అందిస్తాయి. విడివిడిగా అయితే ప్రయోజనం శూన్యం.

వి: ఇంతకుముందు ఈ రత్నత్రయాన్ని గూర్చి సవిస్తరంగా అవాంతర భేదాలతో సహా నిరూపించాడు. వీటిని యథావిధిగా ఆచరిస్తే మోక్షానికి దారితీస్తాయి. మోక్షమంటే శరీరం వదిలి వెళ్ళడం కాదు. జీవించి ఉంటూనే ప్రాపంచిక ఆకర్షణ వలలో చిక్కుకోకుండా ఉండడం. చిక్కుకుంటే చేపలా గిలగిలా తన్నుకోవటమే.

అవ: జైనులు ఆత్మ, జీవుడు అనే వాటిని విశ్వసిస్తారు. అందుచేత ఆ జీవుని స్వరూపం ఏమిటో వివరించబోతున్నాడు.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

109. అత్ర సంక్షేపతస్తావత్ జీవాజీవాఖ్యే ద్వే తత్త్వే స్తః. తత్ర బోధాత్మకో జీవః, అబోధాత్మకస్తు అజీవః. తదుక్తం పద్మనన్దినా–

"చిదచిద్ ద్వే పరే తత్త్వే వివేకస్తద్వివేచనమ్,

ఉపాదేయముపాదేయం హేయంహేయం చ కుర్వతః.

హేయం హి కర్తు రాగాది తత్కార్యమవివేకితా,

ఉపాదేయం పరంజ్యోతిరుపయోగైకలక్షణమ్". ఇతి

మనస్విని

ఈ జైన సిద్ధాంతం ప్రకారం 'జీవ-అజీవ' అని తత్త్వాలు రెండు. వీటిలో జ్ఞాన స్వరూపుడు 'జీవుడు'. జడ స్వరూపం 'అజీవ' తత్త్వానిది. ఈ విషయమే 'పద్మనంది' అనే విద్వాంసుడు ఇలా చెప్పాడు –

"చిత్, అచిత్" అని రెండు పరతత్త్వాలు (ప్రధాన తత్త్వాలు). ఈ రెండింటి యొక్క వివేచనమే (విడదీసి చూడడమే) 'వివేకం'. మోక్షం కోసం ప్రయత్నించే సాధకుడు వీటిలో ఏది గ్రహింపదగినదో దానిని గ్రహించాలి. ఏది విడువ తగినదో దానిని త్యజించాలి. కర్త (మోక్ష సాధకుడు) రాగాదులను త్యజించాలి. ఎందుచేతనంటే వాటి కార్యము (అవి చేసేది) 'అవివేకిత్వము'. పరంజ్యోతి (ఉత్తమ తేజస్సు) గ్రహించాలి. ఎందుచేతనంటే దానియొక్క ఒకే ఒక లక్షణం 'ఉపయోగం'.

వి: ఉచితానుచిత పరిశీలన జ్ఞానం వివేకం. రాగ, ద్వేషాదులు ఆ వివేకానికి దూరం చేస్తాయి. అందుచేత వాటిని త్యజించాలి. మోక్ష మార్గానికి వెలుగు చూపే ఉత్కృష్టమైన తేజస్సును గ్రహించాలి. (దానిని గూర్చి తెలుసుకోవాలి)

అవ: శాస్త్రాలలో పారిభాషిక పదాలుంటాయని ఇంతకుముందు చర్చలో చెప్పబడింది. అలాంటిదే 'ఉపయోగం' అనే పదం. దాని అర్థాన్ని వీరి శాస్త్ర ప్రకారం వివరిస్తున్నాడు.

మూలమ్

110. సహజచిద్రూపపరిణతిం స్వీకుర్వాణే జ్ఞానదర్శనే ఉపయోగః. స పరస్పర ప్రదేశానాం ప్రదేశబన్ధాత్ కర్మణా ఏకీభూతస్య ఆత్మనః అన్యత్వప్రతిపత్తికారణం భవతి. సకలజీవ సాధారణం చైతన్యమ్ ఉపశమ క్షయ క్షయోపశమవశాత్ ఔపశమిక క్షయాత్మకక్షాయౌపశమికభావేన కర్మోదయవశాత్ కలుషాన్యాకారేణ చ పరిణతజీవ-

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వివక్షాయాం జీవస్వరూపం భవతి. యదవోచత్ వాచకాచార్యః -

"ఔపశమికక్షాయికౌ భావౌ మిశ్రశ్చ జీవస్య స్వతత్త్వమ్, ఔదయికపారిణామికౌ చ" (త.సూ 2.1) ఇతి.

అనుదయప్రాప్తిరూపే కర్మణ ఉపశమే సతి జీవస్య ఉత్పద్యమానః భావః ఔపశమికః. యథా పఙ్కే కలుషతాం కుర్వతి కతకాదిసంబంధాత్ అధః పతితే జలస్య స్వచ్ఛతా. (అర్హతతత్త్వానుసంధానవశాత్ రాగాదిపఙ్కప్రక్షాళనేన నిర్మలతాపాదకః క్షాయికః భావః. కర్మణః క్షయే సతి జాయమానో భావః క్షాయికః; యథా పఙ్కాత్ పృథగ్భూతస్య నిర్మలస్య స్ఫాటికాదిభాజనాన్తర్గతస్య జలస్య స్వచ్ఛతా. యథా మోక్షః. ఉభయాత్మా భావో మిశ్రః; యథా జలస్యార్ధస్వచ్ఛతా. కర్మోదయే సతి భవన్ భావః ఔదయికః. కర్మోపశమాద్యనపేక్షః సహజో భావః చేతనత్వాదిః పారిణామికః తదేతత్ యథా సంభవం భవ్యస్య అభవ్యస్య వా జీవస్య స్వరూపమ్ ఇతి సూత్రార్థః. తదుక్తం స్వరూపసంబోధనే-

"జ్ఞానాద్భిన్నో న నా భిన్నో భిన్నాభిన్నః కథంచన,
జ్ఞానం పూర్వాపరీభూతం సోఽయమాత్మేతి కీర్తితః". ఇతి

మనస్విని

సహజమైన చిద్రూప పరిణతిని స్వీకరిస్తూన్న జ్ఞాన-దర్శనాలకు 'ఉపయోగం' అని పేరు. ఈ ఉపయోగము పరస్పర అవయవాలతో కలయిక వల్ల కర్మతో కలసిపోయిన (కర్మనే ఆత్మ అనేది) ఆత్మ అన్యం (భిన్నం) అనే జ్ఞానానికి కారణం అవుతుంది. సకల జీవులకు సాధారణమైన (కామన్) అనగా అన్ని జీవులలోనూ ఒకే విధంగా ఉండే చైతన్యం వివిధ దశలను పొందుతుంది. అలా అవటానికి కారణం ఉపశమ-క్షయ-క్షయోపశమములు అనేవి. వీటిని బట్టి క్రమంగా ఔపశమిక భావం, క్షయాత్మక భావం, క్షాయౌపశమిక (క్షయ + ఉపశమ) భావం ఏర్పడతాయి. అదేవిధంగా కర్మోదయం (కర్మ ప్రారంభం) కారణంగా కలుషాకారంతోను, అకలుషాకారంతోను చివరగా పరిణతమైన జీవపర్యాయ వివక్షలో జీవస్వరూపం గాను అవుతుంది.

వాచకాచార్యులు ఈ విధంగా చెప్పారు -

"ఔపశమిక - క్షాయిక భావాలు, రెండింటి మిశ్రమ భావం, ఔదయిక - పారిణామిక భావాలు జీవుని స్వస్వరూపము (జీవుని స్వరూపము)."

కర్మకు ఫలోదయం (ఫలాన్నిచ్చే స్థితి) లేనపుడు అనగా "ఫలప్రాప్తి" లేకపోవడం అనే 'ఉపశమం' కలిగినపుడు జీవునిలో ఏర్పడే స్థితి 'ఔపశమిక భావం'.

బురదచేత కలుషమైన నీటిలో చిల్లగింజ వేసినపుడు ఆ బురద క్రిందికి పోయి దాని సాంగత్యాన్ని వీడి పైకి తేలిన స్వచ్ఛమైన జలం వంటిది ఈ స్థితి. అర్హతుడు బోధించిన తత్త్వాన్ని అనుసంధానం చేసికోవటం చేత రాగాదులనే పంకం (బురద) పూర్తిగా క్షాళితమైపోగా జీవునిలో నిర్మలత్వాన్ని కలిగించే స్థితి 'క్షాయిక భావం'. కర్మ పూర్తిగా నశించగా కలిగేది ఈ క్షాయిక భావం. ఇది పంకం నుండి పూర్తిగా వేరైన, మరొక స్ఫటిక పాత్రలో ఉంచబడిన స్వచ్ఛమైన జలం వంటిది. ఇదే మోక్షం. నీరు సగం స్వచ్ఛంగా, సగం కలుషమయంగా ఉభయరూపంగా ఉన్నట్లైతే అది 'క్షయ-ఉపశమ' రూపమైన మిశ్రమ భావం.

కర్మ ఫలాన్ని ఇవ్వటం కర్మోదయం, అదే ఔదయిక భావం. కర్మకు సంబంధించిన ఉపశమాదుల అపేక్ష లేని సహజమైన చేతనత్వాది భావం (స్థితి) పారిణామిక భావం. 'ఇది భవ్యజీవునిలోను, అభవ్య జీవునిలోను యథా సంభవంగా (ఆయా దశలను బట్టి) కనబడే స్వరూపం' అని సూత్రానికి అర్థం. 'స్వరూప సంబోధనం' అనే గ్రంథంలో ఈ విషయం వివరించబడింది.

"జీవాత్మ స్వరూపం ఎలాంటిదంటే అది జ్ఞానం కంటె వేరుకాదు, అలాగని రెండూ ఒక్కటే (అభిన్నం) కాదు. ఒక విధంగా ఇది (భిన్నాభిన్నము). అనగా భిన్నమూ, అభిన్నమూ కూడ. పూర్వం ఉన్నదీ తరువాత ఉన్నదీ అయిన జ్ఞానమే, జ్ఞానసంతతి (ప్రవాహం)యే ఆత్మ అని చెప్పబడుతుంది."

వి: సుదీర్ఘమైన ఈ ఘట్టంలో జీవుడు, చైతన్యము, జడము, క్రమిక పరిణామము, మోక్షము ఇత్యాది విషయాలన్నీ చెప్పబడ్డాయి. అయితే ఈ పదాలు అన్నీ 'తద్ధిత సమాస' రూపంలో ప్రయోగింపబడినాయి. అన్నీ భావార్థకాలే కాబట్టి అలా వివరించబడింది.

ఇందులో ప్రయోగించబడిన పారిభాషిక పదాలు కొన్ని అర్థం చేసుకోవాలి.

'ప్రదేశం' అంటే ఇక్కడ అర్థం 'అవయవం' అని.

'ప్రదేశ బంధం' అనగా అవయవాల పరస్పర మేళనం.

జైనులు చెప్పే ఈ 'అవయవాలు' శరీరావయవాలు కాదు. జీవునికీ, కర్మకూ ఉండే అవయవాలు. ఈ రెండింటి అవయవాలు పరస్పరం కలవడమే ప్రదేశ బంధం. ఈ బంధం కారణంగానే జీవుడు కర్మతో కలిసిపోతాడు. పైన (ఇంతకుముందు) పేర్కొన్న 'ఉపయోగం' కర్మతో కలిసిపోయిన జీవుణ్ణి వేరుగా గుర్తించేటట్లు చేస్తుంది.

మోక్ష సాధనకై ప్రయత్నించే క్రమంలో జరిగే ఈ పరిణామాలు ప్రత్యక్షాలు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కావు. ఇదంతా మనసులోనే జరిగే ఒకానొక ప్రక్రియ. సాధనామార్గంలోని సోపానాలను భిన్న భిన్న దర్శనాలు భిన్న భిన్న పదజాలంతో వర్ణిస్తాయి. కొంచెం ఆలోచించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే విషయం స్పష్టమవుతుంది.

ఏ మత చర్చనైనా వారి మాటలలో వినాలి. తరువాత వారి దృక్కోణం ఏమిటో తెలుసుకోవాలి. అన్ని దర్శనాల లక్ష్యమూ, గమ్యమూ మోక్షమే. ఎన్నుకున్న మార్గాలే వేరు. అందుచేత సమదృష్టీ, సమన్వయ దృష్టీ చాలా అవసరం.

అవ: జీవాత్మ, జ్ఞానాలు భిన్నం కాదు, ఒకటీ కాదు, భిన్నాభిన్నం అని ఏదైతే అన్నాడో దానికి ఒక అశంకను ముందుంచుకొని వివరిస్తున్నాడు.

మూలమ్

111. నను భేదిభేదయోః పరస్పరపరిహారేణ అవస్థానాత్, అన్యతపరస్యైవ వాస్తవత్వాత్ ఉభయాత్మకత్వమ్ అయుక్తమ్ ఇతి చేత్ - తదయుక్తమ్. బాధే ప్రమాణాభావాత్. అనుపలమ్భో హి బాధకం ప్రమాణామ్. న సోఽస్తి. సమస్తేషు వస్తుషు అనేకాన్తాత్మకత్వస్య స్యాద్వాదినో మతే సుప్రసిద్ధత్వాత్ ఇత్యలమ్.

మనస్విని

"భేదం అభేదం పరస్పరం ఒకదాన్నొకటి పరిహరిస్తూ ఉంటాయి కదా! భేదం ఉంటే అభేదం ఉండడానికి అవకాశం లేదు. అభేదం ఉంటే భేదానికి తావులేదు. ఏదో ఒకటే ఉండితీరాలి. మరి అలాంటప్పుడు 'ఉభయాత్మకం' (భిన్నాభిన్నం) అనడం ఎలా కుదురుతుంది? మీరు చెప్పేది యుక్తం కాదు" అన్నట్లయితే మీరనేది సరికాదు. ఈ రెండూ ఒకేచోట ఉండడం కుదరదు అనడానికి దానికి బాధ కలుగుతుంది అని చెప్పడానికి తగిన ప్రమాణం ఏదీ ఉపలబ్ధం కావడం లేదు కదా! అలాంటి ప్రమాణం ఉంటే మీ మాటను అంగీకరించవచ్చు. అదీగాక అనైకాంతికత్వాన్ని అంగీకరించే మా మతంలో 'అలా అయినా ఉండవచ్చును', 'ఇలా అయినా ఉండవచ్చును' అనే స్యాద్వాదాన్నే ఆశ్రయిస్తాం. ఇక ఈ వాదం ఇంతటితో చాలు.

వి: జైనులు 'స్యాద్ వాదులు'. ఇది ముందు ముందు స్పష్టమవుతుంది. అంతేకాదు 'ఏది ఎప్పుడు ఎలా ఉంటుందో' 'అంతా ఈశ్వరాధీనం' అనుకునే వారి ఆలోచనకు దగ్గరగా ఉంటుంది ఈ 'స్యాద్వాదం'.

అవ: జీవ, అజీవ స్వరూపాలను గూర్చి మూడు విధాల అభిప్రాయాలు పేర్కొనబడినాయి. వాటిలో మొదటి దానిని గూర్చి వివరించాడు. ఇప్పుడు మరొక

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అభిప్రాయాన్ని గూర్చి విశదీకరిస్తున్నాడు.

మూలమ్

112. అపరే పునః జీవాజీవయోః అపరం ప్రపంచమాచక్షతే - జీవాకాశధర్మాధర్మ పుద్గలాస్తికాయభేదాత్. ఏతేషు పఞ్చసు తత్త్వేషు కాలత్రయసంబన్ధితయా అస్తీతి స్థితివ్యపదేశః, అనేకప్రదేశకత్వేన శరీరవత్ కాయత్వవ్యపదేశః. తత్ర జీవాః ద్వివిధాః సంసారిణో ముక్తాశ్చ. భవాత్ భవాన్తరం ప్రాప్తిమన్తః సంసారిణః. తేఽపి ద్వివిధాః - సమనస్కాః అమనస్కాశ్చ. తత్ర సంజ్ఞినః సమనస్కాః. శిక్షాక్రియాలాప గ్రహణరూపా సంజ్ఞా. తద్విధురాస్తు అమనస్కాః, తే చ అమనస్కాః ద్వివిధాః - త్రస - స్థావరభేదాత్. తత్ర ద్వీన్ద్రియాదయః శఙ్ఖగణ్డోలకప్రభృతయః చతుర్విధాః త్రసాః. పృథివ్యప్తేజో-వాయువనస్పతయః స్థావరాః. తత్ర మార్గగతః ధూలిః పృథివీః. ఏవమ్ అబాదిష్వపి భేదచతుష్టయం యోజ్యమ్. తత్ర పృథివ్యాదికాయత్వేన గృహీతవన్తః గ్రహీష్యన్తశ్చ స్థావరాః గృహ్యన్తే, న పృథివ్యాదిపృథివీకాయాదయః; తేషామ్ అజీవత్వాత్. తే చ స్థావరాః స్పర్శనైకేన్ద్రియాః భవాన్తరప్రతివిధురాః ముక్తాః.

మనస్విని

మరికొందరు జీవ-అజీవాలను గూర్చి వేరొక విధంగా వివరిస్తారు. అది ఎలాగంటే వారు ఈ జీవాజీవ ప్రపంచాన్ని ఐదు భాగాలుగా చెపుతారు. అవి - 1. జీవాస్తికాయము, 2. ఆకాశాస్తికాయము, 3. ధర్మాస్తికాయము, 4. అధర్మాస్తికాయము, 5. పుద్గలాస్తికాయము. ఈ ఐదు తత్త్వాలూ మూడు కాలాలకు సంబంధించి ఉండడంచేత 'అస్తి' అని వాటి స్థితి చెప్పబడుతుంది. శరీరం లాగా అవయవాల కలయిక ఉండడం వల్ల 'కాయ' అని పదప్రయోగం. ఈ ఐదింటిలో మొదటిదైన జీవాస్తి కాయానికి సంబంధించి జీవులు రెండు విధాలు. 1. సంసారులు, 2. ముక్తులు.

సంసారులనగా ఒక పుట్టుక నుండి (భవాత్) మరొక పుట్టుకను (భవాంతరం) పొందే వాళ్ళు. వీరిలో కూడ సమనస్కులు, అమనస్కులు అని రెండు భేదాలు. సంజ్ఞ కలవి సమనస్కులు. ఈ సంజ్ఞ ఉపదేశం, పనిచేయడం, మాటలను గ్రహించడం అనే రూపంలో ఉంటుంది.

ఈ సంజ్ఞలేనివారు అమనస్కులు. మళ్ళీ ఈ అమనస్కాలు కూడా రెండు విధాలు. అవి - 1. త్రసములు, 2. స్థావరములు.

'త్రసములు' నాలుగు విధాలు. వీటిలో కొన్ని 1. రెండు ఇంద్రియాలు గలవి,

In Public domain. Digitization Muthulakshmi Research Academy

2. కొన్ని మూడు ఇంద్రియాలు కలవి, 3. కొన్ని నాలుగు ఇంద్రియాలు కలవి, 4. కొన్ని ఐదు ఇంద్రియాలు కలవి.

శంఖము, గండోలకము (బహుశా నత్తగుల్ల లాంటిదేమో?), శుక్తి (ముత్యపు చిప్ప) మొదలైనవి. ద్వి ఇంద్రియాలు (రెండు ఇంద్రియాలు కలవి). వీటికి త్వక్ (చర్మము), రసన (రుచిచూచే నాలుకవంటిది) రెండే ఉంటాయి.

చీమలు, పేలు మొదలైన వాటికి త్వక్, రసనతో బాటు వాసన చూచే ఘ్రాణేంద్రియం కూడా ఉంటుంది. ఇలా వీటికి మూడు ఇంద్రియాలు ఉంటాయి. ఈగలు, దోమలు, కందిరీగలు మొదలైన వాటికి చక్షు, త్వక్, రసన, ఘ్రాణేంద్రియం నాలుగు ఉంటాయి.

ఇక మనుష్య-పశు పక్ష్యాదులకు చక్షు, శ్రోత్ర, త్వక్, రసన, ఘ్రాణ అనే ఐదు ఇంద్రియాలు ఉంటాయి.

'స్థావరాలు' ఐదు విధాలు. 1. పృథివి, 2. నీరు, 3. తేజస్సు (అగ్ని), 4. వాయువు, 5. వనస్పతి (వృక్ష సంపద).

మార్గంలో ఉండే ధూళి పృథివి. అలాగే నీరు, నిప్పు, వాయువు, వృక్షాలు - ఇవన్నీ సుపరిచితాలే. ఈ పృథివ్యాదులను కాయంగా గ్రహించినవీ, గ్రహించబోయేవీ స్థావరాలు. అంతేకాని పృథివి మొదలైనవి స్థావరాలు కావు. స్థావరాలు 'అజీవాలు'. వాటికి స్పర్శనేంద్రియం (త్వక్) ఒకటే ఉంటుంది. మరొక పుట్టుక (జన్మ) లేనివారు ముక్తులు.

వి: 'పృథివీకాయం' ఇత్యాది శబ్ద ప్రయోగాలు జైనుల పారిభాషిక పదాలు. వీటిని గూర్చి ముందు ముందు స్పష్టమవుతుంది. 'అస్తికాయం' అనే వీరి వ్యవహారం కొంచెం విలక్షణమూ, అపరిచితమూ కూడ. అయితే చర్చను ఓపికగా, సమగ్రంగా అధ్యయనం చేస్తే దైనందిన జీవితంలో ఎదురయ్యే విషయాలే ఇందులోనూ కన్పిస్తాయి. పదాలు వేరైనా పరమార్థం ఒక్కటే అని గ్రహించాలి.

అవ: 'జీవ' స్వరూపం ఇంతవరకూ వివరించి మిగిలిన భేదాల వివరణకు ఉపక్రమిస్తున్నాడు.

మూలమ్

113. ధర్మాధర్మాకాశాస్తికాయాః తే ఏకత్వశాలినః నిష్క్రియాశ్చ; ద్రవ్యస్య దేశాన్తర-ప్రాప్తిహేతవః. తత్ర ధర్మాధర్మౌ ప్రసిద్ధౌ. ఆలోకేన అవచ్ఛిన్నే నభసి లోకాకాశపదవేదనీయే

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

తయోః సర్వత్ర అవస్థితిః, గతిస్థిత్యుపగ్రహః ధర్మాధర్మయోః ఉపకారః. అత ఏవ ధర్మాస్తికాయః ప్రవృత్త్యనుమేయః. అధర్మాస్తికాయః స్థిత్యను మేయః. అన్యవస్తుమధ్యే అన్యస్య వస్తునః ప్రవేశః అవగాహః. తదాకాశకృత్యమ్. **"స్పర్శరసగన్ధవర్ణవన్తః పుద్గలాః"** (త.సూ. 5.24). తే చ ద్వివిధాః అణవః స్కన్ధాశ్చ. భోక్తుమశక్యాః అణవః ద్వ్యణుకాద్యాః స్కన్ధాః. తత్ర ద్వ్యణుకాదిస్కన్ధభేదాత్ అణ్వాదిః ఉత్పద్యతే. అణ్వాదిసంఘాతాత్ ద్వ్యణుకాదిః ఉత్పద్యతే. **"క్వచిద్భేదసంఘాతాభ్యాం స్కన్ధోత్పత్తిః"** (త.సూ. 5.26). అత ఏవ **పూరయన్తి గలన్తీతి పుద్గలాః.**

మనస్విని

ధర్మాస్తికాయ - అధర్మాస్తికాయ - ఆకాశాస్తి కాయాలలో - జీవునికి వలె బహువిధాలు లేవు. వీటికి క్రియలు లేవు. అయితే ఇతరమైన వాటి స్థితి, గతులకు కారణమౌతాయి. ద్రవ్యాన్ని ఒక చోటినుండి మరొక చోటికి వెళ్ళడానికి ఉపకరిస్తాయి. ఇవి అన్నింటిలో సమానంగానే ఉంటాయి. వీటిలో ధర్మ, అధర్మాలు అందరికీ తెలిసినవే. ఈ ధర్మాధర్మాలు వెలుతురుతో నిండిన 'లోకాకాశం'లో అంతటా వ్యాపించి ఉంటాయి. జీవుల గతికి, స్థితికి ఉపకరించేవి ఈ ధర్మ అధర్మాలు. అందుచేతనే ప్రవృత్తిని (గమనాన్ని) బట్టి ధర్మాస్తికాయాన్ని అనుమాన ప్రమాణంచేత తెలుసుకోవచ్చు. అలాగే స్థితి (కదలకపోవడం)ని బట్టి అధర్మాస్తికాయం తెలుస్తుంది. ఒక వస్తువు యొక్క అవయవాల మధ్యలోకి మరొక వస్తువు ప్రవేశించడం "అవగాహం". ఇది ఆకాశం చేసే పని. ఇక పుద్గలాలను గూర్చి చూస్తే వీటికి స్పర్శ, రస, గంధ, వర్ణాలు ఉంటాయి. ఇవి రెండు విధాలు – అణురూపాలు, స్కంధ రూపాలు. అనుభవించడానికి శక్యం కానివి అణువులు. రెండు లేక అంతకంటె ఎక్కువ అణువుల కలయిక వలన ఏర్పడేవి స్కంధాలు. ఈ అణు సమూహము (సంకలనము) విచ్ఛిన్నమైతే అణువులుగా ఏర్పడతాయి. అణువులు దగ్గరగా చేరి సంఘటితమైతే స్కంధాలుగా మారతాయి. అందుచేతనే "పూరిస్తాయి, జారిపోతాయి" అనే వ్యుత్పత్తి చేత వీటికి 'పుద్గలాలు' అనే పేరు వచ్చింది.

వి: జీవుడు, శరీరం, జీవుని గతి, స్థితి – ఇత్యాదులు అన్నీ పైన చెప్పబడినాయి. ఆకాశం రెండు విధాలు. లోకాకాశం, అలోకాకాశం. మొదటిది లోకంతో సంబంధించినది. ధర్మాధర్మాస్తికాయాలు ఈ లోకాకాశంలో సంచరిస్తాయి. ధర్మాధర్మాలకు కూడా పుద్గలాలుంటాయి. ధర్మం జీవుని గతికి (గమనానికి) కారణం (ఉపకారం) అవుతుంది? అధర్మం స్థితికి (కదలకుండా ఉండడానికి) ఉపకారం అవుతుంది.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఇక స్పర్శ, రస, గంధ, వర్ణాలు వాటి భేదాలు ఇలా ఉంటాయి.

స్పర్శ: కఠినము, మృదువు, గురువు, లఘువు, శీతము, ఉష్ణము, స్నిగ్ధము, రూక్షము అని ఎనిమిది విధాలు.

రసం: చేదు, కారము, వగరు, పులుపు, మధురము అని అయిదు విధాలు.

గంధం: సురభి (సుగంధం), అసురభి (దుర్గంధం) అని రెండు విధాలు.

వర్ణం: నలుపు, నీలము, ఎరుపు, పసుపు, తెలుపు అని వర్ణం ఐదు విధాలు.

పుద్గలాలు రెండు విధాలు - 1. అణువులు, 2. స్కంధాలు

అవ: ఇంతవరకు జీవుడు, పుద్గలము (ఇది సాధారణంగా చెప్పబడే శరీరం), ధర్మ, అధర్మ, ఆకాశాల స్వరూపం, వాటి వాటి గుణాలు వివరించబడినాయి. ఇప్పుడు కాలం కూడా ద్రవ్యమే అంటూ వర్ణిస్తూ, మొత్తంగా ఆరు ద్రవ్యాలు అని అంగీకరించి, ఈ ఆరింటిలో ఉండే విశేషాలను చెపుతున్నాడు. వీటన్నింటినీ అన్వయించుకుంటే సృష్టి, స్థితి, లయల స్వరూపం, జీవుల భవాంతర ప్రాప్తి ఇత్యాదులు సుస్పష్టమౌతాయి.

మూలమ్

114. కాలస్య అనేక ప్రదేశత్వాభావేన అస్తికాయత్వాభావేఽపి ద్రవ్యత్వమ్ అస్తి. తల్లక్షణయోగాత్. తదుక్తమ్ - **"గుణపర్యాయవత్ ద్రవ్యమ్"** (త.సూ. 5.38) ఇతి. **"ద్రవ్యాశ్రయాః నిర్గుణా గుణాః"** (త. సూ. 5-39). యథా జీవస్య జ్ఞానత్వాదిధర్మరూపాః, పుద్గలస్య రూపత్వాది సామాన్యస్వభావాః, ధర్మాధర్మాకాశ కాలానాం యథాసంభవం గతిస్థిత్యవగాహవర్తనా హేతుత్వాది సామాన్యాని గుణాః తస్య ద్రవ్యస్య ఉక్తరూపేణ వర్తనం పర్యాయః. ఉత్పాదః, తద్భావః, పరిణామః, పర్యాయ ఇతి పర్యాయాః. యథా జీవస్య ఘటాదిజ్ఞానసుఖశ్లేశాదయః, పుద్గలస్య మృత్పిణ్డఘటాదయః. ధర్మాదీనాం గత్యాదివిశేషాః. అత ఏవ షడ్ ద్రవ్యాణీతి ప్రసిద్ధిః.

మనస్విని

కాలానికి అనేక అవయవాలు లేకపోవటంచేత 'అస్తికాయత్వం' అనేది లేకపోయినప్పటికీ దానికి ద్రవ్యత్వం ఉంది. ఎందుచేతనంటే దానికి ద్రవ్యత్వ లక్షణం ఉంది కాబట్టి. "గుణ పర్యాయాలు కలిగినది ద్రవ్యం" అని ద్రవ్యం యొక్క లక్షణం. ద్రవ్యాన్ని ఆశ్రయించి ఉండేవి గుణాలు. అయితే గుణాలకు మళ్ళీ గుణాలు అంటూ ఉండవు. అవి నిర్గుణాలు.

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

(ఈ ద్రవ్య గుణాల స్వరూపం ఎలాగంటే) జీవునికి జ్ఞానత్వం అనేది ధర్మం. ద్రవ్యంతోపాటు ఎల్లప్పుడూ కలిసి ఉండే ధర్మమే 'గుణం'. తరువాత క్రమంగా ఏర్పడేది 'పర్యాయం'. పుద్గలాలకు రూపత్వాది సామాన్య స్వభావాలైన గుణాలు, ధర్మానికి గతీ, అధర్మానికి స్థితీ, ఆకాశానికి అవగాహత్వం, కాలానికి వర్తనాహేతుత్వం (నడిపించడం) గుణాలు.

ద్రవ్యము ఆయా అవస్థా విశేషాలతో ఉండడం 'వర్తన'. ఉదాహరణకి బియ్యం అన్నం రూపంలో, పాలు పెరుగు రూపంలో, బీజం అంకురాది రూపంలో ఉండడం. క్రొత్తది పాతదై పోవడం. ఇదంతా కాలాధీనం. ఈ విధంగా ద్రవ్యంలో క్రమ పరిణామమే 'పర్యాయం'. ఉత్పాదము (పుట్టుక), తద్భావం (ఏ స్వరూపంలో ఉంటాయో అలాగే ఉండడం), పరిణామం (మార్పు చెందడం), పర్యాయం – ఇవన్నీ 'పర్యాయ' పదాలు.

ఇదంతా ఎలాగంటే – జీవునికి ఘటాదుల (విషయాల) జ్ఞానము, సుఖ, క్లేశాదుల అనుభూతి, పుద్గలానికి మట్టి ముద్ద, ఘటము, ధర్మాదులకు గత్యాది విశేషాలు (ఇంతవరకు చెప్పుకున్నవే) పర్యాయాలు. గుణాలూ, పర్యాయాలు ఉండటం చేతనే ఈ ఆరింటికీ ద్రవ్యాలు అని ప్రసిద్ధి.

వి: పైన చెప్పబడిన చర్చ ద్వారా జీవుడు, పుద్గలం (జీవుడు, శరీరం) - జననము, గతి, స్థితి ఇత్యాదులన్నీ జైన మతానుసారం ఆయా పదజాలంతో వివరించబడినాయి. ఇది కొందరు జైనుల సిద్ధాంతం.

అవ: మరికొందరు జైనులు తత్త్వాల సంఖ్యనూ, స్వరూపాన్నీ వేరుగా చెపుతారు. అదే ముందు ముందు వివరించబడుతుంది.

మూలమ్

115. కేచన సప్తతత్త్వానీతి వర్ణయన్తి. తదాహ – "జీవాజీవాస్రవబన్ధసంవరనిర్జర మోక్షాస్తత్త్వాని" (త.సూ. 1.4) ఇతి. తత్ర జీవాజీవౌ నిరూపితౌ. ఆస్రవో నిరూప్యతే. ఔదారికాదికాయాదిచలనద్వారేణాత్మనః చలనం యోగపదవేదనీయమ్ ఆస్రవః. యథా సలిలావగాహి ద్వారం జలాద్యాస్రవణకారణత్వాత్ ఆస్రవః ఇతి నిగద్యతే, తథా యోగ ప్రణాడికయా కర్మ ఆస్రవతీతి సః యోగః ఆస్రవః. యథార్ద్రం వస్త్రం సమన్తాత్ వాతానీతం రేణుజాతమ్ ఉపాదత్తే తథా కషాయజలార్ద్రః ఆత్మా యోగానీతం కర్మ సర్వప్రదేశైః గృహ్ణాతి. యథా వా నిష్టప్తాయః పిణ్డో జలే క్షిప్తః అమ్భః సమన్తాత్ గృహ్ణాతి తథా కషాయోష్ణో జీవః యోగానీతం కర్మ సమన్తాత్ ఆదత్తే. కషతి హినస్తి ఆత్మానం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కుగతిప్రాపణాత్ ఇతి కషాయః, క్రోధః, మానః, మాయా, లోభశ్చ. స ద్వివిధః శుభా-శుభభేదాత్. అత్ర అహింసాదిః శుభః కాయయోగః, సత్యమిత హితభాషణాదిః శుభో వాగ్యోగః. అర్హత్సిద్ధాచార్యో పాధ్యాయ సాధునామధేయపఞ్చ పరమేష్ఠిభక్తితపోరుచి-శ్రుతవినయాదిః శుభో మనోయోగః. ఏతద్విపరీతస్తు అశుభః త్రివిధః. యోగః, తదేతదా-స్రవభేదప్రభేదజాతం- **"కాయవాఙ్మనః కర్మయోగః; స ఆస్రవః; శుభః పుణ్యస్య; అశుభః పాపస్య"** (త.సూ. 6.1-4) ఇత్యాదినా సూత్ర సందర్భేణ ససంరమ్భమ్ అభాణి. అపరే తు ఏవం మేనిరే - "ఆస్రవయతి పురుషం విషయేషు ఇన్ద్రియప్రవృత్తిః ఆస్రవః; ఇన్ద్రియద్వారా హి పౌరుషం జ్యోతిః విషయాన్ స్పృశత్ రూపాదివిజ్ఞానరూపేణ పరిణమతే" ఇతి.

మనస్విని

కొందరు తత్త్వాలు ఏడు అని చెపుతారు. అది ఇలా చెప్పబడింది - "జీవ-అజీవ-ఆస్రవ-బంధ-సంవర-నిర్జర-మోక్ష - అనునవి తత్త్వములు." వీటిలో 'జీవ-అజీవ' రెండింటినీ గూర్చి ఇంతకుముందే నిరూపించబడింది. ఇక 'ఆస్రవం' నిరూపించ బడుతుంది. ఔదారికాది కాయాదుల చలనం ద్వారా ఆత్మలో ఏర్పడే చలనం 'ఆస్రవం'. దీనినే 'యోగం' అని అంటారు. ఏవిధంగానైతే నీటిలో మునిగి ఉన్న ద్వారా (వాహిక, గొట్టం) నీరు పారడానికి కారణమైనందువలన 'ఆస్రవము' అనబడుతుందో, అదేవిధంగా 'యోగ'మనే ప్రణాళిక (గొట్టం) ద్వారా కర్మ స్రవిస్తుంది, అదే 'యోగము' అనబడే 'ఆస్రవము'. అది ఎలాగంటే 'ఆర్ద్రవస్త్రం (తడిగా ఉండే బట్ట) గాలితో కొట్టుకు వచ్చిన ధూళిని (తుడిచినప్పుడు) అంతనీ గ్రహించినట్లుగా 'కషాయం' అనబడే జలంతో తడిసిన ఆత్మ యోగం (ఆస్రవం) ద్వారా తీసుకురాబడిన కర్మను అన్ని ప్రదేశాలచేతా (ప్రదేశం అంటే అవయవం) గ్రహిస్తుంది.' (మరొక ఉదాహరణం). "బాగా కాల్చబడిన ఇనుప గుండు (గోళం) నీటిలో వేసినపుడు చుట్టూ ఉన్న నీటిని ఎలాగైతే గ్రహిస్తుందో, అలాగే 'కషాయ'మనే ఉష్ణంతో కూడిన జీవుడు యోగం ద్వారా తీసుకురాబడిన కర్మను అన్ని వైపుల నుండీ తీసుకుంటాడు." "దుర్గతికి చేర్చడం ద్వారా ఆత్మను 'కషతి' అనగా హింసిస్తుంది కావున కషాయం అని పేరు." క్రోధం, మానం, మాయం, లోభం - వీటికి కషాయం అనిపేరు. ఈ 'యోగం' రెండు విధాలు. 1. శుభయోగం, 2. అశుభయోగం. ప్రతిదీ మనో, వాక్, కాయాల భేదంచేత మూడు మూడు విధాలు. వాటిలో అహింసాదులు 'శుభకాయయోగం'. సత్యవాక్కు మితభాషణం, హితభాషణం మొదలైనవి

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

'శుభవాగ్యోగం'. అర్హతుడు, సిద్ధులు (తపస్సు చేత సిద్ధిని పొందినవారు). ఆచార్యులు, ఉపాధ్యాయులు, సాధువులు - ఈ ఐదు విధాల వారు, అదేవిధంగా పరమేష్ఠియందు భక్తి, తపస్సు నందు ఆసక్తి, శ్రుతం (విద్య), వినయము - ఇవన్నీ శుభ 'మనోయోగం'. వీటికి విరుద్ధమైనవి 'అశుభయోగం'. అది కూడా మూడు విధాలు. ఈ విధంగా ఆస్రవ, భేద, ప్రభేదాలు - 'కాయవాఙ్మనః...' ఇత్యాది సూత్రాలలో సంరంభంగా (ప్రయత్నపూర్వకంగా) చెప్పబడింది. కాయ-వాక్-మనస్సుల ద్వారా ఆత్మ యొక్క అవయవాలతో కర్మ సంబంధించడం 'యోగం'. అదే ఆస్రవం. ఇది పుణ్యకర్మయోగం అయితే శుభయోగం, పాపకర్మయోగం అయితే అశుభయోగం.

మరికొందరు 'ఆస్రవం' గూర్చి ఇలా భావించారు - "పురుషుణ్ణి ఇంద్రియాలవైపు జారిపోయేట్లు చేస్తుంది కావున 'ఇంద్రియ ప్రవృత్తి' ఆస్రవం. ఆత్మజ్యోతి ఇంద్రియాల ద్వారా విషయాలను స్పృశించి, రూపాది విజ్ఞానరూపంలో పరిణమిస్తుంది."

వి: ఏడు తత్త్వాలు - జీవ, అజీవ, ఆస్రవ, బంధ, సంవర, నిర్జర, మోక్షము అనబడతాయి.

వీటి స్వరూపాలు -

1. జీవుడు చేతన స్వరూపుడు. జ్ఞానాది భేదాన్ని బట్టి జీవభేదాలుంటాయి.
2. జడము అజీవము.
3. శుభాశుభకర్మలు వచ్చి చేరే ద్వారం - ఆస్రవం.
4. ఆత్మ యొక్క అవయవాలు, కర్మ యొక్క అవయవాలు కలవటం బంధం.
5. ఆస్రవాలను అడ్డుకొనడం 'సంవరం'.
6. కర్మలు శిథిలం కావడం 'నిర్జరం'.
7. కర్మ క్షయం 'మోక్షం'.

ఇక ఔదారికాది కాయాలను గూర్చి సూత్రకారులు ఇలా చెప్పారు. "ఔదారిక వైక్రియిక ఆహారక తైజస కార్మణాని శరీరాణి" అని ఐదు విధాల శరీరాలను గూర్చి వివరించారు.

'శరీరం అనే పదానికి అర్థం - 'శీర్యతే ఇతి శరీరమ్' - అనగా క్షీణించి, నశించేది.

1. 'ఔదారిక కాయం' అనగా స్థూల (కంటికి కనబడే శరీరం. 'ఉదారం' అనగా 'స్థూలం' అని అర్థం.

2. 'వైక్రియిక శరీరం' అనగా 'విక్రియ' మార్పునకు ఉపయోగించేది. ఇది

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కంటికి కనబడనిది.

3. 'ఆహారక శరీరం' – సూక్ష్మ శరీరం. దీనికి సూక్ష్మ వస్తువులను తెలిసికొనగలిగే శక్తి ఉంటుంది.

4. 'తైజసశరీరం' – ఇది 'ఆహారక శరీరం' కన్నా సూక్ష్మతరమైనది.

5. 'కార్మణ శరీరం' – ఇది 'తైజసశరీరం' కన్నా సూక్ష్మమైనది.

'శుభకాయయోగం' – భేదాలు వివరించబడినాయి. అశుభకాయయోగం భేదాలు ఇలా ఉంటాయి.

1. అశుభవాగ్యోగం :– అసత్య భాషణం, పరుషవాక్య ప్రయోగం ఇత్యాది.

2. అశుభ మనోయోగం :– ఇతరుల చెడు కోరటం, ఈర్ష్య అసూయ ఇత్యాది.

3. అశుభకాయయోగం :– శరీర సంచలనం వల్ల కలిగే ఆత్మావయవసంచలనం.

ఈ వివరణ అంతా పరిశీలిస్తే ఆస్తికదర్శనాలకూ – నాస్తిక దర్శనాలకూ (చార్వాకం తప్ప) నియమాలలో అంతగా భేదం కనుపించదు. శబ్దజాల విన్యాసంలోనే భేదం. ప్రతిదర్శనానికీ, శాస్త్రానికీ వాటి వాటికి పరిమితమైన పారిభాషిక పదాలుంటాయి. కానీ అంతర్లీనంగా ఉండే మానవతా సూత్రం ఒక్కటే అనిపిస్తుంది.

అవ: బంధమంటే ఏమిటో వివరిస్తున్నాడు.

మూలమ్

116. మిథ్యాదర్శనావిరతిప్రమాదకషాయవశాత్ యోగవశాచ్చ ఆత్మా సూక్ష్మైక క్షేత్రావగాహినామ్ అనన్యప్రదేశానాం పుద్గలానాం కర్మబన్ధయోగ్యానామ్ ఆదానమ్ ఉపశ్లేషణం యత్ కరోతి స బన్ధః. తదుక్తమ్ – **"సకషాయత్వాత్ జీవః కర్మభావయోగ్యాన్ పుద్గలానాదత్తే స బన్ధః"** (త.సూ. 8.2) ఇతి. తత్ర కషాయ గ్రహణం సర్వబన్ధహేతూపలక్షణార్థమ్. బన్ధహేతూన్ పపాఠ వాచకాచార్యః – **"మిథ్యాదర్శనావిరతిప్రమాదకషాయయోగాః బన్ధహేతవః"** (త.సూ. 81) ఇతి. మిథ్యాదర్శనం ద్వివిధమ్ – మిథ్యాకర్మోదయాత్ పరోపదేశానపేక్షం తత్త్వాశ్రద్ధానం నైసర్గికమేకమ్; అపరం పరోపదేశజమ్. పృథివ్యాదిషట్కోపాదానం షడిన్ద్రియాసంయమనం చావిరతిః. పఞ్చసమితిత్రిగుప్తిషు అనుత్సాహః ప్రమాదః. కషాయః క్రోధాదిః. తత్ర కషాయాన్తాః స్థిత్యనుభవబన్ధహేతవః. ప్రకృతిప్రదేశబన్ధహేతుః యోగః ఇతి విభాగః

మనస్విని

మిథ్యా దర్శనం – అవిరతి – ప్రమాద – కషాయాల కారణంగానూ, యోగం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వలనా కూడా ఆత్మ సూక్ష్ములైన, ఒకే క్షేత్రంలో (శరీరంలో) ప్రవేశించేవీ, అనంతములైన అవయవాలు గలవీ, కర్మబంధానికి తగినవి అయిన పుద్గలాలతో వేరుచేయడానికి వీలు లేనంతగా కలిసిపోవడం బంధం.

"కషాయాలతో కూడిన జీవుడు కర్మగా మారడానికి తగిన పుద్గలాలను గ్రహిస్తాడు. అలా గ్రహించడమే బంధం" అని సూత్రంలో చెప్పబడింది. 'కషాయ' పదం తీసుకోవడం అన్ని బంధహేతువులకూ ఉపలక్షణంగా చెప్పబడింది. వాచకాచార్యుడు బంధహేతువులను ఇలా చెప్పాడు– "మిథ్యాదర్శన బంధహేతవః" అనగా మిథ్యా దర్శనం - అవిరతి - ప్రమాద - కషాయ - యోగాలు బంధహేతువులు. వీటిలో మిథ్యా దర్శనం రెండు విధాలు. 1. మిథ్యాకర్మ ఉదయించడం వలన పరోపదేశం అవసరం లేకుండానే తత్త్వ విషయంలో సహజంగా ఏర్పడే అశ్రద్ధ. 2. పరోపదేశం (ఇతరులు చెప్పడం) వలన కలిగే అశ్రద్ధ. అవిరతి అనగా "పృథివి - ఆప - తేజ - వాయు - స్థావర - జంగమ రూపాలైన ఆరువిధాల పుద్గలాస్తి కాయాన్ని గ్రహించడం, ఆరు ఇంద్రియాలను నియంత్రించుకోకపోవటం. ఇక ప్రమాదం అనగా పంచ సమితి (ఇంతకు ముందు చెప్పబడింది), త్రిగుప్తి - వీటి విషయంలో నిర్లక్ష్య భావం. క్రోధాదులు కషాయం. ఇవి స్థితి అనుభవబంధాలకు హేతువులు. యోగం ప్రకృతి ప్రదేశ బంధాలకు హేతువు.

వి: ఉపలక్షణం అనగా చెప్పవలసిన వాటిలో ఒక అంశాన్నే చెప్పటం. ఉదాహరణకు "కాకులు పెరుగు తినకుండా చూడు" అని అంటే కేవలం కాకులే కాదు ఇతరమైన పిల్లి మొదలైనవి కూడా పెరుగును తినకుండా చూడాలి అని అర్థం. ఇక్కడ 'కాకులు' అని చెప్పటం ఉపలక్షణం.

అదేవిధంగా మిథ్యా దర్శనాదులను గూర్చి సంక్షిప్తంగా చెప్పుకుంటే విషయం గహనంగా అనిపించదు.

1. బంధం - ఆత్మ పుద్గలాలతో (శరీరాలతో కలవటం)
2. మిథ్యాదర్శనం - సమ్యక్ దర్శనం లేకపోవటం
3. అవిరతి - విరక్తి లేకపోవటం
4. ప్రమాదం - అజాగ్రత, నిర్లక్ష్యం
5. కషాయం - రాగద్వేషాదులు

అవ: బంధానికి గల కారణాలను వివరించి బంధం ఎన్నివిధాలో సవిస్తరంగా ప్రతిపాదిస్తున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

117. బన్ధః చతుర్విధ ఇత్యుక్తమ్ – **"ప్రకృతిస్థిత్యనుభవప్రదేశాః తద్విధయః"** (త.సూ. 8.3) ఇతి. యథా నిమ్బగుడాదేః తిక్తత్వమధురత్వాదిస్వభావః ఏవమ్ ఆవరణీయస్య జ్ఞానదర్శనావరణత్వమ్, ఆదిత్యప్రభాచ్ఛాదకామ్భోధరవత్, ప్రదీప ప్రభాతిరోధాయకకుమ్భవచ్చ. సదసద్వేదనీయస్య సుఖదుఃఖోత్పాదకత్వమ్ అసిధారా మధులేహనవత్. దర్శనే మోహనీయస్య తత్త్వార్థాశ్రద్ధానకారిత్వం దుర్జనసంగవత్. చారిత్రే మోహనీయస్య అసంయమహేతుత్వం మద్యమదవత్. ఆయుషః దేహబన్ధ కర్తృత్వం జలవత్. నామ్నః విచిత్రనామకారిత్వం చిత్రికవత్. గోత్రస్య ఉచ్చనీచకారిత్వం కుమ్భకారవత్. దానాదీనాం విఘ్ననిదానత్వమ్ అన్తరాయస్య స్వభావః కోశాధ్యక్షవత్. సోఽయం ప్రకృతిబన్ధః అష్టవిధః ద్రవ్యకర్మావాన్తరభేద వేదనీయః. తథా చ అవోచదుమాస్వాతివాచకాచార్యః – **"ఆద్యో జ్ఞానదర్శనావరణ వేదనీయమోహనీయా-యుర్నామగోత్రాన్తరాయాః"** (త.సూ. 8.4) ఇతి. తద్భేదం చ సమగృహ్ణాత్ – **"పఞ్చనవద్వ్యష్టావింశతిచతుర్ద్విచత్వారింశద్విపఞ్చభేదా యథాక్రమమ్"** (త. సూ. 8.4) ఇతి. ఏతచ్చ సర్వం విద్యానన్దాదిభిః వివృతమితి విస్తరభయాత్ న ప్రస్తూయతే.

మనస్విని

బంధము నాలుగు విధాలని చెప్పబడింది. ప్రకృతి – స్థితి – అనుభవ – ప్రదేశ అనేవి దాని భేదాలు. వేప, బెల్లాలకు చేదు, తీపి అనేవి ఎలాగైతే స్వభావాలో గుణాలో అదేవిధంగా ఆవరణీయ కర్మకు 'ఆవరణం' చేయటమే (కప్పివేయటమే) స్వభావం. అది ఎలా ఉంటుందంటే సూర్యకాంతిని మబ్బు కప్పివేసినట్లు, దీపకాంతిని కుండ కప్పివేసినట్లుగా ఉంటుంది. ఈవిధంగా జ్ఞానాన్నీ, దర్శనాన్నీ ఆవరణీయం కప్పివేస్తుంది. సత్, అసత్ రెండువిధాలుగా ఉండే వేదనీయ (అనుభవ వేద్యమైన) కర్మ కత్తి అంచున ఉన్న తేనెనాస్వాదించినట్లు సుఖదుఃఖాలు రెండింటినీ కలిగిస్తుంది. మోహనీయం (ఏమి తెలియకుండా చేసేది) అయిన కర్మ దుర్జనసాంగత్యం (చెడువారితో స్నేహం) లాగా తత్త్వార్థం పట్ల అశ్రద్ధను కలుగజేస్తుంది. తద్వారా సమ్యక్ దర్శనం జరుగదు. ఈ మోహనీయ కర్మయే చారిత్రం విషయంలో మద్యం మత్తులాగా సంయమాన్ని కోల్పోవటానికి కారణమౌతుంది. 'ఆయువు' దేహబంధాన్ని కలిగిస్తుంది. (శరీరంలో ఆత్మను బంధిస్తుంది). అది ఎలాగంటే నీటిలో ఉన్న వాళ్లను నీరు అన్నివైపుల నుండి చుట్టేసి తనలో బంధించినట్లు. (ఆ జలంలోంచి బయట పడాలంటే

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఈదులాడాల్సిందే). నామకర్మ (పేరు) చిత్రకారునిలా విచిత్రమైన పేర్లకు కారణ మవుతుంది. గోత్ర కర్మ కుమ్మరిలాగా శరీరాలలో ఉచ్చ, నీచ అవస్థలను కలిగిస్తుంది. అంతరాయ కర్మ దానాదులకు అడ్డుపడే కోశాధ్యక్షునిలా మంచి పనులకు ఆటంకం కలిగిస్తుంది. ఈవిధంగా ప్రకృతిబంధం ఎనిమిది విధాలు. దీన్ని తెలుసుకోవాలంటే ధర్మాధర్మ రూపమైన కర్మ యొక్క అవాంతర భేదాల మూల స్వభావాన్ని తెలుసుకోవడం అవసరం. ఈ విషయాన్నే ఉమాస్వాతికాచార్యులు "మొదటిదైన ఈ ప్రకృతిబంధము జ్ఞానదర్శనావరణాది భేదాల చేత ఎనిమిది విధాలు అని తెలుసుకోవాలి" అని చెప్పారు.

వి: ప్రకృతి బంధము అంటే ఏమిటో ఎన్ని విధాలో పైన చెప్పారు. సాధారణమైన మాటల్లో "వీడికి కళ్లు కనబడటం లేదు, ఒళ్లు తెలియటం లేదు" అని అహంకారులను గూర్చి అంటుంటారు. ఆవిధంగా ఉన్న స్థితిని కప్పివేసేదే ఆవరణం. దానికి కారణం కర్మ. ఈ విషయాన్నే చాలా చక్కగా వారిదైన పద్ధతిలో వివరించారు జైనాచార్యులు.

ఎనిమిది విధాలైన ప్రకృతిబంధ స్వరూపం –

1. జ్ఞానావరణం – జ్ఞానాన్ని కప్పివేసేది.
2. దర్శనావరణం – దృష్టిని (ఆలోచనను) కప్పివేసేది.
3. వేదనీయం – తెలిసేటట్లు చేసేది.
4. మోహనీయం – మోహింపజేసేది
5. ఆయువు – ఆత్మ, శరీరాలను బంధించి ఉంచేది.

వీటిన్నింటికీ తిరిగి అవాంతర (వాటిలో వాటికి) భేదాలున్నాయి. ఈ భేదాలన్నింటిని గూర్చి సూత్రకారుడు సంగ్రహంగా చెప్పాడు. విద్యానందాదులు వాటిని వివరించి ఉన్నారు. వాటన్నింటినీ ఇక్కడ చెప్పాలంటే గ్రంథం చాలా పెద్దదిగా అవుతుంది. అందుచేత అవి ప్రస్తావించబడలేదు.

6. నామ – పేరు
7. గోత్రం – గోత్రము
} ఈ రెండూ లోక వ్యవహారం కొరకే.

8. అంతరాయం – ఆటంకం.

వీటిలో జ్ఞానావరణం ఐదు విధాలు. వేదనీయం రెండు విధాలు. మోహనీయం ఇరవై ఎనిమిది విధాలు. ఆయుస్సు నాలుగు విధాలు. నామ నలభై రెండు విధాలు. గోత్రం రెండు విధాలు. అంతరాయం ఐదు విధాలు. ఇవన్నీ 'సర్వార్థసిద్ధి' అనే గ్రంథంలో వివరించబడినాయి.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ: ప్రకృతిబంధం వివరించిన తరువాత స్థితి, అనుభవ, ప్రదేశ బంధాలను వివరిస్తున్నాడు.

మూలమ్

118. యథా అజాగోమహిష్యాదిక్షీరాణామ్ ఏతావన్తమ్ అనేహసం మాధుర్యస్వభావాదప్రచ్యుతిస్థితిః తథా జ్ఞానావరణాదీనాం మూలప్రకృతీనామ్ ఆదితః తిసృణామ్, అన్తరాయస్య చ **"త్రింశత్సాగరోపమకోటికోట్యః పరా స్థితిః"** (త.సూ. 8.14) ఇత్యాద్యుక్త-కాలా దుర్దాన్తవత్ స్వీయస్వభావాత్ అప్రచ్యుతిస్థితిః. యథా అజాగోమహిష్యాదిక్షీరాణాం తీవ్రమన్దాదిభావేన స్వకార్యకరణే సామర్థ్యవిశేషః అనుభావః తథా కర్మపుద్గలానాం స్వకార్యకరణే అనుభావః. కర్మభావపరిణత పుద్గలస్కన్ధానామ్ అనన్తప్రదేశానామ్ ఆత్మప్రదేశాను ప్రవేశః అనుబన్ధః.

మనస్విని

ఏవిధంగానైతే మేక, ఆవు, గేదె మొదలైన వాటి పాల మాధుర్యం. కొంత కాలం (కొంతసేపు) స్వభావం నుండి జారకుండా ఉంటుందో (పాడవకుండా ఉంటుందో, అదేవిధంగా మూల ప్రకృతులైన మొదటి మూడు ఆవరణలకు (జ్ఞాన, దర్శన, వేదనీయాలకు) మరియు అంతరాయానికి "ముప్పై సాగరోపమకోటుల కోట్లు అత్యధికమైన స్థితి" అని చెప్పబడిన కాలం పాటు స్థితి ఉంటుంది. అది ఎలాగంటే మదించిన ఏనుగు మదం కూడా కొంత కాలావధికే పరిమితమై ఉంటుంది. అదే స్థితి. కాలాంతరంలో తొలగిపోతుంది. అలాగే జ్ఞానావరణాదుల స్వభావం కూడా అతిదీర్ఘకాలం అలాగే ఉంటుంది. ఇదే స్థితిబంధం. ఏవిధంగానైతే మేక, గోవు, మహిషాల యొక్క క్షీరాలు (పాలు) వాటి వాటి సామర్థ్య విశేషం చేత అవి చేయాల్సిన పనిని చేస్తాయో అదేవిధంగా తీవ్ర, మంద,మధ్యమ (వేగంగా, మెల్లిగా, మధ్యస్థంగా) భేదాలతో కార్యం జరుగుతుంది. సామర్థ్య విశేషమే అనుభవము. ఆయా కార్యకరణంలో ఉండడమే బంధం. ఈ క్షీరాదులు వలెనే కర్మ పుద్గలాలు పనిచేస్తాయి. ఇక కర్మల రూపంలో పరిణమించిన (మారిన) పుద్గలాల, స్కంధాల యొక్క అనంత ప్రదేశాలు ఆత్మావయవాలతో పాలు నీరు లాగా కలిసిపోవటం ప్రదేశబంధం.

(ఈ విషయం ఇంతకు ముందు ప్రస్తావించబడింది. పుద్గలాలు, స్కంధాలు వాటి స్వరూపం ఇత్యాది ఇది వరకే చర్చించబడినాయి.)

వి: ఇంతకు ముందు ప్రదేశ, అవయవ, పుద్గల, స్కంధ - ఇత్యాది పదాల

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

అర్థాలు వివరించబడినాయి. ఈ విధంగా నాలుగు విధాల బంధ స్వరూపం నిరూపించబడింది. బంధం యొక్క స్వరూపం తెలిస్తేనే గదా మోక్షానికి ప్రయత్నించేది. ఈ భవబంధం యొక్క సంకెళ్లు కంటికి కనబడవు. కానీ ఇనుప సంకెళ్ల కంటే దృఢమైనవి. వదల్చుకోవాలంటే బిగుసుకుంటూ ఉంటాయి.

అవ: బంధం గూర్చి తెలిపిన ఆచార్యుడే మోక్షాన్ని గూర్చి కూడా తెలియజేయాలి. అందుచేత జైనాచార్యుడు తరువాతి దశలను వివరిస్తున్నాడు.

మూలమ్

119. ఆస్రవనిరోధః సంవరః. యేనాత్మని ప్రవిశత్ కర్మ ప్రతిషిధ్యతే స గుప్తి సమిత్యాదిః సంవరః. సంచారకారణయోగాదాత్మనః గోపనం గుప్తిః. సా త్రివిధా - కాయ-వాఙ్మనోనిగ్రహభేదాత్. ప్రాణిపీడాపరిహారేణ సమ్యగయనం సమితిః. సా ఈర్యాభాషాదిభేదాత్ పఞ్చధా. ప్రపఞ్చితం చ హేమచన్ద్రాచార్యైః.

"లోకాతివాహితే మార్గే చుమ్బితే భాస్వదంశుభిః,
జన్తురక్షార్థమాలోక్య గతిరీర్యా మతా సతామ్".

మనస్విని

యోగ మనబడే ఆస్రవాన్ని నిరోధించడమే సంవరం. ఆత్మలో ప్రవేశిస్తూన్న కర్మ దేని చేత అడ్డగించబడుతుందో ఆ గుప్తి, సమితి ఇత్యాదులు సంవరము. కర్మపుద్గలాల చలనానికి కారణమైన యోగం అనగా ఆస్రవం నుండి రక్షించడం గుప్తి అనబడుతుంది. ఈ గుప్తి మూడు విధాలు. మనోవాక్కాయాల నిగ్రహమే ఆ గుప్తి. మనోగుప్తి, వాగ్గుప్తి,కాయగుప్తి. (త్రికరణాలు అని శాస్త్రాల్లో చెప్పబడేవి మనోవాక్కాయాలే). సమితి అంటే ప్రాణులకు పీడను కలిగించకుండా చక్కగా చూచి నడవడం. ఈర్యా, భాషా ఇత్యాది భేదాల చేత ఇది ఐదు విధాలు. హేమచంద్రాచార్యుడు వీటిని చక్కగా వివరించాడు.

"సూర్య కిరణాల చేత చుంబించబడుతున్న, లోకులు నడిచే మార్గంలో ప్రాణుల రక్షణకై (హాని కలుగకుండా) చక్కగా పరికించి నడవడం ఈర్య అని సత్పురుషులు అంటారు."

వి: నిర్లక్ష్యంతో నడుస్తూ, వాహనాలు నడుపుతూ అడుగడుగునాప్రమాదాలకు గురిజేసే వారికి ఈ విషయం, వీటి సిద్ధాంతం లోని గొప్పదనం ఏ మాత్రమూ అర్థం కాదు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అవ: పంచవిధాలైన సమితులను గూర్చి చెపుతున్నాడు.

మూలమ్

120. "అనవద్యమృతం సర్వజనీనం మితభాషణమ్,
ప్రియా వాచంయమానాం సా భాషాసమితిరుచ్యతే".
"ద్విచత్వారింశతా భిక్షాదోషైర్నిత్యమదూషితమ్,
మునిర్యదన్నమాదత్తే సైషణాసమితిర్మతా".
"ఆసనాదీని సంవీక్ష్య ప్రతిలజ్ఘ్య చ యత్నతః,
గృహ్ణీయాన్నిక్షిపేద్ధ్యాయేత్సాదానసమితిః స్మృతా"
"కఫమూత్రమలప్రాయైర్నిర్జన్తుజగతీతలే,
యత్నాద్యదుత్సృజేత్సాధుః సోత్సర్గసమితిర్భవేత్".

మనస్విని

దోషాలు లేనిదీ, సత్యమూ, సర్వజనహితమూ, మితభాషణమూ, వాచంయములకు (వాక్కును నియంత్రించుకునే వారికి) ప్రియమైనదీ భాషాసమితి అని చెప్పబడుతుంది.

నలభై రెండు దోషాల చేత దూషితం కాని అన్నాన్ని దేన్నైతే ముని భిక్షగా స్వీకరిస్తాడో అది ఏషణాసమితి అనబడుతుంది.

ఆసనాదులను బాగుగా పరిశీలించి, వాటిపైన ఏవైనా ప్రాణులంటే వాటికి హాని కలుగకుండా దాటి, వాటిని పక్కకు తీసి అప్పుడు ఆ ఆసనాన్ని గ్రహించి (ఆసీనుడై) ధ్యానం చేయాలి. దీనినే ఆదానసమితి అంటారు.

ప్రాణులు లేని చోటు చూసి సాధువు కఫ, మూత్ర, మలాదులను విసర్జించాలి. దీనిని ఉత్సర్గ సమితి అంటారు.

వి: సత్యం ప్రియం, హితం, మితం అయిన వాక్కు, శుద్ధమైన భిక్ష, పవిత్రాసనం, మల, మూత్ర విసర్జన విషయాలలో నియమాలు - వీటిని ఆచరించిన మానవుడు తనకు తాను ఉపకారం చేసుకోవడమే గాక లోకానికి మేలు చేసినవాడు అవుతాడు. ఆరోగ్యకరమైన అలవాట్లు, ప్రశస్తమైన ఆచరణ లోకకళ్యాణానికి దారితీస్తాయి.

అవ: ఆస్రవం తరువాత సంవరం అంటే ఏమిటో వివరిస్తున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

121. అత ఏవ -

"ఆస్రవః స్రోతసో ద్వారం సవృణోతీతి సంవరః"

ఇతి నిరాహుః. తదుక్తమభియుక్తైః -

"ఆస్రవో భవహేతుః స్యాత్ సంవరో మోక్షకారణమ్,

ఇతీయమార్హతీ సృష్టిః అన్యదస్యాః ప్రపఞ్చనమ్" ఇతి.

మనస్విని

అందుచేతనే "కర్మ ప్రవాహానికి ద్వారం ఆస్రవం. దానిని కప్పివేస్తుంది. కాబట్టి సంవరం" అని నిర్వచనం చెప్పారు ఇదే విషయాన్ని విద్యావంతులు ఇలా అన్నారు-". ఆస్రవం సంసారానికి హేతువు అవుతుంది. సంవరం మోక్షానికి కారణం. అర్హతుడు చెప్పినది ఇంతమాత్రమే. మిగిలినదంతా అతని మాటల వివరణమే.

అవ:- సంవరం తరువాత మోక్షానికి అతి సమీపంగా ఉండే హేతువు నిర్జరం. దానిని గూర్చి చెప్పబోతున్నాడు.

మూలమ్

122. అర్జితస్య కర్మణః తపఃప్రభృతిభిః జరణం నిర్జరాఖ్యం తత్త్వమ్. చిరకాల ప్రవృత్తకషాయకలాపం పుణ్యం సుఖదుఃఖే చ దేహేన జరయతి నాశయతి క్లేశోల్లుఞ్చ-నాదికం తప ఉచ్యతే. సా నిర్జరా ద్వివిధా - యథాకాలౌపక్రమికభేదాత్. తత్ర ప్రథమా యస్మిన్ కాలే యత్ కర్మ ఫలప్రదత్వేనాభిమతం తస్మిన్నేవ కాలే ఫలదానాత్ భవన్తీ నిర్జరా కామాదిపాకజేతి చ జేగీయతే. యత్కర్మ తపోబలాత్ స్వకామనయా ఉదయావలిం ప్రవేశ్య ప్రపద్యతే సా ఔపక్రమికనిర్జరా. యదాహ-

"సంసారబీజభూతానాం కర్మణాం జరణాదిహ,

నిర్జరా సంమతా ద్వేధా సకామాకామనిర్జరా,

స్మృతా సకామా యమినామకామా త్వన్యదేహినామ్" ఇతి.

మనస్విని

సంపాదించిన కర్మను తపస్సు మొదలైన వాటిచేత జీర్ణింప (శిథిలం) చేయడం నిర్జరం అనే తత్త్వం. చిరకాలం నుండి వస్తున్న కషాయ సముదాయాన్నీ, పుణ్యాన్ని, సుఖదుఃఖాలనూ ఈ దేహంతో (ఉండగానే) నశింపచేసుకోవటానికై కేశాలను ఊడబెరుకుని (ముండిత శిరస్కుడు అవడం) తపస్సు అనబడుతుంది. ఈ నిర్జర రెండు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

విధాలు –1. యథాకాల, 2. ఔపక్రమిక

1. యథాకాల నిర్జర – ఏకర్మ ఏ కాలంలో ఫలప్రదం కావాలనుకుంటుందో ఆ కాలంలోనే ఫలించడం (పండిపోవడం) యథాకాల నిర్జర. దీనినే కామాది పాకజనిర్జర అని కూడా అంటారు. కామాదులు (కోరికలు మొదలైనవి) పరిపక్వం అవడం వలన కలిగిన కర్మ శైథిల్యం.

2. ఔపక్రమిక నిర్జర – తపోబలం చేత, ఇష్ట ప్రకారం ఉదయావస్థను పొందేట్లు చేయగా కలిగే ఫలితం ద్వారా జరిగేది ఔపక్రమిక నిర్జర (ఉపక్రమం = ప్రయత్నం).

ఈ విషయాన్నే ఇలా చెప్పారు –

"సంసార బీజరూపాలైన కర్మలను ఇహలోకంలోనే జర్జరం చేయడం వలన కలిగే ఈ నిర్జర సకామనిర్జర అనీ అకామనిర్జర అనీ రెండు విధాలు.

సంయమీంద్రుల (ఇంద్రియనిగ్రహం కలిగిన) నిర్జర మొదటి రకానికి చెందినదైతే రెండవదైన అకామనిర్జర ఇతరులకు చెందింది.

వి: జైనులు శిరోముండనం బదులు వెంట్రుకలు పెరికివేసుకుంటారు. ఈవిధంగా తమని తాము కష్టపెట్టుకోవడం కూడా వారి దృష్టిలో తపస్సే. 'ఇంద్రియనిగ్రహం' ద్వారా విషయ భోగాలకు దూరంగా ఉండి సంచిత కర్మ ఫలాలను పోగొట్టుకుంటారు. అలాకాక సాధారణ జనులు పొందేది అకామనిర్జర.

అవ: అన్నింటినీ వివరించి, చివరిగా మోక్ష స్వరూపాన్ని తెలుపుతున్నాడు.

మూలమ్

123. మిథ్యాదర్శనాదీనాం బన్ధహేతూనాం నిరోధే అభినవకర్మాభావాత్ నిర్జరాహేతు సంనిధానేన అర్జితస్య కర్మణః నిరసనాత్ ఆత్య న్తికకర్మమోక్షణం మోక్షః. తదాహ– **"బన్ధహేత్వభావనిర్జరాభ్యాం కృత్స్నకర్మవిప్రమోక్షణం మోక్షః"** (త.సూ. 10.2) ఇతి, **"తదనన్తరమూర్ధ్వం గచ్ఛన్త్యాలోకాన్తాత్"** (త.సూ. 10.5). యథా హస్తదణ్డాదిభ్రమిప్రేరితం కులాలచక్రమ్ ఉపరతేఽపి తస్మిన్ తద్బలాదేవ ఆసంస్కారక్షయం భ్రమతి తథా భవస్థేనాత్మనా అపవర్గప్రాప్తయే బహుశః యత్ కృతం ప్రణిధానం ముక్తస్య తదభావేఽపి పూర్వసంస్కారాత్ ఆలోకాన్తం గమనముపపద్యతే. యథా వా మృత్తికాలేపకృతగౌరవమ్ అలాబుద్రవ్యం జలే అధః పతతి, పునరపేతమృత్తికాబన్ధమ్ ఊర్ధ్వం గచ్ఛతి తథా కర్మరహిత ఆత్మ కర్మరహితత్వాత్ ఊర్ధ్వం గచ్ఛతి. బన్ధచ్ఛేదాత్ ఏరణ్డబీజవచ్చ, ఊర్ధ్వం గతిస్వభావాచ్చ అగ్నిశిఖావత్.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మనస్విని

బంధహేతువులైన మిథ్యా దర్శనాదులు నిరోధింపబడిన తరువాత ఇక క్రొత్తగా వచ్చి చేరే కర్మ ఉండదు కాబట్టి నిర్జరకు హేతువులైనవి దగ్గరగా ఉండటం చేత, సముపార్జించిన కర్మ తొలగిపోవటం చేత (తొలగింపబడటం చేత) సంపూర్తిగా కర్మ తొలగిపోవడమే మోక్షము. ఈ విషయాన్నే "బంధహేతువులు లేకపోవడమూ, నిర్జరము ఉండడమూ – ఈ రెండింటి చేతా సకల కర్మల నుండి విడివడటమే మోక్షము." అని చెప్పారు. ఆ తరువాత లోకాల చివరికి అనంతాకాశంలోకి వెళ్లిపోతారు.

అయితే ఏవిధంగానైతే కుమ్మరి చేత త్రిప్పబడిన చక్రం ఆత్రిప్పడం ఆపివేసాక కూడా కొంచంసేపు ఎలా తిరుగుతూంటుందో అదేవిధంగా ఈ సంసారంలో ఉండే ఆత్మ మోక్ష ప్రాప్తికోసం చేసిన తపస్సు ఆ తరువాత లేకపోయినా (చేయకపోయినా) ముక్తుడు లోకాంతం వరకు వెళ్లడం సాధ్యమౌతుంది (ఆ తపోబలం చేత). (మరొక ఉదాహరణం) ఎలాగైతే అనపకాయ బుర్ర మట్టితో పులమబడినపుడు ఆ బరువుకి నీటిలో క్రిందికి వెళ్లి, ఆ మట్టి కరిగిపోగానే పైకి తేలుతుందో అదేవిధంగా కర్మ తొలగిపోయిన ఆత్మ పైకి (లోకాంతం) వెళుతుంది. బంధం విడివడిన ఆముదపు గింజలాగా, పైకెగసిపడే స్వభావం గల అగ్నిశిఖలాగా (పైకి వెళుతుంది).

వి: 'ఆత్మ' మోక్షం విషయంలో వేదాంతంలో కూడా ఇలాంటి ఉదాహరణలే కనిపిస్తాయి. అడ్డుకునేది ఏదైనా అది బంధం. ఆ ఆటంకం దాటి రావడమే మోక్షం. ఈ విషయం జైనులు తమ పారిభాషిక పదాలలో వివరిస్తారు. అదే ఈ క్రింద చెప్పబడింది.

మూలమ్

124. అన్యోన్యం ప్రదేశానుప్రవేశే సతి అవిభాగేన అవస్థానం బన్ధః. పరస్పరప్రాప్తి మాత్రం సంగః. తదుక్తమ్ – "**పూర్వప్రయోగాత్ అసంగత్వాత్ బన్ధచ్ఛేదాత్ తథాగతి పరిణామాచ్చ**" (త.సూ. 10.6) "**ఆవిద్ధకులాలచక్రవత్ వ్యపగతలేపాలాబువత్. ఏరణ్డబీజవత్, అగ్నిశిఖావచ్చ**" (త.సూ. 6.7) ఇతి. అత ఏవ పఠన్తి –

"గత్వా గత్వా నివర్తన్తే చన్ద్రసూర్యాదయో గ్రహాః,
అద్యాపి న నివర్తనే త్వలోకాకాశమాగతాః" (ప.న) ఇతి.

మనస్విని

ఒకదాని అవయవాలలో మరొక దాని అవయవాలు విడదీయరానంతగా

In Public domain. Digitization Muthulakshmi Research Academy

కలిసిపోవడం బంధం. రెండు ఒకదాని దగ్గరికి మరొకటి చేరడం సంగం. ఈ విషయమే "పూర్వ ప్రయోగాత్... పరిణామాచ్చ" అనీ, "ఆవిద్ధ... శిఖావచ్చ" అనీ సూత్రాలలో చెప్పబడింది.

"పూర్వం చేసిన యోగాభ్యాసం వల్ల, సంగం తొలగిపోవడం వల్ల, బంధం విచ్ఛిన్నం అవడం వల్ల, గతి (గమనం) లో మార్పు వల్ల "కుమ్మరిచేత త్రిప్పబడిన చక్రంలాగా, మట్టిపూత తొలగిపోయిన అలాబు (అనపకాయ) లాగా, ఆముదం గింజలాగా, అగ్ని శిఖలాగా ఆత్మ పైకి వెళ్ళిపోతుంది?" అని సూత్రాల అర్థం.

అందుచేత ఇలా చెప్పారు -

"చంద్ర సూర్యాది గ్రహాలు వెళ్లి వెళ్లి మళ్లీ తిరిగి వస్తూంటాయి. అయితే అలోకాకాశానికి వెళ్లిన ఆత్మలు మాత్రం ఈ నాటికీ తిరిగి రావడం లేదు."

వి: ఇంతకు ముందే ఆకాశం 'లోకాశం', 'అలోకాకాశం' అని రెండు విధాలు అని చెప్పారు. 'లోకాకాశం' కంటికి కనపడేది. 'అలోకాకాశం' లోకాల చివర ఉంటుంది. అందుచేత అక్కడికి వెళ్లిన ఆత్మలు తిరిగిరావు అని జైన సిద్ధాంతం.

అవ: ముక్తి విషయంలో మరికొందరి అభిప్రాయాన్ని ఉట్టంకిస్తున్నారు.

మూలమ్

125. అన్యే తు గతసమస్తక్లేశతద్వాసనావరణజ్ఞానస్య సుఖైకతానస్య ఆత్మనః ఉపరిదేశావస్థానం ముక్తిరిత్యాస్థిషత. ఏవమ్ ఉక్తాని సుఖదుఃఖసాధనాభ్యాం పుణ్యపాపాభ్యాం సహితాని నవ పదార్థాన్ కేచన అఙ్గీచక్రుః. తదుక్తం సిద్ధాన్తే - జీవాజీవే పుణ్యపాపయుతే, అస్రవః, సంవరః, నిర్జరణం, బన్ధః, మోక్షశ్చ నవతత్త్వానీతి. సంగ్రహే ప్రవృత్తా వయమ్ ఉపరతాః స్మః.

మనస్విని

మరికొందరైతే సమస్తక్లేశాలూ, వాటి వాసనలూ, వాటి వలన ఏర్పడిన జ్ఞానావరణమూ తొలగిపోగా కేవల సుఖరూపంగా మిగిలిన ఆత్మ పై ప్రదేశంలో ఉండడమే 'ముక్తి' అని అంగీకరించారు. ఇంతకు ముందు చెప్పిన సప్తతత్త్వాలు సుఖదుఃఖాలకు కారణాలైన పుణ్యపాపాలతో కలిసి తొమ్మిది పదార్థాలు అని కొందరు అంగీకరించారు. సిద్ధాంతమనే గ్రంథంలో ఇలా చెప్పబడింది -" జీవ-అజీవులు, పుణ్య-పాపాలు, ఆస్రవం, సంవరం, నిర్జరణం, బంధం, మోక్షం" - అని తత్త్వాలు తొమ్మిది. సంగ్రహంగా నిరూపించదలచుకున్న మేము ఇంతటితో విరమిస్తున్నాము.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

వి: విద్యారణ్యుల వారి గ్రంథం పేరే "సర్వదర్శన సంగ్రహం". అన్ని దర్శనాలలోని ప్రధాన సిద్ధాంతాలను సంక్షిప్తంగా లోకానికి పరిచయం చేయటమే వారి ఆశయం. విస్తరంగా కావాలనుకునేవారు ఆయా దర్శనాల మూల గ్రంథాలను అధ్యయనం చేసుకోవచ్చు. అంచుచేత పై పేరాలో "సంగ్రహంగా చెప్పాలనుకున్నాం. కాబట్టి ఇంతటితో విరమిస్తున్నాం" అని అన్నారు.

అవ: జైనులది అనైకాంతిక సిద్ధాంతం. 'ఏదీ ఇలా ఉంటుంది' అని నిశ్చయంగా చెప్పకపోవడం అనైకాంతికం, ఏకాంతం అంటే ఒకటే నిశ్చయమైన అంతం సిద్ధాంతం కలది. అలా లేనిది అనైకాంతం. జైనులు 'స్యాత్' అనే ఒక పదాన్ని జోడించి ఇలా ఉండవచ్చును, ఉండకపోవచ్చును' అంటూ ఏడు విధాలుగా చూపిస్తారు. దీన్నే వారు సప్తభంగినయం అంటారు. అదే క్రింద వివరించబోతున్నాడు. గ్రంథకర్త.

మూలమ్

126. అత్ర సర్వత్ర సప్తభఙ్గినయాఖ్యం న్యాయమ్ అవతారయన్తి జైనాః – స్యాదస్తి, స్యాన్నాస్తి, స్యాదస్తి చ నాస్తి చ, స్యాదవక్తవ్యః, స్యాదస్తి చావక్తవ్యః, స్యాన్నాస్తి చావక్తవ్యః, స్యాదస్తి చ నాస్తి చావక్తవ్యః ఇతి.

మనస్విని

జైనులు అన్నింటిలోనూ సప్తభంగినయం అనే న్యాయాన్ని ప్రవేశ పెడుతున్నారు. అది – 'స్యాదస్తి, స్యాన్నాస్తి, స్యాదస్తిచనాస్తిచ, స్యాదవక్తవ్యః, స్యాదస్తి చావక్తవ్యః, స్యాన్నాస్తి చావక్తవ్యః, స్యాదస్తిచనాస్తి చావక్తవ్యః" – అని – ఏడు విధాలు.

వి:– 'న్యాయం' అనే పదం చాలా చోట్ల వచ్చింది 'న్యాయం' అంటే ఏదైనా విషయాన్ని ప్రతిపాదించడానికి చూపే 'యుక్తి'. అయితే శాస్త్రాలలో ఈ పదప్రయోగం 'సరియైన విధంగా వివరించడానికి వాడే ఉదాహరణ రూపం' అనుకోవచ్చు. జైనులు విరుద్ధ ధర్మాలను ఒకేదానిలో ఉండటం అంగీకరిస్తారు. 'విరోధం' లేదు అని నిరూపించటం విరోధభంగం. ఇలాంటివి ఏడు కలిగి ఉన్నదే సప్తభంగి. ఈ నయం యుక్తి సప్తభంగినయం.

'స్యాత్' అనేది వ్యాకరణశాస్త్రంలో 'అస్' ధాతువు యొక్క 'విధిలిజ్' రూపం. 'అయి ఉండవచ్చును' అని ఈ పదానికి అర్థం. అయితే ఈ సప్తభంగి నయంలో ప్రయోగించబడిన శబ్దం ధాతు రూపం కాదు. లింగ, విభక్తి వచనాలు లేని ఒక అవ్యయ పదం. దీని అర్థం కూడా ఇంచుమించు అదే. ఈ ఏడు విధాలు ముందు

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ముందు వివరిస్తాడు.

జైనుల ఈ సిద్ధాంతం సామాన్య మానవుని ఆలోచనకు దగ్గరగా ఉంటుంది. ఎందుచేతనంటే దేన్ని గూర్చి మాట్లాడినా దానికి రెండు అంచులు ఉంటాయి. దేశ, కాల భేదాలను బట్టి ద్రవ్య స్వరూపాలు మారుతూ ఉంటాయి. ఘటం (కుండ) అంటే 'ఇలా ఉంటుంది.' అని నిశ్చయంగా చెప్పడానికి లేదు. ఒక ప్రదేశంలో ఉదాహరణకు తెలుగునాట ఉన్నట్లు ఉత్కళ (ఒరిస్సా రాష్ట్రంలో ఉండకపోవచ్చు, ఉండనూవచ్చు. ఇలా 'అవునన్నది కాదనడం, కాదన్నది అవుననడం' అనే గొడవ లేకుండా ఉండేదే ఈ సప్తభంగినయం. దీనిని సోదాహరణంగా అనంత వీర్యాచార్యుడు ప్రతిపాదించాడు.

మూలమ్

127. తత్సర్వమ్ అనన్తవీర్యః ప్రత్యపీపదత్ –

"తద్విధానవివక్షాయాం స్యాదస్తీతి గతిర్భవేత్,

స్యాన్నాస్తీతి ప్రయోగః స్యాత్ తన్నిషేధే వివక్షితే.

క్రమేణోభయవాఞ్ఛాయాం ప్రయోగః సముదాయభాక్,

యుగపత్తద్వివక్షాయాం స్యాదవాచ్యమశక్తితః.

ఆద్యావాచ్యవివక్షాయాం పఞ్చమో భఙ్గ ఇష్యతే,

అన్త్యావాచ్యవివక్షాయాం షష్ఠభఙ్గసముద్భవః,

సముచ్చయేన యుక్తశ్చ సప్తమో భఙ్గ ఉచ్యతే" ఇతి.

మనస్విని

ఇదంతా అనంత వీర్యాచార్యుడు ప్రతిపాదించాడు.

"పదార్థాలను విధించాలి అనుకున్నప్పుడు "స్యాత్ అస్తి" అను పద్ధతి ఉంటుంది. ఆ పదార్థ నిషేధం (లేదని చెప్పటం) లో "స్యాత్ నాస్తి" అని పద ప్రయోగం ఉంటుంది.

"క్రమంగా విధినిషేధాలు (ఉందిలేదని) చెప్పాల్సినపుడు "స్యాత్ అస్తి చ స్యాత్ నాస్తిచ" అని రెండింటి సముదాయం చెప్పబడుతుంది. క్రమంగా కాకుండా రెండింటిని గూర్చి ఒకేసారి (యుగపత్) చెప్పాలనుకున్నప్పుడు ఆ చెప్పటం శక్యం కాకపోవటం చేత "స్యాత్ అవక్తవ్య" అను శబ్దప్రయోగం ఉంటుంది."

'మొదటిదైన 'అస్తి' అనేదాన్ని చెప్పలేనపుడు ఐదవదైన "స్యాత్ అస్తి అవక్తవ్యశ్చ" అని ప్రయోగం బాగుంటుంది. చివరిదైన 'నాస్తి' అని నిషేధాన్ని చెప్పలేనపుడు 'స్యాత్

 In Public domain. Digitization Muthulakshmi Research Academy

నాస్తి స్యాత్ అవక్తవ్యఃచ' అని ఆరవ భాగం ఏర్పడుతుంది."

'ఇదే విషయాన్ని సముచ్చయంగా అస్తి, నాస్తి ల అవక్తవ్యత్వం అనగా ఉంది. లేదు అని చెప్పడానికి శక్యం కాని స్థితిలో ఏడవ భంగమైన "స్యాదస్తి, స్యాత్ నాస్తి చ అవక్తవ్యః చ" అని ప్రయోగం ఉంటుంది.ఒవి :- ఏడు విధాల ప్రయోగాలను చక్కగా నిరూపించాడు. ఏదైనా వస్తు నిర్దేశం చేసినపుడు అది ఉంది అనీ, లేనపుడు లేదు అనీ చెప్పడం జరుగుతుంది. అయితే 'ఉండనూవచ్చు,' ఉండకపోనూవచ్చు', 'ఏమో చెప్పడం కుదరదు' ఇలాంటి అభిప్రాయాల వ్యక్తీకరణే జైనులు ఈ సప్తభంగినయంలో పొదిగారు.

ఏదైనా వస్తువు ఉంది అని చెప్పినా అది అదే రూపంలో అంతటా ఉండకపోవచ్చు. అలలాంటప్పుడు ఈ 'స్యాత్' కావచ్చు, 'స్యాత్ నాస్తి' కాకపోవచ్చు' లాంటి పదప్రయోగాలు ఏర్పడుతాయి. ఉదాహరణకు ఒక 'ఘటం' విషయంలో ఈ సప్తభంగినయం అన్వయిస్తే విషయం సులభంగా అర్థం అవుతుంది.

1. స్యాత్ అస్తి – ఘటః స్యాత్ అస్తి' అంటే 'ఘటం ఉండి ఉండవచ్చు', ఇది ఘటమై ఉండవచ్చు' – అని అర్థం.

2. స్యాత్ నాస్తి – 'ఘటః స్యాత్ నాస్తి' అనగా 'ఘటం అయి ఉండకపోవచ్చును'.

3. స్యాత్ అస్తిచ స్యాత్ నాస్తిచ – 'ఘటః స్యాత్ అస్తి, స్యాత్ నాస్తిచ' అనగా 'ఘటం అయి ఉండవచ్చు', 'కాకపోవచ్చు కూడ'.

4. స్యాత్ అవక్తవ్యః – 'ఘటః స్యాత్ అవక్తవ్యః అనగా 'ఘటం అని బహుశా చెప్పడానికి శక్యం కాకపోవచ్చు అని అర్థం.

5. స్యాత్ అస్తి చ అవక్తవ్యఃచ – 'ఘటః స్యాత్ అస్తి చ స్యాత్ అవక్తవ్యఃచ' 'ఘటం అయి ఉండవచ్చు, చెప్పడానికి శక్యం కాకపోవచ్చు అని అర్థం.

6. స్యాత్ నాస్తి స్యాత్ అవక్తవ్యఃచ – 'ఘటః స్యాత్ నాస్తి స్యాత్ అవక్తవ్యఃచ 'ఘటం అయి ఉండకపోవచ్చును. చెప్పడానికి శక్యం కాకపోవచ్చు కూడా అని అర్థం.

7. స్యాత్ అస్తి స్యాత్ నాస్తిచ స్యాత్ అవక్తవ్యఃచ – 'ఘటః స్యాత్ అస్తి, స్యాత్ నాస్తి, స్యాత్ అవక్తవ్యఃచ' ఘటం ఉండవచ్చు, లేకపోవచ్చు. చెప్ప శక్యం కాకపోవచ్చు కూడా.

ఈ విధంగా దేనిని గూర్చి 'ఇది ఇలా' అని చెప్పకుండా ఏది ఎలాగైనా ఉండవచ్చు అనేది వీరి సిద్ధాంతం.

అవ:– ఇపుడు 'స్యాత్' శబ్దం యొక్క అర్థం వివరిస్తున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

128. స్యాచ్ఛబ్దః ఖల్వయం నిపాతః తిజన్తప్రతిరూపకః అనేకాన్తద్యోతకః. యథోక్తమ్–
"వాక్యేష్వనేకాన్తద్యోతీ గమ్యం ప్రతి విశేషణమ్,
స్యాన్నిపాతోఽర్థయోగిత్వాత్ తిజన్తప్రతిరూపకః" ఇతి.

యది పునరేకాన్తద్యోతకః స్యాచ్ఛబ్దోఽయం స్యాత్ తదా స్యాదస్తీతి వాక్యే స్యాత్పదమ్ అనర్థకం స్యాత్. అనేకాన్తద్యోతకత్వే తు స్యాదస్తి కథంచిదస్తీతి స్యాత్పదాత్ కథంచిదిత్యయమ్ అర్థః లభ్యత ఇతి నానర్థక్యమ్. తదాహ –

"స్యాద్వాదః సర్వథైకాన్తత్యాగాత్కింవృత్తచిద్విధేః,
సప్తభఙ్గినయాపేక్షో హేయాహేయవిశేషకృత్". ఇతి

మనస్విని

ఈ 'స్యాత్' శబ్దం తిజన్త ప్రతిరూపమైన 'నిపాతం'. ఇది అనేకాంతత్వాన్ని (అనిశ్చితత్వాన్ని) సూచిస్తుంది. దీన్ని గూర్చి ఇలా చెప్పారు.–

'తిజన్త సమాన రూపం గల ఈ 'స్యాత్' అనే నిపాతం వాక్యాలలో నిర్దిష్టమైన దానికి (విధేయానికి విశేషణంగా, అనే కాంతత్వాన్ని సూచిస్తుంది. ఆవిధంగా దానికి సార్థక్యం చేకూరుతుంది.

'ఒకవేళ ఈ 'స్యాత్' పదం ఏకాంతత్వాన్ని (నిశ్చితత్వాన్ని) సూచిస్తే అప్పుడు 'స్యాత్ అస్తి' అన్న వాక్యంలో 'స్యాత్' పదం అనర్థకం అయిపోతుంది. 'అనేకాంతత్వాని'కి అన్వయిస్తే అప్పుడు 'ఏదో ఒక విధంగా ఉంది' అని 'స్యాత్' పదానికి 'కథంచిత్' ఏదో ఒకలా ఉంది అనే అర్థం లభిస్తుంది. అందుచేత అది అనర్థకం కాదు.'

ఇదే విషయాన్ని ఇలా చెప్పారు –

"కిం" శబ్దానికి వ్యాకరణానుసారం 'థమ్' అను ప్రత్యయం చేర్చగా 'కథమ్' (ఎలా?) అని ప్రశార్థరూపకమైన పదం ఏర్పడింది. దీనికి 'చన', 'చిత్' అనే ప్రత్యయాలు చేర్చగా "కథంచన" 'కథంచిత్' పదాలు ఏర్పడతాయి. రెండింటికీ 'ఏదో ఒకవిధంగా' అని నిశ్చయాత్మకం గాని అర్థం వస్తుంది. ఇదే 'అనేకాంతత్వం'. ఈవిధంగా ఏకాంతాన్ని (నిశ్చయత్వాన్ని) వదిలివేయగా ఏర్పడిన 'స్యాద్వాదం' 'సప్తభంగీనయాన్ని, అపేక్షిస్తూ ఇది హేయము (విడువతగినది), ఇది అహేయము (గ్రాహ్యము) అనే విశేషాన్ని తెలుపుతుంది.

అవ: 'వస్తువు నిశ్చయంగా' ఈ రూపంలోనే ఉంటుంది. అన్నపుడు ఇక దానిలో

మార్పు ఉండదు కాబట్టి ఇష్టాయిష్టాలకు, త్యజించడానికీ, గ్రహించడానికీ అవకాశం లేకుండా పోతుంది' అని ముందు ముందు వివరించబోతున్నాడు.

మూలమ్

129. యది వస్తు అస్తి ఏకాన్తతః సర్వథా, సర్వదా, సర్వత్ర, సర్వాత్మనా అస్తీతి న ఉపాదిత్సాజిహాసాభ్యాం క్వచిత్, కదాచిత్, కేన చిత్ ప్రవర్తేత నివర్తేత వా. ప్రాప్తా ప్రాపణీయత్వాత్, అహేయహానానుపపత్తేశ్చ. అనేకాన్తపక్షే తు కథంచిత్, క్వచిత్, కేనచిత్ సత్త్వేన హానోపాదానే ప్రేక్షావతామ్ ఉపపద్యేతే.

మనస్విని

ఒకవేళ వస్తువు నిశ్చితంగా ఉన్నట్లయితే అది అన్నివిధాలా, ఎల్లప్పుడూ, అంతటా పరిపూర్ణరూపంతో ఉంటుంది కాబట్టి దానిని గ్రహించాలనే కోరికతో గానీ, విడిచిపెట్టాలనే కోరికతో గానీ ఎక్కడా, ఎన్నడూ ఎవడూ ప్రవర్తించడు లేదా నివర్తించడు (ముందుకు వెళ్లడు, వెనక్కిరాడు). అంతేకాకుండా పొందినదాన్నే పొందడం, విడవకూడని దాన్ని విడవడం అనేవి కుదరవు. అనేకాంతపక్షంలోనైతే ప్రతిదీ నిశ్చితత్వం లేనిదే అవటంచేత) ఎలాగో, ఎక్కడో, ఎప్పుడో ఆయా పదార్థాలను బట్టి గ్రహించడమో, త్యజించడమో కుదురుతుంది.

అవ: ముగించే ముందు కొంచంగా ఇతర మతాలను స్పృశిస్తున్నాడు.

మూలమ్

130. కించ వస్తునః సత్త్వం స్వభావః, అసత్త్వం వా ఇత్యాది ప్రష్టవ్యమ్. న తావత్ అస్తిత్వం వస్తునః స్వభావః ఇతి సమస్తి, ఘటః అస్తీత్యనయోః పర్యాయతయా యుగపత్ ప్రయోగాయోగాత్, నాస్తీతి ప్రయోగవిరోధాచ్చ. ఏవమన్యత్రాపి యోజ్యమ్. యథోక్తమ్ –

"ఘటోఽస్తీతి న వక్తవ్యం సన్నేవ హి యతో ఘటః,
నాస్తీత్యపి న వక్తవ్యం విరోధాత్సదసత్త్వయోః" ఇతి.

మనస్విని

మరొక విషయం ఏమిటంటే 'వస్తువు యొక్క స్వభావం సత్త్వమా? అసత్త్వమా? ఇత్యాది ప్రశ్నించాలి.' వస్తువు యొక్క స్వభావం 'సత్త్వం' అనటం కుదరదు. ఎందుచేతనంటే 'ఘటః అస్తి' అని యీ రెండు పదాలు పర్యాయ పదాలు ఐపోతాయి. అప్పుడు రెంటినీ ఒకేసారి 'ఘటం ఉంది' అని అనడం కుదరదు. 'ఘటం లేదు' అని

In Public domain. Digitization Muthulakshmi Research Academy

చెప్పడానికీ వీలులేదు. ప్రయోగం విరుద్ధమవుతుంది కనుక. (ఉన్నది లేకుండా పోదు కదా). ఇలాగే అన్నింటి విషయంలో అన్వయించుకోవాలి. ఈ విషయం ఇలా చెప్పబడింది.

"ఉండటం ఘటం స్వభావం (సహజసిద్ధం) అయితే క్రొత్తగా 'ఘటం ఉంది' అని చెప్పటం ఎందుకు/ (అలా చెప్పకూడదు)? అలాగే 'లేదు' అని కూడా అనరాదు 'సత్తు - అసత్తులకు' విరోధం కదా!"

వి: 'ఘటం సత్' ఉంది అంటే 'ఉంది' ఇక ప్రత్యేకించి 'ఉంది' అనే పదప్రయోగం వ్యర్థం. అది ఉన్నట్లయితే 'లేదు' అనే ప్రయోగం కూడా వ్యర్థమే.

అవ: తన మతమే సర్వ సమ్మతం అని ఉపసంహరించబోతున్నాడు.

మూలమ్

131. తస్మాత్ ఇత్థం వక్తవ్యమ్ - సదసత్సదసదనిర్వచనీయవాదభేదేన ప్రతివాదినః చతుర్విధాః పునరప్యనిర్వచనీయమతేన మిశ్రితాని సదసదాదిమతానీతి త్రివిధాః. తాన్ ప్రతి "కిం వస్త్వస్తి?" ఇత్యాదిపర్యనుయోగే కథంచిదస్తీత్యాదిప్రతివచన సంభవేన తే వాదినః సర్వే నిర్విణ్ణాః సన్తః తూష్ణీమ్ ఆసతే ఇతి సంపూర్ణార్థవినిశ్చాయినః స్యాద్వాదమఙ్గీకుర్వతః తత్ర తత్ర విజయ ఇతి సర్వముపపన్నమ్. యదవోచదాచార్యః స్యాద్వాదమఞ్జర్యామ్ -

"అనేకాన్తాత్మకం వస్తు గోచరః సర్వసంవిదామ్,
ఏకదేశవిశిష్టోఽర్థో నయస్య విషయో మతః.
న్యాయానామేకనిష్ఠానాం ప్రవృత్తౌ శ్రుతవర్త్మని,
సంపూర్ణార్థవినిశ్చాయి స్యాద్వస్తు శ్రుతముచ్యతే". ఇతి

మనస్విని

అందుచేత ఇలా చెప్పాలి - సద్వాదము, అసద్ వాదము, సదసద్వాదము, అనిర్వచనీయ వాదము - అను భేదాలతో ప్రతివాదులు (ప్రతిపక్షీయులు) నాలుగు విధాలు. మళ్లీ వీరిలో 'సత్ అసత్ వాదులు' 'అనిర్వచనీయ వాదులతో' కలిసిపోగా ఏర్పడేవి మూడే విధాలు. వాళ్లను కూర్చోబెట్టి "ఏం? వస్తువు ఉందా?" అని ప్రశ్నిస్తే 'ఏదో ఒకవిధంగా ఉంది' అని సమాధానం చెప్పాల్సి వస్తుంది. దాంతో వాళ్లందరూ నిర్విణ్ణులైపోయి (దిగులుపడి) మౌనంగా కూర్చోవాల్సిందే. ఈవిధంగా స్యాద్వాదం అంగీకరించి సమస్త విషయాలను నిశ్చయించగల వానికే ఆయా వాదస్థానాలలో విజయం

చేకూరుతుంది కావున ఇంతవరకు చెప్పినదంతా యుక్తమే. స్యాద్వాదమంజరిలో ఆచార్యులు ఇలా అన్నారు –

"అనిశ్చిత రూపం గల వస్తువే అన్ని జ్ఞానాలలోను గోచరిస్తున్నది. సప్తభంగీనయానికి ఏకదేశం (ఒక విధానం) తో కూడిన వస్తువే విషయం అవుతుంది అని చెప్పబడింది.

ఇంకా – "ప్రమాణ మార్గంలో ఒక విషయాన్ని గూర్చి ఎన్నో న్యాయాలు (యుక్తులు) ప్రవర్తింపజేయగా సంపూర్ణార్థాన్ని నిశ్చయించే 'స్యాద్వస్తు' ప్రమాణం (శ్రుతం) అనబడుతుంది." అని చెప్పబడింది.

వి:– ఘటాదుల విషయంలో 'అస్తి', 'నాస్తి' మొదలైన ఎన్నో జ్ఞానాలు ఉన్నాయి. అందుచేత ఇది అనేకాత్మకం. ఇది ఏకాంత (వినిశ్చిత) స్వరూపమే అయి ఉంటే ఇన్ని విధాలైన జ్ఞానానికి విషయం అయి ఉండేది కాదు. 'ఘటం ఉంది' అనేది ఒక జ్ఞానం. ఇది ఏకదేశం. అలాగే 'ఘటం లేదు' అన్నపుడూ 'ఏకదేశమే'. 'ఘటం ఉంది' అని నిశ్చయంగా చెపితే అది ప్రమాణం కాజాలదు. ఎందుచేతనంటే 'లేకపోవడం' అనే దానికి కూడా అవకాశం ఉంది కాబట్టి . అదే 'స్యాత్' 'ఉండవచ్చును', 'ఉండకపోవచ్చును' అన్నపుడు ఇలాంటి ఇబ్బంది లేదు. అందుచేత అది ప్రమాణం అవడం కుదురుతుంది.

'ఏకదేశం' అంటే' ఒక పరీక్షకు కూర్చున్నపుడు ఆ పరీక్షకు సంబంధించిన పాఠ్యాంశాలు ఎన్నో ఉంటాయి. అన్నింటినీ ఒక్కరే బోధించరు. ఉదాహరణకు 'ఇంటర్మీడియట్ యం.పి.సి' లో లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఉంటాయి. ఒక్కొక విషయం ఒక్కో మాస్టారు చెపుతారు. ఇది ఏకదేశం.' ఎన్నో జ్ఞానాలలో ఒక జ్ఞానానికి సంబంధించినది ఏకదేశం.

ఒక విషయంలో ఒక అంశాన్ని నిర్దేశించేందుకు అనేక యుక్తులు చూపబడతాయి. దానికి సంబంధించిన సమగ్రమైన అర్థాన్ని నిశ్చయించే 'స్యాత్ వస్తువు' అనగా 'స్యాదస్తి' మొదలైన వాక్యాలలో చెప్పబడిన 'ఘటము' 'ప్రమాణ సిద్ధము' 'అస్తి, నాస్తి' మొదలైనవన్నీ 'స్యాత్' అనే దారంతో కూర్చబడిన ఒక 'సుమమాల', ఇది పరిపూర్ణార్థ ప్రతిపాదకం అని జైన సిద్ధాంతం.

ప్రతిపక్షాలు –

1. సద్వాదులు – సత్కార్య వాదులైన సాంఖ్యులు
2. అసద్వాదులు – అసత్ కార్యవాదులైన నైయాయికులు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

3. సదసద్వాదులు - బౌద్ధులు

4. అనిర్వచనీయ వాదులు - వేదాంతులు.

సదసద్వాదమూ, అనిర్వచనీయ వాదమూ ఒకటే అనుకున్నపుడు ప్రతిపక్షాలు మూడే.

(ఈ విషయాలు ఆయా దర్శనాలకు సంబంధించిన 'ప్రకరణ గ్రంథాలు' చదువుకుంటే అర్థం అవుతాయి. సాంఖ్య, తర్క (న్యాయ, వైశేషికాలకు సంబంధించినది), వేదాంత గ్రంథాలు తెలుగులో లభ్యమౌతున్నాయి. బౌద్ధవాదం ఈ పుస్తకంలోనే వర్ణించబడింది.

అవ:- పైన చెప్పిన ప్రతిపక్షాలు అర్హతునితోనే కాక పరస్పరం వారిలో వారు కూడా విభేదిస్తారు. అర్హతుని సిద్ధాంతం అన్ని నయాలనూ అంగీకరిస్తుంది అని నిరూపిస్తున్నాడు.

మూలమ్

132. "అన్యోన్యపక్షప్రతిపక్షభావాద్యథా పరే మత్సరిణః ప్రవాదాః,

నయానశేషానవిశేషమిచ్ఛన్ న పక్షపాతీ సమయస్తథార్హతః" (హేమచన్ద్రకృత ద్వితీయద్వాత్రింశక. వీ.స్తు. శ్లో.30)

మనస్విని

"ఇతర దర్శనాలు అన్నీ పరస్పరం పక్షప్రతిపక్షాలుగా ఉండి పరస్పరం మాత్సర్యం (ద్వేషభావం) తో ఉంటాయి. అర్హతుని సిద్ధాంతం అన్ని నయాలనూ ఏ భేదమూ లేకుండా అంగీకరిస్తుంది. అందుచేత ఈ సిద్ధాంతానికి దేని పట్లా పక్షపాతం లేదు." అంటూ హేమచంద్రసూరి తన వీతరాగస్తుతి గ్రంథంలో చెప్పారు.

మూలమ్

133. జినదత్తసూరిణా జైనం మతమిత్థమ్ ఉక్తమ్ -

"బలభోగోపభోగానాముభయోర్దానలాభయోః,
అన్తరాయస్తథా నిద్రా భీరజ్ఞానం జుగుప్సితమ్. 1

హింసా రత్యరతీ రాగద్వేషావవిరతిః స్మరః,
శోకో మిథ్యాత్వమేతేఽష్టాదశ దోషా న యస్య సః. 2

జినో దేవో గురుః సమ్యక్ తత్త్వజ్ఞానోపదేశకః,
జ్ఞానదర్శనచారిత్రాణపవర్గస్య వర్తనీ." 3

మనస్విని

'జినదత్తసూరి' అనే జైన పండితుడు ఇలా చెప్పాడు.

"బల - భోగ - ఉపభోగ - దాన - లాభాలకు విఘ్నాలూ, నిద్ర, భయం, అజ్ఞానం, జుగుప్స, హింస, రతి, అరతి, రాగం, ద్వేషం, అవిరతి, కామం, శోకం, మిథ్యాత్వం - అనే పద్దెనిమిది దోషాలు ఎవరిలో లేవో అలాంటి దేవుడు, తత్త్వాన్ని చక్కగా ఉపదేశించిన జినుడు గురువు. సమ్యక్ జ్ఞానము, సమ్యక్ దర్శనము, సమ్యక్ చారిత్రము (రత్నత్రయము) మోక్షానికి మార్గం.

అవ: ఇపుడు జైనమతంలో ప్రమాణాలు వివరించబోతున్నాడు.

మూలమ్

134. "స్యాద్వాదస్య ప్రమాణే ద్వే ప్రత్యక్షమనుమాపి చ,
నిత్యానిత్యాత్మకం సర్వం, నవ తత్త్వాని సప్త వా". 4
"జీవాజీవౌ పుణ్యపాపే చాస్రవః సంవరోఽపి చ,
బన్ధో నిర్జరణం ముక్తిరేషాం వ్యాఖ్యాధునోచ్యతే." 5

మనస్విని

స్యాద్వాదులైన జైనులకు ప్రమాణాలు రెండు - 1. ప్రత్యక్షం, 2. అనుమానం. సర్వమూ నిత్య, అనిత్య స్వరూపం కలది. తత్త్వాలు తొమ్మిది లేదా ఏడు. జీవ - అజీవ - పుణ్య - పాప -ఆస్రవ - సంవర - బంధ - నిర్జర - ముక్తి - అని తొమ్మిది తత్త్వాలు. ఇపుడు వాటి వివరణ చెప్పబడుతుంది.

వి: ఇంతకు ముందు చెప్పిన వాటిని మళ్లీ ఉపసంహారార్థం చెపుతున్నాడు.

మూలమ్

135. "చేతనాలక్షణో జీవః స్యాదజీవస్తదన్యకః,
సత్కర్మపుద్గలాః పుణ్యం పాపం తస్య విపర్యయః." 6
"ఆస్రవః స్రోతసో ద్వారః, సంవృణోతీతి సంవరః,
ప్రవేశః కర్మణాం బన్ధో నిర్జరస్తద్వియోజనమ్". 7
అష్టకర్మక్షయాన్మోక్షోఽథాన్తర్భావశ్చ కైశ్చన,
పుణ్యస్య సంవరే పాపస్యాస్రవే క్రియతే పునః" 8

మనస్విని

"జీవుడు చైతన్య స్వరూపుడు. చేతనత్వం అతని లక్షణం. అందుకు భిన్నం

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అజీవము. ఇది అచేతనము. మంచి కర్మ పుద్గలాలు పుణ్యం. చెడు కర్మ పుద్గలాలు పాపం."

"ఆస్రవం కర్మ ప్రవాహానికి ద్వారం. దాన్ని మూసివేసేది సంవరం. ప్రవేశం అనగా కర్మలు ఆత్మలో ప్రవేశించడం బంధం. ఆ బంధాన్ని విడిపించడం నిర్జరం."

"ఎనిమిది విధాలైన కర్మల క్షయం వల్ల మోక్షం లభిస్తుంది. కొందరు పుణ్యానికి సంవరంలోను, పాపానికి ఆస్రవంలోను అంతర్భావం అంగీకరించి తత్త్వాలు ఏడు అనే చెపుతారు".

వి: 'ప్రకృతి బంధం' ఎనిమిది విధాలు అని చెప్పారు. అవి తొలగిపోతే ఇక బంధం ఉండదు. అన్నిటికీ మూలం ఈ ప్రకృతిబంధం.

పుణ్యం సంవరంలో చేరుతుంది, పాపం ఆస్రవంలో చేరుతుంది. ఇలా పరిగణిస్తే తత్త్వాలు ఏడే.

అవ: ఇక జైనుల కుద్దేశించిన నియమాదులు వివరించబోతున్నాడు.

మూలమ్

136. "లబ్ధానన్తచతుష్కస్య లోకాగూఢస్య చాత్మనః,
క్షీణాష్టకర్మణో ముక్తిః నిర్వ్యావృత్తిర్జినోదితా." 9
"సరజోహరణా భైక్షభుజో లుఞ్చితమూర్ధజాః,
శ్వేతామ్బరాః క్షమాశీలాః నిఃసంగా జైనసాధవ". 10

మనస్విని

"జ్ఞానం, దర్శనం, వీర్యం, సుఖం అనే అనంత చతుష్టయాన్ని పొంది, లోకాకాశంలో బంధింపబడని ఆత్మ ఎనిమిది కర్మలు క్షీణించగానే ముక్తి పొందుతుంది. (అనంతాకాశంలోకి వెళ్లిపోతుంది) తిరిగిరాదు" అని జినుడు చెప్పాడు.

"పరాగాన్ని (ధూళిని) తుడిచే పరికరం చేతిలో ఉన్నవాళ్లూ, భిక్షాన్నాన్ని భుజించేవాళ్లూ, కేశాలను పెరికి వేసుకుని గుండుతో ఉన్నవాళ్లూ, శ్వేత వస్త్రాలు ధరించినవాళ్లూ, క్షమాశీలురూ, సంగరహితులూ అయి ఉంటారు జైన సాధువులు."

వి: వీరు సరిగా చూచి నడవటం, ఆసనాదులను శుభ్రం చేసి గ్రహించటం మొదలైన వాటి కోసం మార్జని (తుడిచేది) ఏదో ఒకటి చేత పట్టుకుని తిరుగుతారు. ఈ విషయాన్నే 'పిచ్ఛికా హస్తా' అని రాబోయే శ్లోకంలో చెప్పబోతున్నాడు.

In Public domain. Digitization Muthulakshmi Research Academy

మూలమ్

137. "లుఞ్చితాః పిఞ్ఛికాహస్తాః పాణిపాత్రా దిగమ్బరాః,
ఊర్ధ్వాశినో గృహే దాతుః ద్వితీయాః స్యుర్జినర్షయః". 11

మనస్విని

"కేశలుంచనం చేసి కొన్నవాళ్లూ, పింఛం చేతిలో ధరించినవాళ్లూ, చేతులే పాత్రలుగా ఆహారాన్ని స్వీకరించేవాళ్లూ (అంతమాత్రమే తినేవాళ్లు), దిగంబరులూ, దాతల గృహం లోనే భిక్షను పై నుండి నోట్లో వేసుకునే వాళ్లూ అయిన వారు ద్వితీయ శ్రేణికి సంబంధించిన జైనసాధువులు".

వి: దాచుకోవటం అనేది లేకుండా చేతితో స్వీకరించిన భిక్షను అలాగే నిలబడి నోట్లో వేసుకుని భుజించేవారు 'అల్పభోజనం గ్రహించేవారు' అని అర్థం చేసుకోవాలి. వీరు శరీరంపై మమకారం వదిలి నగ్నంగానే సంచరిస్తారు.

మూలమ్

138. "భుఙ్క్తే న కేవలీ, న స్త్రీ మోక్షమేతి, దిగమ్బరః,
ప్రాహురేషామయం భేదో మహాన్ శ్వేతామ్బరైః సహ". ఇతి 12

ఇతి శ్రీమత్సాయణమాధవీయే సర్వదర్శనసంగ్రహే ఆర్హతదర్శనమ్.

మనస్విని

'కేవలీ' అనగా మోక్షప్రదమైన జ్ఞానం కలవాడు. అలాంటి జ్ఞాని దిగంబరుడు. అతడు ఆహారాన్ని స్వీకరించడు. వీళ్ల మతానుసారం స్త్రీ మోక్షం పొందదు. ఇదే శ్వేతాంబరులకూ దిగంబరులకూ మధ్యన ఉన్న గొప్ప భేదం".

వి: స్త్రీ మోక్షం పొందాలంటే సాధన చేసి పురుష జన్మ పొందాలి. తరువాతే మోక్షం. వీరు పునర్జన్మను నమ్ముతారని ఈ విషయాన్ని బట్టి తెలుస్తుంది. కర్మలు పూర్తిగా తొలగిపోతేనే శాశ్వతముక్తి.

ఇది శ్రీ సాయణ మాధవులు రచించిన సర్వదర్శన సంగ్రహంలో నాస్తిక దర్శనాలలో అంతర్గతమైన ఆర్హత దర్శనమనే జైనమతం.

❋ ❋ ❋ ❋ ❋

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ఉపయుక్త గ్రంథాలు

1. శ్రీసాయణమాధవాచార్య ప్రణీత 'సర్వదర్శనసంగ్రహణము'
'బాలానందిని' ఆంధ్రభాషా వ్యాఖ్యతో
రచయిత మహామహోపాధ్యాయ ఆచార్య పి. శ్రీరామచంద్రుడు
ముద్రణ – శివానందసుపధ ఫౌండేషన్, విశాఖపట్టణం, 2008

2. श्रीमन्माधवाचार्यकृतः 'सर्वदर्शनसंग्रहः'
'प्रकाश' - हिन्दीभाष्योपेतः
भाष्यकारः - डा. उमाशङ्करशर्मा 'ऋषि'

In Public domain. Digitization Muthulakshmi Research Academy

In Public domain. Digitization Muthulakshmi Research Academy

ISBN : 978-81-975732-1-7

In Public domain. Digitization Muthulakshmi Research Academy

అకాడమీ పబ్లికేషన్స్
(తెలుగు వ్యాఖ్యానముతో)

1. సిద్ధాన్తకౌముదీ
2. సాంఖ్యకారికా
3. వేదాన్తసారః
4. తర్కభాషా
5. అర్థసంగ్రహః
6. సర్వదర్శనసంగ్రహః
7. ప్రాకృతపాఠమాలికా
8. భాషాశాస్త్రసంగ్రహః
9. భాషాశాస్త్రప్రవేశినీ
10. యోగదర్శనము
11. శిసుపాలవధమ్
12. నలచంపూః
13. వృత్తరత్నాకరః
14. ధ్వన్యాలోకః
15. కావ్యప్రకాశః
16. నాట్యశాస్త్రమ్ (షష్ఠాధ్యాయః)
17. నిరుక్తమ్

సంస్కృత అకాడమి
(కేంద్రీయసంస్కృతవిశ్వవిద్యాలయముచే మాన్యతపొందిన ఆదర్శసంస్కృతశోధసంస్థ)
ఉస్మానియా విశ్వవిద్యాలయము, హైదరాబాద్
2024